పరిణతవాణి

(నాల్గవ సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ
ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001.

పరిణతవాణి

(నాల్గవ సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణ రెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001.

PARINATAVANI

(VOLUME - IV)

(A collection of autobiographical speeches
of eminent Telugu Literary Persons)

ప్రథమ ముద్రణ : జనవరి, 2008

ప్రతులు : 1000

మూల్యం : రూ. 65/-

ప్రతులకు :

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001.

ఫోన్: +91-40-24753724

ముద్రణ :

విష్ణ కంప్యూటర్ సర్వీసెస్

(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)

నల్లకుంట, హైదరాబాద్ - 500 044.

ఫోన్: +91-40-27676910, 65348445, 27677078

ప్రవేశిక

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా. సి. నారాయణ రెడ్డి
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల్లో 'పరిణతవాణి' ప్రసంగ పరంపర ఎందరో సహృదయుల ప్రశంసలు అందుకున్నది. ఆంధ్రదేశంలోని ప్రముఖులను ఆహ్వానించి వారి జీవిత విశేషాలు, సాహిత్యవేత్తలతో వారికి ఉన్న పరిచయం, ఉద్యమాలతో వారికి గల సంబంధం, సాహిత్య సాంస్కృతిక భాషా రంగాల్లో వారు చేసిన కృషిని గురించి ప్రసంగించమని కోరాము. మొదట డెబ్బై యేళ్లకు పై బడ్డ ప్రముఖులచేత ప్రసంగాలు ఇప్పించాము. తరువాత అరవై అయిదేళ్లు పైబడ్డ వారిని ఆహ్వానించాము. ఈ ప్రసంగాలను ఆడియో టేపుల్లో రికార్డు చేయించాము.

ఆడియో టేపుల్లోని విషయాన్ని ఎత్తి రాయించి ఈ ప్రసంగ వ్యాసాలుగా రూపొందించాము. కొందరు వక్తలు వ్యాసాలు సమర్పించారు. సుదీర్ఘంగా ఉన్న వ్యాసాలను క్లుప్తీకరించాము. విషయ ప్రధాన దృష్టితో ఈ ప్రసంగ వ్యాసాలను సంపుటీకరిస్తున్నాము. అందుచేత ఈ ప్రసంగ వ్యాసాలు విస్తృతిలో కొన్ని చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా రూపొందాయి.

పరిషత్తు కార్యవర్గంవారు, కార్యకర్తలు, ఈ ప్రసంగ పరంపరకు విచ్చేసిన సదస్యులు, సాహిత్యవేత్తలు వీటిని పుస్తక రూపంలో తీసుకురావలసిందని సూచించారు. వారి సూచన ప్రకారం అయిదు ప్రసంగాలతో మొదటి సంపుటిని, ఏడు వ్యాసాలతో రెండవ సంపుటిని, ఎనిమిది ప్రసంగాలతో మూడవసంపుటిని వెలువరించాము. మరో తొమ్మిది వ్యాసాలతో ప్రస్తుతం నాల్గవ సంపుటిని వెలువరిస్తున్నాము. ఈ పరిణత ప్రముఖుల ఆశయాలు ఆదర్శ కరదీపికలుగా నేటి తరాన్ని ఉద్దీపింప చేస్తాయని ఆశిస్తున్నాను.

హైదరాబాదు
6.1.2008

డా. సి. నారాయణ రెడ్డి

ముందుమాట

'పరిణతవాణి' అన్నది ఒక విశిష్టమైన ప్రసంగ పరంపర. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు ఈ ప్రసంగ పరంపర స్వరూప శిల్పి. పరిణతవాణి కార్యక్రమంలో పరిషత్తు వేదిక నుంచి సాహిత్య సాంస్కృతిక రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు వారి అనుభవాలను, ప్రముఖులతో వారికి గల పరిచయాలను, వారు చేసిన కృషిని గురించి ఆత్మ కథాకథన రూపంలో ఎన్నో విశేషాలు వివరించారు. అందులో కొన్ని మనకు తెలిసిన విషయాలు కాకపోవచ్చు. ఈ తరం వారికి వారి అనుభవాలు, జ్ఞాపకాలు, ఎంతైనా అవసరం. భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంలో ఈ తెలుగు ప్రముఖుల అనుభవాలను, జ్ఞాపకాలను మొదటి సంపుటిగా పుస్తక రూపంలో తీసుకురావడానికి కారణం మా అధ్యక్షుల వారి సంకల్ప బలం. ఇప్పటికి నలభై ప్రసంగాలు జరిగాయి. మూడు సంపుటాలు ప్రచురించాం. మరో తొమ్మిది వ్యాసాలతో ఈ నాల్గవ సంపుటిని వెలువరిస్తున్నాం.

ఈ ప్రముఖులు ప్రసంగిస్తున్నప్పుడు రికార్డు చేయించిన ప్రసంగాలను, వ్యాస రూపంగా ఇచ్చిన ప్రసంగాలను సంగ్రహించి ఇందులో ప్రచురించాం. సాధ్యమైనంత వరకు విషయ ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకోవడం జరిగింది. చాలావరకు వారి స్వచ్ఛందమైన అభిప్రాయాలను గౌరవిస్తూ వాటిని ప్రచురించాం. అభిప్రాయ భేదాలు ఉన్నచోట ఆ అభిప్రాయాలు ఆ ప్రముఖులు వెలువరించినవనీ, ఆంధ్రసారస్వత పరిషత్తు కేవలం వాటిని ప్రచురించిందనీ గమనించవలసిందిగా మా విజ్ఞప్తి.

ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యక్రమాల్ని తీర్చి దిద్దుతూ, ఎన్నో సదస్సులను నిర్వహింపజేస్తూ మా అధ్యక్షులు **డా. సి. నారాయణ రెడ్డి గారు** కార్యక్రమాల్లో చైతన్యం తీసుకువచ్చారు. ఈ సంపుటాలను ప్రచురించడంలో వారి ప్రోత్సాహం ఎంతైనా ఉంది. వారికి కృతజ్ఞతలు. నాతో సహకరిస్తున్న కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు. ఈ సంపుటిని తీర్చిదిద్దడంలో **శ్రీ గోవిందరాజు రామకృష్ణారావు గారు, డా॥ డి. చంద్రశేఖర రెడ్డి గారు** ఎంతగానో సహకరించారు. వారికి నా కృతజ్ఞతలు.

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాదు
6.1.2008

ప్రసంగ వ్యాస సూచిక



డా. ఆవంత్స సోమసుందర్

అధికారుల మ్రోల పొట్టకూటికోసం సలాం చేయకుండా నిబ్బరంగా నిజాయితీగా బతకడానికి అవకాశమిచ్చిన నా జీవితానికి నేను కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరిస్తున్నాను. నా జీవితం గనక నాకీ అవకాశం ఇచ్చి ఉండకపోతే కవిత్వం రాయడం మానేసి కట్టెల వ్యాపారం చేసి ఉండేవాణ్ణేమో. లేక సహజ ఉద్రేకం కలవాణ్ణి కాబట్టి ఈనాటికీ ఏ నక్సలైటుగానో ఖతమయిపోయి ఉండేవాణ్ణేమో. కవిత్వంవల్ల విమర్శవల్ల నన్ను నేను సంయమితం చేసుకొని బతికాను. ఇక ఫ్లాష్‌బాక్‌గా కాకుండా బాల్యంతో ప్రారంభిస్తాను. నా బాల్యం తూర్పు గోదావరి జిల్లా శంఖవరంలో ప్రారంభమయింది. కాళ్లూరి సూర్యప్రకాశరావుగారని ఆ వూరి గ్రామకరణం. అప్పటి కాయనకు పన్నెండూళ్ల గ్రామకరణీకాలుండేవి. అవన్నీ తీసేసి వాటికోసం చేసిన ఈనాములన్నీ జిరాయితీచేసి ఒక్క శంఖవరం అట్టే పెట్టారు. నేను పుట్టేముందు అల్లూరి సీతారామరాజుగారు అన్నవరం పోలీసు స్టేషనుమీద దాడిచేసి ఆయుధాలు తీసుకొని వాళ్ల చిట్టామీద ఇంత మందుగుండు సామగ్రి, ఇన్ని ఆయుధాలు తీసుకున్నానని చెప్పి రాసి సంతకంచేసి శంఖవరం వచ్చి తిన్నగా మా నాన్నగారి దగ్గరకు వచ్చారు. అప్పటికి మా పెద్దన్నయ్య ఖద్దరు నేయించి చాపులు వేయించి అవి రహస్యంగా అమ్ముతూ ఉండేవాడు, రహస్యమేమిటి పబ్లిగ్గానే అమ్మేవాడతను. కాకినాడ కాంగ్రెసుకు కూడా పట్టుకెళ్లి పటేలుగారికి, జవహర్లాల్ నెహ్రూగారికి ప్రెజెంటు చేశాడు. అదీ వాతావరణం. అయితే అప్పుడు వారు వచ్చారు. ఇటీవల నేసిన ఖద్దరు చాపు నాకిప్పించండి కరణంగారూ అన్నారు, సరే ముందు పదండి కాస్త విశ్రాంతి తీసుకోండి అని అక్కడ గవర్నమెంటు స్కూలు ఉంటే దాన్ని ఓపెన్ చేయించి అందులో ఆయనకు ఆతిథ్యం ఇచ్చారు. పల్లకీలో కూర్చోబెట్టి ఊరేగింపు చేశారు. ఇంటింటా

హారతిపళ్లెం చేశారు. ఇది ప్రభుత్వ బానిసలుగా బతుకుతున్నటువంటి పెత్తందార్లకంతా కంటగింపయింది. అల్లూరి సీతారామరాజుగారు శ్రీకాకుళం వెళ్లిపోయారు. సాయంత్రం పోలీసులు మాత్రం వచ్చి మా నాన్నగారిని అరెస్టు చేశారు. అది నేను పుట్టిన నేపథ్యం.

సరిగ్గా నాలుగో ఏడు వచ్చేసరికి మా అమ్మ టి.బి. రోగగ్రస్తురాలయింది. టి.బి.కి ఆనాడు మందులేదు. టి.బి. రాక ఏంచేస్తుంది ముప్ఫయారేళ్లకు పదిమంది సంతానాన్ని కనేసింది మా అమ్మ. నేను ఎనిమిదోవాణ్ణి. అంచేత మా పినతల్లిగారు నిస్సంతుగా ఉంది, పిఠాపురం నుంచి అక్కయ్యా నాకు వీణ్ణియ్యి దత్తత తీసుకుంటాను అనడిగితే మా నాన్నగారు తక్షణం వెళ్లిపొమ్మని ఆమెమీద కేకలేశారు. కాని మా అమ్మకు తెలుసు. నేనంటే చాలా గారాబం ఆమెకి. ఆ గారాబం ఎంతోకాలం జరగదనీ, కనుక వాడికి ఒక పట్టుగొమ్మ ఉండాలని ఆమె ఆశించింది, ఆవిడ ఇస్తానని చెప్పి మా నాన్నగారిని సద్దుబాటుచేసి ఆమె పంపించేసింది నన్ను. కాని ఎందుకు వెళ్లిపోతున్నానో తెలీదు. చాలాకాలం ఆ కొత్త ఊళ్లో నాటినటువంటి ఈ మొక్క గిలగిలలాడింది. అక్కడ సూర్యరశ్మి భరించలేకపోయింది. వాతావరణం భరించలేకపోయింది. ఏడ్చింది, మొత్తుకుంది, ఏంలాభం లేకపోయింది. అక్కడే ఉండవలసి వచ్చింది. నిజంగా అక్కడ లేకపోతే శంఖవరంలోనే ఉండిపోతే మా అన్నయ్యలలాగే అరకొర చదువులు చదివి అలాగే అంతర్థానమయి ఉండిపోయేవాడిని. పిఠాపురం వచ్చాను. వస్తూనే మా దత్తత తండ్రిగారు చేసిన విల్లు ప్రకారం మా అమ్మ దత్తత చేసుకుంది. ఆయన చాలా సాహిత్య రసికుడు. ఆనాటికున్నటువంటి వేగుచుక్క, విజ్ఞానచంద్రిక, ఆంధ్రప్రచారిణి వీటన్నిటికి కూడా శాశ్వత సభ్యత్వాలు కట్టాడు. కట్టడం తన పేర కాకుండా భార్య పేర కట్టాడు. భార్యంటే స్త్రీలను గౌరవించాలన్న భావం ఆయనకు వచ్చింది. ఆయన హైస్కూలు మాస్టరు చేశాడు. కాని గుర్రం ఎక్కివెళ్తుండేవాడు, పెద్ద భూస్వామిఆయన అందుచేత. ఆయన 26 ఏళ్లకే చనిపోయారు పాపం కడుపులో అల్సరువల్ల. అల్సరుకు కూడా మందుల్లేవు సరిగ్గా. ఆవిడ దత్తత తీసుకుంది. దత్తత చేసుకున్న తర్వాత, నాకు మెల్లిగా ఆ వాతావరణం, ఏడుపునుండి తెప్పరిల్లిన తర్వాత ఆ ఇంట్లో గూళ్లలో ఉన్న పుస్తకాలన్నీ తీసి దులిపి ఒకచోట సర్దాను, సర్దుతుంటే మా అమ్మగారు చూసి చాలా సంతోషించింది వీడికి పుస్తకాలమీద ఇంత ప్రీతి ఎలా పెరిగిందా అని.

నాకు మాటలు త్వరగానే వచ్చేశాయి గనక ఆవిడ కృష్ణశతకం పద్యాలు వల్లెవేయించడం మొదలుపెట్టింది. ఆవిడ చెప్పడం నాచేత అనిపించడం, తప్పు చెపితే మళ్లీ సర్దడం. ఆ విధంగా నూరు పద్యాలు నా చేత చదివించింది. నూరు పద్యాలు చదివించడం కాదు నూరో పద్యం నుంచి మొదటి పద్యానికి వెనక్కి రావాలి. ఎక్కడ అడిగితే అక్కడ చెప్పాలి.

ఇదీ ఆవిడ శిక్షణ, మా తాతగారు అవసరాల కామరాజు అనే ఆయన ఎనిమిది రూపాయల జీతానికి భీమవరపుకోట వెళ్లి 800 ఎకరాల భూమి సంపాదించాడు. అంత తెలివైన ముండాకొడుకు. ఆయన ఒక కొత్త పద్ధతి పెట్టాడు పిల్లలకు చదువు నేర్పడానికి. రోజుకు ఒక అయిదు కొత్త మాటలు తెలుగు మాటలు నీకు రానివి అయిదు మాటలు నేర్చుకో. అయిదు×365 ఎంత అవుతుందో చూడండి, ఎంత ఒకాబులరీ వస్తుందో. ఇది ఈనాడు టీచర్లకు కూడా తెలియదు. ఆ విధంగా మా అమ్మ 11వ ఏట భాగవతం చదువుకుంది. 11వ ఏట మొదలుకొని చదువుకుంటూనే ఉంది. ఈ కృష్ణ శతకం అయిపోయింతర్వాత దక్షిణపు వేపు హాలులో ఇసుకపోసి అక్షరాలు దిద్దించింది. ఇసుకమీద అక్షరాలు దిద్దడం ఒక పక్కన, భాగవతం రోజూ పురాణం చెప్పేదావిడ. ఎవరికి? ఇరుగు పొరుగు అమ్మలక్కలకి. వారంతా మూడు గంటలకి వచ్చేవారు ఠంచనుగా. వారికి పద్యాలు చెప్పేది. చెబుతుంటే ఓ పక్కన కూర్చోవాలి, ఆమె పెదాలకేసి చూడాలి. పోతనగారి భాగవతం అది నిజంగా హృదయైక వేద్యమయినటువంటి మందార మకరందం. కనక ఆ పద్యాలు నన్నాకర్షించాయి. అక్షరాలొచ్చిందగ్గర్నించి భాగవతం చదవాలని ప్రయత్నించాను.నిజంగా నా దత్తతతల్లి ఆ విధంగా శిక్షణ ఇవ్వకపోతే నేను కవిని కానేమో. ఇదంతా నా పదో ఏటవరకు జరిగింది. నా పదో ఏటనే ఆవిడకు చాలా జబ్బు చేసింది. విశాఖపట్నం ఆసుపత్రిలో చేర్చాం. పదకొండో ఏటే ఆవిడ చనిపోయింది. ఆ పదకొండో ఏట నాకు ఉపనయనం చేసి గుండు చేశారు. అయిదు పిలకలూ పెట్టారు. ఎందుకంటే ఆవిడ కర్మచేయవలసి వస్తుందని. చేయాలిగనక. తయారీ అన్నమాట. అలాగే నాకు మేలో ఉపనయనం చేసి జూలైలో చనిపోయింది. ఆవిడ కర్మ చేశాను. తాతగారున్నారింకా మిగిలిపోయి. ఆయనకీ కర్మ చేశాను.

తర్వాత మళ్లీ నామీద పెత్తనం మా నాన్నగారికి అంటే జనకులైన సూర్యప్రకాశరావు గారికి. ఆయన సంరక్షణలో నేను వెనక్కి వెళ్లిపోలేదు అదీ అదృష్టం, ముందుకే పోయాను. అప్పుడు పిఠాపురం వాతావరణం ఏమిటంటే అష్టదిగ్గజాలనబడేటటువంటి ఎనమండుగురు పండితులు, కవులు ఉండేవారు. వైణికులుండేవారు, విద్వాంసులు musicians ఉండేవారు. వీళ్లందరికీ నెలవారీ జీతాలు. ఎనిమిది రూపాయల జీతం నుండి 150 రూపాయలవరకూ పెద్ద జీతం అన్నమాట. ఈ జీతాలతో పాటు సంవత్సరానికొకసారి గ్రాసం కూడా. ధాన్యం పెసలు ఇలాంటివన్నీ. కనక వాళ్లు విద్యా కృషిని చేసేవాళ్లు. విద్యాకృషి చేయడమంటే ఎలా ఉండేదీ, పిఠాపురంలో ఏ వీధిలోంచి బయలుదేరివెళ్లినా ఇల్లుదాటి ఇంటికి వెళ్లేసరికి సంస్కృత ఘోష, సంస్కృతమో తెలుగు పద్యాలో ఏదో ఒకటి చర్చ వినిపిస్తుండేది. సంగీత సాధన వినిపించేది.

మా దత్తత చేసుకున్న వాళ్లంతా వెళ్లిపోయారు. మళ్లీ మా జనకులొచ్చారు. మళ్లీ ఆయనేమో మా మూడో అన్నయ్యను నా దగ్గరకు పంపించారు. తరవాత ఈ చదువు భాగవతం చదువుతూ ఉండడం, కొత్త పుస్తకాలు చదవడం ఇదంతా ఉంది. 13 ఏళ్ల వరకు వేంకటపార్వతీశ్వర కవుల నవలలన్నీ చదివి పారేశాను. వేగుచుక్క గ్రంథమాల వారి సీరియల్ నవలలన్నీ చదివిపారేశాను. ఇక చరిత్ర కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారి హిందూయుగం వగయిరా. అప్పటినుండి ఇప్పటిదాకా నేను దాచుకున్నాను. ఆ పుస్తకాలు మాత్రమే చదవలేదు. ఇంతట్లోగా పదహారవ ఏడు వచ్చింది. ఈ లోపున ఒక తమాషా జరిగింది. ఓనాడు సబ్బులేక కుంకుడుకాయలతో స్నానం చేయవలసి వచ్చింది. సబ్బులేని స్నానమా అని వాక్యంవచ్చింది. వెంటనే హబ్బులేని సైకిలా, మబ్బులేని వర్షమా అని వరసగా వచ్చినయి. అబ్బ అద్భుతమైన కవిత్వం రాశానని నన్ను నేను మెచ్చుకొని తబ్బిబ్బయిపోయాను. అది కూడా ప్రాస ఉంది గనక. ఇదీ నా తొలి కవిత్వం. ఏదైనా ఒక సృజన అంతకుముందు విననిది కొత్తగా వచ్చేసరికి పురివిప్పిన నెమలిలా గంతులేస్తుంది. తాను విననిది తన నోటినుంచి రావాలి అదీ సృజన. వచ్చింది. అందులో ఏమీలేదు చాలా Flat sentences. కాని చాలదా బాల్యానికి. పదకొండేళ్ల బాల్యానికి ఆ సృజన చాలదా? చాలా సంతోషం కలిగింది. సంతోషం కలిగి రెండు రోజులు కూర్చుని ఒక పదహారు లైన్లు పేనాను. పాదం అంతే ఉండాలి. ప్రతి రెండో లైనుకీ ప్రాస ఉండాలి. చాలా కష్టం. చచ్చాను రెండ్రోజులు.

మా ఇంట్లో మా నాన్నగారు ఏకాహాలు వగయిరాలు చేసేవారు, భజనలు చేయించేవారు. ఈ భజనలకోసం– మా నాన్నగారు భక్తులు కూడాను– నగర సంకీర్తన చేస్తూ ఫొటోలు కూడా తీయించుకున్నారు. ఆయన కవిత్వం అదీ రాయలేదు గాని ఒక రకమైన చమత్కారం ఉండేది ఆయనలో. సామెత లేకుండా మాట్లాడేవారు కారు. అశ్లీలమయిన సామెతలు కూడా ఉండేవి. విపరీతమైన హాస్యోక్తులతో మాట్లాడేవారు. సుమారు రెండువేల పద్యాలు కంఠతా వచ్చును. నేను నా పదహారో ఏటో, పదిహేడో ఏటో కిన్నెరసాని పాటలు పాడుతుంటే 'పాలాత్రగడ పాతర తీసినట్లు' అని ఒకచోట ఉంటుందక్కడ. చచ్చినా అర్థం కాలేదు. మాస్టర్లనడిగాను. వాళ్లకూ అర్థంకాలేదు. మా నాన్నగారినడిగాను. ఆయన చెప్పారు. పాలాత్రగడ అనే ధాన్యవిశేషం ఒకటి కృష్ణాజిల్లాలో ఉండేది. ఇలా పోస్తూ ఉంటే ధగధగ లాడేది. అది పోయిందిరా నాయనా ఇప్పుడు, ఈ నంబర్లొచ్చింతర్వాత పోయిందిరా. నేను వెళ్లి తెచ్చానురా ఆ విత్తనం మన చేలో వేయడానికి. వేశాను. అలాగే కృష్ణ కాటుకలు అని ఒకటుండేదిరా అని చెప్పాడు మా నాన్నగారు. ఇది నాకు తొలి గుణపాఠం. తరవాత మళ్లీ రెండుమూడేళ్లకే నాచన సోమన చదువుతున్నాను. 'పాలలోన పండ్లు పిసికినట్లు' అని ఉందొకటి. చచ్చినా అర్థం కాలేదు. యూనివర్సిటీలో

తెలుగుమాస్టర్నడిగాను. మా నాన్నగార్నడిగాను. పాలలో ఏ పండు పిసికినా పాలు విరిగిపోతాయి. అది అశుభం. పాలు విరగడమంటే అశుభచిహ్నం. ఆ అశుభసూచననే వ్యక్తం చేస్తున్నాడ్రా అన్నాడు. ఆయనకోసం వేయిపడగలు చదివాను. వీరేశలింగంగారి రచనలన్నీ చదివాను. అన్నీ చదవమన్నారాయన. ఆయనెందుకో చదువుకోలేకపోతున్నారా, నన్ను చదవమన్నారు. చాలా ఉపయోగపడింది నాకు. నా పదహారో ఏటనుండి ఇరవయ్యోపడి వరకు అలా సాగింది చదువు. ఈ లోపున భజన కీర్తనలు రాశాను. అవి పాడాను. పాడుతూ నాట్యం చేశాను. పూనకం వచ్చినట్లు పడిపోయాను. అందరికీ చాలా సానుభూతి కలిగింది. సంతోషం గలిగింది. వట్టిదే ఎవడికీ పూనకం రాదు.

పదహారో ఏడు వరకు చక్కని గ్రాంథికంలో చక్కని పద్యాలు రాసేవాణ్ణి. చక్కని గ్రాంథికంలో prose రాసేవాణ్ణి. పదహారో ఏట ఎస్.ఎస్.ఎల్.సి లోకి వచ్చాను. అదే యేడు మా పిఠాపురంలో ఒక విచిత్రమైన community ఉంది. అది దివాణ దాసీల కమ్యూనిటీ. దివాణాలు, ఎస్టేట్లు, వెలమ కులాలవాళ్లు ఎక్కడున్నా ఈ దివాణ దాసీలుంటారు. ఈ దివాణ దాసీలు మామూలు వేశ్యలు కారు. వారు నాట్యాలు చేయరు. సాహిత్యకృషి చేస్తారు. వాళ్ల పేర్లన్నీ కూడా ప్రబంధకన్యల పేర్లయి ఉంటాయి. కలభాషిణి, మందారమాల, కమలనేత్రి, గిరిజాంబుజ, వనజాంబుజ ఇవీ వాళ్ల పేర్లు. ఆ తరంవారి పేర్లు. ఆ తరంలో కచేరీ జరుగుతోంటే ఒక పిల్లది నన్ను అదేపనిగా చూడడం మొదలుపెట్టింది. చూసి చూసి మర్నాడేం చేసిందో తెలుసా నా పక్కనుంచి వెళుతూ ఉత్తరం రాసి పడేసివెళ్లింది. ఆ ఉత్తరాన్ని చాలా చక్కగా రాసింది. గుండెంతా ఇచ్చేస్తున్నట్లు రాసింది. ఏం చేసుకోవాలో తెలియలేదు ఆ గుండెని. జవాబు రాశాను. జవాబు రాసి, ఆ జవాబు ఎలా రాశానంటే చక్కని గ్రాంథికములో చిత్రించితిని. రాస్తే మర్నాడు వీథిలోకొస్తూంటే ఛీఛీ ఏమిటా ఉత్తరం, ఏంటా భాష. అదేంటి భాష, ముసలాళ్లభాష అలా రాస్తారా ఏంటి ఉత్తరాలు అన్నది. ఇది సామాన్య విషయం కాదు. నాకు పాఠం చెప్పిందన్నమాట. గురువావిడ నాకు. నాకంటే మూడేళ్లో నాలుగేళ్లో చిన్నది. ఎలా రాయాలి, నాకేం తెలియలేదు. నేను తెలుసుకున్న జ్ఞానమంతా పడిపోయింది. నేను కట్టుకున్న గోపురం పడిపోయింది. అన్నీ పడిపోయాయి. ఎలాగా. అప్పుడు మర్నాడు పట్టుకొచ్చి చలంగారి ప్రేమలేఖలిచ్చింది.

చలంగారనే ఒక వ్యక్తి, ఒక జంతువు, ఈ లోకంలో తిరుగుతోందని నాకు తెలియదు అప్పటికి. అప్పటికి జాషువాగారి గబ్బిలం చదివాను. ఫిరదౌసి, పద్యాలు ఎవరు రాసినా చదువుతూ వచ్చాను. అబ్బూరి రామకృష్ణరావుగారి ఊహాగానం చదివాను. మల్లికాంబ చదివాను. కాని వచనాన్ని చదవలేదు. అందులో వ్యావహారిక వచనాన్ని చదవలేదు.

అందులోనూ మహారాజావారు గ్రాంథికవాది కదా, నన్నేం చేస్తారోనని భయమో ఏమిటో. అప్పుడు ఈ ప్రేమలేఖలు చదువుతూ వుంటే నేను నేను కాకుండా పోయాను. ఎక్కడికి వెళ్లిపోయానో తెలీదు. నన్ను నేనే వెతుక్కుంటూ సమస్తాటవులూ తిరిగానా అనిపించింది నాకు. మర్నాడుత్తరం రాశాను. ఆ ఉత్తరం కాపీ అట్టే పెట్టేను. ఆవిడ మళ్లీ ఇస్తుందో లేదోనని. నా దగ్గరుంది ఇప్పుడది. తదాదిగా చలం గ్రంథాలు చదివాను. ఈ చలం గ్రంథాలు చదవడం వల్లనే అద్భుతంగా భ్రష్టుణ్ణయిపోయాను. స్త్రీ కోసం వెదకడమే జీవితం. వెతికిందే వెతుకులాట. వావివరసలతో నిమిత్తంలేదు. చలంగారి ఉపదేశం అది. ఎంత రాక్షసమయిన కామాన్ని ఎలా ప్రదర్శించాలో అంతా ప్రదర్శించేసరికి కమ్యూనిస్టుపార్టీ వచ్చి నన్ను రక్షించింది, నా పద్ధెనిమిదో ఏట.

పద్ధెనిమిదో ఏట పి.సి.ఎల్.జోషిగారు మహా నైతికమైనటువంటి స్టాండర్డ్స్ నేర్పారు. అప్పుడే పార్టీ ఈ దేశంలో రెండో పార్టీగా ఎదిగింది. తర్వాత విచ్ఛిన్నత, విచ్ఛిన్నత, మూడు ముక్కలు శతధా విచ్ఛిన్నమయిపోయింది. ఆవేళ రహస్యంగా చేసినా సరే ఏరియా పార్టీవాళ్లు వేగుల్లాంటివాళ్లు. నేనొకసారి బాగా ఎదిగింతర్వాత జమీందారీ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నాను. అక్కడ ఒంటిమామిడి అని ఒక నగరం ఉంది. అది రాజాగారేం చేశారంటే జమీందారీ రద్దు బిల్లుతోటి అడవిని స్వంత సేద్యం కింద మార్చేశారు. కరణాలు నాలుగు రూపాయలు చేతులోపెడితే ఏదిఏమైనా చేసేవారు, మా నాన్నగారు కూడా కరణమే. కరణాలు బ్రహ్మాండమైన ఆపద ప్రజలకుచేసేసేవాళ్లు. అలాగ వాళ్లు ఈ స్వంత సేద్యం కింద మార్చేశారు. అడవిని, అడవి ప్రాంతాన్ని, ఈ అడవి ఏమిటంటే దీన్ని కోన అంటారు. సముద్ర ప్రాంతం, ఇసకపర్ర, అందులో జీడిమామిడి చెట్లు మాత్రమే పెరుగుతాయి. పూవుపూసే చెట్టే లేదక్కడ. అందులోంచి వచ్చే పూవుని తేనెపట్టు పడతాయక్కడ. ఆ తేనె పుష్కలంగా ఉంటుంది. అది చిరుపూదేనె అని, అది జాగ్రత్తగా పట్టి రాజాగారికి సప్లై చేయబడేది. సామాన్య ప్రజలు దొంగతనం చేసి తినాలే తప్ప మామూలుగా దొరకదు. క్రిష్టల్ అయిపోతుంది. లిక్విడ్‌గా ఉండదు. గాలి తగిలితే లిక్విడ్ అవుతుంది. ఎలా చేస్తుందో ఏమిటో ఆ జాతి ఏమిటో నేను చూశాను దాన్ని. ఆ చిరుపూదేనె దగ్గర పోరాటం జరిగింది. అక్కడ పాపం నరసింహరాజని ఒక సామాన్యుడుండేవాడు. ఎవరిదో భూస్వాముల వ్యవసాయం చేయాలని అక్కడకు వెళ్లాడు. భార్య చాలా చక్కనిది, మంచి ఆజానుబాహురాలు, అంత అందమయిన అమ్మాయిని నేను మళ్లీ చూడలేదు. ఎవరితోటో ఏమో కామ్రేడ్‌తోటి మాస్క్యులిన్ బ్యూటీరా ఆ అమ్మాయిది అన్నాను. దీనికోసం అనండీ, నన్ను చర్చించి చీల్చి చెండాడి నాచేత అపాలజీ చెప్పించారు. ఈ ముక్క అన్నాను ఏమీ అనలేదు నేను, ముట్టుకోలేదు, ఏమీ చేయలేదు. మాస్క్యులిన్ బ్యూటీ అన్న రిమార్క్ ఎందుకు చేశావు? ఈ మాట పట్టుకొనిచేశారు. ఈ నిబంధనలెట్లా ఉంటాయంటే మరీ

చాదస్తం పెరిగిపోతుంది. బాగా పెరిగిపోయిన రోజులు. అందుకనే చలంగారి నుంచి అరాచకమయిన భ్రష్టాగ్నినుంచి అది కాపాడింది. లేకపోతే యివాళ ఈ పరిణత వాణి మీకు వినిపించేది కాదు, ఎంచేతనంటే కుళ్లి కుళ్లి సిఫిలిటిక్ రోగిలా చచ్చి ఉండేవాణ్ణి. 1940 నుండి పద్యకవితలు, అప్పటికే ఒక కావ్యం రాశాను, తర్వాత ఇంకో కావ్యం రాశాను, అంతకుముందే ఒక శతకం రాశాను.

నాకు ఇరవయ్యో ఏడు వచ్చేసరికి కన్ఫ్యూజ్ అవుతున్నాను. నాలో మార్పు వచ్చింది. సరిగ్గా 1944లో అభ్యుదయ కవిత్వం రాశాను. సరిగ్గా యాభయ్యేళ్ల కిందట. అది కలకత్తాలో జరిగినటువంటి సరోజినీదేవి నాయకత్వాన ఆవిడ ప్రారంభోపన్యాసంతోటి జరిగింది స్టూడెంట్స్ ఫెడరేషన్ కాన్ఫరెన్సు. దానికి వెళ్లాను. హౌరాస్టేషన్ దిగి ఇలా మలుపు తిరుగుతున్నాం, అక్కడ నిలుచోవాలి, అక్కడికి బస్సు వస్తుంది మమ్మల్ని తీసికెళడానికి. అక్కడ ఒక శవం ఉంది, అంటే మహాప్రళయ బీభత్సమయినటువంటి సామగ్రి ఉండే దగ్ధం చేసి చేసి కొనప్రాణం కొంత మిగిలింది. ఆ మిగిలినటువంటి కొనప్రాణం పోయిందప్పుడే. ఆ శవాన్నింకా తరలించలేదు. దాన్ని చూశాను. ఏంటీ ఈ దర్శనం. ఇలా మా వాళ్లింకా, ఏవేవో ప్రశ్నలు తలెత్తాయి ఇలాగా. మన ప్రశ్నలు మననేం చేస్తాయి. కవిత్వం ఉంటే ఆ కవిత్వంలోంచి కన్నీళ్లుగా కారతాయి. లేకపోతే మన గుండె బద్దలు కొడతాయి, అంతకుమించి ఏంచేయలేం మనం. చాలా పేదవాళ్లం. ఆవేళ మౌనఘోష అని పద్యం రాశాను. అప్పటికి రాశాను గాని, అది కొంచెం బాగుంది, అది వజ్రాయుధంలో చేరింది. ఆ తర్వాత చాలా కవితలు రాశాను. ఇంతట్లోకి 46 వచ్చింది ఉద్యమం. 45లో నేను బి.ఏ.లో చేరి డబ్బు కట్టేసేసి చదువు మానేశాను. చదవడం మానేసి హోల్‌టైమర్‌ని అయిపోయాను. ఈ హోల్‌టైమర్ నవడానికి కూడా ఒక కారణముంది. దానికేమిటంటే కారణం అయ్యదేవర కాళేశ్వరరావుగారు కిరసనాయిలు దొరకడంలేదని బెడజవాడలో ఒక పెద్దరాలీ తీస్తే అసలు కిరసనాయిలు మన తాతలు వాడారా? మన ముత్తాతలు వాడారా? ఆముదం దీపాలు వాడారు వాళ్లు. మనం ఆముదపు దీపాలే వాడాలి. కిరసనాయిలుకోసం ఇంత చీపుగా ప్రజల్ని చీలుస్తూ కూడగట్టుకొని వస్తున్నారు కమ్యూనిస్టులు అని ఒక స్టేటుమెంటిచ్చారు. అమ్మ ముండాకొడుకు ఎలా తయారయ్యారా వీళ్లు కాంగ్రేసువాళ్లు, ఒకనాడు దేశభక్తులు. చైనా యువజనోద్యమం మీద ఒక పుస్తకం రాసి బ్రహ్మాండంగా నన్ను ఇన్స్పైర్ చేశాడాయన. అలాంటి అయ్యదేవర కాళేశ్వరరావు మళ్లా ఆముదపు దీపాల గురించి మాట్లాడుతున్నాడే ఇక మనం ఊరుకోవడానికి వీల్లేదని నేనేం చేశానంటే ఈ సార్వకాలిక కమ్యూనిస్టు సేవకుడుగా మారి చేతులు కాల్చుకున్నాను. ఈ మారడం మారడం ఏమయిందంటే ప్రతి సంవత్సరం మా పిఠాపురంపార్టీ ఆఫీసుకి కావలసినటువంటి ఖర్చంతా నేనే పెట్టుకోవలసి వచ్చింది.

మిగతా వాళ్లందరికీ ఏముంది? ఈ విధంగా 1954లో మళ్లీ పార్టీనుండి ఇవతలికొచ్చేశాను.

అటు సాహిత్యం కాకుండా ఇటు రాజకీయం కాకుండా ఉభయ భ్రష్టుత్వం వస్తుందన్న భయంతోటి ఇవతలికొచ్చేసే సమయానికి దాదాపు 80,000 రూపాయలు రెడీ కాష పోయింది. ఖర్చయిపోయింది. ఇదే టయింలో ఈ జమీందారి కేసులలో, 8 కేసుల్లోనూ ఓడిపోయారు వాళ్లు. కేసులమీద పంపించేస్తే ఒదిలిపోతుంది, డిటెన్యూ చేయడంకాదు అని అనుకొని వాళ్లు ఈ ఎత్తుగడ పన్నితే అన్నీ పోయాయి. ఈ పోవడానికొక కారణం ఉంది. మన కన్యాశుల్కంలో అంటారు చూడండి, బైరాగి అంటాడు, బ్రాహ్మల్లో కూడా మహానుభావులు లేకపోలేదు అని. అలాగా జడ్జీల్లోనూ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లలోనూ, పోలీసుల్లోనూ కూడా మహానుభావులు లేకపోలేదు. ఒకాయన జేమ్స్ అని మన బాబురావంత పొడుగుంటాడు, బాగా నలుపు, చక్కని మొహం, చాలా దర్జా అయిన మనిషి. నన్ను రాజ ఒమ్మంగి తీసుకెళ్లారు విచారణకు కేసులో. నన్నింకా పిలవలేదు. వాకిట్లో ఇలా కిందకూర్చొని వాల్ట్ విట్మన్ పద్యాలు చదువుకుంటున్నాను. ఆయన అప్పుడు హియరింగయిపోయింది, లంచికి లేచారు. పోలిసుల్ని పిలిచి ఆయనకు లంచ్ ఏం ఏర్పాటు చేశారా అని అడిగాడు. లంచ్‌కేమీ ఏర్పాటు చేయలేదండీ ఏమీ ప్రొవైడ్ చేయలేదండీ నాకూ లేదండీ అన్నాడు. ఆఁ మీకు లేకపోతే చావండి ఆయనకు లేకపోవడమేమిటి? అన్నాడు. నాకు ఎవరి గురించి మాట్లాడుతున్నాడో గాని మాటలు వినబడ్డాయి. వెంటనే ఇవతలికొచ్చి చనువుగా 'రండి మనం లంచ్ తీసుకుందాం' అన్నాడు. 'వద్దులెండి సార్' అన్నా. చేతిలో పుస్తకం ఏమిటని తీసుకొని ముగ్ధుడైపోయాడు. ఒక దిక్కుమాలిన కేసులో ఉన్నటువంటి కుర్రాడు, బక్కపలుచగా ఉన్నటువంటివాడు వీడి చేతిలో వాల్ట్ విట్మన్ ఏమిటి? వాల్ట్ విట్మన్ అంటే అమెరికన్ డెమాక్రసీకి ఫస్ట్ వాయిస్ అది. అటువంటి మహాకవి. 'మీరు చదివారా! మీరు ఇంకా ఏం చదివారు?' ఇక చదువులో పడిపోయాం. ఆయన ఇంగ్లీషు ఎం.ఏ. అంచేత లిటరేచర్ అంటే బాగా ఇష్టం. ఆయన మనసులో కెక్కిపోయింది. ప్రశ్నలు అందించేవాడు ప్రాసిక్యూటర్‌కి, ఇలా అడిగితే వాడు పడిపోతాడని. అలా అడిగితే వాడు చచ్చేవాడు, ఆ సాక్షి. అలాగ అయిదారు కేసులు కొట్టేశాడు.

తరువాత 1949లో వజ్రాయుధం అచ్చువేస్తూ, ఈ అచ్చు వేయడానికి కూడా కారణమేమంటే రణదివేగారికి ఒక అద్భుతమయిన ఆలోచన వచ్చింది. 1947లో ఈ దేశానికి లభించింది స్వాతంత్ర్యం కాదు, ఈ నల్లదొరలు తెల్లదొరలతో రాజీ చేసుకుంటే వచ్చినటువంటి ఒక భయంకరమయిన పద్మవ్యూహంలో మనం చిక్కుకున్నాం. దీన్ని ఛేదించాలంటే సాయుధ విప్లవం చేయాలి అని. ఇది కలకత్తా ప్రోగ్రాం అంటారు. ఆ ప్రోగ్రాంతోటి అందర్నీ ఊచకోత కొయ్యడం మొదలెట్టారు. అదే ఫలితంగా చాలామందిని

డిటెయిన్ చేసేశారు. ఏంచేయాలి. అన్ని పత్రికలూ నిషేధించబడ్డాయి. అభ్యుదయ నిషేధించబడింది. ఈ అభ్యుదయ నిషేధం తొలగించడం కోసమని నేనొక్కణ్ణే అటు ఇటు ముందు శ్రీకాకుళందాకా వెళ్లి మళ్లీ పిఠాపురం వచ్చి రెండు రోజులు రెస్టు తీసుకొని మళ్లీ మద్రాసుదాకా వెళ్లి మొత్తం ఏడువేల సంతకాలు పోగు చేశాను. ఎవరెవరి సంతకాలంటే మామూలువికాదు లెక్చరర్స్ లాయర్సు ఇలాంటివి, గౌరవనీయులవి. పి.వి.రాజమన్నారు గారు సంతకం చేశారు. గోవిందాచార్యులుగారు చేశారు. అంతకుముందే వారికి అభ్యుదయంతో సంబంధం ఉంది గనక చేశారు. మచిలీపట్నం తీసుకెళ్లి ఇచ్చాం. ఏమీ ఉపయోగం కలగలేదు. ఎక్కడా అభ్యుదయవాణి వినపడని స్థితి. కేవలం ప్రభుత్వానిది తప్ప ఏమీ వినపడడంలేదు. ఇప్పుడేం చేయాలి? కవుల కావ్యాలు అచ్చు వెయ్యాలి. అప్పుడే దాశరథికి ఉత్తరం రాశాను. తమ్ముడూ నీ కావ్యాలు అచ్చు వెయ్యాలి అని. నువ్వు వెయ్యడానికి నీకెవరన్నా అక్కడున్నారా లేదా? లేకపోతే నేనే వేస్తాను. భూమి అమ్మేస్తాను మరేం పర్వాలేదు. ఈ భూమి నన్ను రక్షించదు, అని ఉత్తరం రాశాను. ఆ వుత్తరానికి చాలా అద్భుతమయిన సమాధానం రాశాడు, అది నా దగ్గరుంది. నేనిక్కడే వేయిస్తానన్నాడు. అలాగే అనిసెట్టికి రాశాను అనిసెట్టి కూడా నేనిక్కడ వేయిస్తానన్నాడు. అనిసెట్టి అగ్నివీణ వేశాడు నరసరావుపేటలో. నేను వెళ్లాను. త్వమేవాహం మాత్రం నేనే ఖర్చుపెట్టి వేశాను. 1949 మార్చి అయిదో తారీకున వజ్రాయుధం వచ్చింది. జూన్‌లో త్వమేవాహం వచ్చింది. 1950 ఫిబ్రవరి ఆరో తారీకున ప్రభుత్వ ఉత్తరువు వచ్చింది, మద్రాసు ప్రభుత్వ ఉత్తరువు. వజ్రాయుధాన్ని నిషేధిస్తున్నట్లు. ప్రతులు జప్తు చేయడానికి ఈ ఆర్డరు. మర్నాడొచ్చారు. అప్పటికి ఏ ఉద్యోగమూ లేదు. తిండి గడవడమే కష్టంగా ఉంది. చాలా పేదరికం అనుభవిస్తున్నాడప్పుడు మా రాంషా. రాంషా కోసమే ప్రచురణ పెట్టాను. కళాకేళి ప్రచురణలు అని పెట్టాను. ఈ కళాకేళి ప్రచురణలకు వాడు మేనేజిమెంటు చేసేవాడు. ఆ కళాకేళి ప్రచురణలు ఎడ్రసుకే నాకు నారాయణరెడ్డిగారు నవ్వనిపువ్వు పంపించారు. నా పేరు, కళాకేళి ప్రచురణలు, సామర్లకోట అడ్రసు. వెంటనే ఉత్తరం రాశాను. అది 53లో.

ఆస్తిలేని రాంషాకి ఆయన పినతల్లి చచ్చిపోతూ ఆస్తి రాసి ఇచ్చింది. ఇంకో అమ్మ అనేవాడు. సిద్ధాంతంలో మూడెకరాలిచ్చింది. సిద్ధాంతంలో అంటే మంచిభూమి. ఆ మూడెకరాలు అమ్మేసి ప్రెస్సు కొన్నాడు. ప్రెస్సు కొనడమే కాదు– అప్పటివరకు మేము ఒక బాస చేసికొన్నాం. క్రిటిసిజం ఇద్దరం కలిసే చదవాలి. చదివి క్రిటిసిజం వాడు రాయాలి. పోయెట్రీ నేను రాయాలి. కథలు వాడు రాసుకోవచ్చు, నేను రాసుకోవచ్చు. ఇది మా ఒడంబడిక. మా ఖరార్ నామా అది. కాని వాడేం చేశాడు. మా ఖరార్‌నామాను బ్రేచేసి, డిటెక్టివ్ కథలు అని పుస్తకం తీసుకురావడం మొదలుపెట్టాడు. వ్యతిరేకించాను

నేను. పోరాటం ప్రారంభమయింది మా యిద్దరికీ. అభిప్రాయభేదాలు. తర్వాత అభిసారికను తీసుకున్నాడు ధనికొండ హనుమంతరావుగారినడిగి, ఆయన మానేసి వెళ్లిపోతే మద్రాసు. అది అంతే ఇహ మాకూ అతనికి ఓహో అంటే ఓహో అనేవరకు సంబంధాలు వచ్చాయి. నాకు పుస్తకాలన్నీ తీసి జమాఖర్చులవీ చెప్పకుండా మనం చేలోకి పెంట తోలుతాం చూశారా అలా ఒంటెద్దు బండిమీద, అలా కుప్పలుగా మిగిలిపోయిన పుస్తకాలన్నీ పడేసేసి వీడికి అయిదు రూపాయలివ్వవలెను అని ఒకే లైను రాసేసి మా యింటికి పంపించేశాడు. నేను వీటికోసం కొన్న బీరువాలు పంపించలేదు, బీరువాలు వాడికి కావాలి. పుస్తకాలు మాత్రం అక్కర్లేదు, అంచేత పంపించేశాడు. ఈ విధంగా బిట్రే చేశాడు. బిట్రే చేయడంవల్ల అప్పుడప్పుడు నేను విమర్శ రంగంలో కాలెట్టవలసి వచ్చింది. కాలెట్టవలసివచ్చి, 1966లో తిలక్ చనిపోతూ నా పద్యాలమీద ఒక వ్యాసం రాయండి అనడిగాడు పాపం. అతను బతికుండగా ఆ పనిచేయలేకపోయాను. ఆ తర్వాత రాశాను. రాసి విశాలాంధ్రలో సీరియల్‌గా ప్రచురించాను. అవి తరువాత పుస్తకంగా వచ్చాయి. ఆ విధంగా 1964 నుంచీ విమర్శలు రాయడం మొదలుపెట్టాను, అంతకుముందు విమర్శలు రాస్తే కవి అన్న ఇమేజ్ పోతుందేమోనని భయపడ్డాను. కాని విపరీతంగా చదవడంవల్ల నాకు నిజంగా మా బాబూరావు ఎంత సాయం చేశాడో చెప్పలేను. ఇది మీరు చదవాలి అని పుస్తకం ఇచ్చేవాడు మెడికల్ కాలేజీలో. ఎజ్రా పౌండు మీద ఉన్న సమస్త సాహిత్యం చదివించేశాడు నాతో. నేను ఎవరితో చెప్పుకోవాలి చదివిన ప్రతిపాయింటూను. ఆయన వినేవాడు. దాంతోను ఇలా నా శిష్యుడు కాడు కాని అతను నా గురువైపోయాడు. నా చేత ఎంత సాహిత్యం చదివించాడో మా బాబురావు. మెడికల్ కాలేజీకి ఉచితంగా వచ్చేసేవి అమెరికన్ పబ్లికేషన్స్ అన్నీ. అద్భుతమయిన సాహిత్యం. నేను కాకినాడ మకాంలో ఉన్నప్పుడు చాలా చదివాను. చదివినప్పుడేమయిందంటే హెర్బర్ట్‌రీడ్ గొప్ప సాహిత్యవేత్త కాని బేసికల్‌గా అతను కవి. టి.ఎ.జాక్సన్ అతను కవి. ఇల్యూషన్ అండ్ రియాలిటీ రాసినటువంటి క్రిస్టఫర్ కాడ్వెల్ మంచికవి. కవిత్వం బేస్ లేకపోతే వీరెవరూ విమర్శలు రాయలేరు. కవిత్వం బేస్‌లేని విమర్శకులు తార్కికులై పాషాణులౌతారు. హృదయద్రావకశక్తి ఉండదు వారికి. కవి కవిత్వాన్ని ఒక అంతస్తులో రాస్తాడు. దాన్నందుకోవడానికి ఆ అంతస్తుకు వెళ్లాలి మీరు. అంతేకాని వీళ్లు నేలబారుగా ఉండి ఈ భూగంధం నాకు చాలా బాగుందనుకుంటూ కవిత్వాన్ని అర్థం చేసుకుంటే కుదర్దు. కనుక ఒకప్పుడు తిట్టవలసివస్తుంది. ఒకప్పుడు పొగడవలసి వస్తుంది. రెండూ ఉండాలి. ఈ విధంగా కవిత్వాన్ని ప్రతి విమర్శకుడూ ఆఖరికి అలెన్‌టేట్ అని ఉన్నాడు, ఇప్పుడు పోయాడేమో బహుశా తెలియదు. అమెరికన్ విమర్శకుడు ఫోర్ డికేడ్స్ అని చెప్పి నలభై సంవత్సరాలలో రాసిన వ్యాసాలు ఒక సంకలనం వచ్చింది అతనిది. ఆ సంకలనాన్ని కొన్నాను. ఆయన

గొప్ప కవి. కవి అని తెలియదు నాకు. ఆ తర్వాత బయాగ్రఫీ చదివినప్పుడు కాని అతను కవి అన్న సంగతి తెలియదు. ఈ విధంగా ఈయనతో కలిసి అంతకుముందు నుంచి చిన్నప్పటినుంచీ ఆసక్తి ఉన్నా ఒక క్రమపద్ధతిలో మేమిద్దరం కలిసి మధించడం జరిగింది. అయితే దురదృష్టవశాత్తూ ఆయన కవిత్వం రాయడం మానివేశాడు. సైకియాట్రిస్టు అయిపోయాడు. అద్భుతమయిన ప్రాక్టీసు చేశాడు. ఆయన కూతుర్ని చూడడానికి ఇక్కడికి వస్తే ఇంట్లో దొంగలు పడి ఎత్తుకుపోయారు, కాషెత్తుకుపోయారు, ఎంతుంటుందండీ అంటే నాలుగు లక్షలుంటుంది అన్నాడు, బంగారమంతా పట్టుకెళ్లిపోయారు. ఇలాగ ఒక ఇంటలెక్చువల్ ఫ్రెండుతో ఎప్పుడూ మసిలినట్లుండేది. 1960 దాకా వచ్చేశాను అప్పుడే.

కాని ఈ లోపలే రాంషా బ్రిటే చేసింతర్వాత ఏంచేయాలి? 'మేఘరంజని' అని ఒక కావ్యం రాశాను. అందులో ప్రియురాల్ని వర్ణించేటప్పుడు గుమ్మపాలలో తేనె కలిపినట్లుంది ఆమె దేహకాంతి అని రాశాను. ఇలాంటి చాలా వాక్యాలు అందర్నీ ఆలోచింపజేశాయి. ఆ కావ్యం రాశాను. ఇది 1956లో రాశాను. 1957 'సోమరసం సుందరకాండ' అని ఒక విచికిత్సాత్మకమైనటువంటి కావ్యం రాశాను. ఏంచేయాలి వీటిని. అక్కణ్ణుంచి పబ్లికేషన్స్ నేనే మొదలుపెట్టి కళాకేళి ప్రచురణలను పిఠాపురం మార్చి నేను ఏదో చీమనడక యథాశక్తిగా. అప్పుడిద్దరం ఉండేవాళ్లం కనక కమర్షియల్ పనంతా వాడు చేసేవాడు, పెట్టుబడి నేను తెచ్చేవాణ్ణి ఇతరుల్ని పోగుచేసేవాణ్ణి, ఆ పుస్తకం వేయడం పంపించడం డబ్బు తెప్పించడం, ఇది మా ఒడంబడిక. ఈ ఒడంబడిక కూడా వాడొదిలేసేశాడు. వాణ్ణెళ్లి బతిమాలవలసి వచ్చింది. ఈ విధంగా మొత్తంమీద ఒంటరివాణ్ణయ్యాను. కాని ఏమైందంటే లక్షలు సంపాదించాడు, లక్షలు సంపాదించడంకోసమని చేస్ చేశాడు. చేస్ చేయకని కూడా చెప్పాను షష్టిపూర్తినాడు ఉపన్యాసంలో. ఇక చేస్ చేయకు ఆగిపో. ఎక్కడో పడిపోతావు, టాల్‌స్టాయ్ రాశాడు మనిషికి భూమి ఎంత కావాలని. అది చదువుకోమని. చేయలేదు. చివరికి ఆ స్టేజిలోనే చచ్చిపోయాడు. షష్టిపూర్తి అయిన మరసటిరోజున. ఏమైనా సరే నేను మాత్రం ఆ కాంపిటేషన్ రాంషా బ్రిటే చేసిన ఉక్రోషంతోటి మరింతపని చేశాను. ఇప్పటిక్కూడా. 77 అని వచ్చిందని అంటున్నారం తాను. నేను ముసిలివాణ్ణని అంగీకరించడం నాకిష్టం లేదు. ఏ రంగంలోను కూడా. కానయితే నాకు మరణం ఉందని తెలుసు. మరణం ఇనెవిటబుల్ అని తెలుసు. కాని వార్ధక్యం ఉండడానికి వీల్లేదు. కనీసం మనస్సుకయినా వార్ధక్యం రాకూడదు. మనస్సుకు వార్ధక్యం వచ్చినవాడు కుతంత్రాలు పన్నుతాడు. కుళ్లు ఆలోచన చేస్తాడు. ముందు నీదే కులం, ముందు మనిషిని కాకుండా మనిషికున్న విలువలతో మనిషిని చూడకుండా నీదేకులమని ఆలోచిస్తాడు. రెండోది వీడు బ్రాహ్మడు, అయితే వీడిదేగోత్రం అని

ఆలోచిస్తాడు. తరవాత వీడిదేశాఖ. ఎంత నీచమయిన ఆలోచలనండీ ఇవన్నీ. ఈ నీచమయిన ఆలోచనలతోటి ఎన్నివేల సంవత్సరాలు మన భారతదేశం సర్వనాశనమయి పోయి భ్రష్టమై బానిసయి పోయింది. అలాగే పందొమ్మిది వందల ముప్పై ఎనిమిదో, ముప్పై తొమ్మిదో త్రిపురనేని రామస్వామి చౌదరిగారి భగవద్గీత చదువుతున్నాను. దాని ఇంట్రడక్షనులో అద్భుతమయిన వాక్యముంది. 'సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు- ఆయన ఆస్తికుడే అది మరచిపోకూడదు- బ్రాహ్మణులను విశిష్టముగా సృష్టింపదలచినచో అడవిలోని పెద్దపులివలె బ్రాహ్మలకు ఒంటినిండా చారలు పెట్టడా? ఈ జందెమెందులకు?' అని అంటాడు. ఈ వాక్యం చదివేటప్పటికి ఎవరో నన్ను చంపేసినట్లయింది. కత్తి తీసుకొని జందెం కత్తిరించాను. పక్కనే మా నాన్నగారున్నారు ఆయనకి చెప్పాను. ఇదేమిట్రా ఈ వెధవ పనేమిట్రా అన్నాడు. నాకప్పటికి పెళ్లయింది. అయినాసరే తండ్రికి హక్కుంటుంది! 'ఏమిట్రా' అన్నాడు. ఈ వాక్యాలు చదువు అన్నాను, చదివాడు. 'అయితే ఆయనేదో రాస్తే జందెం తీసేయాలా?' లేదు మీరు దానికి సమాధానం చెప్పండి. సరయిన సమాధానం చెప్తే నేను వేసుకుంటాను. లేకపోతే మీ జందెం కూడా కత్తిరించి పారేయదలచుకున్నాను. నేనేమో ఆఖరి పిల్లవాణ్ణి కాబట్టి ఆయనదగ్గర చనువుగా ఉండేది. నన్ను చూడకుండా ఉండలేకపోయేవాడు. శంఖవరంలో బొప్పాసిపండ్లు పండించి సంచిలో మోసుకొనివచ్చే వారు పాపం. అంచేత నాకు చనువు. ఏం చెప్తారాయన? ఆయనకేమో ఆర్గ్యుమెంటు తోచలేదు. నిజమేననుకో. ఏదో పెద్దలు పెట్టారు. సంప్రదాయం. దీనంత మాదర్‌చోదీ మాట ఇంకోటి లేదండి. సంప్రదాయమేమిటి? దాన్నెందుకు మార్చుకోకూడదు మనం.

తర్వాత ఇంకో గమ్మత్తయిన విషయం. వీరేశలింగంగారి జీవితం ఆ సంవత్సరమే చదివాను. చదివి దెయ్యాలకోసం, ఉన్నాయా లేవా అన్న పరిశోధన కోసం వెళ్లాను. హైస్కూల్లో మంత్రి యుగంధరుని పాత్ర పిచ్చి యుగంధరుడవుతాడు చూశారా మోనోయాక్షన్ చేశాను, హైస్కూల్ డే రోజు. దానికి పుర్రె కావలసివచ్చింది, పుర్రెలో అన్నం పెట్టుకుతింటాడు వాడు. ఇంతట్లో వేగులవాడు వస్తాడు. అన్నం వండుకుంటుం టాడు పిచ్చివాడుకాదు అన్నది సమస్య ప్రతాపరుద్రీయంలో వెంకటరాయ శాస్త్రిగారిది. అప్పుడేంచేస్తాడు వండుకుంటూ వండుకుంటున్నది గుడగుడి శబ్దం కుండకు నష్టం అని భడామ్మని పగలగొట్టేస్తాడు, అంటే పిచ్చివాణ్ణని రుజువు చేయడానికన్నమాట. అలాగా ఈ పుర్రెలో అన్నం పెట్టికొని తినాలి. శుభ్రంగా కడిగేశాను, దాన్లో ఒక ఆకు ఎవరికీ కనపడకుండా పెట్టేశాను. అనుమానం రాకుండా. గోనీ కూడా కట్టాను, తలకి కూడా గోని గుడ్డే కట్టాను. అద్భుతమైన వేషం. వచ్చాను. మా పిఠాపురం రాజావారు చాలా సరసమైనవాడు. రసికుడు. ఆయన ఎదురుగుండా కూర్చున్నాడు. నోట్లో పెట్టుకొని 'థూ' అని ఉమ్మేశాను. వీళ్లందరిమీదా కూడా పడింది. మా హెడ్మాస్టరుగారు చీమలకొండ

భీమశంకరరావు గారని చెప్పి బాగా గొప్ప అందగాడు, మంచిమీసాలుండేవి, మీసంలో మెతుకొకటి చిక్కుకొనింది. అది చూశాను. అయిపోయిందిరా నా పని అనుకున్నాను. కాని ఎంతబాగా చేశావోయ్ అని కావిలించుకొని, మీసం దులిపేసుకున్నాడు.

1941లో ఎస్.ఎస్.ఎల్.సి. టెక్స్టులో where the mind is without fear అన్న టాగోర్ పోయెమ్ చెప్పాలి. షేక్స్పియర్ చెపితే ఆయనే చెప్పాలి. వర్డ్స్‌వర్త్ చెపితే ఆయనే చెప్పాలి. గొప్ప వ్యక్తి ఆయన. బాబూ అల్లరి చేయకూడదు, జాగ్రత్తగా నేను చెప్పినట్లు వినాలి. చాలా గొప్ప వ్యక్తి మీ కొస్తున్నాడు వెళ్లాలిరా ఆయన చెప్పాడు. టాగూర్‌గారు మద్రాసునుండి కలకత్తా వెళుతున్నాడు. మెయిలు పిఠాపురంలో ఆగేది. పిఠాపురంలో రాజా ప్రభావంవల్ల. పిఠాపురంలో ఆయనకు లంచ్ ఇవ్వాలి. రాజాగారు పాత్రలతో అందిస్తారు. జనం రాగూడదక్కడ. మమ్మల్ని ఎస్.ఎస్.ఎల్.సి. కుర్రవాళ్లని మాత్రమే తీసుకొని ఒక పూలదండ కనపడకుండా పట్టుకొని మా హెడ్‌మాస్టారు తీసుకెళ్లారు. టాగోర్‌గారు వచ్చి ఆ పెద్ద విగ్రహంతోటి నిలబడ్డారు. ఇంతట్లోకి ఒకాయన తెల్లటిబట్టలతోటి వచ్చాడు మంచి క్రాపుతోటి. మన నారాయణరెడ్డి, కృష్ణశాస్త్రిగారి క్రాఫు కూడా అలాగే ఉండేది. చాలా దగ్గరిపోలికలుంటాయి. నేను మా మెడ్మాస్టరుగారికి ప్రియశిష్యుణ్ణే కాని. ఆయన కుర్రాళ్లను తీసికొనివెళ్లాడు. వెళ్లి పాదాభివందనం చేశాడు. ఆయనెవరో తెలియదు నాకప్పుడు. ఆయనెవరండీ అంత దగ్గరగా వచ్చాడు హెడ్మాస్టరుగారిని అడిగితే చెప్పారు కృష్ణశాస్త్రిగారని. కృష్ణశాస్త్రి అన్న పేరు మొట్టమొదటిసారి వినడం అదే నాకు. తరవాత ఏమయింది.

> వ్రేగకు హైమసౌధ మణివీధిక పుట్టెను రాచబిడ్డకా
> ల్వాగరుము వోలె నేల విరియంబడె బంగరుముద్ద ఏ దిశన్
> త్యాగమునొందె వారసతులాడిరి ముంగిట తూర్యరావముల్
> మ్రోగెను....

తర్వాత

> ఒక్క నిరుపేద గుడిసెలో ఉద్భవిల్లినాడు. ....
> అన్నమోసగ్గినాడో మంత్రమోసన్గినాడో బ్రాహ్మణుడు
> వచ్చి మంత్రసాని దెప్పినది అన్నము సాలదంచు

అని ఒక పద్యం కవిని గురించి. ఒక పద్యం రాజును గురించి. మొట్టమొదటి పద్యం రాజును గురించి. ఈ కవికూన ఒక చిన్న పొదరిల్లులాంటి ఇంట్లో పుట్టాడు, గుడిసెలో పుట్టాడు. వాడు మహాసౌధంలో పుట్టాడు రాజు. ఈ రాజు చనిపోతాడా నక్షత్రం

రాలిపోతుంది. ఈ కవి చచ్చిపోతాడు ఆకాశంలో నక్షత్రం నిలుస్తుంది. రెండు నక్షత్రాలు అని దీనిపేరు. విశ్వనాథ సత్యనారాయణగారి ఖండకావ్యం. ఆనాటికి జాషువాగారు టీచరు వినుకొండలో. పాఠం చెప్పేవారు. అద్భుతంగా ఉంది వెనకాల భావం. కాని కొరకబడనటువంటి సమాసాలు కల్యాణసజ్జిత పంచ కల్యాణిపై ఇలాంటి సమాసాలు. దీన్ని లలితమయినటువంటి భాషలో చెపితే బాగుంటుంది. అందరికీ చెప్పాలి అనేటటువంటి ఒక కవి ఆత్మఘోష, ఆయన కూడా కవి రాజు అని పద్యాలు, తేటగీతులు, చాలా అందంగా ఉంటాయి అవి రాశాడు. అంటే ఇది జాషువాగారి సృజన సెకండరీ అని కాదు, ఒక ఇన్స్పిరేషన్ తీసుకున్నాడు, తన భాషలో తన పద్ధతిలో రాశాడు. అంతకుముందు మాత్రం విశ్వనాథ సత్యనారాయణగారు రాశారు. ఆ సంవత్సరం విశ్వనాథ సత్యనారాయణగారు పిఠాపురం వచ్చారు. అంతకుముందే కిన్నెరసాని పాటలు చదవడం పాలాత్రగడపాతర్లు వంటి మాటల గురించి మా నాన్నగారిని అడిగి తెలుసుకోవడం, కోకిలమ్మ పెండ్లి చదవడం జరిగింది. ఆ కోకిలమ్మ పెండ్లిలో తెలుగుతనంమీద సంస్కృత జాడ్యం ఎలా సంభవించిందో చెప్పడం ఇది మా నాన్నగారు మెచ్చుకోవడం ఈ గొడవలన్నీ జరిగిపోయాయి. లైబ్రరీ వారోత్సవాలకని చెప్పి ఆయన వచ్చారు. ఆయన వస్తే నేను వెళ్లి నమస్కారం పెట్టి నేను మీ కావ్యాలు కొన్ని చదివాను అని చెప్పాను. ఏం చదివారంటే కిన్నెరసాని చదివాను. మీ పద్యాలు బాగున్నాయండీ. మీ వేంగిక్షేత్రం మా టెక్స్ట్లో ఉంది. చెప్పి సాయంత్రం ఆయన సభలో మాట్లాడుతూ ఉంటే లేచి కిన్నెరసాని పాటలు పాడాలండీ. 'నే పాడను' అప్పటికే వచ్చేసిందాయనకి కిన్నెరసాని మీద ద్వేషం, రామాయణ కల్పవృక్షం మీద మోజు ఏర్పడిపోయింది. అదే ఆయనలోని కవిని ఎత్తుకుపోయిందెక్కడికో. జనంలో ఉన్న కవిని. ఇది ప్రజావాణి చెబుతోంది మీరు చదివితీరాల్సిందే అన్నాను. 'ఆఁ ఎవరా ప్రజావాణి?' అన్నారాయన. మేమంతా అంటున్నామండి. మా అందరి తరఫున చెప్తున్నాడండి కుర్రవాడని చెప్పి నా వెనకాల చాలామంది కుర్రాళ్లు లేచారు. చచ్చినట్లు కిన్నెరసాని పాడారు. ఎంత అద్భుతంగా పాడాడు. అందులో చాలా మాటలు కవిత్వం దృష్ట్యా చూస్తే వ్యర్థంగా అనిపిస్తాయి. కాని పాడుతుంటే అద్భుతంగా ఉంటాయి. పరిగింది, పరిగింది, పరిగింది కిన్నెరసాని ఇలా ఉంటే మనం దాన్ని కవిత్వంగా అనుకొని పరిశీలిస్తే దెబ్బ తినేస్తాం. ఏమిటి ఇంత పునరుక్తి ఉన్నది అనిపిస్తుంది, విని పాడుతుంటే అద్భుతంగా ఉంటుంది. ఈ విధంగా కాకినాడ చదువుకు నేను వెళ్లకుండా మేథమేటిక్సు పేపర్లో పద్యాలు రాసేవాణ్ణి. ఎందుకంటే కాకినాడ కనుక. కాలేజీ చదువుకు వెళ్లిపోతే మా రమాదేవి ఉందికదా, ఆ నిరుపేద అమ్మాయి ఉందికదా ప్రియురాలు, ఆ అమ్మాయిని విడిచిపెట్టి వెళ్లాలిసొస్తుందని. నాకు చలం ఉపదేశం చేసినటువంటిమ్మాయి. కాని మొత్తానికి మూడే ఛాన్సులుండేవి. ఎస్.ఎస్.ఎల్.సి. పాసుకావడానికి. చచ్చినట్టు

పాసయ్యాను మూడోసారి. అంటే పద్యాలు రాయకుండా లెక్కలే రాశాను. పాసు మార్కులొచ్చాయిరా, పాసయ్యాను. అక్కడ కాలేజీలో చేరాను. కాలేజీలో చేరడమేమిటి? కాలేజీలో అద్భుతమయిన లెక్చరర్స్ ఉన్నారు. అప్పుడు అంతకుముందు చదవనటువంటి పుస్తకాలు ముఖ్యంగా ఆముక్తమాల్యద అప్పుడు చదివాను, వేదం వేంకటరాయశాస్త్రిగారి పీఠికా, వ్యాఖ్యానంతో కూడినటువంటి కళాపూర్ణోదయం చదివానక్కడ.

పాండురంగ మాహాత్మ్యం చదివాను. మంచి పుస్తకాలక్కడ ఉండేవి. అవన్నీ అక్కడ చదివాను. అలాగనే ఇంగ్లీషు పోయెట్రీ కూడా చదివాను. ఇలా చదివాను. క్లాసు పుస్తకాలప్పుడూ చదివేవాణ్ణి కాను. పాఠాలు వినేవాణ్ణి. చెప్పేది ముందు చదివేవాణ్ణి. రేపు పాఠం ఇవ్వాళే ముందు చదువుకొని వెళ్ళేవాణ్ణి. అది చాలు పాసు మార్కులు రావడానికి పాసైపోయేవాణ్ణి. బట్టీ పట్టడం అనేది మొదటినుంచీ అలవాటు లేదు.

ఈ విధంగా కృష్ణశాస్త్రిగారి పరిచయం ఏర్పడింది. ఎవరబ్బాయి నీవు అని అడిగారాయన. ఆవంత్స వెంకటరావుగారి అబ్బాయిని అని చెప్పాను. ఆఁ ఆవంత్స వెంకటరావుగారా? మా మాస్టారయ్యా. ఇంగ్లీషు చెప్పేవారాయన. ఆయనెవరో నాకు తెలియదు. ఆయన విల్లు ప్రకారం కదా నన్ను పెంచుకుంది. ఆయన భార్య నన్ను పెంచుకుంది. ఇలాగ ఆవంత్స వెంకటరావుగారి అబ్బాయినని చెప్పుకోవడంవల్ల కొంత పెద్దల్లో గౌరవభావం ఏర్పడింది నామీద. ఆయన ఇచ్చిన ఆస్తే కాకుండా కొంత గౌరవం కూడా ఇచ్చారాయన. ఆ విధంగా పెద్దలు మా వూళ్లో దేశభక్తులయిన తనికెళ్ల సత్యనారాయణ. ఆయన కొడుకునని చెప్పుకోవడం వల్ల నాకు చాలా గౌరవం ఇచ్చేవారాయన, ఆయన శిష్యుడాయన. ఒక తరం అందరికీ కూడా ఇంగ్లీషు మర్చిపోని రీతిలో ఆయన బోధించాడట. మాంచి స్ఫురద్రూపి. ఫొటో కూడా తీయించుకున్నాడాయన ఎక్కడికో వెళ్లి. ఒక విధంగా అదృష్టమేమిటంటే అంతా నన్ను జమీందారనేవారు. వాడికేమిటోయ్ పిల్లజమీందారు అని లేనిపోని అరిస్టోక్రసీలన్నీ తగిలించారు. ఏమైనా డబ్బు కాపీనం అనేటువంటిది మొదటినుంచీ లేదండి. డబ్బు చేత్తో లెక్కపెట్టుకోవడమనేది నాకిప్పటికీ చేతకాదు. ఎవడికైనా పది రూపాయలప్పిస్తే ఎంతిచ్చానో తెలీదు. ఖంగారొచ్చేస్తుంది. లెక్కపెట్టుకుంటూంటే గుండె ఎక్కువగా కొట్టుకుంటుంది. సభలకెళ్లేటప్పుడు చేతిచమురు వదిలించుకోవడమే సాహిత్యసభలకెళ్లటమంటే ఎవర్నో కూడా తీసికెళ్లేవాణ్ణి. డబ్బు లెక్కపెట్టుకునేందుకు, నేను పడిపోతే లేవదియ్యడానికి, నాకు కావలిస్తే సిగరెట్లు తెచ్చి పెట్టడానికి.

ఎప్పుడయితే జైలునుంచి వచ్చేసానో కేసులన్నీ పోయాయో అప్పుడు హవుజ్ అరెస్టు చేశారు ఒక సంవత్సరంపాటు. ఇంటినుంచి కదలకూడదు. కాని ఆ పోలీసువాళ్ల చేత

అన్నీ తెప్పించుకొనేవాణ్ణి, తెచ్చిపెట్టేవాళ్లు పాపం. ఓసారి ఓ వారం రోజుల పాటు విజయనగరం వెళ్లిపోవలసి వచ్చింది. పోలీసువాణ్ణి కాపలా ఉండమన్నారు. విజయనగరంలో చాసోగారి పెద్దమ్మాయి ఆత్మహత్య చేసుకొని చచ్చిపోయింది. చూడ్డానికి వెళ్లాలి అని చెప్పాను. పాపం మోసగింపబడి చచ్చిపోయింది. తులశమ్మ అక్కయ్యను అమ్మాజీ అనేవాళ్లు దీన్ని చిన్నాజీ అనేవాళ్లు. చూడ్డానికి వెళ్లాలి. వెళ్తూ ఆ.నా.శర్మగారని అద్భుతమయిన వ్యక్తి, తాతా సుబ్బరాయశాస్త్రిగారి శిష్యుడు, అలంకారశాస్త్రంలో నిధి. ఆయనింట్లో ఉండాలి. ఆయనింటికెళ్లకుండానే పువ్వాడ శేషగిరిరావుగారని చాలామంచి మధురమయిన కవిత్వం రాసేవారు తాజ్‌మహల్ అని కావ్యం రాశారు. ఆయనభార్య మాజీ జమీందారుగారి కూతురు. అంతా పోయింది వారికి. అయినా ఇంకా జమీందారీ వెలగబెట్టేది. పాపం ఈయన మీద సకలపెత్తనం చేసేది, ఊడిగం చేయించుకునేది. ఈయన్ని చూస్తే చాలా జాలివేసేది. ఈ పువ్వాడ శేషగిరిరావుగారిని, ఈ ఆ.నా. శర్మ మేమిలా వెళ్లాం ఆయన్ని చూసివచ్చేం. వచ్చింతర్వాత. 15 రోజులు పోలీసు స్టేషన్ తీసుకెళ్లారట. ఆయన్ని కొట్టలేదనుకోండి. ఇంటరాగేషన్ చేసేరు. చాలా బాధపెట్టారు. నా ట్రయినులోనే ఒక ఎస్.ఐ.ఉన్నాడు. ఇంటర్న్‌లో ఉండగానే ఈయనెలా బయటికి వెళ్లాడు అని ఆయన లేశాడు. నానా బీభత్సం చేశాడు, ఇంటరాగేషన్‌చేసి. ఇంటరాగేషన్ చేస్తే ఆయన ఇలా చేశాడేంటి సోమసుందరం, కావలసినవాడు, నన్నింత ద్రోహం చేస్తాడా? ద్రోహం చేశానని అనుకున్నాడు, నేనింత పని జరుగుతుందనుకోలేదు. ఆయన్ను క్షమించమని అడిగితే ఆయనొప్పుకోలేదు. 'నో నీకు తెలుసుండే చేశావు' అనడమే కాదు, పాపం తరవాతేమయిందంటే నండీ పాపం ఆయనకు మతిస్థిరం తప్పింది. పోలీసులచేత హింస పడి కొంచెం మాడ్ అయ్యారు. అనవసరంగా అందర్నీ తిట్టేవాడు. చాలాసార్లు నేనూ తిట్లు తిన్నాను. మరి నా వల్లనేకదా ఆయనిలా అయింది అని నేను సహించాను. తరవాత చాలా కాలానికి తేరుకోగలిగాడు పాపం. ఇప్పుడు చాలా మారాడు. చాలా సౌమ్యవంగా ఉన్నాడు. అయితే మంచి prime of the age ఆయన చాలా పుస్తకాలు రాయవలసినటువంటి వ్యక్తి. అది దెబ్బతీసింది. ఒకసారి 1949లో తుని కేసుకు వెళ్లి వస్తున్నాను. ఆ ట్రయిన్ నిండా విద్యార్థులు. 'ఏమిటి? శలవులు కాదుగదా మీరంతా వచ్చేశారేమిటి?' అని అడిగాను 'ఏదో దున్నపోతు పుస్తకమటండీ, అది మా లాడ్జిలో అందరు చదువుకుంటున్నారు, అంచేత అందర్నీ లాఠీచార్జీ చేసేసి హాస్టలు మూసేసి పొమ్మన్నారండీ' అన్నారు. ఏ వూరంటే విజయనగరం. దున్నపోతు మనిషిమీద పడుతూ ఉంటుంది, మనిషి దాన్ని ఎదిరిస్తాడు, పెద్ద కఱ్ఱ తీసుకొని. అది వజ్రాయుధం ముఖచిత్రం. చాలా గొప్పబొమ్మ. అది దున్నపోతు పుస్తకం. ఈ పుస్తకం ఆనాడు అమరవీరులయి నటువంటివారు అంటే ఆనాడు బి.టి. రణదివేగారి పాలసీవల్ల బలయిపోయినటువంటి

నిర్భాగ్య కమ్యూనిస్టు వీరులందరి జేబుల్లోనూ, అందరి సంచీల్లోనూ ఉండడంవల్ల దీన్ని చాలా ప్రమాదకరమయిన పుస్తకం అనుకొని దాన్ని బోయిభీమన్నగారిని ట్రాన్స్‌లేట్ చేయమంటే ఆయన చేసి వారికివ్వగా తరవాత అది నిషేధింపబడింది. ఇంక అంతకంటే ఎక్కువ చెప్పగూడదు. ఎందుకు నిషేధింపబడాలో చెపుతూ ఆయన స్టేటుమెంటు పంపించాడు మద్రాసు గవర్నమెంటువారికి. తర్వాత 1960 తర్వాత చిన్నప్పట్నించీ కూడా కృష్ణశాస్త్రిగారిని గురువుగా భావిస్తూ కూడా ఒకసారి మొక్కపాటి నరసింహశాస్త్రి గారుండే వాడే ఆయన వారన్నగారు మొక్కపాటి సుబ్బారాయుడుగారు చాలా గొప్ప పర్సనాలిటీ, సంస్కృతాంధ్రాల్లో ఆంగ్లంలో చాలా గొప్ప పండితుడు. ఆయన చెప్పినటు వంటి గొప్ప పనులన్నీ రోజూ చేసి ఆయన కీర్తిమంతుడయ్యాడు. ఆయన అర్థాంతరంగా 1919లో పోయాడు, వీరేశలింగంగారు పోయిన కొద్దినెలల్లో పోయాడు. ఆయన చెప్పిన కార్యక్రమాలన్నీ రాజావారు చేశారు. తరవాత వచ్చినటువంటి దివానులంతా స్వార్థపరులు కావడంవల్ల రాజాగారు ఆనాటికి చేసినవి తప్ప తర్వాత మంచిపనులేమీ చేయలేదాయన. కాని నరసింహశాస్త్రిగారున్నారే ఈయనకి ప్రతివ్యక్తి మీదా ద్వేషం. నేను చాలా సన్నిహితంగా వెళుతూ ఉండేవాణ్ణి. ఆయనకొడుకు నా క్లాస్‌మేట్, సుబ్బారాయుడని. ఆయనేం చేశాడంటే ఏమిటి? కృష్ణశాస్త్రిగారికి మీకూ గొడవ వచ్చిందంట అని అడిగారు. కళాకేళి వసంతోత్సవాలని జరిపేవాళ్లం చైత్రమాసంలో. అందరూ జనం బాగా వచ్చేవారు. వాళ్లందరికి పానకం అంటే డ్రింకులు, ఏదో పులిహోరలాంటి టిఫిన్లు పెట్టేవాళ్లం. మల్లెపూలిచ్చేవాళ్లం, మంచి గంధం ఇచ్చేవాళ్లం. ఏదో సాహిత్యం మీద చర్చించేవాళ్లం. 'అంటే ఆయనకు నామీద కోపమెందుకు?', 'ఏదో అన్నావట గదా' 'ఏం అనలేదే' అన్నా. 'ఆఁ వాళ్లంతా అస్తాద్రికి చేరుకుంటున్నటువంటి తారలు, మేమంతా ఉదయాద్రికి ఎగబాకుతున్నటువంటి తారలు అన్నావట గదా'. 'అవును అన్నాను. ఫాక్టే కదా. వయసు మళ్లిన, వాళ్లంతా ఇవ్వాళ లేకపోతే రేపైనా వెళ్లవలసిన వాళ్లే కదా' అన్నాను. వీడిలా అన్నాడు, అన్నానని ఒప్పుకుంటున్నాడు అని కృష్ణశాస్త్రిగారితో అన్నాడు. కలహంకోసం. సాయంత్రం లేచి ఆయన చెడామడా తిడుతూ అనర్గళమైన ఉపన్యాసమంతా దీనికోసం నా మీద ఖర్చుపెట్టాడు. నాకు చాలా మండింది. కృష్ణశాస్త్రి ఎంత స్టేటసున్నవాడో నేనూ అంతే ఉన్నవాణ్ణి. తక్కువేం కాదు. ఎటొచ్చీ ఆయనముందు పుట్టాడు. నేను ఆలస్యంగా పుట్టాను. చరిత్రలో కెక్కింది అంతమాత్రంచేత ఆయన నా మీద ఏదో ఒకటి చేయడానికి వీల్లేదు. వెంటనే సెక్రటరీగా ఆరోజు శశాంక రిపోర్టు ఇవ్వాలి. నువ్వుకాదు ఇవ్వాల్సింది నేనిస్తానివాళ అని పుచ్చుకొని కడిగి కడిగి వదిలిపెట్టేశాను. అది ఆఖరి ఉపన్యాసం. సభ అయిపోయింది దాంతో. అలాగ ఎంతో మోశాం. మోస్తున్నాంకదా అని అన్నీ చేయమంటే ఎక్కడ చేస్తాం. ఈ విధంగా శ్రీశ్రీని మోశాను. మోసేవాళ్లం. ఎంచేతనంటే 49లో

వజ్రాయుధం రాకముందే శ్రీశ్రీ అపభ్రంశమయి పోయేడు తెలుసా మీకు. శ్రీశ్రీ కవిత్వం ఎవరికర్థమౌతుంది. మరో ప్రపంచం, మరో ప్రపంచం అంటే ఏమిటి? ఏమిటా ప్రపంచం? ఇలాంటి వెక్కిరింత ప్రశ్నలు సాహిత్య కారులేసేవాళ్లు. ఈనాడు శ్రీశ్రీ సాహిత్యం అర్థమవకపోతే రేపు మా గతంతా ఏమయిపోతుంది?

శ్రీశ్రీ తర్వాత ఒక పదేళ్లు blank అయింది. సరయినటువంటి experimental కవిత్వం రాలేదు. progressive poetry రాలేదు. 1943లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడ్డ తర్వాతనే మళ్లీ సరయిన దారిలోకి వచ్చింది కవిత్వం. అంతకుముందు కురుగంటి సీతారామ భట్టాచార్యులు సాహిత్య వీధుల్లో ఆ దశాబ్దానికి శ్మశాన సాహిత్యం అని పేరు పెట్టారు. ఎందుకు పెట్టారో వివరించినట్లు నాకు జ్ఞాపకం లేదు కాని శ్రీశ్రీ తర్వాత వచ్చిన పద్యాలన్నీ కూడా శ్రీశ్రీ కూడా ఆ శ్మశానకవుల్లో ఒకరు అని చెప్పేశారు. ఈ అపవాదునెలా పోగొట్టాలి అనుకొని శ్రీశ్రీ గురించి establish చేయడంకోసం, శ్రీశ్రీ పద్యాలన్నీ నాకు కంఠతావచ్చు, చాలా అద్భుతంగా పాడుతూ, మంచి వీరావేశంతో నటిస్తూ చటచట హింసరచన ధ్వంసరచన, మరి విషవాయువు మరఫిరంగి... అదే అది వలయం, ఈ విధంగా కొంచెం నటించి శ్రీశ్రీని impress చేయటానికి అయిదారేళ్లు కృషి చేశాం. ఈ విషయం తెలుసు. శ్రీశ్రీ ఉండగానే మాట్లాడా శ్రీశ్రీ కవిత్వం గురించి. కాని ఇవన్నీ మరచిపోగలడతను. జ్ఞాతి వైరంతోటి నారాయణ బాబునే తిట్టాడు. ఇంకెవరిని తిట్టడు. కనకనే శ్రీశ్రీ జాన్తానై. అందుకనే శ్రీశ్రీ కూడ యుద్ధం చేయవలసి వచ్చింది. అలాగే విరసం పుట్టినప్పుడు ఎప్పుడూ కూడా నా మనసులో పుట్టిన మాటని నేను దాచుకోలేదు. దానికొకే ఒక్క కారణం ఉంది.·అది చెప్పితీరాలి. 1948లో రాజమండ్రిలో వీరేశలింగం హాలులో అద్భుతమైనటువంటి సభలో అభ్యుదయ రచయితల మహాసభ జరిగింది. దానికి కృష్ణశాస్త్రిగారు, శ్రీశ్రీ ఉన్నారు. అధ్యక్షులు వారు. వీరిద్దరినీ పల్లకీలో పెట్టి ఊరేగించారు, మామూలు ప్రజలంతా మోస్తూను. పెద్ద ఊరేగింపు. దాంట్లో ఎలా వచ్చిందో అప్పుడు గోర్కీ చైల్డ్‌హుడ్ అని చెప్పి పిక్చరొచ్చింది. ఇంగ్లీషు టైటిల్స్‌తోటి. గోర్కీ తల్లి మళ్లీ పెళ్లి చేసుకుంటుంది. మారుటి తండ్రికి ద్వేషం, కొడుతూ ఉంటాడు. అమ్మమ్మ అంటుంది. దయామయమయినటువంటి హృదయం ఆవిడిది. ఆమె తరువాత ఉత్తరోత్తరా అమ్మపాత్రగా రూపొందింది. మేనమామలుండేవారు. క్రూరులూ, త్రాగుబోతులూ, వెధవలూనూ. అనవసరంగా వీడు ఇంట్లో పడి తింటున్నాడని ద్వేషిస్తూ ఉండేవాళ్లు. తాత దయామయుడు, బాగా తాగి పడుకొనేవాడు. ఆ తాగుడు మత్తు చాలక మరో మత్తు మందు, నల్లమందో ఏదో వేసుకొనేవాడు. ఈయన వంటరివాడయిపోయి 'అమ్మమ్మా! ఈ వెధవదెబ్బలు తినలేకుండా ఉన్నాను. బతికుంటే మళ్లీ నిన్ను చూస్తాను, లేకపోతే లేదు, నాకు శలవిప్పించమ్మా' అన్నాడు గోర్కీ పదకొండేళ్ల పిల్లవాడు. అంటే

'బాబూ నిన్ను వెళ్లు అనలేను, ఉండు అనడానికి నాకు హక్కులేదు. వెళ్లు. జీవితాన్ని వెతుక్కుంటూ వెళ్లు. కాని ఒక్కటి గుర్తు పెట్టుకో never hide behind another's conscious. నీ అంతరాత్మను నువ్వు ప్రజ్వలింపజేయి. ఇంకోడి అంతరాత్మ వెనుక నువ్వు దాక్కోకు' అంది. వేలాదిమంది చూశారు ఆనాడు సినిమా. ఈ మాట ఎంతమంది మీద ప్రభావం కలిగించిందో తెలీదు కాని ఇది నా జీవితానికి మోటో. నేను ఎవరిమాటయినా మాట్లాడుతున్నానా? ఎవరికోసమయినా ప్రీత్యంకంగా నేను చేస్తున్నానా? నా మాట నేను పలుకుతున్నానా? నా హృదయంలో మోగుతున్నదే నేను చెపుతున్నానా లేదా? అది కవిత్వంలో కాని, మరో ప్రక్రియలో గాని, అనేది నా ప్రశ్న. నాకు నచ్చని దాన్ని తీవ్రంగా అనడమే. మొహమాటం లేదు. చస్తేపోతాం అంతకంటే ఏముంది? అల్టిమేట్ ఇదేముంది? కొడతారు, చంపుతారు, ఆ మధ్యన నక్సలైట్ సోదరులొచ్చారు మా యింటికి. వచ్చి, తలుపు గుద్దారు, తీశాను, లోపలికొచ్చారు. వచ్చేసరికి వాళ్ళ వేషం చూసి నాకు అనుమానం వచ్చింది. నేను చాలా సౌమ్యంగానే మాట్లాడాను. 'అయ్యా గురువుగారూ! మీరు ఖబర్దార్ అనే కవిత్వం మళ్లా రాయాలి' అన్నారు. అంటే ఖబర్దార్‌కి నేను ఇంపోజిషన్ రాయనా అన్నాను. కాదు తీవ్రమయిన కవిత్వం రాయాలి. 'నాయనా కవిత్వం ఏదీ ఎవర్నీ పిల్లల్ని కనదు, విప్లవాలు కనదు, విప్లవావేశపరులకు మరింత ఆవేశం కలిగిస్తుంది, మీకు ఆవేశం కలిగించేవాళ్లు మీకిప్పటికే ఉన్నారుకదా' అప్పటికర్థమయిపోయింది నక్సలైట్లని నాకు, కనక పెద్దవాళ్లమయిపోయాం అప్పటికే మనం 70 నడుస్తోంది నాకప్పుడు. ఇంకేంరాస్తాం, ఇదే చెప్పాను. తోచింది రాస్తాను. కాని ఒక్కటిమాత్రం చెప్పాను నేను శాస్త్రీయ సామ్యవాద పథాన్ని నా జీవితాంతం నేను విడిచిపెట్టను. మీరు అనుకున్నది మాత్రం శాస్త్రీయ సామ్యవాదపథం కాదు. చంపడం, చావడంవల్ల ఏమీ రాదు. ఇప్పటికెంతో మందిని చంపారు మీరు, జ్ఞాపకముంచుకోండి, దీనివల్ల మాత్రం మీరెవర్నీ ఉద్ధరించలేరు. ఇది ఖాయం, ఈ దుందుడుకువాదంవల్ల పెటీబూర్జువా ప్రదర్శనంవల్ల ఏమీ జరగదు. నన్ను ఉరితీయి, నేను చెప్పవలసింది చెప్పకత్పదు, అని పంపించాను. నేను పిఠాపురంలో నా షష్టి పూర్తికి ఊళ్లో ఉన్న కోమట్లంతా చాలా సహాయం చేశారు. వీరందర్నీ '42 నుంచీ బ్లాకు మార్కెటు చేశారని చాలామందిని అరెస్టు చేయించాను నేను. procurement చేయించాను. కాని పాపం వాళ్లే ముందుకొచ్చి డబ్బు వసూలు చేశారు. డబ్బు వసూలుచేసి నాకు 7,000 రూపాయలివ్వాలనీ క్యాష్ తీసుకుంటే, నాకిప్పుడవసరం లేదీ డబ్బు అని దాన్ని కామన్ ఫండ్ కింద ఉంచండి అని ఆ వ్యాపార సంఘ సెక్రటరీకి చెప్తే వాడు శుభ్రంగా తినేసి ఆత్మహత్య చేసుకొని చచ్చిపోయాడు పాపం. చాలా మంచివాడు పాపం. ఆ వేళ ఆ షష్టి పూర్తినాడు చెప్పాను. వీడికెందుకొచ్చిందీ ప్రేమ, ఎలా వచ్చింది, నేనెప్పుడూ వీళ్లని స్పేర్ చేయలేదే, ఎప్పుడూ

వీళ్లమీద వ్యతిరేకంగానే మాట్లాడానే అంటే అన్నాడు వెనక నుంచి అన్నాడొకతను 'పిఠాపురానికెవరున్నారు ఇంకొకరు పేరు తెచ్చేవాళ్లు మీరు కాకపోతే ఇప్పుడు, గతం ఉంది. వర్తమానమేదీ పిఠాపురానికి? భవిష్యత్తెలాగా లేదేమో' అన్నాడు. ఆ అభిమానంకొద్దీ సప్తతి పూర్తి కూడా బాగా చేశారు. అయితే వన్ డే మ్యాచ్‌లాగా పొద్దున 8 గం॥ నుండి రాత్రి 8 గం॥లకు ఆ వేళ 50 మంది రచయితలు ఉపన్యాసాలిచ్చారు. బాగా జరిగింది.

చాలా సందిగ్ధ వర్తమానంలో బతుకుతున్నాం మనం. ఇరవయ్యో శతాబ్దం ఒక అయిదేళ్లలో ముగుస్తోంది. ఇరవయ్యొకటో శతాబ్దం రానుంది. ఈ ఇరవయ్యొకటో శతాబ్దాన్ని ఆలింగనం చేసుకొని, ఆహ్వానించడానికి, స్వాగతం పలకడానికి, మన హృదయ సంస్కృతి సిద్ధంగా ఉండాలి కదా. మనం ఇంకా కుళ్లు మోతుల్లాగా పద్దెనిమిదో శతాబ్దంలోనే బతుకుతున్నాం. మనకింకా ఈ కులాల వెధవ పోకిళ్లన్నీ పోయాయా? ఉన్నాయా? ఇవన్నీ ఎవరికి వారు వేసుకోవలసిన ప్రశ్నలు. ఇవన్నిటికీ అతీతంగా బతికినప్పుడే మనం ఇరవయ్యొకటో శతాబ్ది పౌరులమవుతాం. లేకపోతే పద్దెనిమిదో శతాబ్దం పౌరులు. మిమ్మల్ని ఇరవయ్యొకటో శతాబ్దానికి అర్హులుగా కాకుండా చేయడానికి ఈ వెనుకబాటుతనంతోటి ఈ వైశ్వనాథీయులందరూ కూడా చాలా తీవ్రమైన కృషి చేస్తున్నారు. ఈనాడు విశ్వనాథ సత్యనారాయణను కొలుస్తున్నవారంతా బి.జె.పి.వాళ్లు. బి.జె.పి. వాళ్లు రాజ్యానికి వస్తే మళ్లీ కులవ్యవస్థ సజావుగా వస్తుంది. మనుధర్మశాస్త్రమే ఆధునిక శాస్త్రమవుతుంది. ఇది నేను యాభై రెండు సంవత్సరాల కమ్యూనిస్టుగా మాట్లాడడం లేదు. మానవుడుగా మాట్లాడుతున్నాను, భారతీయుడుగా మాట్లాడుతున్నాను. నెహ్రూ మనకు ఒక సెక్యులర్ కండిషన్ ఇచ్చాడు. సెక్యులర్ కండిషన్ ఇవ్వడమంటే ఆయనేదో చేసేశారని కాదు, కనీసం మనల్ని ప్రపంచ పౌరుల స్థాయికి ఎత్తడానికి ప్రయత్నించాడాయన. అది లేకుండా మనం ఎక్కడికో దిగజారిపోతాం మళ్లా. ఆయన డిస్కవరీ ఆఫ్ ఇండియాలో ఒక మాటన్నాడు, చంద్రగుప్త మౌర్యులు కాలంలో మనకు ఈ మనుధర్మశాస్త్రం పుట్టింది. మనుధర్మశాస్త్రంలోనే ఒక కుటుంబంలో పెద్దవాడికే రాజ్యాధికారం అని రాయబడింది. ఆ మనుధర్మశాస్త్రంలోనే ఏకపత్నీవ్రతం గురించి చెబుతూనే స్త్రీకి చాలా అగచాట్లు కల్పించాడు. కనక రామాయణం చంద్రగుప్త మౌర్యుని తర్వాత కాలంలో వచ్చిందని నేను నమ్ముతున్నాను అని రాశారు. ఇది ఆలోచించవలసిన విషయం. ఎంచేతంటే జ్యేష్ఠభాగం రాముడు. జ్యేష్ఠుడయినందువల్లే అతడు రాజ్యానికి వచ్చాడు. కనుకనే భరతుడు రాజ్యం ఏలుకోనంటాడు, ఏలుకోడానికి భయపడిపోతాడు రామాయణంలో. ఆనాడు చలామణీ అవుతున్నటువంటి భావం. బాబూరావు నన్ను రిక్వెస్టు చేశాడు. బాబూరావంటే నాకు గొప్ప ఇన్స్పిరేషను. నాలో ఒక రకమైన జీవశక్తికి ఆయనే

కారణం. నన్ను ఇంగ్లండు తీసికెళ్లి మూడునెలలు, శతాధిక దినాలు తిప్పి అన్నీ ఎక్స్‌ప్లెయిన్ చేసి, ఓ సూర్యదేవాలయం ఉందండీ అక్కడ నేను మర్చిపోయాను, నందులు పెద్ద మైదానం, ఆ వూరు మర్చిపోయాను. ఇక్కడ ఇండియాలో ఉద్యోగంచేసి వెళ్లి అక్కడ సూర్యదేవాలయం కట్టాడండీ ఒక మహానుభావుడు, మంచి ఎంతో సుందరమయిన ప్రదేశం చేశాడు. నాకు కేవలం కవే బతికాడక్కడ, విమర్శకుడు లేడు. పరిశోధకుడు లేడు. ఆరుద్ర మోశాడు అదంతా, ఆ గాడిదమోతంతా ఆరుద్రకొదిలేశాను. కేవలం కవిగా బతికి ఆ అద్భుతమయిన సీమలో కవిత్వం రాశాను. యాత్రా కవితలు రాసిన వాడింతవరకూ లేడు, మాత్రా కవితలు రాసిన వాళ్లున్నారు కాని యాత్రా కవితలు నేనే రాశాను. అది ఆంగ్లసీమలో ఆమనివీణలు అని చెప్పి పుస్తకం అచ్చేశాను. అలా యథాశక్తి సాహిత్యసేవ చేస్తున్నాను. ప్రచురణకర్తలెవరన్నా సహాయం చేస్తే పుస్తకం వేస్తాను, లేకపోతే నేనే వేసుకుంటున్నాను. ఇంతవరకు ఎవరు తృణమిస్తామన్నా తిరస్కరించలేదు, ఎవరినైనా తృణమిప్పించమని నేను బతిమాడలేదు. ఈ జీవితం ఇలా వెళ్లిపోతూంది. ఇక ఆఖరి దశాబ్దంలోకి వచ్చాను, ఒక దశాబ్దంకంటే ఎక్కువ బతకను, నాకు తెలుసు. నా తండ్రులు, నా అన్నగార్లకంటే బాగా ముందుకొచ్చి బతికాను, ఎందుకంటే నా స్థితిలో మంచి మందులొచ్చాయి, వైద్యశాస్త్రం బాగా అభివృద్ధి చెందింది. ఏమైనా 'వినాదైన్యేనజీవనం', 'అనాయాసేన మరణం' ఇది భారతీయులు కోరుకునేది. ఈ రెండే కోరుతూ ఈ రెండింటినీ గమ్యంగా పెట్టుకొని నేను ఆ బాల్యంగా ఏ మానవుడినైతే నమ్ముకుంటున్నానో ఆ మానవుడి ఉచ్చస్థితిని చూడాలని కలలు కంటూ ఇక సెలవు తీసుకుంటాను.



డా. రావూరి భరద్వాజ

మా పూర్వీకులది వరంగల్లు సమీపంలోని మట్టెవాడ ప్రాంతమట. మాకక్కడ చాలా భూములు కూడా ఉండేవట. ఏ కారణంగానో ఆ ప్రాంతాన్ని వదిలి, గుంటూరు జిల్లాలోని తాడికొండ గ్రామానికి వలసవచ్చారట.

నందిగామ తాలూకా కంచికచర్లకు సమీపంలో మొగులూరు మా స్వగ్రామం. అది పరిటాల జాగీరులోనిది. ఆ గ్రామంలో సంగయ్య, ఆదెయ్య, కోటయ్య, మల్లయ్య అని నలుగురు అన్నదమ్ములు. వారిలో ఇద్దరు నాకు తెలుసు. ఆదెయ్య పెద్దకూతురు మల్లికాంబ. ఆమే మా అమ్మ. మా అమ్మకు నలుగురు సంతానం. నేను పెద్దవాడ్ని. రెండవ సంతానం మా చెల్లెలు కోటీశ్వరమ్మ. మూడవ సంతానం సుందరమ్మ. నాలుగవ సంతానం నారాయణమూర్తి.

మాకున్న 20 ఎకరాల పొలంలోనూ, 17 ఎకరాల పొలం దుబారా కింద ఖర్చు చేశాడు మా నాన్న. నాటకాలు, భజనలు, సంఘసేవ, చిన్న చిన్న ఉద్యమాలవంటి వాటిల్లో తిరగడంవల్ల, భూముల్ని అమ్ముకొని బతకవలసి వచ్చింది.

1942 నాటికి నాకు 15 సంవత్సరాలు. మా నాన్న మరికొందరితో కలిసి రైలుపట్టాలు పీకడానికి నంబూరు పోయాడని చెప్పుకొంటూ ఉండేవారు. ఏవో ఉద్యమాలనీ, ఊరేగింపులనీ తిరుగుతుండేవాడు. మా అమ్మ పోరు పెడుతూ ఉండేది. అయినా మా నాన్న వినలేదు. ఊళ్లో పెద్దలు కూడా చెప్పడంవల్ల, మా నాన్న కాస్త మెత్తబడి, మూడెకరాల్లో పొగాకు వేశాడు.

మొదటి సంవత్సరం దొంగలుపడి ఆకును విరుచుకుపోయారు. రెండవ సంవత్సరం బూడిద తెగులు కారణంగా పంటంతా నాశనమయింది. మూడో సంవత్సరం మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని, ఇంకో భాగస్థుణ్ణి కలుపుకొని వ్యాపారం చేశాడు. ఆ భాగస్థుడు నిలువునా ముంచాడు.

ఆ సంవత్సరం చాలామంది వ్యాపారస్థులు రూపాయికి బేడలు, అణాలు చెల్లించారు రైతులకు. మా నాన్న ఒక్కడే రూపాయికి, రూపాయి చొప్పున చెల్లించాడు. అలా చెల్లించడం కోసం, మాకు మిగిలిన మూడెకరాల తూరుప్పొలమూ అమ్మేశాడు.

"నా బిడ్డలు పెరిగి పెద్దవారయ్యాక, వీధుల్లో తలెత్తుకు తిరగాలి. వారిని చూసి, 'రూపాయికి అణాలు, బేడాలు చెల్లించినవాడి పిల్లలు వీళ్ళే' అని ఎవ్వరూ వారిని అనకూడదు, వేలెత్తి చూపకూడదు" అనేవాడు మా నాన్న. అన్నంతపనీ చేశాడు.

ఫలితంగా దరిద్రం మమ్మల్ని చుట్టుముట్టింది.

మా నీరుకొండ పొలంలోనూ, మా తూరుప్పొలంలోనూ, మా నాన్న, మా అమ్మ, నేను కూలిపనులు చేసుకొని బతికాం.

నాకు అయిదవ ఏటనే అక్షరాభ్యాసం చేశారు. ఆ చేసినవారి పేరు కొల్లిపర కోటయ్యగారు. మా పెదనాన్నకూ, మా నాన్నకూ కూడా ఆయనగారే అక్షరాభ్యాసం చేశారు. ఎందుకనోగానీ మాక్వెరికీ "చదువు" అబ్బలేదు.

1942 నాటికే, నేను చదువు మానేశాను. అలా మానేయడానికి ప్రత్యక్ష కారణం, మా స్కూలు హెడ్‌మాస్టరుగారయితే, పరోక్ష కారణం మా కుటుంబాన్ని ముసిరిన దరిద్రం.

స్కూల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీకి వచ్చిన రోజున కూడా నేను చిరిగిన లాగు, చిరిగిన చొక్కా తొడుక్కున్నానన్న కారణంతో, మా హెడ్మాస్టరుగారు ముందుగా నన్ను నుంచోబెట్టారు. తరువాత వంగోబెట్టారు. ఆ తరువాత గొడ్డును బాదినట్టు బాదారు. ఆ దెబ్బలను భరించలేకపోయాను. మాస్టరుచేతిలోని బెత్తాన్ని విరిచేశాను. పుస్తకాల సంచిని ఆయన మీదికి గిరవాటు వేశాను. బండబూతులు తిడుతూ పారిపోయాను. వేణుగోపాలస్వామివారి రథంలోనూ, గాలిగోపురం సందులోనూ, చెరువుకట్టల మీదా, కొండమీది గుడిమెట్ల మీదా దాక్కొన్నాను. చాలాకాలం తరువాతగానీ, ఇంటికి రాలేదు.

అప్పుడప్పుడే తాడికొండలో, కొత్త రకం రాజకీయాలు వీచడం ప్రారంభించాయి. ఈ కొత్తగాలిని తీసుకొచ్చినవారు చిర్రా రామకోటి రెడ్డిగారు. యువజనసంఘాలు, విద్యార్థిసంఘాలు, వ్యవసాయకూలి సంఘాలు, రైతు సంఘాలు, బాలసంఘాలు వారేర్పాటు చేశారు.

"రష్యా" అన్న దేశాన్ని గురించి, ఆయనగారు పదేపదే చెబుతూ ఉండేవారు. ఆ దేశంలో పేదరికం లేదట. అందరికి తిండి, అందరికి గుడ్డ, అందరికి నీడ, అందరికి విద్య, అందరికి వైద్యం, అందరికి పని– ఇలాగా దేనికీ కరువు ఉండదట. అలాంటి సమాజం కావాలని ఆ తరం వారందరూ ఆశించారు. నేనూ ఆశించాను. అందుకోసం మీటింగులు పెట్టారు. ఊరేగింపులు జరిపారు. వీటన్నింటిలోనూ నేనూ పాల్గొన్నాను.

తిండికోసం– పిడికెడు మెతుకులకోసం– నేను వ్యవసాయ కూలీగా పనిచేశాను. పశువుల కాపరిగా పనిచేశాను. ఒక కో ఆపరేటివ్ స్టోర్స్‌లో, సరుకులందించే కుర్రాడిగా పనిచేశాను. పొగాకు బారన్‌లో బొగ్గువేసే కూలీగా పనిచేశాను. ఒక కలప అడితీలో, రంపంలాగే కూలీగా పనిచేశాను. ఒక కమ్మరి దగ్గర తిత్తు లూదడానికీ, సమ్మెట వేయడానికీ కుదిరాను. కొంతకాలం పేపర్ బాయ్‌గా కూడా పనిచేశాను.

రెండవ ప్రపంచయుద్ధం ముమ్మరంగా జరుగుతున్న రోజులవి. యువకులను మిలిటరీలోకి ఆహ్వానిస్తూ ప్రభుత్వం రకరకాల ప్రకటనలు చేస్తున్నది. ఇంత వయసుండాలి, ఇంత బరువుండాలి, ఇంత ఎత్తు ఉండాలి, అంటూ ఏవో నిబంధనలుండేవి. 1944 నాటికి నా వయస్సు 17 సంవత్సరాలే! కానీ పద్దెనిమిదేళ్ళని అబద్ధమాడి, కొలతలకు, తూకాలకు సిద్ధపడ్డాను. రెండుసార్లు బరువు తక్కువగా ఉన్న కారణంగా సెలక్టు కాలేదు. మూడవసారి ఒక దయామయుడు నాకో ఉపాయం చెప్పాడు. ఎత్తు, గుండె చుట్టుకొలతలు, ఒకచోట చూస్తారు. బరువును మరొకచోట చూస్తారు. అందుకని ముందుగా ఎత్తును, గుండె చుట్టుకొలతను చేయించుకొని, బరువు చూసే చోటుకు వెళ్ళబోయేముందు పుష్కలంగా అరటిపళ్ళు తిని, నాలుగైదు గ్లాసుల నీళ్ళు తాగి, బరువు తూచే మెషిను మీద నిలబడ్డాను. బొటాబొటిగా బరువు సరిపోయింది. నేను సెలెక్ట్ అయ్యాను. ఒక సంవత్సరంపాటు నాకు తిండి సమస్య, గుడ్డ సమస్య, గూడు సమస్య లేదు.

ఆ దయామయుని పేరు పురుషోత్తంగారు. వారిది తాడికొండకు సమీపంలోని లాం అన్న గ్రామం. అరటిపళ్ళకి కావలసిన ఒక్క అణాడబ్బులు వారే ఇచ్చారు.

ఓ సంవత్సరం పాటు, నేను పాములపాటి వెంకటకృష్ణయ్యగారి సెంటర్‌లోనే ఉన్నాను. యుద్ధం అయిపోయింది. అందర్నీ విడుదల చేశారు.

1945–46 సంవత్సరాలు మరీ నరకప్రాయాలు. మా నాన్నగారి రాజకీయాలు వేరు, నా రాజకీయాలు వేరు. రాజకీయంగా మా ఇద్దరికి పడదు. అందుకని ఊళ్ళో ఉన్నప్పటికీ, ఎప్పుడోగానీ ఇంటికి వెళ్ళేవాణ్ణి కాదు. ఎవరింట్లోనో తినడం, ఏ గుడిలోనో, అరుగుమీదనో నిద్రపోవడం అలవాటయింది. ఎక్కడా ముద్ద దొరకనప్పుడు, చెరువులోని

నీళ్ళు తాగి, మెట్లపక్కనే ఉన్న మండపంలో నిద్ర పోయేవాణ్ణి.

నేను మా ఊరు వెళ్ళిన ప్రతిసారీ, ఆనాడు నాకు అన్నంపెట్టిన అమ్మలనూ, నేను పడుకొన్న గుడిగోపురాలనూ, తిరిగిన చెరువు కట్టలనూ, చెరువమ్మనూ పలకరించి వస్తుంటాను.

నాకసలు చదువురాదు. కానీ ఒకానొక అవమానం నన్ను చదువువైపు మళ్ళించింది. నాకన్నా వయసులో చిన్నవాడయిన ఓ కుర్రాడు మనుచరిత్రలో ఉండే ఓ పద్యం అప్పగించాడు, మా ఊరి లైబ్రరీ అరుగులమీద. అందరూ ఆ కుర్రాణ్ణి మెచ్చుకొన్నారు. శేషయ్యగారనే మా నాన్న స్నేహితుడు, ఆ కుర్రాడితో నన్ను పోలుస్తూ తిట్టాడు. చుట్టూ ఉన్న వారందరూ నవ్వారు. ఆ నవ్వు నన్ను గాయపరిచింది. ఆ గాయం నాలో పట్టుదలను రెచ్చగొట్టింది. పగలంతా కూలిపని నాలిపని చేసుకొనేవాణ్ణి. రాత్రిపూట మా వూరి శివాలయంలోని ప్రమిద వెలుతురులో చదువుకొనేవాణ్ణి. బాలభారతి గ్రంథాలయంలో చాలా పుస్తకాలుండేవి గానీ, వాటిని చందాదారులకు మాత్రమే ఇంటికిస్తారు. సంవత్సరం చందా మూడు రూపాయలు. ఆ చందాను చెల్లించి తనపేర పుస్తకాలు తీసుకొని చదువుకొనే అవకాశాన్ని కొల్లూరు వెంకటేశ్వర్లుగారన్న మహా దాత నాకు కలిగించాడు. ఆయన ఋణం తీర్చుకోవడం కోసం 1965వ సంవత్సరంలో "పాకుడు రాళ్ళు" నవలను వారికి అంకితమిచ్చాను.

ముందుగా పద్యాలు రాశాను. అందులో గణ, యతి ప్రాసలు తప్ప కవిత్వం ఉండేది కాదు. జీవన ప్రభాత్ అన్న ఒక కథకుని ప్రోత్సాహంతో కొవ్వలివారి నవలలు, చలంగారి పుస్తకాలు, కుటుంబరావు పుస్తకాలు, గోపీచంద్ పుస్తకాలు చదవడం ప్రారంభించాను.

వారిలాగే కథలు రాయడం ప్రారంభించాను. వాక్యం తరువాత వాక్యం వచ్చేదికాదు. దృశ్యాన్ని అక్షరబద్ధం ఎలా చేయాలో బోధపడేది కాదు. అయినా రాసి పత్రికలకు పంపుతుండేవాణ్ణి. కొన్ని తిరిగొచ్చాయి. కొన్ని ఏమయిపోయాయో తెలీదు.

ఈ రాతకోతలకు కావలసిన ఒక వైలెట్ పెన్సిల్‌ను, ఒక దస్తా కాగితాలను త్రిపురనేని శివరామకృష్ణయ్యగారన్న స్నేహితుడు నాకోసారి కొనిపెట్టాడు. ఆ ఋణం తీర్చుకోవడం కోసం "ఇదంజగత్" అన్న నవలను, అతనికీ, వారి ధర్మపత్ని శ్రీ మరమ్మగారికీ కలిపి అంకితమిచ్చాను ఆ తరువాత.

అచ్చయిన నా తొలి కథ పేరు "విమల". అది 1946 ఆగస్టు 26వ తేదీ నాటి "ప్రజామిత్ర" వారపత్రికలో అచ్చయింది. ఆ తరువాత చాలా కథలు చాలా పత్రికలలో వచ్చాయి.

1946 చివరలో నెల్లూరుకు సమీపంలో "యువజన కాంగ్రెస్ శిక్షణా శిబిరం" కార్యక్రమానికి నేను హాజరయ్యాను. చాలామంది పెద్దపెద్ద నాయకులను నేనప్పుడే చూశాను. కళా వెంకట్రావు, పొట్టిశ్రీరాములు, ఆచార్యరంగా, ఎ.సి.సుబ్బారెడ్డి, రేబాల చంద్రారెడ్డి లాంటి వారెందరినో దర్శించుకొన్నాను.

మా నాన్నగారికి, రంగాగారితో ఉన్న పరిచయం కారణంగా, నా గురించి నెల్లూరు వెంకట్రామానాయుడుగారికి సిఫార్సు చేసి "జమీన్ రైతు" వారపత్రికలో నాకో చిన్న ఉద్యోగం ఇప్పించారు రంగాగారు. అంతక్రితం ఆ ఉద్యోగాన్ని ఆచార్య ఆత్రేయ చేస్తూ ఉండేవాడు. నాటకాలమీద అభిమానంతో ఆత్రేయ ఆ ఉద్యోగాన్ని మానేశాడు. నేనా ఉద్యోగంలో చేరాను.

అప్పుడే నాకు మరికొందరు పెద్దవారితో పరిచయాలేర్పడ్డాయి. మారుపూరి కోదండరామిరెడ్డి, దీపాలపిచ్చయ్యశాస్త్రి, చంద్రశేఖర కణ్వశ్రీ, నారపరెడ్డి రామిరెడ్డి, ఉండేల మాలకొండారెడ్డి వంటి వారెందరితోనో పరిచయాలయ్యాయి.

1947 ఆగస్టు 5వ తేదీనాడు "సుప్రభాతం" అన్న పుస్తకాన్ని వీధి వీధీ తిరిగి, అమ్మగా వచ్చిన డబ్బులన్నీ ప్రచురణకర్తకిచ్చి, పెన్నా నదిలోని నీళ్ళు తాగి, ఆ పొద్దునే, కాలే కడుపుతో నిద్రపోయాను.

వెంకట్రామానాయుడు గారొకసారి, ఫలానావారికి వ్యతిరేకంగా రాయమన్నారు. 'నేను రాయ' నన్నాను. 'అయితే ఉద్యోగం మానెయ్య' మన్నారు. "సరే" నని మానేశాను. పెళ్ళకూరు గోపాలకృష్ణారెడ్డిగారు, పొగతోట ప్రాంతంలో "దీనబంధు" వారపత్రికను ప్రారంభించేదాకా నరకం అనుభవించాను. ఆ బాధలను అనుభవిస్తున్న రోజుల్లో నాకు అంతో ఇంతో సాయంచేసిన మరో దయామయుడు ఉండేల మాలకొండారెడ్డి.

నేనో చిన్న ప్రేమ వ్యవహారంలో ఇరుక్కున్నది కూడా అప్పుడే!

"దీనబంధు" కార్యాలయానికి ఎదురుగా, ఓ పెద్ద పెంకుటిల్లు ఉండేది. అదో వెలయాలిది. ఆమె పేరు నాగరత్నం. ఆ ఇంట్లోనే, చామనచాయగా ఉండే ఓ బక్కపలుచని పిల్ల ఉండేది. ఆమెపేరు రోహిణి. ఆ పిల్లకు అమ్మెవరో తెలీదు. చిన్నపిల్లగా ఉన్నప్పుడే, నాలుగైదు రూపాయలకో, ఇంకా తక్కువకో, ఆ పిల్లను కొనుక్కొన్నది నాగరత్నం. ఆ పిల్లచేత కూడా "వ్యాపారం" చేయించాలని నాగరత్నం ఆలోచన.

పుస్తకాలకోసమూ, పత్రికలకోసమూ ఆ పిల్ల తరచుగా, దీనబంధు కార్యాలయానికి వస్తూ ఉండేది. ఆ పిల్లకు ఎడంవేపున గొగ్గిపన్ను ఉండేది. చిన్న పులిపిరి కూడా బుగ్గమీద ఉండేది. ఆ పులిపిరి కనబడకుండా, జుత్తును బుగ్గలమీదిదాకా జార్చుకొనేది. గొగ్గిపన్ను

కనిపించకుండా బిగబట్టి నవ్వుతూ ఉండేది. వీటి మాటకేంగానీ, రోహిణి కళ్ళు చాలా అందంగా ఉండేవి. నీలంరంగులో మెరిసిపోతూ ఉండేవి.

ఆమెను పెళ్ళి చేసుకొందామనుకొని, మా నాన్నకు, మునిమాణిక్యం గారికి, చలంగారికి ఉత్తరాలు రాశాను. చలంగారు మాత్రం "గో ఎహెడ్" అని జాబు రాశారు.

ఈ పెళ్ళి జరగకపోవడానికి, నా పేదరికమే కారణం! నాగరత్నం "అమ్మాయికి సొమ్ము" పేరుతో మూడువేలు కావాలన్నది. "నా దగ్గర మూడు రూపాయలు కూడా లే" వన్నాను.

ఆ తరువాత కొద్దిరోజులకే; గూడూరులో ఉన్న వొక మైకా వ్యాపారికి రోహిణినిచ్చి "నిషేక ముహూర్తం" నిర్ణయించింది నాగరత్నం.

ఆ రోజునే నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, తాడికొండకొచ్చాను.

నా ఈడు వాళ్ళందరకూ పెళ్ళిళ్ళు అయ్యాయి. ఒకరిద్దరు బిడ్డల తండ్రులు కూడా అయ్యారు. సాధ్యమయినంత తొందరగా పెళ్ళి చేయాలని, మా అమ్మ నాన్నల అభిప్రాయం. నాలుగయిదు సంబంధాలు చూశారు. నాకు కులాల పట్టింపు లేదనీ, ఎక్కడబడితే అక్కడే తింటాననీ, ఆస్తిపాస్తులేమీ లేవనీ, ఏ ఉద్యోగమూ లేదనీ, ఏ పనీ చేతకాదనీ- వంటి కారణాలతో, పిల్లనివ్వడానికెవరూ ముందుకు రాలేదు. రాకపోవడమే మంచిదనిపించింది.

సరిగ్గా అదే సమయంలో కృష్ణా జిల్లా, నందిగామ తాలుకా, తోటరావులపాడు గ్రామవాసి, మేదూరి మల్లయ్యగారు, తాడికొండ వచ్చారు. మమ్మల్ని చూశారు. మా విషయాలన్నీ వాకబు చేశారు. తన కూతురును చూసుకోవడానికి, ఫలానా తేదీనాటికి రమ్మన్నారు.

తోటరావులపాడుకూ, మా మేనమామగారి ఊరయిన మొగులూరుకూ మధ్య నాలుగయిదు మైళ్ళ దూరముంది. నేను, మా అమ్మ, నాన్న, మా మేనమామ శేషయ్యగారు కలిసి, మల్లయ్యగారు రమ్మన్న సమయానికి తోటరావులపాడు చేరుకొన్నాం. నాకు పెళ్ళి కాదేమోనన్న భయంతో, మా మేనమామగారు నా గురించి, మా ఆస్తిపాస్తులను గురించి, చాలా ఉబికించి చెప్పాడు. నేను స్కూలు ఫైనల్‌దాకా చదివాననీ, తెలుగులో ఒక్క మార్కు తక్కువ రావడంవల్ల పరీక్ష తప్పాననీ, నెల్లూరులో ఉద్యోగం చేస్తున్నాననీ, నెలకు 60 రూపాయల జీతమనీ, మూడెకరాల పొలమూ, రెండు ఇళ్ళు ఉన్నాయనీ చెప్పాడు.

మల్లయ్యగారూ, నేనూ ఊరికి దగ్గరగా ఉన్న మామిడితోపులో కూచున్నప్పుడు అసలు సంగతి చెప్పాను.

"నాకు పెళ్ళి కాదని, మా మేనమామగారి భయం. అందుకే చాలా అబద్ధాలు చెప్పాడు. నేను 7వ తరగతి పాసయ్యాను. నెల్లూరులో నేనిప్పుడు ఉద్యోగం చేయడంలేదు. చేసినప్పుడు కూడా నా జీతం 20 రూపాయలు మాత్రమే! మూడెకరాల పొలంలేదు. రెండిళ్ళున్నాయి. ఒకటే మాది, మరొకటి మా తాతగారిది" అన్నాను.

"ఈ సంగతులన్నీ నాకు తెలుసు. అన్నీ చెప్పావుగానీ, రోహిణి సంగతి చెప్పలేదేం?' అన్నారు మల్లయ్యగారు.

"ఆ సంగతి మీకెలా తెలుసు?" అన్నాను.

"మునిమాణిక్యంవారు చెప్పారు. ఆయన నాకు మంచి స్నేహితుడు. నా రెండవ కూతురు పేరు కాంతం. ఆయన కథలు చదివాకే, ఆ పేరు మా అమ్మాయికి పెట్టుకొన్నాను. నేనూ పేదవాణ్ణే! గింజలు దంచి, పేడతొక్కి బతికాను. దాచుకోకుండా మీరు నిజం చెప్పారు. నిజం చెప్పినవారికి పిడికెడు మెతుకులు దొరుకుతాయన్న నమ్మకం నాకున్నది. మీకో పిడికెడు అన్నం దొరికితే, సగం నా బిడ్డకు పెట్టి, మిగిలిన సగం మీరు తింటారన్న నమ్మకం నాకున్నది. అందుకనే, మా అమ్మాయిని మీకిద్దామనుకొంటున్నాను.

ఇంటికొచ్చాం. పిల్లను చూడమన్నారు. నేను చూడనన్నాను.

1948 మే 28వ తేది రాత్రి, పెళ్ళిపీటల మీద కూచుని, జీలకర్ర, బెల్లం కలిపి, నెత్తిమీద పెడుతున్నప్పుడు మాత్రమే నేను పెళ్ళికూతుర్ని చూశాను.

పెళ్ళయింది.

అమ్మా నాన్నల బరువు తీరింది గానీ, నా బరువు పెరిగింది. నా కేమో ఉద్యోగం లేదు. చేయడానికయినా ఏ పనీ చేతకాదు.

సరిగ్గా ఆ సమయంలోనే, తెనాలి నుండి ఆలపాటి రవీంద్రనాథ్‌గారు నాకో కార్డు రాశారు. "ఈ ఉత్తరం అందగానే, తగినన్ని గుడ్డలు తీసుకొని తెనాలి రండి" అని. ఈ ఉత్తరం వచ్చిన రోజున మా నాన్న ఊళ్లో లేడు. భోషాణంలో ఉన్న కందిపప్పు కుండలోంచి, అయిదు రూపాయలు తీసుకోమని మా అమ్మ చెప్పింది. అక్షరాలా అయిదు రూపాయలు మాత్రమే తీసుకొని, గుంటూరుదాకా నడిచి, రైలెక్కి తెనాలి చేరాను.

తెనాలితో అంతకుముందు నాకు కొంచెంగా పరిచయముంది.

రవీంద్రనాథ్‌గారు జ్యోతి, రేరాణి, సినీమా అన్న మూడు పత్రికలను నడుపుతున్నారు. జ్యోతి, రేరాణి పత్రికలను ధనికొండ హనుమంతరావుగారు చూస్తుంటే, సినీమా పత్రికను

మాగాపురామన్ చూస్తూండేవాడు. ఈ మూడు పత్రికల సంపాదకత్వ బాధ్యతలలో నాకూ భాగముండేది. చాలామంది కొత్త కథకులను నేను ప్రోత్సహించాను. ఎంత పాతవారయినా, వారు రాసినవి నచ్చకపోతే, నిర్మొహమాటంగా తిప్పి పంపేశాను.

నెలకు జీతం పాతిక రూపాయలు. వేరే గది, అద్దెకు తీసుకోవడానికి ఈ జీతం చాలదు. అందుకని హోటల్లో భోజనం చేసి, జ్యోతి ప్రెస్‌లోనే పడుకొంటూ ఉండేవాణ్ని.

శారద, ఆలూరి భుజంగరావు, ప్రకాశరావు, అబ్బరాజు నాగభూషణం, కవిరావు, వీరమల్లు రామకృష్ణ, తాళ్లూరి నాగేశ్వరరావు, "అమరశ్రీ", శార్వరి వంటి రచయితలతో నాకప్పుడే సన్నిహితపరిచయాలేర్పడ్డాయి.

ఒక చిన్నమాట పట్టింపు కారణంగా ఆలపాటి వారివద్ద ఉద్యోగం మానేశాను. నాలుగయిదు మాసాలు ఖాళీగానే ఉన్నాను. కథలమీద వచ్చే రాబడితోనే రోజులు వెళ్ళదీస్తూ ఉండేవాణ్ని. అన్నింటికీ ఇబ్బందులే! చేజాచి ఎవర్నీ అడగను, అడగలేను. ఒకవేళ అడిగినా ఇచ్చేవారూ లేరు!!

నా అవస్థను చూడలేని శార్వరి, నా కోసం ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు.

మారిస్ పేటలో, నలందా ప్రెస్ ఉన్నది. దాని యజమాని పేరు కోగంటి రాధాకృష్ణమూర్తిగారు. ఆయన రాడికల్ హ్యూమనిస్టు. ఆ భావాలను ప్రచారం చేయడంకోసం "సమీక్ష" అన్న మాసపత్రికను నడుపుతుండేవారు.

ఆ పత్రికలో నాకు ఉద్యోగం సంపాదించి పెట్టాడు శార్వరి.

రాధాకృష్ణమూర్తిగారికి ప్రజాసాహిత్య పరిషత్తు అన్న ప్రచురణల సంస్థ కూడా ఉండేది. ఉత్తమస్థాయికి చెందిన చాలా పుస్తకాలను ఈ సంస్థ ప్రచురించింది. "సమీక్ష" పత్రికతో బాటుగా, ప్రజాసాహిత్య పరిషత్తు పని, నలందా ప్రెస్ పని కూడా నాకే అప్పగించారు రాధాకృష్ణమూర్తిగారు.

పరిచయాలు పెరిగాయి. స్నేహితులు పెరిగారు. జీతం మాత్రం ముప్పయి రూపాయలకు పెరిగింది. రెండు పూటలా భోజనంచేస్తే ఇతర ఖర్చులకు డబ్బులుండవు. అందుకని ఒక్కపూట మాత్రమే భోజనం చేస్తూ ఉండేవాడిని. అన్నం తినకపోయినా, రాత్రిపూట నిద్రపడుతుంది గనక, రాత్రి భోజనం మానేసి, పగలు మాత్రమే తినేవాణ్ని. ప్రెస్‌లోనే పడుకునేవాణ్ని.

ఆకలి మంటల్ని బలవంతాన అణచిపెట్టడంవల్లా, అదీ కుదరనప్పుడు, మంచినీళ్ళతో ఆ మంటల్ని చల్లార్చడంవల్లా, నా ఆరోగ్యం పాడయిపోయింది. మందులు తినలేను.

ఉద్యోగం మానుకోలేను. సెలవు పెట్టలేను. సెలవుపెట్టి ఎక్కడికెళ్లను? వెళ్ళినా ఎవరు చూస్తారు?

తెనాలిలో, ఎక్కువమంది స్నేహితులూ, తక్కువమంది బంధువులూ ఉన్నారు. పరిచయమున్నవారిని నేనడగను. ఆత్మీయులయినవారు నాకన్నా దరిద్రులు.

ప్రెస్ పని అయిపోగానే నేను లక్ష్మి దగ్గరకెళ్ళి కూచుంటూ ఉండేవాడిని. ఆవిడ 'వృత్తి' చేసుకొని బతుకుతూ ఉండేది. ఆ ఇంట్లో ఆమెగాక, జైబూన్, చిత్ర అన్నవారుండేవారు. వీరు కాక కొంతమంది అప్పుడప్పుడు వచ్చిపోతూ ఉండేవారు. ఈ వ్యభిచార గృహ యజమాని పేరు సాంబయ్య. ఈయన నా మిత్రుడైన అబ్బరాజు నాగభూషణానికి దగ్గర మిత్రుడు.

ఈ ఇంటి వారెవ్వరూ, మూడు నాలుగు మాసాలదాకా నన్ను నమ్మలేదు. "అవసరం" కోసం వస్తున్నాననుకొనేవారు. నేను 'అందుకు' రావడంలేదని వారికి నమ్మకం కుదిరాక, తమ గొడవలన్నీ నాతో చెప్పుకొన్నారు. వాటిని ఆధారం చేసుకొని నేను చాలా కథలు రాశాను. రాశాక వారికి వినిపించాను. వినిపించాకనే పత్రికలకు పంపించాను.

ఈ ముగ్గురిలోనూ లక్ష్మి, జైబూన్ నాకు తెనాలిలో పరిచయమయ్యారు గానీ, చిత్ర నెల్లూరులోనే పరిచయమయింది. ఎక్కువ డబ్బిచ్చి కొనుక్కొన్న గూడూరు మైకా వ్యాపారి, తన మోజు తీరిపోయాక రోహిణిని, ఇంకో వ్యభిచార గృహ యజమానికి అమ్మాడు. అక్కడ నుండి, చిత్ర పేరుతో ఆమె తెనాలి చేరుకొంది.

ప్రతిరోజూ ఈ ముగ్గురినీ కలుసుకొంటూ ఉండే నేను, రెండు మూడు రోజులు రాకపోయేసరికి వారికి అనుమానమొచ్చింది. లక్ష్మి నా కోసం వచ్చింది. నన్ను తనతో తెచ్చుకొని, మేడమీది గదిలో నన్నుంచి, నాకు మందులిప్పించి, జబ్బును నయం చేయించింది.

ఇది జరిగిన రెండు మూడు వారాలకే కళ్ళకు మసకలు వచ్చాయి. లక్ష్మి, జైబూన్, చిత్ర కలిసి, నాలుగు రూపాయల ఎనిమిదణాలకు నాకో కళ్ళజోడు కొనిపెట్టారు.

ఆ కళ్ళజోడు ఇప్పటికీ నా దగ్గర పదిలంగా ఉంది! ఈ లోకమంతా, 'చెడిపెలు'గా దుమ్మెత్తిపోసిన ముగ్గురు కరుణాంతరంగిణులు కొనిపెట్టిన ఆ కళ్ళజోడును, ఓ గొప్ప బహుమానంగా నేనిప్పటికీ భావిస్తుంటాను!

నేను చేయని పనిని చేశానంటూ, మేదూరి మల్లయ్యగారు నా మీద ఒక అపవాదు వేశారు. దానికి క్షమాపణ చెప్పిందాకా, ఆ ఇంటి గడప తొక్కకూడదనుకొన్నాను. 1952

జూలైలో ఆయన క్షమాపణ చెప్పారు.

1952 సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో గానీ కాంతం కాపురానికి రాలేదు.

కాపురానికొచ్చిన తొలిరోజుల్లో, వంటినిండా నగలతో లక్ష్మీదేవిలా ఉండేది కాంతం. కానీ ఏం లాభం? మూడు సంవత్సరాలు గడవకముందే ఆమె నిరాభరణ సుందరిలాగా మారిపోయింది. ఎక్కడెక్కడి చుట్టాలో వచ్చి మాసాలకొద్దీ ఉండేవారు. వెళ్ళమని చెప్పలేను. ఉంచుకొని పోషించనూలేను. కాంతం కాపురానికొచ్చాక నా జీతం 40 రూపాయలు చేశారు రాధాకృష్ణమూర్తిగారు. అద్దెపోను మిగిలిన 22 రూపాయలు రెండు వారాలకు కూడా సరిపోయేవి కావు.

ఈ లోగా "సమీక్ష" పత్రిక ఆగిపోయింది. ప్రజాసాహిత్య పరిషత్తు ప్రచురణలు ఆగిపోయాయి. నలందా పబ్లికేషన్స్ అన్న సంస్థ వెలిసింది. ఈ సంస్థ పక్షాన 1వ తరగతి నుండి 5వ ఫారందాకా టెక్ట్స్ పుస్తకాలు ప్రచురించాం. కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలు తిరిగి– జిల్లా బోర్డుల్లోనూ, మున్సిపల్ స్కూళ్ళల్లోను ఈ పుస్తకాలు పెట్టించాను. వేలాది రూపాయల అమ్మకాలు జరిగాయి.

కానీ జీతం పెరగలేదు.

పెంచమని అడిగాను. ఎంత కావాలన్నారు రాధాకృష్ణమూర్తిగారు. కాగితం మీద ఖర్చులన్నీ రాసి 60 రూపాయలు ఇవ్వమన్నాను. ఆయనగారు కుదరదన్నారు. అయితే ఉద్యోగం మానేస్తానన్నాను.

ఇది 1955 డిసెంబరులో జరిగింది.

రచయితగా నన్ను ఎంతగానో ప్రోత్సహించిన ధనికొండ మనుమంతరావుగారు, అంతకుముందే మద్రాసుకు వెళ్ళిపోయారు.

కొంతకాలం "చందమామ" కార్యాలయంలో పనిచేశారు. ఆ తరువాత సొంతంగా "అభిసారిక" పత్రికను ప్రారంభించారు. ఆ దరిమిలా "జ్యోతి", "చిత్రసీమ" పత్రికలను ప్రారంభించారు.

1956 జనవరి మొదటి వారంలో నేను మద్రాసులో కాలుమోపాను.

ఈ ప్రపంచం చాలా విశాలమయింది. చాలా విచిత్రమయింది కూడా. మద్రాసు మహానగరం నుండి, అక్కడి మనుషుల నుండి, అక్కడి వాతావరణం నుండి, నేను చాలా పాఠాలు నేర్చుకొన్నాను.

వందలమంది రచయితలతో, కవులతో, పత్రికా సిబ్బందితో, సినిమావారితో పరిచయాలయ్యాయి. ఊహకు కూడా అందని సందర్భాలను నేను చవిచూశాను. వీటిని ఆధారం చేసుకొని, నేను "పాకుడురాళ్ళు" నవలను రాశాను. ఆ నవలలోని అన్ని పాత్రలూ నాకు బాగా తెలిసినవారి ప్రతిరూపాలే! ఆ నవలలోని అన్ని సంఘటనలూ, నాకు తెలిసినవారి జీవితాలలోంచి ఏరుకొన్నవే!!

ధనికొండవారికీ నాకూ, మాట పట్టింపు వచ్చిందొకసారి. "మీరింకెక్కడన్నా ఉద్యోగం చూసుకోండి వచ్చే నెలనుండి" అన్నాడు ధనికొండ.

నా గుండెల్లో రాయిపడింది!

సొంతవూరును వదిలేశాను. తెలిసిన తెనాలినీ వదిలేశాను. అమ్ముకోవడానికి కూడా ఏమీ లేవు. అయినవారెవ్వరూ సాయం చేయరు.

అయినా– నేను దాసోహమనడానికి సిద్ధపడలేదు.

"మానదలచుకొన్నప్పుడు, నెలాఖరుదాకా దేనికి? ఈ రోజునించే మానేస్తున్నాను. ఈ నిమిషం నుండీ నీవు యజమానివీ కాదు, నేను పనివాణ్ణీ కాను" అన్నాను.

ఇద్దరం కలిసి రామకృష్ణా లంచ్ హోమ్‌లో కాఫీ తాగాం. బిల్లు నేనే ఇచ్చాను.

అంతకుముందు నేను కోడంబాకంలో ఉండేవాణ్ని. ధనికొండ వారి ప్రెస్ పనికోసమని, జార్జి టౌన్‌లోని ఆర్మీనియన్ స్ట్రీట్‌కు ఇల్లు మారాను.

ఆ ఇంట్లోనే ఉంటున్న కె.వి.రత్నంగారికి, రాణీ అండ్ కంపెనీ అన్న కలాల కంపెనీ ఉంది. నా ఉద్యోగం ఊడిన సంగతి వారితో చెప్పాను. తన కంపెనీలో ఉద్యోగమిచ్చారాయన. నెలకు వంద రూపాయల జీతం. అద్దె, కరెంటు ఖర్చులు పోను, చేతికి యాభై రూపాయలొచ్చేవి. ఈ డబ్బుతో నేను, కాంతం మా పెద్దబ్బాయి రవి, కూతురు పద్మ బతకాలి– బతికాం.

"ఎలా బతికా?" రని అడక్కండి! ఆ బాధలు, క్షోభలు, అక్షరాలకు అందవుగాక అందవు.

మద్రాసులో జ్యోతి పత్రికలో ఉన్నప్పుడు, కథా రచనలో కొన్ని ప్రయోగాలు చేశాను. సమస్యాత్మక కథలు రాసి, ముగింపు పాఠకుల కొదిలేశాను. సామాజిక సమస్యలను, పౌరాణిక పాత్రలకూ, జానపద వాతావరణానికీ అన్వయించి చాలా కథలు రాశాను. అవన్నీ పఠితలను అలరించాయి.

ఆ మద్రాసులోనే, పొట్టకూటికోసమూ, నా అవసరాల కోసమూ, అపరాధ పరిశోధక రచనలూ రాశాను.

కలాల కంపెనీ ఉద్యోగంలో కూడా రవరవలు రేగాయి. ఒక యజమాని, ఒక పనివాడు ఒకే ఇంట్లో ఉంటున్నప్పుడు, పనివాడి భార్య, యజమాని భార్య దృష్టిలో ఎలా ఉండేదీ అనుభవరీత్యా గ్రహించాను.

ఈ రత్నంగారు కూడా– "కంపెనీ పరిస్థితులు బావో లేదు. ఇంకెక్కడన్నా ఉద్యోగం చూసుకో!" మన్నాడు.

"మంచిది!" అన్నాను.

ఆ రాత్రే విషమ పరిస్థితినంతా తెనాలి మిత్రుడు నాగభూషణానికి రాశాను. వాడు– ఈదర లక్ష్మీనారాయణగారికి చెప్పాడు. ఈ లక్ష్మీనారాయణగారు చక్రపాణిగారికి మంచి స్నేహితుడు.

అప్పటికే చక్రపాణిగారు, హైదరాబాదులో, యువ ప్రెస్ పెట్టారు. "యువ" మాసపత్రికను కూడా ప్రారంభించాలని వారి ఉద్దేశం.

సరిగ్గా అప్పుడే ఈదరవారి సిఫార్సు చక్రపాణిగారికి చేరింది. నేనూ చక్రపాణిగారిని కలిశాను. తెనాలిలో ఉన్నప్పుడే చక్రపాణిగారు నాకు తెలిసినా, ఉద్యోగం అడిగేటంత చనువు వారితో నాకు లేదు.

చక్రపాణిగారు, నన్ను హైదరాబాదు వెళ్ళమన్నారు. నేను సరేనన్నాను. 1959 ఏప్రిల్ మాసంలో మద్రాసుకు వీడ్కోలు చెప్పి హైదరాబాదుకు వచ్చాను.

1950 నుండి నాకు పరిచయమున్న త్రిపురనేని సుబ్బారావు వచ్చి నన్ను కలిశాడు. మేమిద్దరం కలిసి, గోపీచంద్‌గారిని కలిశాం. గోపీచంద్‌గారితోనూ, నాకు తెనాలిలో కొంచెం పరిచయముంది.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో నాకు తెలిసినవారు చాలామంది పనిచేస్తున్నారు. గోపీచంద్, బుచ్చిబాబు, భాస్కరభట్ల, మునిమాణిక్యం, స్థానం, కృష్ణశాస్త్రి, శ్రీవాత్సవ, జనమంచి, నండూరి విఠల్– వారందరూ విజయవాడ రేడియో కేంద్రంలోనూ, మద్రాసు రేడియో కేంద్రంలోనూ పనిచేసినవారే!

హైదరాబాదు రేడియో కేంద్రంలో స్క్రిప్టురైటర్ ఉద్యోగం ఖాళీగా ఉన్నదని, తొలిసారిగా నాకు చెప్పినవారు విఠల్‌గారు. నేనా ఉద్యోగం కోసం ప్రయత్నించాను.

త్రిపురనేని సుబ్బారావు, నర్రా కోటయ్య నా గురించి గోపీచంద్‌గారికి గట్టిగా సిఫార్సు చేశారు. అప్పటి స్టేషన్ డైరెక్టర్ జి.పి.యస్.నాయర్‌గారికి నా గురించి బాగా చెప్పారు అయ్యదేవర కాళేశ్వరరావుగారు. ఈ కాళేశ్వరరావుగారు మా నాన్నగారికి బాగా తెలిసినవారు.

1959 నవంబరు 25వ తేదీన, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో, గ్రామస్థుల కార్యక్రమ విభాగంలో స్క్రిప్టురైటర్‌గా ప్రవేశించాను. జీతం 180 రూపాయలు. 27 సంవత్సరాలపాటు ఆకాశవాణిలో పనిచేశాక, 1987 జూలై 4వ తేదీన ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా ఉద్యోగవిరమణ చేశాను.

ఆకాశవాణి నుండి నేను చాలా నేర్చుకొన్నాను.

మనుషుల్లో- ఎలాంటి ఉత్తములుంటారో, ఎలాంటి అధమాధములుంటారో, ఆకాశవాణి నాకు సోదాహరణంగా వివరించింది.

డిగ్రీలు లేని నా చదువు- నన్ను నానాయాతనలకూ గురిచేసింది. సంవత్సరాలకొద్దీ నేను చేసిన పనులు, చేయడానికి పనికిరానన్నారు. ఏ పనీ రానివారిని పీఠంమీద కూర్చోబెట్టి, వారికి నన్ను సహాయకునిగా చేశారు. అయిదేళ్ళపాటు చిన్నపిల్లల కార్యక్రమాలను దిగ్విజయంగా నడిపాను. నాకు పదోన్నతిని ప్రసాదించమని అడిగాను. "డిగ్రీ లేదు గనుక ప్రమోషన్ ఇవ్వడానికి వీలుపడ"దన్నారు. అయినా, నాలో నేను కుంగిపోయానే తప్ప, ఏమీ చేసుకోలేకపోయాను.

మా నాన్నగారి కారణంగా, నాకు చాలామంది రాజకీయ నాయకులతో సన్నిహిత పరిచయాలున్నాయి. నీలం సంజీవరెడ్డిగారు, కాసుబ్రహ్మానందరెడ్డిగారు, వెనిగళ్ళ సత్యనారాయణగారు, దామోదరం సంజీవయ్యగారు, ఇంకా చాలామంది నాకు తెలుసు. అయినా వీరి పరిచయాలను ఉపయోగించుకోవడానికి నేను ఇష్టపడలేదు.

నాకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలను సహించలేని మంచాళ జగన్నాథరావు గారూ, వారి తమ్ముడు వాడ్రేవు పురుషోత్తంగారూ నాకు నచ్చచెప్పారు.

1974వ సంవత్సరంలో, నేనూ, పురుషోత్తంగారూ ఢిల్లీవెళ్ళాం. పెండేకంటి వెంకటసుబ్బయ్యగారికి జరిగిన సంగతంతా చెప్పాం. ఆయన అప్పటి సమాచార ప్రసారశాఖా కార్యదర్శి శ్రీ ఎ.జె.కిద్వాయ్‌గారికి చెప్పారు.

నేనూ, పురుషోత్తం- కార్యదర్శి కిద్వాయ్‌గారిని కలిశాం. "ఫాంటమీ క్వింటెట్" అన్న నా ఇంగ్లీషు పుస్తకాన్ని కిద్వాయ్‌గారికి ఇచ్చాను. ఆ పుస్తకానికి కె.ఎ.అబ్బాస్ అద్భుతమయిన పీఠిక రాశారు. ఆ పుస్తకాన్ని నేను దామోదరం సంజీవయ్యకు

అంతకుముందెప్పుడో అంకితమిచ్చాను. ఆనాటి అంకితోత్సవంలో, ఐ.కె.గుజ్రాల్, నార్ల వెంకటేశ్వరరావు, కె.యల్.రావు, బి.వి.కేస్కర్, యస్.యన్.మూర్తి వంటి వారెందరో పాల్గొన్నారు.

కిద్వాయ్‌గారిని మేము కలుసుకొన్నప్పుడు, గుజ్రాల్‌గారు సమాచార ప్రసారశాఖా మంత్రి. "నేను చేయగలిగింది చేస్తాను. ఎందుకయినా మంచిది- మీరోమారు గుజ్రాల్‌గారిని కలవండి!" అన్నారు కిద్వాయ్‌గారు.

నేనొప్పుకోలేదు!

అయినా 1975 మే నెల నాటికి నన్ను ప్రొడ్యూసర్‌గా నియమిస్తూ, డైరెక్టర్ జనరల్ నుండి ఉత్తరం వచ్చింది.

పన్నెండు సంవత్సరాలపాటు నేనా ఉద్యోగంలో ఉన్నాను. వందల మంది కొత్తవారిని ఆకాశవాణి కేంద్రానికి ఆహ్వానించాను. సంతృప్తికరమయిన కార్యక్రమాలెన్నింటినో ప్రసారం చేశాను.

ఈ పరంగా నాకు కుడిభుజంగా ఉన్నవారు వాడ్రేవు పురుషోత్తంగారు.

నా తొలికథ 1946లో అచ్చయిందన్నాను కదూ? నా తొలిపుస్తకం 1950లో అచ్చయింది. దానిపేరు "రాగిణి". ఆ కథా సంపుటానికి చలంగారు పరిచయం రాశారు. నా రెండవ పుస్తకం కూడా 1950లో అచ్చయింది. దానిపేరు "కొత్త చిగుళ్లు". ఈ పుస్తకాన్ని చలంగారికి అంకితమిచ్చాను. విజయవాడలోని ఆదర్శగ్రంథ మండలివారు, మచిలీపట్నంలోని తెలుగు విద్యార్థి ప్రచురణలవారు నా పుస్తకాలలో ఎక్కువ భాగం ప్రచురించారు.

ఇంతవరకూ అచ్చయిన పుస్తకాలు 140. కొన్ని కథలు, దాదాపుగా అన్ని భారతీయ భాషలలోనూ వచ్చాయి. కొన్ని పుస్తకాలు ఇంగ్లీషు, హిందీ, గుజరాతీ, కన్నడం, తమిళం, మలయాళ భాషలలోనికి అనువాదమయ్యాయి.

తొలిసారిగా "నికషం" అన్న నాటిక ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి 1950-52 మధ్యలో ప్రసారమయింది. 1956లో ఆకాశవాణి, మద్రాసు కేంద్రం నుండి ప్రసారమయిన ఒక నాటికలో తొలిగా పాత్రధారిగా పాల్గొన్నాను. 1959 ఏప్రిల్, మే మాసాలలో, "నా పుస్తకాల బీరువా" అన్న ప్రసంగాన్ని హైదరాబాదు కేంద్రం నుండి తొలిసారిగా ప్రసారం చేశాను.

తొలి అవార్డు 1956లో. "జ్యోతి" పాఠకులు ఎన్నిక చేసిన కథకు స్వర్ణపతకం లభించింది. 1968లో "విజయవిలాసం" అన్న కథా సంపుటానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి అవార్డు లభించింది. 1983లో "జీవన సమరం" పుస్తకానికి రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీల అవార్డులు లభించాయి. ఆ తరువాత ఇంకా ఇంకా చాలా ఉన్నాయనుకోండి.

1980లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, 1987లో జవహర్‌లాల్‌నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, 1991లో నాగార్జున విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌లను నాకు ప్రసాదించాయి.

1984లోనూ, 1987లోనూ, సోవియట్ రష్యాలో పర్యటించాను.

1986 ఆగస్టు 1వ తేదీన, నా జీవిత భాగస్వామిని, నా వెలుగును, నా మార్గదర్శిని, నేను పోగొట్టుకొన్నాను.

కాంతమ్మగారి నిర్గమనం, నా జీవిత గమనాన్నే మార్చివేసింది.

ఆమె జ్ఞాపకాలను- 5 పుస్తకాలుగా ముద్రించాను. ఈ పుస్తకాల మీద అయిదు విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు జరిగాయి.

అయిదు విశ్వవిద్యాలయాలలో కాంతమ్మగారి పేరున సంస్మరణోపన్యాసాల కార్యక్రమాల నిర్వహణకు, పతకాల బహూకరణకు కావలసిన నిధులను ఇచ్చాను.

"శ్రీమతి రావూరి కాంతమ్మ భరద్వాజ ట్రస్టు" పేరిట ఒక సంస్థను రిజిష్టరు చేయించాను. సమాజ సంక్షేమానికి ఉపకరించగల కార్యక్రమాలను, ఈ ట్రస్టు పేరిట నిర్వహించుదామని నేను అనుకొంటున్నాను.

నా పెద్ద కొడుకుపేరు రవీంద్రనాథ్. నాకు తొలిసారిగా తెనాలిలో ఉద్యోగమిచ్చిన ఆలపాటి రవీంద్రనాథ్‌గారికి కృతజ్ఞతగా సూచికగా ఈ పేరు పెట్టుకొన్నాను. అతని భార్యపేరు ఇందిర.

రెండవ కొడుకు పేరు గోపీచంద్. ఆకాశవాణిలో, నాకు ఉద్యోగం రావడానికి కారణభూతులయిన త్రిపురనేని గోపీచంద్‌గారి జ్ఞాపకార్థం ఈ పేరు పెట్టుకొన్నాను. అతని భార్యపేరు సుశీల.

మూడవ కొడుకు పేరు బాలాజీ. నేను మద్రాసులో ఉన్న మూడున్నర సంవత్సరాల కాలంలోనూ, ఉచితంగా వైద్యం చేసిన డాక్టర్ గాలి బాలసుందరరావుగారి జ్ఞాపకార్థం

ఈ పేరు పెట్టుకొన్నాను. భార్యపేరు నాగసుభద్ర.

నాలుగవ కొడుకు పేరు వెంకటకోటేశ్వరరావు. నాకింత నీడను ప్రసాదించిన ఆలపాటి వెంక్రటామయ్య పేరునూ, మా నాన్న పేరునూ కలిపి, మా నాలుగో వాడికి పెట్టుకొన్నాను. భార్యపేరు లక్ష్మీకుమారి.

నా కూతురు పేరు పద్మావతి- పద్మ. 1943లో అన్నం లేక స్పృహ తప్పిపడిపోయినప్పుడు, నన్ను పిలిచి ఆప్యాయంగా ఇంత అన్నం తినిపించిన మాల పద్దక్క జ్ఞాపకార్థం, కూతురుకు ఆ పేరు పెట్టుకొన్నాను. భర్తపేరు మాధవరావు.

నాకు ఆకలి తెలుసు. అవిద్య తెలుసు. అవమానం తెలుసు. నిరుద్యోగం తెలుసు. అన్యాయం తెలుసు. అక్రమం తెలుసు. అధర్మం తెలుసు. వీటిని నేను పుష్కలంగా అనుభవించాను కాబట్టి ఇవిలేని సమాజం కావాలని నేను కోరుకొంటున్నాను.



డా॥ ఉండేల మాలకొండారెడ్డి

మా స్వగ్రామం ఇనిమెర్ల. నెల్లూరు జిల్లా (ప్రస్తుతం ప్రకాశం జిల్లా)లో 23.08.1932 తేదీన నేను జన్మించాను. అక్కడ ప్రాథమిక పాఠశాలలో 1940లో కాబోలు నాల్గవ తరగతి చదువుతున్న రోజులవి. తలవని తలంపుగా భాగవతంలోని "రుక్మిణీ కళ్యాణం", "గజేంద్రమోక్షం" కావ్యాలు నా కంట బడ్డాయ్. బమ్మెర పోతన భక్తిరస పాత్రికలోని ఒక అమృతబిందువు నాపై చిలికినట్లయినది. తొలుత ఆ కావ్యాలలోని శబ్ద సౌందర్యం తర్వాత భావ మాధుర్యం నన్నాకట్టుకొన్నాయ్, సాహిత్య వాసనగల శ్రీ నూకరాజు వెంకట సుబ్రమ్మణ్యంగారు మా ఊరికి ఆనాటి గురువు. ఆయన ప్రోత్సాహంతో పై కావ్యాలనే కాక అల్లసాని పెద్దన "మనుచరిత్ర", కంకంటి పాపరాజు "ఉత్తర రామాయణం" మున్నగు గ్రంథాలను సేకరించి చదువనారంభించాను. ఆ పద్యాలలోని పదబంధాల్ని, యతిప్రాసల్ని, నడకను నిశితంగా పరిశీలించి, అలాగే పద్యాలను వ్రాసి నడిపించాలని ప్రయత్నించాను. ఇంతలో మా గురువుగారు తాతంభట్లు ప్రణీతమైన "సులక్షణసారం" అనబడే ఛందో గ్రంథాన్ని నా చేతికిచ్చి "నీ అక్షరాలు చక్కగా వున్నాయ్. ఒక వ్రాతప్రతి వ్రాసిపెట్టు" మని నాకు పని కల్పించారు. ఆ ప్రతిని వ్రాసే కాలంలో ఛందస్సంటే యేమిటో కొంత తెలుసుకొన్నాను. కాని పద్యాలు వ్రాసేటప్పుడు ఛందస్సు కోసం ప్రయత్నించలేదు. నా మనఃఫలకంలో ముద్రపడ్డ పద్యగమనమే ఛందస్సుగా పద్యాలు వ్రాయడం మొదలుపెట్టాను. పద్యకవిత ఇలా యాదృచ్ఛికంగా నా కలవడింది, ఏవో పద్యాలను ఎవరు లేనప్పుడు బొగ్గుతో గోడలపై వ్రాయడం, అవి చదివే పాఠకుల మధ్యలో నిలబడి వారి ప్రశంసల్ని, విమర్శల్ని గమనించడం మొదలుపెట్టాను. కొంత కాలానికి ఊళ్ళోని పెద్దలు గోడమీద వ్రాతకాణ్ణి పట్టుకొని సన్మానించారు.

ఐదవ తరగతివరకే మా ఊళ్ళో చదువు. తర్వాత ఏం చేయాలన్నది సమస్య. హితవు చెప్పేవారెవ్వరు లేరు. అట్టి పరిస్థితులలో అనుకోకుండా నేను అల్లూరు (నెల్లూరు జిల్లా) గ్రామానికి వెళ్ళడం జరిగింది. అక్కడే శ్రీ అల్లంపాటి రమణారెడ్డిగారిని '(నా "నేతాజీ" కావ్యకృతి భర్త) కలవడం జరిగింది. వారి ప్రాపుతో ఆయన యాజమాన్యంలో వున్న రామకృష్ణ పాఠశాలలో విద్యాభ్యాసం మొదలుపెట్టాను. అల్లూరులో వున్నప్పుడే శ్రీ వెల్లటూరు సుబ్రహ్మణ్యం, శ్రీ గూడా రామబ్రహ్మం అనబడే సంస్కృత పండితుల అంతేవాసిగా సంస్కృతం అభ్యసించాను. రఘువంశం, కుమారసంభవం, మేఘసందేశం, విక్రమార్క చరిత్రం మొదలైన సంస్కృత కావ్యాలను అప్పుడే అధ్యయనం చేశాను.

ఈనాటి ప్రఖ్యాత న్యాయవాది పార్లమెంటు సభ్యుడు ఆంధ్రప్రదేశ్ జనతాపార్టీ అధ్యక్షులు సాహితీప్రియులు అయిన శ్రీ పి.బాబుల్‌రెడ్డిగారిది అల్లూరు. ఆయన కాకినాడలో బి.ఏ. చదువుతూ వేసవి సెలవులకు స్వగ్రామం వచ్చినపుడు తన పాఠ్యాంశమైన శృంగార నైషధంలోని కొన్ని పద్యాలను చదివి అర్థం చెప్పమన్నారు. ఐదవ తరగతి పూర్తి చేసిన నేను తడుముకోకుండా ఆ పద్యాలకు అర్థం చెప్పడం ఆయనను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. ఆ సంఘటనే మా మైత్రికి పునాది. కాలం ఆ మైత్రీబంధాన్ని పటిష్ఠం చేసి ఎన్నో రంగాలలో మమ్మల్ని సమైక్యం మమైక్యం చేసింది. అల్లూరు రామకృష్ణ పాఠశాలలో విద్యార్థిగా వున్నప్పుడే నా కవితాలత మొగ్గదొడిగి పుష్పించింది. అందుకు ఆ గ్రామ ప్రజల రసజ్ఞతే కారణం. ఎక్కడ అవకాశం దొరికినా ఒక సమస్య యిచ్చి పూరించమనేవారు. ఏదో సంఘటనను వర్ణించి ఆశువుగా పద్యం చెప్పమనేవారు. ఒకనాడు సాయంకాలం మిత్రులం కలిసి చెరువుగట్టున పోతూ వున్నాం, చెరువునిండా నీరుంది. సూర్యుడస్తమిస్తున్నాడు. గాలికి అలలు ఉవ్వెత్తుగా లేచి గట్టుమీది రాళ్ళతో ఢీకొంటున్నాయి. ఆ దృశ్యాన్ని వర్ణించమన్నారు. అపుడు ఆశువుగా చెప్పిన పద్యం:

జలభంగమ్ములు మారుతాహతికి పాషాణాల ఢీకొట్టి, ప్ర
క్కలుకాగా జనియించువారికణమేఘ వ్రాతముల్ సూర్య ర
శ్ముల దేలాడి అకాల శక్రధనువుల్ సొంపార సృష్టించి, మ
మ్మలరించెన్ భళిరే తటాకతట సాయంకాల సంచారముల్.

ఒకనాడు సత్రంలో ఊరివారందరికి పండుగ విందు జరుగుతూంది. భోజనాలు చేస్తున్నప్పుడు వడ్డించే సూరయ్యకు, తింటూ వున్న సుబ్బయ్యకు వాగ్వాదం మొదలైంది. అది సరసమో, విరసమో తెలియనట్లు నడుస్తూంది. అందరు నవ్వుతూ వారిని ఎక్కదోల్తు న్నారు. ఆ సందర్భంలో భోక్తల కోరికపై చెప్పిన పద్యం:

క్షీరాన్నము చిత్రాన్నము
తీరికగా కూరుచుండి తినగానేమీ
సూరయ సుబ్బయ జగడము
గారెలు తిన్నంత తృప్తి కలిగించెనహో!

ఇలా ఎన్నో అనుభూతుల్ని గుర్తు చేసుకోవచ్చు. ఆనాటి గ్రామ ప్రజల సాహిత్య ప్రియత్వం, అభిమానం అట్టిది. కవికి ఒక విశిష్టస్థానం ఇచ్చేవారు.

1946లో నేతాజీ సుభాస్‌చంద్రబోసు విమాన ప్రమాదంలో మరణించినట్లు వార్త రావడం. ఆయన నిర్మించిన "ఆజాద్ హిందు ఫౌజ్" లేదా స్వతంత్ర భారత సేనను ఆంగ్ల ప్రభుత్వం బంధించి విచారణ జరపడం- భారత ప్రజల ఆగ్రహం- ఆంగ్ల ప్రభుత్వంపై తిరుగుబాటు చరిత్రలో నిలిచిపోయే ఘట్టాలు. విద్యార్థులం ఊరేగింపులు చేస్తూ "స్వాతంత్ర్యం కావాలి" అంటూ నినాదాలు చేస్తూ ఆందోళనలో పాల్గొనేవాళ్ళం. ఊరేగింపు తర్వాత జరిగే ప్రతి సమావేశంలో నేతాజీని గూర్చి పద్యాలు వ్రాసి చదివేవాణ్ణి. ఆ పద్యాలే "నేతాజీ" కావ్యం పేరిట ప్రచురించబడ్డాయి.

కవికోకిల శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారిని ఆయన స్వగ్రామం పెమ్మారెడ్డిపాళెంలో ఒక పర్యాయం కలిశాను. ఆయన "కృషీవలుడు" కావ్యంలోని ప్రకృతి వర్ణనలన్నింటిని ఆ ఊరికి వెళ్లే మార్గంలో చూశాను. "వ్రాసిందంతా ప్రచురించాలనే తహతహ వద్దు. రాసికంటె వాసి ప్రధానం" అని నాకు హితవు చెప్పారు శ్రీ రామిరెడ్డిగారు.

అల్లూరులో హైస్కూలు విద్య 1949 వరకు సాగింది. ఆ పాఠశాలలో ప్రతిదినం ఉదయం బాలబాలికలు చేసే సరస్వతీ ప్రార్థనకు ఒక గేయం ఇలా వ్రాసి యిచ్చాను:

"జయవాణీ భువన జీవనీ
జయజయ మంజులవాణీ"

అనే పల్లవితో. ఈనాటికీ ఆ పాఠశాలలో ప్రార్థనాగీతం ఇదే.

1949లో నెల్లూరు వేంకటగిరిరాజా కళాశాలలో ఇంటర్‌మీడియట్ విద్యార్థిగా చేరినాను. అప్పటినుండి నెల్లూరు నగరంలోని సాహిత్యాభిమానులతో వ్యక్తిగత పరిచయం ఏర్పడింది. సాహితీ పోషకులు, వదాన్యులైన శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారితో నాకు సాన్నిహిత్యం ఏర్పడింది. నా మూడవకావ్యం "కాంతి చక్రాలు" కృతిభర్త వారే. కవికోకిల గుర్రం జాషువా గారితో తొలిపరిచయం వారింట్లోనే. "జటిల సంస్కృత పదాలకు ప్రయత్నించకు. అందమైన అలతి అలతి తెలుగు మాటలతో కవిత్వం వ్రాయ"మని

హితవు చెప్పారు జాషువాగారు. అభినవ తిక్కన శ్రీ దుర్భా సుబ్రహ్మణ్యం గారితోను, సరసకవి శ్రీ మోచర్ల రామకృష్ణయ్య గారితోను సాన్నిహిత్యం అప్పుడే కలిగింది.

1950లో గొల్లల మామిడాడ, తూర్పుగోదావరి జిల్లా వాస్తవ్యులు అక్కడ జీవకారుణ్య సంఘం యొక్క అధ్యక్షులు అయిన శ్రీ కర్రి అప్పారెడ్డిగారు నా దగ్గరకు వచ్చి వివేకానందుని జీవితాన్ని పద్యకావ్యంగా వ్రాయమని కోరినారు. తత్ఫలితమే నా రెండవ కావ్యం "వివేకానందుడు". ఆ కావ్యానికి కృతిపతి శ్రీ కర్రి అప్పారెడ్డిగారు. గొల్లల మామిడాడలో ఆస్థానకవి శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి ఆధ్వర్యంలో నాకు సన్మానం జరిపి "బాలసరస్వతి" బిరుదు ప్రదానం చేయించారు. అప్పుడే ఇంద్రగంటి హనుమత్ శాస్త్రిగారితో పరిచయం.

కవికోకిల దువ్వూరి రామిరెడ్డి మరణవార్త విని నేను వ్రాసిన పద్యాలను అప్పటి కప్పుడే ముద్రించి నెల్లూరులో పంచిపెట్టినవారు కళాప్రపూర్ణ శ్రీ మరుపూరు కోదండరామిరెడ్డిగారు, శ్రీ నేలనూతల శ్రీకృష్ణమూర్తిగారు. నెల్లూరు ఆంధ్రసభలో "నేతాజీ" కావ్యావిష్కరణ జరిగింది. ఆ సభా విశేషాలను 'జమీన్‌రైతు' వారపత్రిక ప్రకటిస్తూ "కనిగిరిసీమలో రాళ్ళేకాదు రత్నాలు ఉన్నా"యని వ్యాఖ్యానించింది. అప్పటి నుండి నా రచనలెన్నో "జమీన్ రైతు"లో ప్రచురింపబడుతూనే వున్నాయి.

1951లో ఇంజనీరింగు విద్యాభ్యాసం కోసం మద్రాసు గిండి కళాశాలలో ప్రవేశం పొందాను. శ్రీ నిడదవోలు వేంకట్రావుగారితోను, శ్రీ బోయి భీమన్నగారితోను తొలి పరిచయం అప్పుడే. "వివేకానందుడు"కావ్యాన్ని మద్రాసు విశ్వవిద్యాలయం పాఠ్యగ్రంథంగా నిర్ణయించడంలో శ్రీ నిడదవోలు వేంకట్రావుగారు ప్రధానపాత్ర వహించారు.

ఆనాడు మద్రాసులో తెలుగు సాహిత్య సభలు విరివిగా సాగుతుండేవి. ఉద్దండ కవి పండితులు అందులో పాల్గొనేవారు. ఒక విద్యార్థుల సాహిత్య రచన పోటీలో న్యాయనిర్ణేతగా వచ్చిన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు నాకు ప్రథమ బహుమతి యిచ్చి ఆశీర్వదించారు. మద్రాసు గిండీ ఇంజినీరింగు కళాశాల తెలుగు విద్యార్థుల పక్షాన ఆత్రేయ రచించిన కొన్ని నాటకాల్ని ప్రప్రథమంగా ప్రదర్శించే అవకాశం నాకు కలిగింది. "వానరహస్తం", "ఓటు నీకే" అనే నాటకాల్లో నేను తల్లిపాత్ర వేశాను. రంగంమీద నటించేటప్పుడు సమయస్ఫూర్తిగా నేను కొన్ని సంభాషణలను చేర్చడం, మార్చడం జరిగింది. అందుకు రచయిత ఆత్రేయగారి ప్రశంస లభించింది. ప్రత్యేకంగా తల్లి పాత్రను నా కోసం సృష్టించి నాటికను వ్రాస్తానని ఆత్రేయగారన్నారు. 1955లో మద్రాసులో నా విద్యాభ్యాసం పూర్తి అయింది. ఉద్యోగరీత్యా 1957 సంవత్సర ప్రారంభంలో హైదరాబాదు

రావడం జరిగింది. శ్రీ దాశరథి, శ్రీ సి.నారాయణరెడ్డి, శ్రీ వానమామలై వరదాచార్యులు, శ్రీ బోయి భీమన్న, శ్రీ పల్లా దుర్గయ్య ప్రభృతులతో కలిసి కవి సమ్మేళనాలలో పాల్గొనడం ప్రారంభమైంది. తత్ఫలితమే 'కాంతిచక్రాలు' ఖండకావ్య సంపుటి. అప్పుడే "కళానికేతన్" పేరుతో ఒక సాంస్కృతిక సంస్థను మిత్రులం కలిసి ప్రారంభించాం. ఎన్నో కార్యక్రమాలు హైదరాబాదులో జరిపించాం. "ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ"లో ప్రారంభసభ్యుడుగా అప్పుడే ప్రవేశం లభించింది. శ్రీ దేవులపల్లి రామానుజరావుగారితో పరిచయం కలిగింది.

ఆనాటి సాహిత్య అకాడెమీ అధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు యువ రచయితలకు ఎంతో ప్రోత్సాహం కల్పించేవారు. నెల్లూరు నుండి చిరపరిచయం ఉన్నందువల్ల నన్ను ఎక్కువగా ప్రోత్సహించేవారు. అప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం కళాశాలలో అధ్యాపకుడుగా ఉన్నందువల్ల విరివిగా సాహిత్య సభలలో పాల్గొనే అవకాశం నాకుండేది.

1961లో నేను వరంగల్‌లోని ప్రాంతీయ ఇంజనీరింగు కళాశాలలో ఆచార్యుడుగా చేరడం సంభవించింది. వరంగల్‌లో సాహిత్యప్రియులు, అభిమానులు కోకొల్లలు. శ్రీ కాళోజీ నారాయణరావుగారు, శ్రీ కాళోజీ రామేశ్వరరావుగారు ఆకర్షణ కేంద్రాలు. "మిత్రమండలి" పేరిట ఇంటింట జరిగే కవి సమ్మేళనాలలో నేను పాల్గొనేవాణ్ణి.

1965లో విదేశాలకు ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్ళడం, తిరిగివచ్చి గురుతరమైన ఉద్యోగ బాధ్యతను వహించడం ఈ కారణాలవల్ల చెదరుమదురుగా రచనలు చేయడమేకాని ఒక కావ్యం వ్రాయలేకపోయాను. అప్పుడప్పుడు వ్రాసిన రచనలను పోగుచేసి 1981లో "మొగలిరేకులు" ఖండకావ్యసంపుటి ప్రచురించాను. ఆ కావ్యాన్ని కోరి కృతి అందుకున్నవారు నెల్లూరీయులు, సినీ నిర్మాత, సహజకవి, మల్లెమాల సుందర రామిరెడ్డిగారు. "మల్లెమాల" పేరుతో సినీప్రపంచంలో ప్రముఖ గేయరచయితగా పేరున్న రెడ్డిగారు అసాధారణ ధారణశక్తి కలవారు. నా "నేతాజీ" కావ్యాన్ని నాకే ఒప్పచెప్పి ఆశ్చర్యపరిచారు.

వరంగల్ నుండి హైదరాబాదుకు రావడం 1979లో. గండిపేటలోని చైతన్యభారతి ఇంజనీరింగు కళాశాల స్థాపన అప్పుడే జరిగింది. "నెలనెలా వెన్నెల" పేరుతో శ్రీ సి.వి.కృష్ణారావుగారు సూత్రధారుడుగా నడిపిస్తున్న సాహితీ సమ్మేళనం అపూర్వమైనది. అక్కడ తక్కిన కవి సమ్మేళనాలలో వ్రాసి చదివిన రచనలే "ఒడిసెలరాళ్ళు" కావ్యంగా వెలువడ్డాయి. ఈ ఖండకావ్య సంపుటిని వలచి వచ్చిన కృతిభర్త నా చిన్ననాటి నేస్తం శ్రీ నర్రా కోటయ్య. శ్రీ కోటయ్య సాహిత్యాభిమాని, సంఘసంస్కరణాభిలాషి, ప్రగతిశీలి.

స్వతంత్రోపాధి కల్పించుకొని తన కాళ్ళపై తాను నిలబడాలనే స్వేచ్ఛాభిలాషి, మనసున్న వ్యక్తి, మా యిద్దరి మైత్రి "ఒడిసెల రాళ్లు" గ్రంథంద్వారా అక్షరబద్ధం కావడం నాకు మహదానంద దాయకం.

నా రచనలను నేనే విమర్శించుకొన్నప్పుడు కలిగే ఊహలు మీ ముందుంచుతాను. కళ కళకోసమే అన్న సిద్ధాంతం నుండి కళ విశ్వశ్రేయస్సుకు అన్న నినాదం వరకు నేను పయనించాను. "వాక్యమ్ రసాత్మకమ్ కావ్యమ్" అనే సూక్తి నాకు నచ్చింది. దేశభక్తిని గూర్చి వ్రాసినా, వేదాంత తత్త్వాన్ని ప్రబోధించినా, శృంగార హాస్యరసాదులను పోషించినా, చమత్కరించినా, అధిక్షేపించినా పైసూక్తిని ఒరవడిగా పెట్టుకొని రచనలు చేయడానికి ప్రయత్నించాను. ఇతరుల మనసు నొప్పించకుండా ప్రేయసికి ప్రియుడు చెప్పినట్లుగా ధ్వనిపూర్వకంగా వ్రాయడమే కవిత్వం యొక్క ప్రధాన లక్షణమని నా విశ్వాసం.

ఇది దృష్టిలో ఉంచుకొని నా రచనలను చదవాలని పాఠకులకు మనవి చేస్తున్నాను.

నా రచనలన్నింటిని ఒకచోటికి చేర్చి "కవితా కల్పకమ్" పేరుతో ప్రచురించడానికి కారణభూతులు కవికౌస్తుభ శ్రీ ఆచార్య తిరుమలగారు. వారికి నేనెంతో ఋణపడి ఉన్నాను.

కోరినంతనే పంచామృతం పేరుతో పైన పేర్కొనబడిన నా పంచకావ్యాల సంపుటికి పరిచయం వ్రాసిన మాన్యులు, సాహితీవేత్త, మహామనీషి, లోకాయుక్త శ్రీ ఆవుల సాంబశివరావు గారికి నా నమోవాకాలు.

ఆ పంచామృతాన్ని ఆయన సుమధుర వాక్కుల్లోనే ఆస్వాదించండి.

పంచామృతం

'కవితా కల్పకమ్' (1986) ప్రచురణనాడు

ఈ 'కవితా కల్పకమ్' అయిదు కావ్యాల సంకలనం. ఉండేల మాలకొండారెడ్డి గారి కవితా జీవితానికి ఈ కావ్య సంపుటి అద్దం పడుతున్నది. నలభై ఏండ్ల ఆయన కవితా వ్యవసాయం పండించిన పంట ఇది.

మహాకవి శ్రీనాథునిలాగా చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడే 1946లో మొదటి కావ్యం 'నేతాజీ' రాశారు. సుప్రసిద్ధకవి పండితుల అభిమానం, ఆశీస్సులు అందుకున్నారు.

ఏడేళ్ళ తరువాత, 1953లో రాసింది రెండవ కావ్యం 'వివేకానందుడు'.

అయిదేండ్ల తదుపరి 1958లో రచించింది 'కాంతిచక్రాలు'.

ఆ తరువాత 23 ఏండ్ల అంతరాయం వచ్చింది. ఈలోగా వారు ఇంజనీరుగా, అధ్యాపకుడుగా జీవితంలో ఇంకొక అధ్యాయాన్ని గడిపారు. కవితాగంగ ఉప్పొంగగా 1981లో "మొగలి రేకులు" విప్పారింపజేశారు.

1986లో, ఇందులోని చివరికావ్యం "ఒడిసెలరాళ్లు' పేరుతో కవితారుక్కులు వెదజల్లారు.

ఈ మధ్యలో రాసిన ఖండికలను కూడా ఇందులో కూర్చారు.

అనేక రీతులలో ఉండేలవారి ప్రజ్ఞ, ప్రతిభ విప్పారింది. గ్రామీణుడుగా, రైతుబిడ్డగా, కవితా వ్యవసాయకుడుగా, ఇంజనీరుగా, అధ్యాపకుడుగా, ఇంజనీరింగు కళాశాల స్థాపన కార్యకర్తగా, సంఘ సేవాపరాయణుడుగా బహురూపాల ఆయన వ్యక్తిత్వం విస్తరించింది. ఎన్నెన్ని అనుభూతులనో సంతరించుకున్నది. చింతనలో పరిణతిని సేకరించుకున్నది. 40 ఏండ్ల ఈ భావ పరిణామమంతా ఈ 'కవితా కల్పకమ్'లో ద్యోతకమవుతున్నది.

కవిగారు ఈ గ్రంథానికి 'కవితా కల్పకమ్' అని నామకరణం ఎందుకు చేసినట్టు? 'రసజ్ఞు'లైన పాఠకులు ఏ రసం కోరుకొంటే ఆ రసం యిందులో లభ్యమవుతుంది. కనుక ఇది కల్పవృక్షమే అని ఆయన భావన అని నా అవగాహన. శ్రీనాథునికీ, ఈయనకూ ఉన్న పోలిక పైన చెప్పాను. శ్రీనాథునికున్న ఆత్మవిశ్వాసం ఉండేలవారికీ వుంది. అందుకే తన కావ్యాలకు కవితా కల్పకమని పేరుబెట్టి, పాఠకుల్ని పిలుస్తున్నాడు. 'మీకు ఏ అనుభూతి కావాలో కోరుకోండి, అది నా కావ్యాలు అందిస్తాయి' అది.

ఈ నా పరిచయ వాక్యాలను 'పంచామృతం' అని ఎందుకు పిలుస్తున్నానంటే; అర్చనల వేళ అందరికీ పంచే పంచామృతమంత మధురంగా వుంది ఇందులోని కవిత. పంచామృతంలోని భక్తిభావాన్ని అలా వుంచండి. అయిదు మధుర పదార్థాలు సరైన పాళ్ళలో కలవగా పంచామృతం ఆస్వాదనీయమైన, ఆకర్షణీయమైన అమృతమైంది. ఈ పంచకావ్యాలు చదివిన మీదట పంచామృతాన్ని తనివితీరగా ఆస్వాదించిన అనుభూతి నాకు కలిగింది. అందుకనే ఆ పేరు ఏరుకొన్నాను.

కాలక్రమాన్ని బట్టి ఈ కావ్యాలను పరిశీలిద్దాం. మొదటివి రెండూ నేతాజీ, వివేకానందుడూను. ఉండేలవారు వాటిని కౌమార, యవ్వన దశలలో రాశారు. ఆదర్శాలు, వాటిని అంటిపెట్టుకొని పెరిగే ఉత్సాహాలు, ఉద్రేకాలు, ఉద్వేగాలు కదనుతొక్కే కాలాలవి. యవ్వనోత్సాహం, ఎక్కువగా వీరులుగా ఆరాధించే వ్యక్తులచుట్టూ పరిభ్రమిస్తుంది. తమ వీరుల ఆదర్శం యువతీయువకుల ఆవేశం అలాగే జరిగింది మాలకొండారెడ్డిగారికి కూడా. పొడుస్తున్న పొద్దులాగా వికసిస్తున్న ఆయన ఉత్సాహం వీరులైన నేతాజీ,

వివేకానందులచుట్టూ పొంగులారింది. ఆ ప్రభావ ఫలితమే మొదటి రెండు కావ్యాలు.

జీవిత గమనం సాగగా, అనుభూతులు విస్తరించగా, ఆలోచనలు పరిణతి చెందగా, రచనా వస్తువులు మారాయి. జీవితం, భావాలు, మానవుడి మనుగడ, భారతీయుని భవిష్యత్తు ఆలోచనీయాంశాలయినాయి. ఆ పరిణామాన్ని చూపిస్తున్నాయి, చివరి మూడు రచనలు– కాంతిచక్రాలు, మొగలిరేకులు, ఒడిసెలరాళ్లు.

మొత్తం అయిదూ కలిసి మాలకొండారెడ్డిగారు మనిషిగా, భావుకుడుగా, కవిగా మారిన రీతిని వివరిస్తున్నాయి. చిన్ననాడు రచించింది ఛందోబద్ధమైన కవిత; అవలంబించింది ఎక్కువగా దేశికవితారీతి. రాను రాను ఖండికలు ఎక్కువైనాయి. వచన కవితను వరించడం పెరిగింది.

కవితారీతి అలా మారగా, భావనారీతి ఎలా సాగిందో చూద్దాం.

"గౌతమీ కృష్ణ మహాతరంగచ్ఛటల్
నవ్యాంధ్ర యశముగా నమ్మసేయ"–

అంటూ కవనం, తరంగ న్యాసంతో ప్రవచించింది.

"మొగలిరేకులు" వరస మారింది. విచక్షణ పెరిగింది. విమర్శ హెచ్చింది.

తెలుగువారు తమలో తాము కీచులాడుకొంటూ వుంటే ఉండేలవారి గుండె ఆక్రోశిస్తుంది.

"తెలుగమ్మ ఏంచేస్తున్నది"
ఈడొచ్చిన కొడుకులు
... ...
వాటాలు కుదరక
ఒండొరుల నమ్మక,
పంట తగలేస్తుంటే
వలవల యేడుస్తున్నది'
ప్రజాస్వామ్యం దెబ్బ తింటున్నదనే కోపంతో–
"రాజ్యం చేస్తున్నవి రాకాసి గూబలు
... ...
ప్రజాస్వామ్య కోకిల గొంతును
పగబట్టి నులిమేస్తున్నవి".

"ఒడిసెలరాళ్లు"లో క్రూరత్వాలను పాఠకుని మనసుకు గుచ్చుకొని, హత్తుకునేట్లు విసిరారు. ఉదాహరణకు:

కలియుగం పోయింది
కలితీయుగం వచ్చింది"– అంటూ
"కుంటుతున్న, ధర్మదేవత
కలితీయుగం రాగానే
కాళ్లు లేకనే నడుస్తున్నది" అని వజ్రాఘాతం చేశారు.
నేతాజీ కావ్యాన్ని "నీ మహనీయమూర్తి యెడ నిర్మల భక్తికి
నానవాలుగాఁ గోమల పద్యపుష్పముల గూర్చిన యీ కృతిమాలను"
నేతాజీ "జన్మదినంపుగానుకగా" అర్పించారు. అయితే–
'మన యనైక్యత, మనలో ప్రమత్తబుద్ధి
యిన్నిటికి కారణంబులై యున్నవనుచు
గుఱుతు పట్టరు నేటికీ కొమరులనుచు
పరితపించుచున్నది భరతమాత".

అని చారిత్రక సత్యాన్ని, భారతీయుల ప్రవృత్తిలోని దౌర్భాగ్యాన్ని ఆ పసితనంలోనే ఎత్తిచూపించారు.

'వివేకానందుడు'లో–
'సంజకెంజాయతో మంజుల కాషాయ
విమలాంబరద్యుతి వియ్యమాడ
రాజవీధుల ప్రేక్షకారాధ్యుడయ్యె
భరతదేశపు చిన్నారి బ్రహ్మచారి"

ఎంత సొంపైన సీస పదగమన ఇది! వివేకానందుల స్వదేశాగమన గమకాన్ని శబ్దసౌందర్యంతో కండ్లకు కట్టినట్లు చూపిస్తున్నది. కవి ఆవేశంతో ఉరకలు వేస్తూ రాసిన పద్యాలు ఇవి.

వివేకానందుని మహాసమాధిని వర్ణిస్తూ–
"అది ప్రదోషంబు, గురుడు బాహ్యాళి వెడలి
తిరిగి చనుదెంచి శయన మందిరముజొచ్చి
జప మొనర్చుచు లోచనాబ్జములు మూసి
నిదురలోన బరబ్రహ్మపదము జేరె".

శబ్దాలంకారానికి ఇది ఇంకొక అందమైన మచ్చుతునక. వివేకా౯ందయోగి ప్రశాంతంగా కన్నుమూసి, తనువు చాలించినరీతిని అలవోకగా వర్ణించి, కవితకే వన్నె తెచ్చారు ఉండేలవారు.

కాంతిచక్రాలు ఖండికల సంకలనం, అందులోని 'మహేంద్రావతరణము'లో కవిలోని తెలుగువాడు ఉవ్వెత్తున పొంగుతున్నాడు.

"నది"ని గురించి గుండె కరిగించే రీతిలో
"చక్కని యీ నదీ దేహాన్ని
ముక్కలుగా ఖండించకు
వేదనాశ్రుధారలతో
రోదసినే నింపి
రోదిస్తుంది నది!
... ...
నది మననుండి ఏమాశిస్తున్నది?
తనకున్నది మనకు ధారపోస్తున్నది".

నదీజలాలకై కయ్యాలు పొయ్యేవారికి ఇది ఒక గుణపాఠం.

ఈ రీతిగా నాలుగు దశాబ్దాలలో ఉండేలవారి భావనాసరళి పెరిగి పెరిగి పెద్ద కాసారమైంది. రసమనోజ్ఞంగా విహరించగల భావకాసారమది. పూవు పుట్టిన దాదితావి మొలచినట్లు వారిలో కవిత పుట్టిన నాటినుండి భావనాపటిమ ఉంటూనే వుంది. అది పెరిగి పెరిగి, పుష్టిని, పరిపక్వతను సంతరించుకొంది.

తియ్యని తెలుగు, కమ్మని కవిత, కవిగారి సొత్తులు, ఆయన రసపిపాసి. ప్రౌఢత్వాన్ని పొందిన రసజ్ఞుడు ఈనాడు. కనక 'పారమ్ములేని గగనవీధి విశాలరంగాల'లో విహరించమని, తన మధుర కవితా కానుకలతో తెలుగువారిని చిరకాలం తనియజేయ మని, మాలకొండారెడ్డిగారిని కోరుతున్నాను'.

నా ప్రథమ కావ్యం "నేతాజీ" 1946లో ముద్రింపబడింది. అందువల్ల 1986లో నలభై వసంతాల సాహితీ మహోత్సవం హైదరాబాదులో జరుపబడింది. ఆనాటి సభాధ్యక్షులు పద్మశ్రీ డా॥ సి.నారాయణరెడ్డిగారు. సభా ప్రారంభకులు నటాగ్రేసరులు, మధురకవి శ్రీ కొంగర జగ్గయ్యగారు.

వంశీ సాంస్కృతిక సంస్థ పక్షాన వంశీ రామరాజుగారు కార్యక్రమాన్ని

త్యాగరాజసభలో నిర్వహించారు. "కవికిరీటి" బిరుదు ప్రదానం అప్పుడే జరిగింది.

ఆనాటి కొందరి ప్రధానవక్తల అభిప్రాయాలనిక్కడ పొందుపరిచాను.

మాలకొండారెడ్డికి "కవికిరీటి" బిరుదు ప్రదానం

ఆరోజు నవంబరు 13 సాయంత్రం ఎంతో రద్దీగా వుండే శ్రీ త్యాగరాయ గానసభను కలిపే వీధులన్నీ ఆరోజు మరింత రద్దీగా వున్నాయి. ఎందరో సాహితీప్రియులు, కళాప్రియులు 6 గంటలకల్లా, పెళ్ళిపందిరిలా అలంకరింపబడిన త్యాగరాయ గానసభను చేరుకున్నారు. ప్రముఖకవి, విద్యావేత్త డా॥ ఉందేల మాలకొండారెడ్డి 40 వసంతాల సాహితీ మహోత్సవం సాహితీప్రియులకు ఆనందాన్ని చేకూర్చింది. మాలకొండారెడ్డి రచించిన గీతాలను, శ్రీ విన్నకోట మురళీకృష్ణ సుమధుర సంగీత సారథ్యంలో గాయనీ గాయకులు ఆలపించటం జరిగింది. ఆ తర్వాత జరిగిన అభినందన సభలో సాహితీవేత్తల ప్రసంగాలు:

సభాధ్యక్షులు పద్మశ్రీ డా॥ సి.నారాయణరెడ్డిగారి ఉపన్యాసం

1957లో మాలకొండారెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ అవతరణంతో పాటు ఈ హైదరాబాదు రంగానికి అవతరించారు. మాకు తెలిసిన మాలకొండారెడ్డిగారు నేతాజీలాంటి కావ్యాలు వ్రాసిన కవిగానే. ఆయన ఇంజనీరని చాలాకాలం తర్వాత తెలిసింది. ఆశ్చర్యపోయాను. ఇంజనీరు కూడా ఇంతమంచి కవిత్వం రాస్తాడాని. కాని ఆధునిక కాలంలో విశేషమంటే ఒక కవి కవిగా మాత్రమే లేడు. ఒక కవి ఇంజనీరవుతున్నాడు. డాక్టరుగా వుంటున్నాడు. పరిపాలకుడుగా వుంటున్నాడు, ఐ.ఎ.యస్.ఆఫీసరుగా వున్నాడు. అధ్యాపకుడుగా వున్నాడు, పరిశోధకుడుగా వున్నాడు. వెనుక కవులు కవులుగానే వున్నారు. కాని ఈనాడు కవులు– ఒక సైనికుడు కవి, ఒక సాధకుడు కవి, ఒక తిరుగబడే యోధుడు కవే! ఆ రకంగా ఇంజనీరుగా వుంటూ కవిత్వం వ్రాసిన వాళ్ళల్లో మాలకొండారెడ్డిగారొకరు. ఆయన మాట్లాడుతుంటే ఆయనకున్న పదవికాని, ఆయన చదువుకొన్న చదువుకాని మనకు స్ఫురించదు. లలితంగా మాట్లాడటంలో మాలకొండారెడ్డి గారికున్న ప్రతిభ మనకందరికి తెలుసు. 14వ ఏట ఆయన వ్రాసిన నేతాజీ విశ్వనాథ సత్యనారాయణగారికి, వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి పంపిస్తే వాళ్లు ఆశ్చర్యపోయి, ఈ వయస్సేమిటి? 14 ఏళ్ల కుర్రవాడేమిటి? వ్రాయటమేమిటని, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఒక మాటన్నారు. "ఎవరో ఒక మహాకవి ఈ కుర్రవాడి మాటునవుండి వ్రాయించినట్టుంది". అమ్మో! నాల్క కొరుక్కున్నారు. వేరే అర్థం వచ్చేటట్లుంది. కాదు అతని లోనుండి వ్రాయించినట్లుంది అన్నారు. చాలా గొప్పమాటన్నారు. అంటే ఒక మహాకవి 14వ ఏట మాలకొండారెడ్డి మనసులో విడిది

చేసుకున్నాడు. ఆ 14వ ఏటనుంచి తక్కువగా రాసినా, రాసిలో తక్కువైనా వాసిలో మిన్నగా చాలా రాసాడాయన. ఆయన ప్రత్యేకత శబ్ద చమత్కారమని స్థూలదృష్టి వాళ్ళకనిపిస్తుంది. కాని వేసిన ప్రతిశబ్దం చమత్కారంగా వుంటూనే అర్థగాంభీర్యం కలిగి వుంటుంది. పైపైన చూసేవాళ్ళకు ఉపరిదృష్టి కలిగినవాళ్ళకు మాటలతో ఆడుకుంటున్న గారడీవాడు అని అనిపిస్తుంది. వడగళ్ళ గురించి వ్రాస్తాడాయన. పొగబండి గురించి వ్రాస్తాడాయన. వడగళ్ళ గురించి వ్రాస్తూ వచ్చెను వచ్చెను వడగళ్ళు అంటాడు. అక్కడనుంచి మాలకొండారెడ్డి గారిలోవున్న ప్రాస ప్రియత్వం తొంగిచూస్తుంది. శబ్దచమత్కారం ఆటలాడుకుంటుంది. ప్రాసకేళి కనిపిస్తుంది. ఒక్కసారి ఆగి చదివితే తెలుస్తుంది. ఈ ప్రాస వెనుక ఎంత అర్థగాంభీర్యముంది. ఆ పదానికి బదులు ఇంకోపదం వేస్తే ఆ గేయం విరిగిపడాలి. ఎవడు గొప్ప కవంటే ఒక మాటవేస్తే దాన్ని తీస్తే మరొక మాట దొరకదు అలాంటివాడు మహాకవి. అర్థగాంభీర్యం వుంటూనే శబ్దాశ్రయంగా తన ఊపిరి చమత్కారంగా వ్రాసిన కవి మాలకొండారెడ్డి. చమత్కార ప్రియత్వం విపరీతంగా ఉంది ఆయనలో. గాజులను క్రాంతిచక్రాలు అన్నాడు. పొగబండిని గొప్పగా భావన ధూమవేణి అన్నాడు. పొగబండిని ధూమవేణిగా భావించే భావుకత చాలాగొప్పది.

అన్నిటికంటె ఒక్కొక్కసారి చాలా ఎత్తుల్లోకి ఎదిగిపోతాడు. ఇంత సరసంగా చమత్కారభరితంగా వ్రాసినకవి ఒక్కమాటు చాలా దూరంగా వెళ్ళిపోయి క్రాంతదర్శిలాగా పలుకుతాడు. గొల్లవాడా! ముల్లోకాలను నువ్వు నడిపించేటట్టు నువ్వు పాలించు అంటూ, గొప్పవాళ్ళంతా గొల్లవాళ్ళే అన్నాడు. జనాన్ని నడిపించిన ప్రతివాడు గొల్లవాడే అంటాడు. అనితరసాధ్యమైన భావన ఇది. ఈ రకంగా ఆయన రచనలు సాగినయ్.

14వ ఏటనే ఆయన దర్శనం, వర్ణనం రెండు కళ్ళుగా చేసుకొని, 14వ ఏట కావ్యప్రారంభం చేయటం చాలా అరుదు. తొలకరి వయసులోనే ప్రౌఢ పద్యరచన దువ్వూరి రామిరెడ్డిగారిని తలపించే రచనలు ఆ రోజుల్లోనే చేసి జాషువాలోని సంఘసంస్కరణ దృష్టి ఏ వస్తువునైనా కవితకు అర్హమైందే అని, జాషువా గబ్బిలం మీద వ్రాస్తే, పొగబండిమీద ఇతను వ్రాశాడు.

నటులు, కవి, సభా ప్రారంభకులు శ్రీ కొంగర జగ్గయ్యగారి ఉపన్యాసం

మాలకొండారెడ్డిగారు నాకు దాదాపు 1957 సంవత్సరం నుండి తెలుసు. వారు వ్రాసినవి శతాధికమైన గ్రంథాలేమీ కాదు. కాని నాణెంలో మాత్రం దేనికదే పసిడితునకగా మిగిలిపోయేటటువంటి గ్రంథాలు వ్రాశారు. మరి 14వ ఏటనే కవిత్వం ప్రారంభించి అందులోను ఎందరో పండితుల ప్రశంసలందుకోగల రీతిలో రూపొందించగలగటం

అసాధారణమైన విషయం. ప్రతిభ ప్రతిభావ్యుత్పత్తుల్లో ప్రతిభ గలిగేది స్త్రీ అంటారు. కాని ప్రతిభని వ్యుత్పత్తిని రెంటిని సమానంగా తన సొంతం చేసుకోగలిగి ఆ ఎత్తుకు ఎదుగగలిగినప్పుడు ఆ కవి చాలా గొప్పవాడవుతాడు. అలాంటివాళ్ళు కొద్దిమందే వుంటారు. ఆ కోవకు చెందినటువంటి మాలకొండారెడ్డిగారు ప్రతిభా వ్యుత్పత్తి అనే జమిలి గుఱ్ఱాలమీద స్వారిచేశారు. కదను తొక్కించారు. శ్రీశ్రీ గారన్నారు కాదు ఏదీ కవితకు అనర్హమని. మరి ఇతరులు కూడా ఒప్పుకున్నారు. అయితే ప్రతిదానిమీద కవిత్వం చెప్పినవారు చాలా తక్కువమంది. మన దైనందిన జీవితంలో మనకు తటస్థపడే వస్తువులు కానివ్వండి ప్రకృతిలో మీరు సర్వసామాన్యంగా చూసే దృశ్యాలు కానివ్వండి వీటన్నిటిని కూడా కవితా వస్తువులుగా చేసుకొని వాటిని రసవత్తరంగా మలచకలిగినటువంటివాళ్ళు కొద్దిమంది కవులు మాత్రమే వున్నారు. వారిలో మన మాలకొండారెడ్డిగారొకరు. చాలా అర్థవంతంగాను, భావగర్భితంగానూ, సందేశాత్మకంగాను వ్రాశారు.

చిన్నతనంలోనే సంప్రదాయ పద్ధతిలో కావ్యేతిహాసాల్ని చదువుకొని, ప్రబంధాలన్నీ చదువుకొని పాండిత్యాన్ని గడించుకొన్నారు. అయితే వీరి మొట్టమొదటి కావ్యం మరి తాను చదువుకొన్న సంప్రదాయబద్ధమైన విద్యకు అనుగుణంగా లేదు. ఉన్నట్లయితే షష్ఠ్యంతాలతోను, అష్టాదశవర్ణనలతోను ఏదో ఒక ప్రబంధం ప్రారంభించి వుండేవారే. కాని ఆయన మొట్టమొదటగా ఎత్తుకొన్న వస్తువు నేతాజీ. దేశభక్తి పూరితమైనటువంటి వస్తువు. ఒక మహావ్యక్తి, మహానాయకునియొక్క జీవితచరిత్ర. అటువంటి వస్తువును కావ్యంగా స్వీకరించటంలో ఆయన ఉదాత్తత ఉంది. అటువంటి సమయంలో కూడా అంత సంప్రదాయబద్ధమైనటువంటి పద్ధతులలో పెరిగి పెద్దవాడైనటువంటివాడు మరి ఇంకొకరకంగా కవితను ఆహ్వానించకుండా ఆయన కవితాకుమారికి స్వస్తి పలికినటువంటి తీరు కూడా ఎంతో విలక్షణంగాను ఆయన శైలికి తగ్గట్టుగాను వున్నవి. ఒకసారి మనవి చేస్తాను- కవితాకుమారి గురించి మాట్లాడుతూ-

సీ॥ అలఁనాడు క్రౌంచపక్షులఁజూచి వాల్మీకి
దుఃఖించుచో హఠాత్తుగ జనించి,
కాళిదాసుని మేఘ కావ్యకన్యకతోడ
నలకాపురముదాఁక నరుగనేర్చి,
నన్న పార్యుందందుకొన్న గంటమువెంట
తెలుగువారింటికి వలసవచ్చి,
కవిసోమయాజుల గ్రంథసౌధమునందు
మురిపెంబుమీఱ గాపురముచేసి,

అంతేకాని శ్రీకారంతో చుట్టుతిప్పి, దేవతాస్తుతిచేసి ఇవన్నీ చెయ్యలేదు. అందుకని మొట్టమొదటినుంచి కూడా తాను 14వ ఏట కవిత్వం వ్రాయటం ఆరంభించినప్పటినుంచి కూడా తనకంటూ ఒక శైలిని, రీతిని ఒక పద్ధతిని, బాణిని ఏర్పరచుకొన్నటువంటి విశిష్టమైన కవి, విశిష్టమైన వ్యక్తి మాలకొండారెడ్డిగారు అని మనవి చేస్తున్నాను.

ఈ కవిత్వంలో ఇన్ని చదివింతర్వాత నాకనిపిస్తుంది, కవిగా ఆయన పుట్టింది రైతుకుటుంబంలో– ఆ రైతు రక్తం ఆయన శరీరంలో ప్రవహిస్తుంది. ఆ రైతు జీవితాన్ని ఆయన పూర్తిగా అనుభవించారు. దాన్ని ఆకళింపు చేసుకున్నాడు. రైతు జీవితంలో వున్నటువంటి సుఖదుఃఖాలను, సొగసుల్ని ఇన్నింటిని ఆయన తనలో జీర్ణింపచేసుకొని వాటిని మనకి పంచిపెట్టాడు, ఆయన రచనల్లో కవిలోని రైతు, రైతులోని కవి తొంగిచూస్తూనే వుంటాడు. అలాంటి ఘట్టాలు చాలావున్నాయి. నేతాజీలో–

గీ॥ పండియొఱఁగిన వెన్నుఁజొంపములవంటి
భరత జనయిత్రి సంపద కొఱకికి తినఁగ
పఱిగ పిట్టలవోలె మీ పంచలందు
వ్రాలియున్నారు పరదేశవాసులెల్ల"

ఆ పొలాలమీద విరబూసిన సౌభాగ్యాన్నంతా వరిగపిట్ట వచ్చి కొరుక్కు తీసుకుపోతుంటే ఎంత బాధగా వుంటుందో ఆ రకంగా వున్నటువంటి ఆ భరతమాతయొక్క ఆనాటి పరిస్థితిని ఆయన వర్ణిస్తూ, రైతుపరంగా రైతుజీవితాన్ని పూర్తిగా తనలో జీర్ణం చేసుకున్నాడు కాబట్టి ఆ expression, ఆ imageని ఆద్యంతం ఆయన అందించగలిగారు. అదే రకంగా నేతాజీలో చక్కని పదాలను వాడారు. చక్కని పలుకుబడులూ చక్కని ప్రయోగాలతో చక్కని పదబంధాలను ఉపయోగించారు.

అలాగే కాంతిచక్రాల్లో 'గాజు' గాజులు, గాజుల మల్లయ్య గాజుల మలారం ఇవన్ని కూడా మన తెలుగుదేశపు తెలుగుదనానికి చాలా ముఖ్యమైనటువంటి సంకేతాలు. మన తెలుగు గ్రామీణ జీవితంలో మరచిపోలేనటువంటి మధురమైన ఘట్టాలు. అయితే ఇప్పుడు పల్లెటూళ్లల్లో కూడా గాజుల మలారం అంటే ఏమిటో తెలీకుండా పోతుంది. అది మన దౌర్భాగ్యం. క్రాంతిచక్రాలు గురించి చెప్తూ ఆయనంటాడు.

సీ॥ మెరుగు మీగడతోటి పెరుగు చిల్కెడి కాపు
కన్నెముందు నటించు కవ్వమునకు,
సిరులిచ్చు వరిపంటతఱగు మాలెతల గు
ప్పిళుల క్రేళుటుకు లవిత్రములకు,

కమ్మని గుత్తివంకాయ తాళింపు "చుం
యన" దించు నిల్లాలియంగుళులకు,
జిలిబిలి ముద్దుపల్కుల ముత్తెములు చెక్కు
కవయిత్రి జాళువాగంటమునకు,

ఆ పసందు, రసస్ఫూర్తి అబ్బ గలవె
నా మలారములో గొంటెనవ్వు నవ్వు
గాజుల సరాల మధురనిక్వణములేక?
కళలు నేర్చిన కలకంఠకంఠులార!

అని చాలా గర్వంగా చెప్పుకుంటాడు. అసలు ఇక్కడ నేను చెప్పదలచుకొన్నదేమిటంటే ఎన్ని రకాలైన వాళ్ళకైనా తన గాజులను తొడిగి ఆనందింపచేస్తున్నాడో అక్కడ వుండేటటువంటి ప్రతిచిత్రం కూడా మన పల్లెటూరులో కనిపించే సర్వసాధారణమైన ఘట్టం. కాని ఈ విధంగా poetic గా గుర్తుచేసుకోటం ఎంతో ఆనందంగా మధురంగా వుంటుంది.

అంతేకాకుండా మొట్టమొదట ఈ కవితాయోగి నేతాజీ దగ్గరనుంచి ఒడిసెలరాళ్ళవరకు పాఠకులకు రసవత్తరమైనటువంటి, ప్రయోజకరమైనటువంటి కవిత్వాన్ని అందించారు. ఇకముందు కూడా అప్పుడప్పుడే కాకుండా తరచుగా సాహితీ వ్యాసంగం చేస్తూ పాఠకులకు ఆనందం చేకూరుస్తారనుకుంటాను.

లోకాయుక్త శ్రీ ఆవుల సాంబశివరావుగారు-ముఖ్యఅతిథి

ఉండేలవారికి నిండుగా 54 ఏళ్ళు పూర్తికాలేదు. అయినా అప్పుడే కవితా వసంతాలు 40 అయిపోయినయ్- అంటే ఆశ్చర్యంగా వుంటుంది. ఎప్పుడో శ్రీనాథుడు చిన్నప్పుడు చరిత్ర వ్రాసినట్లుగా, ఈయన 'నేతాజీ' 14వ ఏట మొదలుపెట్టాడు. అయితే నాకు 40 వసంతాల్లా నేను అనుకోను. నన్నయ్యగారి మహాభారతం మొదటి కావ్యం మొదటి కవిత్వం అంటే నేనెలా నమ్మలేనో అంగీకరించలేనో ఒక్కసారిగా మహత్తరమైనటువంటి కవిత్వం పుట్టిందని ఎలాగైతే నా మేధస్సు అంగీకరించలేదో అలాగే ఒక్కసారిగా ఆయన నేతాజీ అనే కావ్యాన్ని వ్రాశారు అంటే నాకు నమ్మశక్యం కాకుండా వుంది. అంతకుముందు చాలా చాలా ఎన్నో కూనిరాగాలు తీసి తీసి వుండాలాయన. ఆ తరువాత 14 ఏళ్ళప్పుడు ఈ కవిత్వం పుట్టింది. అందుచేత ఇది 14 వసంతాలు కాదు. వాస్తవానికి 45 వసంతాలో 50 వసంతాలో అయివుండాలి. ఆ రహస్యం ఆయనకే తెలిసివుండాలి. పోతే నాకు అనిపిస్తుంది. ఆయన రచన పుస్తకాలు వాటిని గురించి- ఈ 40 ఏళ్లల్లో- 1946లో

ప్రారంభించి 1986 వరకు నడచినటువంటి కవితాయాత్ర చూస్తే, 1946లో నేతాజీ, 1953లో వివేకానందుడు, 1959లో క్రాంతిచక్రాలు, మళ్ళీ ఇక్కడ ఆదికవులు జ్ఞాపకమొస్తున్నారు. నన్నయ్యగారు రెండుపర్వాలు వ్రాసి మూడోపర్వం కొంతభాగం వ్రాసి ఆపేశారు. మరి మన ఉండేలవారు ఏంచేశారు అంటే నేతాజీ వివేకానందుడు, క్రాంతిచక్రాలు చాలావరకు పద్యంలో వ్రాశారు. ఇక అక్కడ నుంచి ఈనాడు మనం నవీనత నవ్యత అనుకొనేటువంటి వచనకవిత్వం అనండి, గేయాలనండి ఇవన్నీ వచ్చినయ్. అందుచేత కాలక్రమంగా వచ్చినటువంటి ఈ మార్పు మరి ఉండేల వారిలో ఎలాగైతే వచ్చిందో, అసలు మన తెలుగు సాహిత్యంలోను తెలుగు కవిత్వంలోనూ కూడా అలాగే వచ్చింది. అప్పటివరకు పద్యమే ప్రధానమనుకున్న మనకు అక్కడనుంచి వచనకవిత్వం ప్రముఖంగా భావించటం జరుగుతున్నది. ప్రతి ఒక్కరికి కవిత్వం వ్రాయాలనే కోరిక వుంటుంది. పద్యమున్నంతకాలం చాలా కొద్దిమంది మాత్రమే పద్యాలు వ్రాశారు. ఇంకా వచన కవిత్వం అన్న తర్వాత వేలకువేలు రాస్తున్నారు. అది సహజమైన విషయం కోరుకోతగినటువంటి విషయం. మాలకొండారెడ్డిగారిలో ఆ పరిణతి కనిపిస్తుంది. రూపంలోనేకాదు, పద్యంలోను వచన కవిత్వగేయాల్లో వచ్చి తగినటువంటి విషయం. మాలకొండారెడ్డిగారిలో ఆ పరిణతి కనిపిస్తుంది. రూపంలోనేకాదు, పద్యంలోను వచన కవిత్వగేయాల్లో వచ్చినటువంటి మార్పేకాదు భావుకతలో కూడా.

పద్యకవితలో నుంచి భావకవిత వచ్చింది. దానికి మరి ఏళ్లునిండాయి. అది చాలావరకు అస్తమించింది. వచనకవిత వచ్చింది. వచనకవితలకు వున్నటువంటి పరిమితులను మనం గుర్తించవలసి వుంది. అది చదువుకొన్నవారికి పట్టణాలకు మాత్రమే పరిమితమై వున్నది. మీరు వచన కవితలను గానంచేసి చదువుకోనివాళ్లను ఏమి రంజింపచెయ్యగలరు? చెయ్యలేరు! అందులో గానంలేదు. మొన్ననే విన్నాను నేను పద్యాలు ఇంద్రసభలో, పానకం తాగినట్టు తాగేశారు. రాగయుక్తంగా పద్యంలో ఏమున్నదన్నది కాదు. ఆ రాగం గానం. అందుచేత వచనకవితకు ఒక పరిధి ఏర్పడిపోయింది. చదువుకున్నవాళ్ళకు ఏదో చదువుకోటానికి తప్ప వీలులేదు. నా అభిప్రాయం వచనకవిత్వం యొక్క ప్రాధాన్యం తగ్గిపోతున్నదని, తగ్గిపోవాలి. దానిస్థానంలో భావకవిత్వంలో నుంచి మనకు ఇతరమైనటువంటి కవిత్వం ఎలా అయితే పుట్టుకొచ్చిందో కవితారూపాలు ఎలా అయితే వచ్చినవో వచన కవితను దాటి తెలుగు కవిత ముందుకు వెళ్ళాలని నా కోరిక.

ఉండేలవారి మీద నాకు చాలా నమ్మకం, ఆశ వున్నది. ఆశ తీరుస్తారని చెపుతూ, ఈ 40 వసంతాలే కాదు మరో 40 వసంతాలు కవితాగానంచేస్తూ వుండాలని, కవితా కోకిలగా వుండాలని కోరుతూ, అభినందిస్తున్నాను.

నిర్మాత, సహజకవి శ్రీ మల్లెమాల సుందర రామిరెడ్డి

మాలకొండారెడ్డిగారికి, నాకు వున్న అనుబంధంవారి సాహితీ వ్యాసంగంలాగే మా స్నేహానుబంధానికి కూడా సరిగా 40 సంవత్సరాలే వయసు. అయితే 30 సంవత్సరాలు ఏమాత్రం ముఖపరిచయంలేని స్నేహితులు నేను, ఆయన. 1946లో నేతాజి కావ్యావిష్కరణ నెల్లూరు పురమందిరంలో జరిగినప్పుడు ఆ కావ్యాన్ని గురించి సమీక్ష జమీన్‌రైతు మొదలైన పత్రికలలో వచ్చినప్పుడు నేను చదివి అందులోని కొన్ని పద్యాలను ఆస్వాదించి, ఎంతో ప్రయత్నించాను నేను వారిని నెల్లూరులో కల్సుకోవాలని. ఎక్కడో మారుమూల పల్లెలో నెల్లూరు జిల్లాలో దుర్భరదారిద్ర్యాన్ని అనుభవిస్తున్నటువంటి నేను కనీసం చార్జీడబ్బులు సంపాదించుకొని మాలకొండారెడ్డి గారిని కల్సుకోలేకపోయాను. అలా అప్పుడప్పుడు వారి కవిత్వం జమీనురైతులో వస్తూవుంటే అది చదివి నేను వారికి కలంస్నేహితుడుగా, సాహితీమిత్రుడుగా హృదయంలో స్థానం ఏర్పరచుకున్నాను.

సుమారు 10 సంవత్సరాల క్రితం ఆయన, నేను పరస్పరం నెల్లూరులో జరిగిన ఒక సాహితీసభలో కలవటం, చూసుకోవటం జరిగింది. మాలకొండారెడ్డిగారి కవిత్వాన్ని సమీక్షించే బాధ్యత నేను పెట్టుకోలేదు, వారి వ్యక్తిత్వం చాలా గొప్పది. ఆయన పద్యకవిత్వం ఎంత గొప్పగా చెప్పాడో గద్య కవిత్వం కూడా అంత బాగా చెప్పాడు. మరొక పద్యకావ్యానికి వారు నాంది పలకాలని కోరుతున్నాను.

ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం

నేను ఏ కవినైనా పరిచయం చేయదల్చుకుంటే ఈయన ఏ వర్గానికి చెందినవాడు అని ప్రేక్షకులు అడుగుతారు. ఈయన భావకవియా? విప్లవకవియా? అభ్యుదయ కవియా? ఈ వర్గాలన్నిటికి అతీతుడు సహజకవి, సత్కవి మాలకొండారెడ్డిగారు. ఈయన 4వ తరగతి చదువుతున్నప్పుడు భాగవతం ఔపోసన పట్టారు. మనుచరిత్రను జీర్ణించుకున్నారు, ఉత్తర రామాయణాన్ని ఔపోసనపట్టారు. 5వ తరగతి చదువుతున్నప్పుడు రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం, విక్రమార్క చరిత్ర మొదలైన సంస్కృత కావ్యాలు క్షుణ్ణంగా మథించారు. 5వ తరగతి తాను చదువుతూ బి.ఏ. చదువుతున్న ఒక విద్యార్థికి శృంగారనైషధం పాఠం చెప్పారు. ఈయన మాలకొండారెడ్డి. ఈయన ఆశుకవిత్వం చెప్తుండేవారు. అనర్గళంగా కవితాధారపొంగులు వారుతుండేది. అవెక్కడా రికార్డు చేసినట్టులేదు. బోసు చనిపోయాడన్న వార్త దేశంలో అగ్గిలా వ్యాపించినప్పుడూ, దేశం ఆవేశంతో శోకంతో ఉప్పొంగుతున్నప్పుడూ యువకులతో కూడి వేదికను ఎక్కి నేతాజీమీద తన కవితలను ఆలపించటం ఆరంభించాడు. సమకాలీన వస్తువులనెత్తుకొని గళంవిప్పిన ఈ కోకిలకు ప్రాచీన సాహిత్య సంస్కారమంతా పుక్కిట పట్టినట్లై గుబాళించింది. కొత్త

వాసనలూ, తెలుగు సాహిత్యానికి అందించింది. మాలకొండారెడ్డిగారు పద్యం చదువుతుంటే ప్రాచీన కవుల నీడలు అందులో కనిపిస్తుంటాయి. కాని వాణి, బాణి మాత్రం రెడ్డిగారివే. తనదైన సొంత గొంతుకతో తరతరాలనుండి వస్తున్న సంప్రదాయాల్ని జీర్ణించుకొని వాటి ప్రభావంనుండి వైదొలగి ముందుకువెళ్ళే ఒక యువకవి. ఒక సత్కవి.

ప్రాచీనంలో వస్తున్న శిల్పాలన్నిటినీ తన పద్యాల్లో ఇముడ్చుకున్నారు. ఆ పద్యాలు ప్రాచీన కవియొక్క జాడల్లో నడిచినవి కావు.

ఆధునిక కవుల్లో చాలామంది మహాకావ్యం వ్రాయాలి అని కోరుకుంటూ వుంటారు. ఈయన చిత్తశుద్ధి నేను మెచ్చుతాను. ఈయన విదేశాలు వెళ్ళివచ్చిన తర్వాత ఆయనొక విచారాన్ని వ్యక్తం చేశారు. ఒక మహాకావ్యాన్ని వ్రాసే స్వాస్థ్యం నేను కోల్పోయాను. ఒక మహావస్తువును తీసుకొని నిర్వహించే ఓపిక తీరిక కరువైంది అని నిజాయితీతో ఒప్పుకొన్న వ్యక్తి.

కాంతా సమ్మితంకాదు మాలకొండారెడ్డిగారి వాక్యం, పౌరుషోపేతం, ఒకసారి వాక్యం, మరొకసారి చమత్కారం, మరొకసారి ధ్వని ఈయన కవిత్వంలో పొంగులు వారుతుంటుంది.

***

1987లో అమెరికన్ ఆంధ్రులు (NRIలు) ముఖ్యంగా డా॥ పి.యస్.రెడ్డి(వరంగల్ వాస్తవ్యులు) పిట్స్‌బర్గ్‌లో ప్రసిద్ధ హృద్రోగ నిపుణులు నాయకత్వం వహించి మెడిసిడి ఆస్పత్రిని షామీరుపేటలో నెలకొల్పినారు. ఆ ప్రాంత ప్రజలకు ఆధునిక ఆరోగ్యసేవలందిస్తు న్నారు. అంతర్జాతీయ స్థాయి గల్గిన వైద్యకళాశాలను 2002లో స్థాపించినారు. మెడిసిటి సంస్థలో ఆచరణ కార్యదర్శిగా నాకు స్థానం కల్పించి, గ్రామీణ ప్రజలకు నా శక్తి మేర సేవచేసి అవకాశాన్ని కల్పించారు.

1992లో "విలపించే ఉత్తరం" కావ్యాన్ని రచించాను. ఎటుచూచినా హింసాకాండ ప్రబలిపోయిన రోజులవి. యువత ఏ మార్గంలో వెళుతున్నారో వారికే తెలియని అయోమయస్థితి. ప్రజలు మానప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని విలవిలలాడిపోతున్నారు. వారిని గూర్చి విలపించే ఉత్తరమే యీ కావ్యం.

1996లో "అమెరికన్ తెలుగు అసోసియేషన్" (ATA) ఆహ్వానంపై హ్యూస్టన్ నగరానికి వెళ్లడం జరిగింది. "మాలకొండ నోట మంచి మాట" అనే మకుటంతో "సత్యం శివం సుందరం" కావ్యాన్ని అక్కడ రచించాను. సాహితీవేత్త శ్రీ వంగూరి చిట్టెన్‌రాజుగారు ఆ కావ్యాన్ని ముద్రించి, ఆటా సభలలో ఆవిష్కరింపజేశారు.

2002 సంవత్సరం నా జీవితంలో ఒక గొప్ప మైలురాయి. ఆనాటికి జీవితంలో 70వ వసంతాలు చూశాను. సాహిత్య వ్యాసంగంలో 60 యేండ్లు గడిపాను. అంటే 1942లో ఐదవ తరగతి విద్యార్థిగా కవిత్వం వ్రాయటం మొదలుపెట్టాను. 1952లో సాంకేతిక విద్యారంగంలో ప్రవేశించాను. వేలకొలది విద్యార్థులు నా వద్ద ఇంజనీరింగు విద్యనభ్యసించి పట్టభద్రులై స్వదేశంలో విదేశాలలో ఉన్నతస్థానాలలో వున్నారు. ప్రధానంగా చైతన్యభారతి విద్యాసంస్థ (సిబిఐటి), గండిపేట, హైదరాబాదు) వ్యవస్థాపక కార్యదర్శిగా, ప్రిన్సిపాలుగా, తర్వాత అధ్యక్షులుగా దాదాపు 27 సంవత్సరాలు సాంకేతిక విద్యాసేవ చేసే అవకాశం నాకు లభించింది. నా సాహిత్యాభిమానులు, ఇంజనీరింగు విద్యార్థులు ఆంధ్ర ప్రముఖులు, ప్రముఖ భారతీయులు కలిసి ఆహ్వానసంఘంగా ఏర్పడి, జీవితసప్తతి(1932–2002), సాహితీషష్టిపూర్తి (1942–2002), వైజ్ఞానిక స్వర్ణోత్సవం (1952–2002) హైదరాబాదు, రవీంద్రభారతిలో జరిపినారు. అది నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆనాడు ఎందరో పెద్దలు ఆశీర్వదించినారు. ప్రశంసలు కురిపించారు. మచ్చుకు మాన్యులు కాళోజీ నారాయణరావుగారి శుభాకాంక్షలిందు పొందుపరుస్తున్నాను.

"తమ్ముడు కొండన్న పేరు యాదికి రాంగనే నాకు, "పైన రవి, క్రింద భువి, మధ్యన పైరవి" అన్న ఆయన గేయపంక్తి యాదికి వస్తుంది. పైరవీని ఇంత చమత్కారంగా చెప్పినాడు. అట్లనే గాజులకు "కాంతి చక్రా"లని, రైలుబండిని "ధూమవేణి" అని ఆయన పెట్టినపేర్లు ఆయన చమత్కారమైన అందమైన ఊహలకు నిదర్శనం.

వరంగల్లులో ఆయన పనిచేసే రోజుల్లో చాలాసార్లు కలుసుకునేవాండ్లం. 1953 నుంచి మా స్నేహం. ఆయన మంచి స్నేహశీలి.

ఇంజనీరింగ్ విద్యావేత్త అయినా, సాహిత్యంపట్ల, సమాజంపట్ల, మనుషులపట్ల ప్రేమ ఉన్నవాడు. ఆ రంగాల్లో తనకు చేతనైన సేవ చేస్తున్నవాడు. ఆయన స్థాపించిన 'వుండేల విజ్ఞాన కళాపీఠం' పురస్కారం నాకూ దొరికింది 1996లో. పురస్కారం ప్రదానంచేస్తూ "కనకం ఆయనకు నాస్తి, కన్నీళ్ళే స్థిరాస్తి, ఉండటానికి ఇల్లు లేనివాడు, ఉర్వి అంతా తనదైనవాడు, చెలిమియే కలిమిగా భావించినవాడు, పల్లెపట్టణాలనక పల్లేరై తిరుగువాడు, ఈగవోలె, దోమవోలె వాగుచు తిరుగాడువాడు, సగటుమనిషి ఆవేదనకు సాక్షాద్రూపము" అని నా గురించి అన్న మాటలు, ఆయనకు నా మీద ఉన్న ఆత్మీయతకు, ప్రేమకు స్నేహానికి గుర్తులు.

జీవిత సప్తతి, సాహితీ షష్టిపూర్తి, వైజ్ఞానిక స్వర్ణోత్సవం జరుపుకుంటున్న సమయంలో, తమ్ముడు మాలకొండారెడ్డికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

ఇంకా నాల్గు మాటలు రాద్దామని ఉన్నా, వయసు, ఆరోగ్యం సహకరించడం లేదు".

2004లో "మానవగీత" కావ్యాన్ని రచించాను. ఇందులో ప్రధాన కథాంశం ఆయుధధారులై అడవులలో వుంటూ హింసకు పూనుకొన్న యువకులనుద్దేశించి చేసిన అహింసాబోధ. ఇందలి యువకులు చాలమంది, ప్రాంతీయ ఇంజనీరింగు కళాశాల వరంగల్లులో నేను ఆచార్యులుగా వున్నప్పుడు, 1970లో నా తరగతులకు హాజరైనవారే.

ఇందులోని కొన్ని పద్యాలను ప్రఖ్యాత సంగీత విద్వాంసులు శ్రీ ఎస్.బి.బాల సుబ్రహ్మణ్యంగారు సీడీ రూపంలో గానం చేసినారు. ఆ సీడీలను 2004లో "లాస్ ఏంజెలస్" అమెరికాలో జరిగిన ఆటాసభలలో తెలుగు సాహితీ ప్రియులకు ఉచితంగా ఇవ్వడం జరిగింది.

దూరదర్శన్ సప్తగిరివారు "మానవగీత" లోని సందేశాన్ని 2005 ఆగస్టు నుండి అక్టోబరు మాసాల మధ్య ఆదివారం 8 గంటల నుండి 8.30 గంటలవరకు ఉదయం పది పర్యాయములు ప్రసారం చేయడం జరిగింది. ఎందరో ప్రేక్షకులు ఆ సందేశానికి స్పందించి నాకు ధన్యవాదాలు తెలపడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

"మానవగీత" పై తమ అమూల్య అభిప్రాయాలను అందించిన ప్రముఖులు:

డా॥ యం.యస్.రెడ్డిగారు

డా॥ గుంటూరు శేషేంద్రశర్మగారు

డా॥ జి.వి.సుబ్రహ్మణ్యంగారు.

మచ్చుకు డా॥ శేషేంద్రశర్మ, డా॥ యం.యస్.రెడ్డి, డా॥ సి.నారాయణరెడ్డిగార్ల సుహృత్ స్పందనలను ఇందు పొందుపరుస్తున్నాను.

శేషేంద్రశర్మగారి భూమిక

మానవగీత అందరూ అనివార్యంగా చదువవలసిన ఉత్తమ కావ్యం. ఇందులో ప్రపంచపు ఫొటో ఉంది. దానికి మించి ప్రపంచపు ఎక్స్‌రే ఉంది. ఆయుధధారి అయి రోడ్డుప్రక్కన కూర్చొని వున్న ఒక ఉగ్రవాది యువకుడికీ, ఆ దారిన వెడుతూ కలిసిన ఒక కవికీ మధ్య జరిగిన సంభాషణ ఈ కావ్యము. కృష్ణుడికీ అర్జునుడికీ మధ్య జరిగిన సంభాషణ వంటిది. కవి దర్శనసిద్ధి గలవాడు. కాబట్టి దానిచేత అతనికి సమస్త వస్తు దర్శనములు సువిదితములు.

"నా నృషిఃకురుతే కావ్యం ఋషిశ్చ కిల దర్శనాత్ ।
సమస్త వస్తుధర్మాంశ్చతత్త్వ ప్రఖ్యాచ దర్శనమ్ ॥

మన మాలకొండారెడ్డి అంతటివాడని ఈ మానవగీత అనే కావ్యం స్పష్టంగా చెపుతుంది. బహుశ భగవత్‌గీతకంటె కొంత ఎక్కువ సత్యావిష్కారము ఈ కావ్యము చేస్తుందని పఠితకు విదితమౌతుంది. ఉగ్రవాదయోగము, స్వార్థయోగము, ధనయోగము, సంపద్విషాదయోగము, అధికారయోగము, విజ్ఞానయోగము, కళాయోగము, నీతియోగము, వివేకయోగము, ప్రేమ యోగము, స్త్రీ యోగము, కళాయోగము, నీతియోగము, వివేకయోగము, ప్రేమయోగము, స్త్రీ యోగము, దైవయోగము, భవిష్యత్ యోగము అనే త్రయోదశ యోగములు ఇందులో ఉన్నవి. ఇవి భగవత్‌గీతలోని అర్జున విషాదయోగం, సాంఖ్యయోగం, కర్మయోగం, జ్ఞానయోగం, కర్మసన్న్యాసయోగం, ధ్యానయోగం, విజ్ఞానయోగం, అక్షరపరబ్రహ్మయోగం, రాజవిద్యా రాజగుహ్య యోగం ఇత్యాదులవంటివి. భగవద్గీతలో యోగాలన్ని వేదాంత మానసికతాలిప్తములై ఉంటే, అదే ఎత్తులో మానవగీతలోని యోగాలన్నీ వాస్తవభావలిప్తములై ఉండి, ఈనాటి పఠితలకు భగవద్గీతకంటె ఎక్కువగా ఆచరణీయములనిపిస్తాయి.

ఈ అపూర్వకావ్యము మూలంగా వర్తమాన సమాజంలోని మానవుల సంస్కారము మారుతుంది; ఉదార వ్యక్తులైతారు. పూర్వము రెండువేల నాలుగు ఏళ్ల క్రితం జీసస్ క్రీస్తు ఇలాంటి ఉదారభావాన్నే వ్యాపింపజేశాడు. ఇక్కడ ముఖ్య విషయం– ఆయన మానవ సమాజాన్ని రెండు భాగాలుగా విడదీసి చూశాడు. ఆ రెండు భాగాలు ఫిలిస్టీన్స్, ప్లెబియన్స్ అంటే ధనికులు– పేదలు; అలా విభజించి పేదల పక్షం అవలంబించి ధనికుల్ని గర్హించాడు.

ఆయన అన్నాడు– "ఒంటె ఒక సూదిబెజ్జంలోంచి ఇవతలి నుంచి అవతలకు పోగలదు కాని ధనికుడు స్వర్గద్వారములోకి చచ్చినా చొచ్చుకోలేడు". జీసస్ ప్రపంచ చరిత్రలో అద్వితీయమైన ఉన్నతి వున్న మహాపురుషుడు. ఆయన్ని భారతీయ పౌరాణిక దశావతారాలలో చేర్చి ఇప్పటి నుంచి ఏకాదశావతారాలుగా పరిగణించడం మన నైతిక బాధ్యత. జీసస్ సమాజాన్ని రెండు వర్గాలుగా చూచినట్లు, ఆయన తర్వాత సుమారు రెండువేల సంవత్సరాలకు కార్ల్‌మార్క్స్ చూచాడు. అంటే మార్క్స్ పుట్టకముందే రెండు వేల సంవత్సరాల పూర్వము పుట్టిన మార్క్సిస్టు జీసస్ క్రీస్తు. అయితే పెద్ద భేదం ఒకటి వుంది. జీసస్ అహింసావాది. మార్క్స్ హింసావాది. సమాజాన్ని మార్చడానికి ఈ రెండు విధానాలను గురించి మానవగీతలో మహాకవి మాలకొండారెడ్డి ఎంతో అద్భుతంగా చర్చించాడు.

"కత్తి వదలిపెట్టి కలమును చేపట్టు,
ద్వేషభావమింక విడిచిపెట్టు"

అని ఆ ఉగ్రవాది యువకునికి బోధిస్తాడు.

ఆ ఉగ్రవాది యువకుడు కూడా కావ్యకర్త మాటలన్ని అంగీకరించి ఇలా అన్నాడు:

"అన్ని తెలియుననుచు అతి గర్వముననున్న
నాకు తెలిపినావు లోకరీతి,
తెలియుకొలది ఏమి తెలియదు నాకని
తెలుసుకొంటినయ్య! ధీవిశాల!"

ఇలా అంతమౌతుంది ఈ మహాకావ్యం. దీన్ని అందరూ చదివితీరాలి. కనుక దీన్ని ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ ఇత్యాది భాషల్లోకి అనువదింపచేయమని మహాకవి మాలకొండారెడ్డికి నా సలహా.

ఎం.ఎస్.రెడ్డి

కాషాయం కట్టని "ఋషి"

శ్రీకృష్ణుడు చిన్ననాడె–చేసెనద్భుతాలు చాల!
విద్యార్థిగ ఉన్ననాడె–వినుతికెక్కె "ఉండేల"!
పట్టుమని పదిహేనేళ్ళు రాకముందే...
గోవర్ధనగిరిని గోటితో పైకెత్తాడు "శ్రీకృష్ణుడు"
అదే వయసులో...
నేతాజీ వీరగాథను నిరుపమానమైన పద్యకావ్యంగా
రూపొందించాడు "ఉండేల"
అలాగని...
ఉండేల శ్రీకృష్ణుడంత గొప్పవాడని నేననను.
ఎందుకంటే? ఆయన భగవానుడు. ఈయన మానవుడు.
... ...
శ్రీకృష్ణుడు చేసే ప్రతి పనిలో దైవత్వం ప్రతిబింబిస్తుంది.
ఉండేల చేసే ప్రతి పనిలో మానవత్వం పరిమళిస్తుంది.
సంగ్రామ రంగంలో నిల్చొని శరసంధానం చేసేందుకు

వెనుకాడిన అర్జునుడికి ధర్మోపదేశం చేసి
కర్తవ్యోన్ముఖుణ్ణి చేశాడు శ్రీకృష్ణుడు-
ఉండేల కూడా అలాంటి ప్రయత్నమే చేశాడు.
ఏమిటా ప్రయత్నం?
జీవిత సంగ్రామంలో ఎన్నో యెదురుదెబ్బలు తిని...
ఆవేశమణచుకోలేక-ఆకలితో చావలేక
సమాజం మీద కసితో తుపాకీ చేపట్టిన
ఒక ఉగ్రవాద యువకుణ్ణి తన కవిత్వోపదేశంతో
శాంతికాముకుడుగా మార్చాడు ఉండేల.
శ్రీకృష్ణుడు కర్తవ్యబోధ "భగవద్గీత"గా
విశ్వవ్యాపితమైంది. డా॥ ఉండేల మాలకొండారెడ్డి
కవిత్వబోధ "మానవగీత"గా పురుడు బోసుకొనింది.
కాని... రెండింటి లక్ష్యం ఒక్కటే!
చెడును ఖండించడం-మంచిని ప్రోత్సహించడం.
మాలకొండారెడ్డి, మనసా-వాచా-కర్మణా
ఆ ప్రయత్నమే చేశాడు. ఆయన సంకల్పంలో
నిజాయితీ వుంది. నిబద్ధతా వుంది. అన్నిటినీ మించి
శాంతిపట్ల-అహింసపట్ల అచంచలమైన విశ్వాసముంది.

ఈ లక్షణాలన్నీ మానవగీతలో మనకు అడుగడుగునా దర్శనమిస్తాయి-

వ్యక్తిగా మాలకొండారెడ్డిది క్రియాశీల జీవితం
ఆయన జీవన విధానం, క్రమబద్ధంగా, కార్యక్రమబద్ధంగా
ఉంటుంది. కవిగా... ఆయన జీవనయానం
సమాజశ్రేయస్సే లక్ష్యంగా సాగుతుంది. అదే ఉండేల
విలక్షణ విధానం...
ఇక్కడ ఇంకొకమాట చెప్పాలి.
చేదుమందును తేనెలో రంగరించి సేవిస్తే కమ్మగా ఉంటుంది.

అలాగే...

ఇతివృత్తం ఆకర్షణీయమైంది కాకపోయినా
అది... ప్రతిభావంతుడైన కవిచేతిలో పడితే
హృదయంగమంగా రూపుదిద్దుకుంటుంది.

అందుకు... మీ చేతిలో ఉన్న మానవగీత కావ్యం
ఒక మహాదర్పణం. ఆ దర్పణంలో ఉండేల
భావ విన్యాస కౌశలం పఠితను పదే పదే ఆలోచింప
జేస్తుంది. ఉదాహరణకు విజ్ఞానయోగంలో...

"ఆకసమ్ము వోలె-అవధులు లేనిది
హిమనగమ్ముకంటె-ఎత్తు గలది
జలధికంటె లోతుగలది విజ్ఞానము"

అంటాడు. పద్యం చిన్నదే! కాని... ఎంత లోతైన అర్థముంది?

అలాగే... మరోచోట బాలకార్మిక వ్యవస్థను గురించి...

"క్రూరమైన లేమి కోరలలో చిక్కి
ఎండలోన బండలెత్తి నేడు
కందిపోవు బాలకార్మికులను జూచి
బండరాయి గుండె బాదుకొనియె!!" అంటాడు.

ఈ పద్యంలో కవిత్వం పాలుకంటె మాలకొండారెడ్డి నవనీత హృదయం అద్దంలా మనకు గోచరిస్తుంది. ఆయనదంతమెత్తని మనసు కాబట్టే భావిభారత పౌరులైన బాలబాలికల దురవస్థను చూచి బండరాయి కూడా గుండెబాదుకుంటుందన్నాడు.

అలాగే వివేకయోగంలో ఒకచోట ఇలా అంటాడు.

"అధిక దుఃఖమైన, ఆనందమైనను
కలసి చెమ్మగిల్లు-కనులు రెండు!
ఆలుమగల జంట అట్లున్నయప్పుడే
సౌఖ్యజీవనమ్ము సాధ్యమగును!!"

ఎంత చక్కని భావ వ్యక్తీకరణ? మాలకొండారెడ్డి కవితాప్రతిభ బహుముఖమైనదన డానికి మానవగీతలో ఉదాహరణలు కోకొల్లలుగా మనకు దర్శనమిస్తాయి.

కళాయోగంలో... మచ్చుకొక పద్యం ఉదహరిస్తాను.
"చిన్నిచీమలు నోట మన్నును గొనితెచ్చి
కట్టిన అందాల పుట్టచూడు!
మిలమిల మెరసెడు జిలుగు దారములతో
అల్లిన సాలీని ఇల్లు చూడు!

గరికపోచలు తెచ్చి తరుశాఖకు తగిల్చి
గిజిగాడు గట్టిన గృహము చూడు!
తేనెటీగలు రూపుదిద్ది వృక్షాగ్రాన
పెట్టిన తేనియపట్టు చూడు!
చీమవంటి మూగజీవులె తమ నిత్య
జీవనమున కళలు సృష్టిచేయ
మహితబుద్ధిశాలి–మానవుండేరీతి
కళలు లేక బ్రతుకు గడపగలడు!!"

ఈ పద్యం ఉండేల కళాదృష్టికి కమనీయ సంకేతం.

అలాగే... ప్రేమయోగంలో...

"అటు రషియా నుండి అరుదెంచు పక్షులు
కొల్లేరు సరసులో కొలువుదీరు!
హిందూ సముద్రాన ఎగసిన మేఘంబు
చిరుపుంజిలోన వర్షించిపోవు!
బాగ్దాదు నగరాన బయలుదేరిన గాలి
ముంబాయి నగరిని ముద్దులాడు!
పసిఫిక్ పయోధిలో పడిలేచు కెరటముల్

కన్యాకుమారికి కాళ్ళుకడుగ
నరులు గీచిన హద్దుల సరకుగొనక
వసుధ యీ రీతి ఒక కుటుంబముగ మెలగ
ఓర్వలేని దురాత్ములీ యుర్వితలము
ముక్కలుగ జేసి భుజియింపబూనినారు!!"–

ఈ పద్యం మాలకొండారెడ్డి వసుధైక కుటుంబ దృక్పథాన్ని మన కళ్ళముందు కుదిలించి కుప్పబోస్తుంది–

చివరగా స్త్రీ యోగంలో స్త్రీ శక్తిని ఇలా ఆవిష్కరిస్తాడు.

"కాకతిసామ్రాజ్య ఘనతను చాటిన
రాణిరుద్రమ్మ శౌర్యమ్ము వినరా?
చిరకాల మాంగ్లేయ సీమనేలినయట్టి

క్వీన్ విక్టోరియా కీర్తి వినరొ?
మాతృభూమికి తొలి మహిళా ప్రధాని, శ్రీ
మతి ఇందిరాగాంధి ప్రతిభ గనరొ?
అంతరిక్షము నందు అసువులు బాసిన
కల్పనాచావ్ల త్యాగంబుగనరొ?
అన్నీ రంగాల పురుషులకన్న తాము
తీసిపోమని మహిళలు దీక్షబూని
జయపతాకము దశదిశాంచలములందు
ఎగురవేసిరి స్త్రీ శక్తి నెరుగుడనుచు!!"–

మాలకొండారెడ్డి ప్రతిభా పాటవాలకు చారిత్రక విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం తోడు కావడం వలన మానవగీతను మహాకావ్యాల సరసన, మాలకొండారెడ్డిని మహాకవుల సరసన నిలబెడుతుంది–

ఇహ... సాటికవిగా ఆయనకు నా ఆశీస్సు
భేషజమెరుగని జ్ఞానిగ...
కాషాయాంబరమునెపుడు కట్టని "ఋషిగా"
తోషితమతివై భాషా
యోషామణి సేవజేయుముందేలకవీ!!

డా॥ సి.నారాయణరెడ్డిగారి సుహృత్ స్పందన

తరుణ ప్రాయంలోనే పరిణత పద్యకావ్యాలను సృష్టించిన 'బాలసరస్వతి' సార్థక బిరుదులు మిత్రులు డా॥ ఉండేల మాలకొండారెడ్డిగారు. నాటి వివేకానందుడు, నేతాజీ లాంటి చారిత్రక కావ్యాలు మొదలుకొని ఈనాటి సందేశాత్మకమైన 'మానవగీత' వరకు డా॥ ఉండేల సృజనాత్మక ప్రతిభ శతదళాయమానంగా వికసిస్తూనే ఉన్నది.

భగవానుడైన కృష్ణుడిచేత ప్రవచింపబడిన గీత 'భగవద్గీత'. ఇది వేదవ్యాస విరచిత మహాభారతంలోని ఒక ఘట్టం. సగటు మానవుడు సమగ్రంగా రూపొందే వివిధ పార్శ్వాలను సమర్థంగా స్పృశించి చూపిన సార్వకాలీన సముదాత్త రచన 'శ్రీమద్ భగవద్గీత'.

భగవద్గీతలోని ప్రధానాంశం స్వధర్మాచరణ విముఖుడైన సవ్యసాచిని వాసుదేవుడు కర్మాచరణ సుముఖుణ్ణి చేయడమే. వస్తు విశ్లేషణం, భావోద్దీపనం, శిల్పపాటవం మేళవించుకున్న కవితా సాధకుడైన డా॥ ఉండేల భగవద్గీత ఒరవడిలో సమకాలీన చేతనను

సమన్వయింపచేస్తూ రూపొందించిన కావ్యమే ఈ "మానవగీత'. భగవద్గీతలో వున్నది శ్రీకృష్ణార్జునుల మధ్య సంవాదం. ఈ అభినవ గీతలో వున్నది ఉగ్రవాదికి, కవికి మధ్య జరిగిన సంభాషణ. ఆ గీత అష్టాదశయోగ విభక్తం. ఇది త్రయోదశ యోగ విరచితం. అక్కడ కత్తిదూసి విజయాన్ని సాధించమనే ప్రబోధముంటే, ఇక్కడ ఆయుధం విడిచి ప్రేమ ద్వారా సత్ఫలితాలు సాధించమనే సందేశముంది.

నేటి సమాజంలోని స్వార్థం, ధనం, అధికారం లాంటి ప్రలోభనీయ విషయాలను ఎత్తిచూపుతూ, ప్రేమ, వివేకం, కళలు లాంటి అనశ్వర సత్యాలు ఎలా ఆచరణీయాలో విశదీకరించారు డా॥ మాలకొండారెడ్డిగారు. పరస్పర విరుద్ధంగా తోచే అంశాలను అద్భుతంగా సమన్వయించి చూపారాయన. ఒకచోట ఆయన ఇలా అంటారు.

'మతము గ్రుడ్డిది శాస్త్రసంగతము లేక
మరియు శాస్త్రమ్ము కుంటిది మతము లేక'

పరమ శాస్త్రీయసరళిలో ప్రవచించిన ఈ కావ్యంలోని పద్యాల్లో ఎన్నెన్నో రసోక్తులుగా గుబాళించిన సూక్తులున్నాయి. మచ్చుకు:

'కాగినట్టి పాలు మీగడయై తేలు
పొంగినట్టి పాలు పొయ్యి పాలు'

ఈ పంక్తుల వెనక వేమన్న మందహాసం స్ఫురిస్తున్నది. ఇలా ఉదాహరిస్తూ పోతుంటే అహమహమికతో నా ముందుకొస్తున్నాయి అనేక పద్యపాదాలు.

పద్యబహుళంగా సాగిన ఈ కృతిలో అక్కడక్కడా లయాత్మక గేయ పంక్తులు చోటు చేసుకున్నాయి. చిననాడే పద్య శిల్పాన్ని కైవసం చేసుకున్న డా॥ఉండేల మాలకొండారెడ్డిగారు పరమవైజ్ఞానికంగా, ఉత్కృష్ట సందేశ బంధురంగా, కవితాశిల్ప కమనీయంగా ఈ 'మానవగీత'ను రచించినందుకు నా సుహృత్ స్పందన తెలియజేస్తూ హార్దికాభినందనలు అందజేస్తున్నాను.

***

1988లో బ్యాంకాకు నగరంలో జరిగిన అంతర్జాతీయ కవి సదస్సులో "ఫ్లోటింగ్ గ్రాసు" పేరుతో నా కవితల్ని కొన్ని ఇంగ్లీషులోకి అనువదించి ఆవిష్కరించడం జరిగింది.

సంక్షిప్తంగా ఒక పుటలో నా జీవిత చరిత్రలోని ముఖ్య సంఘటనల్ని జతపరుస్తున్నాను.

ఇన్ని విశేషాలు, జీవితానుభవాలు ఆవిష్కరించడానికి అవకాశం కల్పించిన ఆంధ్ర

సారస్వత పరిషత్తువారికి, ప్రధానంగా అధ్యక్షులు డా॥ సి.నారాయణరెడ్డిగారికి, కార్యదర్శి, ప్రియమిత్రులు, సాహితీవేత్త ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనాలు.

డా॥ ఉండేల మాలకొండారెడ్డి

జననం	:	23, ఆగస్టు, 1932
జన్మస్థలం	:	ఇనిమెర్ల, కనిగిరి తాలూకా, ప్రకాశం జిల్లా
విద్యాభ్యాసం	:	అల్లూరు, నెల్లూరు జిల్లా, నెల్లూరు, మద్రాసు, ఎడింబరో, గ్రేట్ బ్రిటన్
విద్య	:	బి.ఇ.(సివిల్), యం.యస్.సి.(స్ట్రక్చరల్ ఇంజనీరింగు), పిహెచ్.డి. (ఎడింబరో, గ్రేట్‌బ్రిటన్)
ఉద్యోగం	:	1. సివిల్ ఇంజనీరు, పి.డబ్ల్యు.డి. ఆంధ్రప్రదేశ్ (1955-57)
		2. అధ్యాపకులు, ఉస్మానియా ఇంజనీరింగు కళాశాల, హైదరాబాదు (1957-61)
		3. ఆచార్యులు, ప్రాంతీయ ఇంజనీరింగు కళాశాల, వరంగల్ (1961-1979)
		4. ప్రిన్సిపాలు, కార్యదర్శి, చైతన్యభారతి ఇంజనీరింగు కళాశాల, హైదరాబాదు(1979-90)
		5. కార్యదర్శి, అంతర్జాతీయ వైద్య మహానగరం(మెడిసిటి) షామిర్‌పేట, మేడ్చల్ మండలం, రంగారెడ్డి జిల్లా (1987)
		6. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబరు, జె.ఎన్.టి.యూనివర్సిటీ.
		7. ఛైర్మన్, చైతన్యభారతి ఎడ్యుకేషనల్ సొసైటీ.
తెలుగు కావ్యాలు	:	1. నేతాజీ (1946), 2. వివేకానందుడు (1953), 3. కాంతిచక్రాలు (1959), 4. మొగలిరేకులు(1981), 5. ఒడిసెల రాళ్లు (1986), 6. వలపించే ఉత్తరం (1992), 7.సత్యం శివం సుందరం (1996), మానవగీత (2003)

ఇంగ్లీషు కావ్యాలు : 1. Gloting Grass(1988) Presented at 10th World Congress of Poets at Bangkok, 2. Special Number International Poets Academy, Madras (1992)

పురస్కారాలు : 1. బాలసరస్వతి(1951), కవికిరీటి(1986), మైకేల్ మధుసూదన్ అవార్డు(1990), దాశరథి అవార్డు(1990), సృజనాత్మక రచన అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం (1991), విద్యాభూషణ్- అఖిల భారత పాత్రికేయమండలిచే(2004), ఇందిరా ప్రియదర్శిని అవార్డు(2003), అత్యుత్తమ సేవకు



వేముగంటి నరసింహాచార్యులు

సీ॥ సాహిత్యవాణిజ్య సంపన్నమగు సిద్ది
పేటపురిన్ ప్రభవించినాను
మహితాత్ములైన రామక్కరంగాచార్య
దంపతులకును పుత్రకుడనైతి
సంస్కృతాంధ్రాది భాషలనభ్యసించితి
పట్టభద్రుడనైతి ప్రౌఢిమీర
సత్కారములు, పురస్కారముల్ పొందితి

గీ॥ ఏబదేడుల సాహితీ కృషి ఫలముగా
కృతులు గూర్చితి వివిధ ప్రక్రియలయందు
ముప్పదికిపై, రసజ్ఞుల మెప్పుగంటి
వేముగంటి నృసింహకవిప్రవరుడ.

అప్పుడే బాల్యయవనిక అల్లనల్లన జారుతున్నది. యవ్వనపు తెర మెల్లమెల్లన లేస్తున్నది. అలాంటి సంధి సమయంలో ఏదో ఒక పదబంధం నా యెదలో రూపుగట్టింది. అది పద్యమని తరువాత తెలిసింది అయితే పద్యానికి ఛందోనిబంధన ఉంటుందని అప్పుడు నాకు తెలియదు. తరువాత పద్యం రాసే లక్షణాలను తెలుసుకున్నాను.

కొన్ని కవితా రచనలు
"భారతంబును హరిహర బ్రహ్మమునకు
అర్పణముచేసె, తిక్కనమనీషి,"

అంటూ కవిబ్రహ్మతిక్కనకు
కైమోడ్పులందించాను.
"అప్పుడెప్పుడొ వేరైన యావదాంధ్ర
లోకమీనాడు ఏకపతాకనీడ
చేరుభాగ్యము మరల వచ్చినదటంచు"

తెలుగు కోయిలగా తీయగా గానం చేశాను.

"మాతృభాషపై నున్న ప్రేమంబుతోడ
అన్యభాషావిమోహ మనాదరించి
విజయులైనట్టి ఆంధ్ర విద్యార్థులార!"

అని ఆంధ్ర సారస్వత పరీక్షా విజయులైన విద్యార్థులను అభినందించాను.

కవితలు

నా కవితా ప్రస్థానంలో కవితాంజలి ఘటించాను. నవమాలిక కూర్చాను. మణికింకిణి మ్రోగించాను. వీరపూజ చేశాను. జీవన స్వరాలు పలికాను. కవితా కాహళి ఊదాను. కాంతి వైజయంతికలు ఎగురవేశాను. భావలహరి ప్రవహింపజేశాను.

సీ॥ శ్రీశైల శిఖరసంస్థిత మల్లికార్జున
కరుణాకటాక్షవీక్షలు విరిసి
కాళేశ్వరావాస కాళీశమౌళి
చంద్రకళాతుషారములు కురిసి
విదిత దాక్షారామ భీమేశ్వర కపర్ద
గళితగంగా తరంగములు మొరసి
సకల దిగంత ప్రచార త్రిలింగ
సందీప్తాభిధాన ప్రతిష్ఠ మెఱసి

గీ॥ తెలుగుదేశపు చిక్కని వెలుగురేక
లఖిల విశ్వాంతరాళము నావరింప
తెలుగురాయని పాలన విలసనమ్ము
పుడమికంతకు ముత్యాల గొడుగుబట్టె

గీ॥ తెలుగువెన్నుండు దైవమూర్తిని వహించి
అఖిల భూజన పూజనలందుకొనియె॥

అంటూ ఆంధ్రవిష్ణువును ఆరాధించాను.

సిద్దిపేటలో "ఉమామహేశ్వరాంధ్ర భాషా నిలయము" అనే పేరుతో ఒక గ్రంథాలయం ఉండేది. చిన్నతనంలో నేను ప్రతిదినం గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలూ, పత్రికలూ చదువుతుండేవాణ్ణి. ఆ గ్రంథాలయంలో ఆంధ్ర ప్రచారిణీ లిమిటెడ్‌వారి గ్రంథాలు కొన్ని ఉండేవి. అవి చాలావరకు చారిత్రక నవలలు. ఛత్రసాలుడు, ధర్మాంగదుడు మొదలగు నవలలు అవి. ఆ నవలలను చదివేవాడను. ఆ పుస్తకాలలోని భాష చక్కని చిక్కని గ్రాంథికం. దానివల్ల నాకు కొంత భాషాజ్ఞానం అలవడింది. గ్రంథాలయానికి ఆంధ్ర దినపత్రిక, గోలకొండ దినపత్రిక, నవ్వులరాణి, నవ్వులగని, వినోదిని మొదలైన మాసపత్రికలు వస్తుండేవి. అవి చదువుతూ కాసంత జ్ఞానం సంపాదించుకున్నాను. ఈలాంటి పుస్తక, పత్రికాపఠనమే నాలో తెలియకుండనే సాహిత్య బీజం నాటింది. ఆ తరువాత వరంగల్‌లోని విశ్వేశ్వర సంస్కృత పాఠశాలలో సంస్కృతాభ్యాసంవల్లా, మా యింటిలో మా నాన్నగారు సేకరించిన భారతం, భాగవతం, మను చరిత్రాది కావ్యపఠనం వల్లా ఆంధ్రభాషా జ్ఞానం ఏర్పడింది.

"ఆనాడు కుతుబు సు
ల్తాను నిలిపిన పురము
ఆంధ్రావళికి అంద
మగు రాజధానియౌ
భాగ్యనగరములోన
వసియించుపౌరులకు
పంచదారలను బోలు
మంచినీ రొసగెదవు
ఎంత చల్లని దానవే నీవు
మంజీర! ఎంత
తీయనిదానవే"

అని మంజీరా నదిని గూర్చి మధురంగా పాడుకున్నాను.

"అరవదినాలుగు కళలకు
సురవన కల్పలతవగుచు శోభిలు నీకై
సురభిల వాక్సుమమాలను
విరచించితి వాసరేశి! విద్యారాశీ!"

అంటూ వాసర సరస్వతికి వందనాలు అర్పించాను.

పద్య కవితామృతవర్షంలో తడిసి మురిశాను.

"శ్రీ సుమాళించు
మంజీరా నదీమణీ!
పీయూష సదృశ
పానీయధృత సారణీ!
తెలుగుబిడ్డను వలచి
ఏ కొండ యొడినుండి
ఏ బండముడినుండి
జారివచ్చితివొ?
జాల్వారివచ్చితివో?
జీబుకానలు దాటి
చిలుపకోనలు ప్రాకి
ఎండిపోయిన భూమి
గుండెనాడులు తాకి
పసిమిపచ్చికల పని
పాపవై పారాడి
చిన్నారిపొన్నారి
కన్నెవాగులగూడి
వచ్చితివి మంజీర!
తెచ్చితివి మధుధార!"

అక్కడినుండి పద్యకవిత వ్రాయడం ప్రారంభించాను. 1946లో మదనమోహన్ మాళవ్యా స్వర్గస్థులైనప్పుడు "బాష్పాంజలి" అనే పేరుతో పద్యాలు వ్రాసి, అప్పుడు హైద్రాబాదు నుండి వెలువడుతున్న తెలుగు మీజాన్ పత్రికకు పంపాను. ఆ పద్యాలు ఆ పత్రికలో ప్రచురించబడినవి. అప్పుడు తెలుగు మీజాన్ పత్రికకు అడవి బాపిరాజుగారు సంపాదకులుగా ఉండిరి. అందులో వారి గోనగన్నారెడ్డి సీరియల్‌గా వస్తూ ఉండేది.

ఆ కాలంలో నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రంథాలయాల ద్వారా పరోక్ష పద్ధతిలో రాజకీయోద్యమం సాగుతూ ఉండేది. ఆలాంటి ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేను మరికొందరు మిత్రులం కలిసి సిద్ధిపేటలో "స్వతంత్రాంధ్ర గ్రంథాలయం" అనే లైబ్రరిని నెలకొల్పి నడిపించాము. రహస్య సమావేశాల ద్వారా రాజకీయం సాగించాము. ఆ సమయంలో నేను తెలుగువారిని మేలుకొలుపుతు 'ప్రబోధము' అన్న చిన్న పద్యకావ్యం వ్రాశాను. అది 1947లో ముద్రించబడినది.

1948లో గాంధీ మహాత్ముడు ఒక వ్యక్తి తుపాకి గుండ్లకు గురియై పరమపదించడం జరిగింది. ఆ మహాత్ముని మరణానికి విషాదభరితుడనైన నేను "అమరజీవి బాపూజి" అనే పద్యకృతి సంతరించాను. దానికి అభిప్రాయం రాయించాలని మాడమాటి హనుమంతరావుగారి వద్దకు వెళ్ళి మనవి చేశాను. వారు కావ్యంలోని కొన్ని పద్యాలను విని కంటనీరు పెట్టారు. ఆకృతి 48లో ముద్రణాకృతి దాల్చింది. దాస్యవిముక్తమై తెలంగాణా తేరుకుంటున్నది. అట్టి సమయంలో 1949లో ఫిబ్రవరి 4,5,6 తేదీలలో మెదక్‌జిల్లా తుప్రాన్లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఐదవ మహాసభ జరిగింది. బాలకవినైన నేను ఉత్సాహంగా ఆ సభలకు వెళ్లాను. ఆ సభలకు సుప్రసిద్ధ పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, మునిమాణిక్యం నరసింహారావుగారు ఆంధ్రప్రాంతం నుండి విచ్చేశారు. తెలంగాణ నుండి కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు, కేశవపంతుల నరసింహశాస్త్రిగారు, వానమామలై సోదరులు జగన్నాథాచార్యులు, వరదాచార్యులుగారలు ఇంకా ఎందరో కవిపండితులు వచ్చి సభాసదులకు కనులపండువు, వీనులవిందు చేశారు. వరదాచార్యులుగారి అధ్యక్షతన కవిసమ్మేళనం జరిగింది. ఆ సమ్మేళనంలో నేను కూడా కవిత చదివాను. ఆ సమయంలో ఒక ముఖ్యమైన ఘట్టం జరిగింది. అది నేటికీ కన్నులకు కట్టినట్లుగా ఉంది. అదేమిటంటే నిజాం నిరంకుశ ప్రభుత్వంపై అగ్నిధార కురిపించిన దాశరథి వాడిగా వేడిగా కవితలు వినిపించారు. ఆ కవితలకు స్పందించి జూకారెడ్డి అనే ఒక వ్యక్తి ఆనందంపట్టజాలక దాశరథిని అమాంతం పైకి లేవనెత్తి అభినందించాడు. ఓహో ఏమి అపూర్వఘట్టం!

ఆనాటినుండి నాకు ఆంధ్ర సారస్వత పరిషత్తుతో సంబంధం ఏర్పడింది. సిద్దిపేటలో పరిషత్తు శాఖ ఏర్పాటు చేసి పరీక్షలు నడిపించాం. కొందరు అభ్యర్థులకు నేను పాఠాలు కూడా చెప్పడం జరిగింది. ఆ పరీక్షలలో ఉత్తీర్ణులైనవారు ఎందరో ప్రభుత్వోద్యోగాలు సంపాదించికొని జీవితంలో స్థిరపడినారు. నేను కూడా విశారద పరీక్షలో ఉత్తీర్ణుడనై తెలుగు పండితునిగా ఉద్యోగం పొందాను. పరిషత్తు నిరక్షరాస్యతా తిమిరం నిండుకున్న తెలంగాణా ప్రజల బ్రతుకుల్లో అక్షరాస్యతా దీపం వెలిగించడమే కాక ఉద్యోగ భిక్ష కూడా పెట్టింది.

1953 జనవరి 11 నుండి 14వ తేదీ వరకు అలంపూరులో అప్పటి ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణ పండితులు ప్రారంభించిన సారస్వత పరిషత్తు ఏడవ మహాసభలు వైభవంగా జరిగినవి. నేను ఆ సభలలో పాల్గొని ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల నుండి విచ్చేసిన అనేక పండితకవులను దర్శించడం వారి ఉపన్యాసాలు విని ఆనందించడం జరిగింది. ఆ సభల సందర్భంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో నేను కవిత చదివాను.

సాహిత్యరీత్యా కొంత వెనుకబడిన తెలంగాణా ప్రాంతంలో సాహితీ సరస్వతీ ప్రభావాన్ని ప్రసరింపజేయాలనే ఉద్దేశంతో తెలంగాణా రచయితల సంఘం ఏర్పాటు చేయబడినది. 1953 ప్రాంతం అనుకుంటాను హైద్రాబాదులోని ప్రతాపగిర్జికోఠీ ఆవరణలో రచయితల సంఘానికి ప్రారంభోత్సవం జరిగింది. ఆనాటి ముఖ్యమంత్రి డా॥ బూర్గుల రామకృష్ణారావుగారు సభను ప్రారంభించారు. దాశరథిగారు అధ్యక్షత వహించారు. అప్పుడే ఆరోగ్యాన్ని పొందిన అభినవ పోతన వానమామలై వరదాచార్యులుగారు సభలకు వచ్చి అందరినీ సంతోషింపజేశారు. ఆ సభలలో ప్రముఖమైన అంశం పుట్టపర్తి నారాయణాచార్యులుగారి శివతాండవ గేయగానం. ఆ గానం విని సభ యావత్తూ ఆనందముగ్ధమైంది. కాళోజి అధ్యక్షతన జరిగిన కవిసమ్మేళనం నాలాంటి యువ కవులకు గొప్ప ఉత్సాహం కలిగించింది. తెలంగాణా రచయితల సంఘంలో ప్రముఖపాత్ర వహించిన కాళోజీ, బి.రామరాజు, దాశరథి, సి.నారాయణరెడ్డిగారలు తెలంగాణా ప్రాంతం మారుమూలలలో గూడా సాహిత్యసభలు జరిపి తెలంగాణమంతటా సాహిత్యసౌరభాలను వెదజల్లి సాహితీ చైతన్యాన్ని కలిగించారు. తరువాత రచయితల సంఘానికి దాశరథి అధ్యక్షులుగా, నారాయణరెడ్డి కార్యదర్శిగా ఉండి తెలంగాణాలో సాహిత్యవ్యాప్తికి ఎనలేని కృషిచేశారు. ఎందరో యువకవులూ, రచయితలూ రచనాకృషిని సాగిస్తూ తెలంగాణా ప్రాంతాన్ని ఉజ్జ్వల సాహితీక్షేత్రంగా రూపుదిద్దారు.

కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో సి.నారాయణరెడ్డిగారి ఆధ్వర్యమున జరిగిన రచయితల సభలలో నేను పాల్గొనడం జరిగింది. ఆ సభలకు డా॥ మర్రి చెన్నారెడ్డిగారు ముఖ్యఅతిథిగా విచ్చేసి రచయితల సంఘానికి ఎనలేని ఉత్సాహాన్ని కలిగించారు. ఆ సభల విశేషాలు ఈనాటికీ నా హృదయంలో చెరిగిపోని ముద్రవేశాయి. తరువాత హైద్రాబాదు ఎగ్జిబిషన్ గ్రౌండులో తెలంగాణా రచయితల సభలు మహావైభవంగా జరిగాయి. ఆ సభలకు అప్పటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు ముఖ్యఅతిథిగా విచ్చేసి సభలకు శోభను చేకూర్చారు. ప్రముఖ కథారచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వంటి ప్రసిద్ధ రచయితలూ, కవులూ ఆ సభలలో పాల్గొన్నారు. నేను ఒక సాహితీగోష్ఠికి సమావేశకర్తగా ఉండినాను. ఆ సభలలో తెలుగు పలుకు వెలది పాదాల మణిమంజీరాల మధురనాదం వీనులకు విందు చేసింది.

నూటికి నూరుపాళ్ళు యథార్థం చెప్పాలంటే ఆంధ్ర సారస్వత పరిషత్తు సారస్వతదీపాలు వెలిగించీ, తెలంగాణా రచయితల సంఘం సాహిత్య చైతన్యం కలిగించీ తెలంగాణా ప్రాంతాన్ని నూతన కాంతిమంతం చేశాయి.

ప్రముఖ సాహిత్య పత్రిక 'భారతి'లో నా కవిత ప్రచురించబడాలని మిక్కిలి

ఉబలాటంగా ఉండేది. అప్పటికి అనగా 1953 ప్రాంతంలో 'భారతి'లో తెలంగాణా నుండి దాశరథి కవిత మాత్రమే ప్రచురించబడినదని జ్ఞాపకం. నేను 1952 నుండి 'భారతి'కి రెండు మూడుసార్లు కవిత పంపించాను. చివరకు 1953 అక్టోబరులో 'భారతి'లో నా 'తొలకరి' అనే పద్యకవిత ప్రచురించబడినది. ఆ కవితను చూచి నేను ఎంతో సంతోషించాను. అప్పటినుండి 'భారతి'లో నా కవితలు అనేకం అచ్చైనవి. ఆ తరువాత ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలలోనూ, దిన వారపత్రికలలోనూ నా కవితలు, వ్యాసాలు ప్రచురితాలయ్యాయి. 'భారతి'లో వచ్చిన నా తొలికవిత 'తొలకరి'లోని ఒక చిన్న పద్యం.

> **"జాలిగల మానవుడు పేదరాలిచేతి**
> **బిచ్చపుంగిన్నెలో పడవేసిపోవు**
> **నట్టి చిల్లరడబ్బులయట్లు చిన్న**
> **చిన్న చినుకులు టపటప క్షితినిరాలె"**

1953 నుండి దక్షిణ భారత హిందీ ప్రచార సభ హైద్రాబాదు పక్షాన వెలువడే 'స్రవంతి' పత్రికతో నాకు సంబంధం ఏర్పడింది. 1986లో వనపర్తిలో ఉయ్యాల అవార్డు, కోరుట్లలో వానమామలై స్మారక పురస్కారం, 1987 డిశంబరులో మచిలీపట్నంలో త్రిపురసుందర ప్రతిష్ఠాన్‌వారి పురస్కారం, 1988 జనవరిలో కడపలో గడియారం వేంకటశేషశాస్త్రిగారి స్మారక పురస్కారం లభించి, నాకు కవితా సరస్వతీ సేవాభావాన్ని ఇతోధికం చేశాయి. 1989లో ఆచార్య సి.నారాయణరెడ్డిగారు ఉపాధ్యక్షులుగా ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం వారి సత్కారం నాలో గాఢముద్ర వేసిన ఒక మధురానుభూతి. పుట్టపర్తి నారాయణాచార్యులు గారు, డా॥ బి.రామరాజుగారు మొదలైన దిగ్గజాలవంటి పండిత కవులతో పాటు తెలుగు విశ్వవిద్యాలయం నన్ను సత్కరించడం ఒక అపూర్వఘట్టంగా భావిస్తున్నాను. మరొక మరువలేని మధురానుభూతి 1983లో కరీంనగర్‌లో జరిగిన నన్నయ జయంతి సందర్భంలో ప్రత్యేక సన్మానం.

నా జీవన సాహితీ నందనవనంలో ఒక పారిజాతపుష్పంగా వికసించిన ఒక మహనీయమైన ఘట్టాన్ని మనవి చేస్తున్నాను. అది 1966 సంవత్సరంలో లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానిగా ఉన్నప్పుడు భారతదేశానికీ పాకిస్థానుకూ యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో భారతీయ సైనికులు ఘనవిజయం సాధించారు. ఆ సైనికులను ప్రస్తుతిస్తూ నేను 'వీరపూజ' అనే పద్యకృతి వ్రాశాను. ఆ కావ్యాన్ని అప్పుడు రాష్ట్రపతిగా ఉన్న డా॥ రాధాకృష్ణ పండితులకు పంపాను. దానికి వారు సమాధానమిస్తూ Some of the poems are inspiring అని ప్రశంసించారు. అంతటి మహానుభావుడు నా కావ్యం చదివారు కదా అని మిక్కిలి ఆనందించాను. పులకించాను.

చివరకు ఒక మధుర మనోజ్ఞ సందర్భాన్ని మనవి చేస్తున్నాను. 1996 జనవరి 29 తేదిన నా జన్మస్థానమైన సిద్ధిపేటలో నా సాహితీస్వర్ణోత్సవం పురప్రముఖులు ఘనంగా జరిపారు. ఆ ఉత్సవానికి ఆచార్య సి.నారాయణరెడ్డిగారు ముఖ్య అతిథిగా విచ్చేసి అభినందించారు. సభకు స్థానిక శాసనభ్యులు (నేటి రవాణాశాఖామాత్యులు) మాన్యశ్రీ కె.చంద్రశేఖరరావుగారు అధ్యక్షత వహించారు. ఆనాడు నాకు కనకాభిషేకం జరిగింది. ఆ మహోత్సవంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు, డా॥ జె.బాపురెడ్డిగారు, డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులుగారు, ఉత్పల సత్యనారాయణాచార్యులుగారు పాల్గొని అభినందనలు తెలిపారు.

ఈ విధంగా నా సాహితీ జీవనయాత్రలో ఎన్నో స్వర్ణసందర్భాలూ, మధురానుభవాలు మణిదీపాలై నన్ను ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించాయి. దేవులపల్లి రామానుజరావు, నారాయణరెడ్డి గారల వంటి ఎందరో విజ్ఞులు రసజ్ఞులూ అయిన మహనీయ వ్యక్తులు నాపై ఆదరాభిమానాలు చూపించి నా కృతజ్ఞతకు పాత్రులైనారు.

నా 'సాహిత్యము–జీవితము' అంశంపై శ్రీమతి సిహెచ్.పద్మ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి.పట్టా పొందారు. పి.యన్.శ్యామసుందరరావు అనే యువకుడు నా 'సాహిత్య పరిశీలనం' అనే అంశాన్ని గూర్చి ఎం.ఫిల్.చేశాడు.

ఉస్మానియా, కాకతీయ, శ్రీ వేంకటేశ్వర, గుల్బర్గా విశ్వవిద్యాలయాలు నా కావ్యాలను పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించాయి. నా కవితలు హిందీ, గుజరాతీ భాషలలోనికి అనువదింపబడినాయి.

1954 నుండి నా కవితలూ, ప్రసంగాలు ఆకాశవాణిలో నేటివరకూ ప్రసారమౌతూ ఉన్నాయి.



డా॥ వాసిరెడ్డి సీతాదేవి

గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామంలో ఒక మధ్యతరగతి వ్యావసాయిక కుటుంబంలో పుట్టాను. ఆడపిల్లల్ని చదివించే కాలం కాదు. ఐదో తరగతివరకే చదివాను. చిన్నతనంలో అందరిలాగే ఆటలతోనే కాలక్షేపం చేశాను. అయితే ఈ ఆటల రోజుల్లోనే నాలో ప్రశ్నలు బయలుదేరాయి.

ఆడపిల్లలంతా బొమ్మలాటలాడుకునేవాళ్లు. ఎక్కువగా అమ్మా నాన్న ఆటలాడేవాళ్లు. నన్ను అమ్మగా ఉండమంటే ఒప్పుకునేదాన్నికాను, నాన్నగా అయితేనే ఉంటాననేదాన్ని. మగపిల్లలు బచ్చాలాటలు, బిళ్లంగోడు, కోతికొమ్మచ్చులాడేవాళ్లు. అక్కడికి పోయి ఆడేదాన్ని. ఎందుకూ? వీళ్లు ఒప్పుకొనేవాళ్లుకాదు గనక. పొద్దున్నే లేచి ఆటలకు పోయేదాన్ని. ఒకసారి మా మామయ్య తెనాలిలో ఉండేవాడు వచ్చి చూసి మొట్టికాయవేసి 'ఆడముండవు, మొగపిల్లలతో బచ్చాలాడుతున్నావేమిటి?' అని చివాట్లు పెట్టాడు. అయితే ఒక్క విషయం చెప్పాలి. గొప్ప విషయం. మా అమ్మ మాత్రం నన్నెపుడూ వెనకేసుకొనివచ్చేది. ఎప్పుడూ ఆడా మగా తేడా చూపించలేదు. 'ఏమయిందిరా? ఏమిటి? మొగపిల్లల్తో ఆడుకుంటే తప్పేమిటి?' అనేది. ఆయన తిట్టి నోరు మూయించేవాడు. ఏం చేద్దామనుకుంటున్నావు, ఆడపిల్ల ఇలా బరితెగించిపోతే ఎలాగ? అని. చదువుకోవడానికి అవకాశం లేకపోయినప్పటి గూడా ఈ వ్యత్యాసాలు చూస్తున్నప్పుడు నాలో ఏవేవో నాకు తెలియని తిరుగుబాటుభావాలు కలిగేవి. ఈ సమాజం మీద తిరగబడాలి. దీని మీద తిరగబడాలి. దానిమీద తిరగబడాలి ఇలా. జీవితమంటే కేవలం ఇదేనా. 12, 13 ఏళ్లు వచ్చేటప్పటికి చాలా విషయాలమీద సందేహాలేర్పడ్డాయి. బంధువుల్లో చావులు వగయిరా. భయం వేసేది. రాత్రి పడుకొని ఆలోచించేటప్పుడు భయంతో ఉలిక్కిపడేదాన్ని. మా అమ్మ లేపి కూర్చోపెట్టి భయం

పోగొట్టేది. ఎట్లా బతుకుతుందో పిచ్చిది అనేది. ఏంచేయాలో తోచదు. ఎట్లాగో ఉండేది. రకరకాల విషయాలు చెప్పుకుంటూ ఉండేవాళ్లు. డబ్బు పోతుందని చెప్పి ఎవరికో ముసలివాళ్లకిచ్చి పెళ్లి చేయడం వంటివి.

ఎవరు చెప్పినా పల్లెటూళ్లో జీవితం ఒక్కటేననిపించేది. కేవలం పెళ్లిళ్లు చేసుకోవడం పిల్లల్ని కనడం. ఆ పిల్లలకు పిల్లలు, ఆ పిల్లలకు పిల్లలు అలా అలా. ఇంతేనా బతుకు. నాకు తెలిసిన అందరికీ ఇదే జీవితం. ఏమీ తేడా లేదు. నాకూ వీళ్లకీ ఏమీ తేడా లేదా. ఇలాగే బ్రతకాల్సిందేనా? ఇంకో జీవితాన్ని వెతుక్కోకూడదా?

నా మీద వ్యక్తుల ప్రభావం గాని, సంఘటనల ప్రభావం ఏమైనా ఉందా అంటే పెద్దగా చెప్పుకోవడానికేమీ లేదు. సాహిత్యపరంగా చూస్తే ప్రేంచంద్ ప్రభావం కొంత ఉండవచ్చు. వ్యక్తులుగా నన్నెవరూ ప్రభావితం చేయలేదు. ఏమీ చెప్పుకోదగ్గ ప్రభావాలు లేవనే నేనంటాను. ఒక్క ప్రభావం మాత్రం ఉంది. జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. మా చేబ్రోలులో టూరింగ్ టాకీసులో భక్త వేమన చిత్రం చూశాను. చిత్రం చూసింతర్వాత దాదాపు 20 రోజుల పాటు నేనెలా ఉన్నానో. నేను నేనుకాదు. ఏదో అయిపోయానని డాక్టరుదగ్గరికే తీసుకుపోయారు. ఆ చిత్రంలో ఒక సంఘటన ఉంది. వేమన సన్యాసి కదా. ఆయన సన్యసించకముందే ఆ ఊళ్లో ఎవరో ఒకరు చనిపోతారు. వేమన శ్మశానంలో ఒక పుర్రె తీసుకొని ఇదేనా జీవితసారం అని ఒక పాట పాడతాడు. అప్పటికే జీవితం, చావు, అది చేయాలి ఇది చేయాలి అని పిచ్చి పిచ్చి ఆలోచనలొస్తున్నాయి నాకు. ఇదేనా జీవితసారం అనే ఈ పాట నన్ను ఆలోచింపజేసింది. ఆ వేమన, ఆ శ్మశానం, ఆ పాట. ఇది శాశ్వతంగా నా మీద ఒక ముద్ర వేసింది.

బహుశా ఇప్పటికీ అనుకుంటూ ఉంటాను. ఆ ప్రశ్న ఎప్పుడూ వెన్నాడుతూనే ఉంది. అంతకుముందే జీవితమంటే ఉన్న సందేహాలు మరింత ఆలోచనల్ని రేకెత్తించాయి. జీవితమంటే తెలుసుకోవాలి. ఎలా? ఎవరో పెద్దల్ని అడగాలి. సన్యాసుల్నో, పెద్ద మనుషుల్నో అడిగితే తెలుస్తుందా. ఏమో. పెద్ద పెద్ద వేదాంతులు కూడా చివరికి ఏం తెలుసుకున్నారో. ఏదో తెలుసుకోవాలి. నిరంతర అన్వేషణ. ఇప్పటిదాకా ఈ అన్వేషణలో ఏమన్నా తెలుసుకున్నానా అంటే ఏమీ తెలుసుకోలేకపోయాననే అనుకుంటున్నా. ఏమీ తెలుసుకోలేదనే, అంధకారంలోనే ఉన్నాననే అనుకుంటున్నాను.

ఇకపోతే ఆ ప్రశ్నలోనుంచే నా జీవితం ప్రారంభమయింది. నలుగురు నడిచిన బాటలో నడపకూడదు. ప్రవాహానికి అనుకూలంగా అందరూ ఈదుతారు. నేనుమాత్రం ప్రవాహానికి ఎదురుగానే ఈదాలనుకున్నాను. చాలామందికి ఆశ్చర్యంగా ఉంటుంది, పెళ్లి

చేసుకోకుండా ఉండడం. ఇక్కడ మేధావులంతా ఉన్నారు. నా అనుభవమేమిటంటే ఒక ఆడపిల్లగాని, మగపిల్లవాడు గాని పాతికేళ్లు వచ్చేదాకా పెళ్లి గురించి గాని ఆడా మగా గురించి కాని సెక్సు గురించి కాని ఆలోచించకుండా మరో ఆలోచనల్లో జీవిస్తూ, ఒంటరితనాన్ని మరచిపోయి ఏదో ఒక పని చేస్తూ, నిమగ్నమై ఉంటూ ఉంటే పెళ్లికి సంబంధించిన భావాలు రావు. అలా రాకపోవటంలో ఆశ్చర్యమేమీ లేదు. కాకపోతే నలుగురూ ఏదో ఒకటి అనుకుంటూంటారు. అనుకుంటే అనుకోనివ్వండి, నేను నవ్వుకుంటాను. నా మార్గంలో నేను నడుస్తాను. అందరూ నడిచే మార్గంలో నడవను. శ్రీశ్రీ చెప్పినట్లు పదిమంది నడిచే మార్గంలో నడిచే స్వభావం నాలో లేదు. నాదైన మార్గాన్ని నేను ఏర్పరచుకొని ముందుకు సాగాను.

ఏమీ చదువుకోకుండా అయిదో తరగతి మాత్రమే చదువుకొని కొంచె హిందీ నేర్చుకొని డిక్షనరీ పెట్టుకొని చదివి విశారద పరీక్ష రాసి– మా వూళ్లో హిందీ టీచరు వొకాయన సహాయం చేశాడు. మద్రాసు వెళ్లిపోవడం. మద్రాసులో 35 రూ॥ జీతానికి ఉద్యోగంలో చేరిపోయాను. మా ఇంటి పేరు వాసిరెడ్డి అని వినగానే చాలా ధనవంతులమని అనుకుంటారు. ఒకప్పుడు ధనవంతులమే. కాని మా వరకు వచ్చేటప్పటికి అంతా పోయింది. పేదవాళ్లమయ్యాం. పేదవాళ్లమని చెప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడాల్సిన అవసరంలేదు. బీదతనం పాపమేమీ కాదు. అప్పటికి నాలుగయిదెకరాలుండేదేమో. మద్రాసులో మార్వాడీ స్కూల్లో ఉద్యోగం ఇచ్చినాయన 35 రూ॥ల ఉద్యోగం ఇచ్చినందుకు మీ వాళ్లు నన్ను తంతారేమో అని ఉత్తరం రాశారు. పర్వాలేదులెండి అని అప్పుడు నేను మద్రాసు చేరాను అంతవరకూ మా పల్లెటూరు తప్ప దగ్గర్లో ఉన్న గుంటూరు, విజయవాడ కూడ చూళ్లేదు నేను. మద్రాసు సెంట్రల్ స్టేషన్లో దిగాను. పదిహేడో ఏడు నడుస్తోందప్పుడు నాకు. చాలా సన్నగా బక్కగా ఉండేదాన్ని. పన్నెండో, పదమూడో అన్నట్లుగా కనిపించేదాన్ని. సెంట్రల్‌స్టేషన్‌లో అంత పెద్ద స్టేషన్ చూడగానే ఒక్కసారిగా ఏదో కొత్త ప్రపంచం చూసినట్లుగా అయిపోయింది నాకు. ఒక భయం. దుఃఖం కూడా వచ్చేసింది. స్టేషనే ఇట్లా ఉంటే ఊరు ఎంత పెద్దగా ఉంటుందో, ఈ ఊళ్లో మనుషులెలా ఉంటారో. సూట్లు వేసుకున్నవాళ్లు, లుంగీలు కట్టుకున్నవాళ్లు ఇలా. అక్కడే ఏడ్చేశాను కూడా.

ఇక స్కూలుకు వెళ్లాను. మార్వాడీ పాఠశాల. ఆ స్కూలు పేరేమిటంటే సనాతన ధర్మ కన్యాపాఠశాల. నాకెప్పుడూ కూడా ఎవరూ నాస్తికత్వం బోధించలేదు, హేతువాదం బోధించలేదు. కాని మొదటినుంచీ మా యింట్లో మా అమ్మ కూడా దేవుణ్ణి గురించి చెప్పలేదు. ఎప్పుడూ మొక్కలేదు. ఎందుకంటే ఈ ప్రశ్నలే. ఈ ప్రశ్నలే నన్నడుగుతున్నాయి. ఏమిటి ఇదంతా. ఇలా ఎదుకుంది వగయిరా. సరే ఈ సనాతన ధర్మ కన్యాపాఠశాలకు

వెళ్లాను. ఒక టీచరు ప్రిన్సిపాల్ దగ్గరికి తీసికెళ్లారు. ఆయన నన్ను చూసినవ్వారు. నువ్వు ఇక్కడ ఎక్కువ రోజులు ఉండవు. నీకు ఉద్యోగం ఇవ్వనన్నాడు. బయటికి వచ్చాను. ఏడ్చేశాను. ఏంచేయాలి. నిశ్చయం చేసుకొని వచ్చాను. మళ్లీ ఎక్కడికి వెళ్లను. ఆ బంధాలన్నీ తెంచుకొని వచ్చేశా. ఎక్కడికి వెళ్లేది. మళ్లీ ఆ టీచరు ఓదార్చి కమిటీ చైర్మన్ జగన్నాథశర్మగారని ఆయన దగ్గరికి తీసికెళ్లారు. ఆయన ఉద్యోగం ఇచ్చాడు. తర్వాత ఉద్యోగాలు మారుతూ మారుతూ హిందీ ప్రచారసభలో వైస్ ప్రిన్సిపాల్ ఉద్యోగం కోసం వెళ్లాను. తర్వాత హిందీ ప్రచార సభలో ఆ వైస్ ప్రిన్సిపాల్ ఉద్యోగం పోయింది. అది ఎలా పోయింది నా సాహిత్యం గురించి చెప్పేటప్పుడు చెప్తాను.

చాలామంది మహానుభావులు గొప్ప గొప్ప వాళ్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. వారినుంచి జీవితంలో ఎంతో నేర్చుకున్నాను. 1958లో అనుకుంటాను హైదరాబాదు వచ్చినప్పుడు ఓల్డ్ ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్‌లో నారాయణరెడ్డిగారిని కలుసుకున్నాను. అంతకుముందు మద్రాసులో దాశరథి, నారాయణరెడ్డిగార్లను చూశాను. వాళ్లు వచ్చినప్పుడు అక్కడ అందర్నీ పిలిచి ఏదో పార్టీ పెట్టారు. ఇటువంటివి జరిగినప్పుడు ఫోన్ చేసి చెప్పేవాళ్లు. నేను పైకి వస్తానని నారాయణ రెడ్డిగారికి నమ్మకం. తరువాత 58లో నారాయణరెడ్డిగారితో పరిచయం ఏర్పడింది. దాదాపు ముప్పై ఏళ్లకు పైగా పరిచయం. నా పుస్తకానికి పరిచయం కూడా రాశారు. అలా గొప్ప వాళ్లనుంచి చాలా నేర్చుకున్నాను.

గవర్నమెంటు ఉద్యోగంలో చేరాను. నాకు వేరే జీవితం లేదు. నా ఉద్యోగమే నా జీవితం. నా సాహిత్యమే నా జీవితం. నేను ఇంతకుముందే చెప్పినట్లు నా జీవితం ప్రశ్నలతోనే మొదలయింది. వాటికి సమాధానం వెతుక్కొనే ప్రయత్నం చేశాను. సమాధానం వెతుక్కుంటూనే ఇంతదూరం వచ్చాను. సమాధానం దొరకలేదు. ఆ ప్రయత్నంలో నుంచే ఒక ఆర్తి, ఏదో చెప్పాలనే ఒక తపన నా చేత సాహిత్యం రాయించింది.

నేను మద్రాసులో ఉన్నప్పుడే ఒకసారి జబ్బు చేసింది. టైఫాయిడ్ అనుకున్నాను. నారాయణరావుగారనే డాక్టరు దగ్గరికి వెళితే టైఫాయిడ్ కాదు మలేరియా అన్నారు. మందులిచ్చారు. నాకు మాత్రం టైఫాయిడ్ అనే. టైఫాయిడ్ వచ్చింది ఇక చచ్చిపోతాను అనుకున్నాను. కాగితం కలం తీసుకున్నాను. ఏవో ఆలోచనలు ఇక నేను చచ్చిపోతాను. నేను ఉండను. అదృశ్యమైపోతాను. కాని ఈ కాగితం ఉంటుంది. నేను కూర్చున్న ఈ కుర్చీ ఉంటుంది. ఈ మంచం ఉంటుంది. నేను తప్ప అన్నీ ఉంటాయి. అందరూ ఉంటారు. నేను రాసిన ఈ కాగితం ఉంటుంది. చచ్చిపోయింతర్వాత ఏమవుతుంది. ఆత్మ అనేది ఉందా? చచ్చిపోయింతర్వాత ఆత్మ అనేది ఉంటే అదేమవుతుంది. మనిషి తనులేని ఈ ప్రపంచాన్ని ఊహించుకోలేడు. అందరూ ఉంటారు, అన్నీ ఉంటాయి నేను

ఉండను అనే భావం మనిషిని ఎక్కువ భయపెడుతుందనుకుంటాను. ఆ విధంగా నేను ఉండను అనే భావం కూడా నన్ను భయపెట్టింది. అందువల్ల నేను అన్నది భౌతికంగా లేకపోయినా కూడా ఏదో రూపంలో ఉంటాను అనుకొని మానవుడు కల్పించుకున్న భావనే ఈ ఆత్మ అని నేననుకుంటాను. అప్పుడు ఆ పదిహేడేళ్ల వయస్సులోనే ఆ ఆలోచన వచ్చి జీవితమంటే ఏదో రాద్దామనుకున్నాను. జీవితమంటే ఒక్కొక్కళ్లు వాళ్ల వాళ్ల అనుభవాన్ని బట్టి అర్థం చేసుకుంటారు. ఈ స్థితిలో ఏదో రాశాను.

అప్పటికి రెండు మూడు నెలల క్రితం కిన్నెర పత్రిక ఎడిటర్ వెంకటాద్రిగారని ఉండేవారు. వారింటికి గొప్ప గొప్ప కవులు, రచయితలంతా వచ్చేవాళ్లు. అది ఒక సరస్వతీ నిలయంగా ఉండేది. రచయితలతో నాకు పరిచయం అక్కడే. ఆయన నన్ను చూడడానికి వచ్చి ఆ కాగితాలన్నీ చూసి ఆశ్చర్యపోయాడు. అది ప్రచురించారు. తరవాత రెండు మూడు సంవత్సరాలు ఏమీ రాయలేదు.

నేనింత దూరం ఒంటరిగా ప్రయాణం చేయగలగడానికి కారణం ఆత్మవిశ్వాసం. భయం లేకపోవడం. నిజం చెప్పడానికి భయపడకపోవడం. అబద్ధం చెప్పేవాళ్లకి జ్ఞాపకశక్తి ఎక్కువట. ఒకసారి చెప్పింతర్వాత మళ్లీ పది రోజుల తర్వాత జ్ఞాపకం పెట్టుకొని చెప్పాలికదా. నిజం చెప్పడానికి ధైర్యంకావాలి. నిజమే చెప్పేదాన్ని. అందువల్ల కొంతమందికి కోపం రావచ్చు కూడా. కాని నిలకడమీద దాని విలువ తెలుస్తుంది. నాకు నిజం చెప్పడంవల్ల శత్రువులయినవాళ్లు తక్కువ. మిత్రులే ఎక్కువ. ఒక్కొక్కసారి కోపం వచ్చి బాగా తిట్టినవాళ్లు కూడా ఉన్నారు. అయితే కొంతకాలం తర్వాత వాళ్లు తిట్టారన్న విషయం గుర్తుండేది కాని ఏం తిట్టారో మరిచిపోయేదాన్ని. పదిహేడు సంవత్సరాల వయస్సు అజ్ఞానంతోనే జీవితం ప్రారంభించి ముందుకు వెళ్లిపోయాను, ఇక వెనక్కి తిరిగి చూడలేదు. ఏ రోజున కూడా నాకు ఈ ఆసరా ఉంటే బాగుండేది కదా అనుకోలేదు. అయ్యో ఇన్ని కష్టాలు పడిపోయానే అని బాధపడిపోలేదు. ఏదన్నా వస్తే ధైర్యంగా దాన్ని అధిగమించి ముందుకు వెళ్లాను కాని కష్టం వచ్చిందనుకోలేదు.

ఒక విధంగా చూస్తే గవర్నమెంటులో చాలా కష్టాలు పడ్డట్టే లెక్క. అయితే ఎప్పుడూ న్యాయం పక్షాన ఉన్నాను కాబట్టి కష్టం అనుకోలేదు. ఆ విధంగా ముందుకే వెళ్లాను, నిజమే మాట్లాడాను, నేను ఆలోచించి నిర్ణయించుకున్నదే చేశాను. నా ఆలోచనలే నేను నమ్మిందే రాశాను. రాసిందే ఆచరించానని చెప్పలేను. ఆచరించలేము. అలా ఆచరిస్తే బావుంటుంది. ఎప్పుడూ నేను, నా అని ఆలోచించలేదు. చెప్పుకోలేదు.

నా రెండో కథ 'సాంబయ్య పెళ్లి'. మొదటికథ హిందీ ప్రచారసభ ఆఫీసులో కూర్చొని ఏదో రాశాను. అది కథ అవునో కాదో చెప్పేవాళ్లు కూడా లేరప్పుడు. సరే 'సాంబయ్య

పెళ్లి' రాశాను. పోస్టు చేశాను. మూడో వారానికల్లా ప్రభలో పెద్ద అక్షరాల్లో అచ్చయి వచ్చింది. ఆ కథకు స్ఫూర్తి మా వూళ్లో సాంబయ్య అనే వ్యక్తి ఉండేవాడు. చాలా వికారంగా ఉండేవాడు, పిచ్చివాడు కూడాను. అటువంటివాణ్ణి తీసుకొని కథ రాస్తే ఎలా ఉంటుందని ఆలోచించాను. అతన్ని స్ఫూర్తిగా తీసుకొని సాంబయ్యపెళ్లి అన్న కథ రాశాను. తర్వాత రాయడం కొనసాగించాను.

నా మూడో కథ 'బావ' అన్న కథ. మా స్కూల్లో ఈశ్వరి అని ఒక అమ్మాయి ఉండేది. చాలా అందంగా ఉండేది. వైభవంగా ఉండేది. తోటి టీచర్లంతా ఈశ్వరి, ఈశ్వరి అంటూ ఇష్టంగా పిలుస్తూండేవాళ్లు. ఆమె భర్త హఠాత్తుగా చచ్చిపోయాడు. అప్పటిదాకా బాగా ఉన్నవారనుకునేవాళ్లు. భర్త చచ్చిపోయేసరికి ఏమీలేదని తెలిసింది. ఆ భర్తకు చీట్లపేక అలవాటుండేది. అంతా అందులో పోగొట్టుకున్నాడన్నారు. ఆమె తండ్రి ఇంటికి బెంగుళూరు వెళ్లిపోయింది. అక్కడ మళ్లీ పెళ్లి చేసుకోమని బలవంతం చేశారు. నా దగ్గరికి పారిపోయి వచ్చి కొన్నాళ్లు ఆశ్రయం పొందింది.

తర్వాత ఏమనుకుందో వెళ్లిపోయింది. అప్పుడు ఆ అమ్మాయి కథనే 'బావ' అన్న కథగా రాశాను. బహుశా అప్పుడు రాసేవాళ్లు తక్కువగా ఉన్నారేమో వెంటనే అచ్చయ్యేవి. అట్లా నాలుగయిదు కథలు రాశాను.

మా హాస్టల్లో పద్మ అని ఒకమ్మాయి ఉండేది. ఆ అమ్మాయికి క్లెప్టోమేనియా అనే జబ్బు ఉండేది. మాకు తెలియదు. ఒకసారి మూర్ఛవచ్చి పడిపోతే భయపడి డాక్టరు దగ్గరికి తీసికెళ్లాం. డాక్టరు ఏమీ భయంలేదని చెప్పి, మామూలు మూర్ఛల జబ్బని చెప్పారు. 'శ్రీనాథరావుతో పరిచయం' అని ఒక కథ రాశాను. అది చాలా మంచికథ అని ఇంగ్లీసు పత్రికలో వచ్చింది. అప్పుడప్పుడూ ఎవరో ఒకరు వచ్చి పరిచయం చేసుకుంటూ ఉండేవారు. అలాగే అప్పుడు హనుమంతరెడ్డి అని ఒక కాలేజీ స్టూడెంటు వచ్చి కలిశాడు. వాళ్ల కాలేజీకి ఆహ్వానించాడు. నేను, పద్మ వెళ్లాం.

అతని విషయం ఆ కాలేజీ స్టూడెంట్లెవరో నాకు చెప్పారు. అప్పుడు 'శ్రీనాథరావుతో పరిచయం' అనే కథ రాశాను. పత్రికకి పంపించాను. మూడు వారాల్లో అచ్చయి వచ్చింది. ఆ హనుమంతరెడ్డి మళ్లీ వచ్చాడు. 'నా మీద కథ రాశావు చూడు ఏంచేస్తానో. నువ్వు హాస్టల్ నుంచి బయటికి ఎట్లా వస్తావో చూస్తాను. కొడతాను' అదీ ఇదీ అని గొడవచేశాడు. అతనేమో పరీక్ష పాసయ్యాట్ట. స్టూడెంట్లంతా కాపీకొట్టి పాసయ్యావన్నారట. నేనన్నాను 'నీ గురించి నాకు తెలిసింది ఒకే విషయం. మరి కథలోనివన్నీ నిజమేనా మరి. స్టూడెంట్లు అట్లా అనుకుంటున్నారంటే అవి నిజమే అయ్యుండాలి. ఆ లక్షణాలన్నీ నీలో ఉన్నాయన్న మాట'.

రచయిత నిజంగా రాయదలచుకుంటే ఒక చిన్న విషయం చాలు. రచయిత సైకాలజిస్టు అయిఉండాలి. ఒక పాయింటు, ఒక మాట, ఒక అలవాటు, ఒక సంఘటన చాలు ఒక వ్యక్తి స్వరూప స్వభావాలను మాటతీరును అంచనా వేయడానికి, అర్థం చేసుకోవడానికి.

రత్తమ్మ కష్టాలు అని ఒక కథ రాశాను. ఆ రోజుల్లో హిందీ ప్రచారసభ సెక్రటరీని మంత్రి అనేవాళ్లు. ప్రధాన కార్యదర్శి అయితే ప్రధానమంత్రి, విద్యాకార్యదర్శి అయితే విద్యామంత్రి, పరీక్షా కార్యదర్శి పరీక్షామంత్రి. ప్రధానమంత్రిగారికి ఒక భార్య ఉండేది. ఆమె కొంచెం గయ్యాళి. ఏ పని కావాలన్నా మనం ఆమె చుట్టూ తిరిగి సంతోషపెడితే తప్ప పనులు కావు. మా పరీక్షామంత్రి అప్పుడప్పుడూ అంటూండేవాడు ఆమెను చూశావా అని. నా కంత ఆసక్తిలేదు కాని ఎవరితోనో ఒకరితో కలిసి రెండుమూడుసార్లు ఆమెను చూడవలసి వచ్చింది. చూసింతర్వాత ఆమె మీద కథ రాయాలనిపించింది. కథ రాయాలంటే ఏదో ఒక పాత్రను ఎంచుకోవాలి కదా. పాపం నిజానికి ఆమెకేమీ కష్టాలు లేవు. కాని కొనితెచ్చుకున్న కష్టాలు. తనకు లేని కష్టాలను ఊహించుకొని ఇతరులను కష్టపెట్టే స్వభావం. ఇటువంటి పాత్ర తీసుకొని కథ రాశాను.

'శ్రీనాథరావుతో పరిచయం' కథ రాసినప్పుడే నాకు తెలిసింది, మనం కథ రాసినప్పుడు ఏదైనా వ్యక్తి లోపాన్నెత్తి చూపినప్పుడు అది సమాజంలో అటువంటి స్వభావం కలిగిన వ్యక్తుల్ని ఏ విధంగా ఉడుక్కునేలాగ చేస్తుందో, ఏ విధంగా ఆలోచింపచేస్తుందోనని. నిజంగా సాహిత్యానికి ఎంతో ప్రభావం ఉంది. బలం ఉంది. అందువల్ల ఎలా ఉంటే అలా రాయకూడదు. ఏదంటే అది రాయకూడదు. సాహిత్యం మనుషుల మీద ప్రభావాన్ని చూపిస్తుంది, వాళ్లని ప్రభావితుల్ని చేస్తుంది కనక మనం జాగ్రత్తగా రాయాలి. 'రత్తమ్మ కష్టాలు' కథ రాయడంతో నా ఉద్యోగం పోయింది. దీంతో సాహిత్య ప్రభావం గురించి నాకు బలమైన నమ్మకం ఏర్పడింది. జాగ్రత్తగా రాయాలి. బాధ్యతారాహిత్యంగా రాయకూడదు. మనం ఏదో చేయాలనుకున్నప్పుడు ఆ లక్ష్యంతో రాయాలి. ఇలా చాలా కథలు రాశాను. 1954లోనే నా మొదటి కథా సంపుటం వచ్చింది. 1958లో ఉద్యోగానికి హైదరాబాదుకు వచ్చాను. మధ్యలో కొంతకాలం రాయడం మానేశాను.

నాటకాలంటే నాకు ఇష్టం. నాటకాలు చూస్తేండేదాన్ని. ఒకసారి ఒకనాటకంలో వేషం కూడా వేశాను. రచయిత్రిగా పేరు వచ్చింతర్వాత ఈ నాటకాలేమిటి? కథలన్నా రాయి, నాటకాలన్నా వేసుకో అన్నాడు మా బ్రదర్. వాళ్లకు ఈ నాటకాలంత ఇష్టంగా ఉండేవి కావు– ముఖ్యంగా స్త్రీలు నాటకాల్లో పడడం. ఒక నాటకం డైరెక్టు చేశాను. మొట్టమొదట నూతన్‌ప్రసాద్‌ను నాటకాల్లో ఇంట్రడ్యూస్ చేసింది నేనే. నూతన్‌ప్రసాద్, ఈశ్వరరావు, గోపిని రామారావు మొదలైనవాళ్లు నటించారు. ఆ నాటకానికి

బ్రహ్మానందరెడ్డిగారు వచ్చారు. మెచ్చుకున్నారు. ఇట్లా నాటకాలలో పడి కొన్నాళ్లు రచనలు చేయలేదు. అసలు రాసింది చాలదా? ఎందుకు రాయాలి? రచనలతో ప్రయోజనం ఏమిటి? వీటితో ఏమైనా మార్పు తేగలమా! ఇలాంటి ఆలోచనలూ వస్తూండేవి.

గోపీచంద్‌లాంటివారు అడిగేవాళ్లు. ఏమమ్మా మంచికథలు రాస్తావు అనుకుంటూం డేవాళ్లం. ఇక్కడికి వచ్చి రాయటం మానివేశావేమిటి? రచయిత్రిగా చచ్చిపోయినట్లేనా అని. కథలు చదువుతూ ఉండేదాన్ని. ఉద్యోగం, కొత్తగా వచ్చి ఈ హైదరాబాదులో. ఇంతమంది రచయితలు రాస్తున్నారుగా అని.

సరే, నా మొదటి నవల 'వైతరణి' అంటున్నారు చాలామంది. కాని కాదు. అడవిమల్లె. ఒకసారి గోపాలశాస్త్రిగారు ఫోన్ చేశారు. ఆఫీసుకు వచ్చి కలవమన్నారు. వెళ్లాను. అమ్మా మా డైరెక్టరు మిమ్మల్ని కలవాలన్నారు, రండి అని సిన్హాగారి దగ్గరకు తీసుకువెళ్లారు. మీరు మాకో నవల రాయాలి. ఆంధ్రప్రదేశ్‌లో సీరియల్‌గా ప్రచురిస్తాం అన్నారు. అప్పటికి నేను కథలే తప్ప నవల రాయలేదు. సీరియల్స్ చదువుతూ ఉన్నాను. రంగనాయకమ్మ, కోడూరి కౌసల్యాదేవి ఉద్ధృతంగా రాస్తున్న రోజులు. నేను రాయగలనా అన్నాను. గోపాలశాస్త్రిగారు మీ పేరు చెప్పారు, ఆమె రాస్తుందో లేదో, రాస్తేమాత్రం బాగా రాస్తుంది అని చెప్పారు. మీరు రాయాలి అన్నారు. అడ్వర్టయిజ్ చేస్తాం అన్నారు. చేశారు. అట్లా రాయవలసి వచ్చింది 'అడవిమల్లె'.

మనిషి జీవితాన్ని చుట్టూ ఉన్న వాతావరణం నిర్ణయిస్తుందా? పుట్టిన వంశం, రక్తం నిర్ణయిస్తాయా? అన్న అంశం తీసుకొని రాశాను. 1964-65. ఒకే తల్లి బిడ్డలు ఇద్దరు అమ్మాయిలు. ఒకామె సర్వీసులోకి వెళుతుంది. ఒకమ్మాయి పబ్లిషర్ అవుతుంది. జన్మకాదు, వాతావరణమే మనిషి స్వభావాన్ని నిర్ణయిస్తుంది అని చెప్పటానికి ప్రయత్నించాను ఈ నవలలో. జనం బాగా రిసీవ్ చేసుకున్నారు. పేరు వచ్చింది. ఇప్పటికీ ఎక్కడికన్నా వెళితే చాలామంది 'అడవిమల్లె' రాసిన రచయిత్రి కదూ అంటారు. మిగతా నవలలన్నీ మరచిపోతారు.

నేను రాసిన నవలలన్నీ ఇలా రాసినవే. ఒక్క సమత మాత్రం పూర్తి నవల రాశాను. ఆ నవలలో ముఖ్య పాత్ర విషయం అందరికీ తెలిసిందే. పేరు చెప్పకపోయినా తెలుసుకోవచ్చు. ఒక స్త్రీ వివాహబంధంలో ఇమడలేక బయటికి పోతే మరెవరితోనో కలిసిఉంటే లేచిపోయిన ఆడది అంటారు. లోకమంతా చిన్నచూపు చూస్తుంది. ఆ స్త్రీకే అధికారం, పదవి లభిస్తే అదే మనుషులు ఆమె కాళ్లచుట్టూ తిరుగుతారు. ఆమె ఇష్టాన్ననుసరించి డాన్స్ చేస్తారు. పెద్ద పెద్ద నాయకులు, జమీందారి కుటుంబాలవాళ్లు కూడా ఎలా ప్రవర్తిస్తారో ఒక ఎంపి సీటుకోసం, ఎమ్మెల్యే సీటుకోసం ఎంత నీచానికైనా

ఎలా దిగజారతారో, ఆమె ఛీఛీ అన్నా ఎలా పట్టుకొని వేలాడతారో చూశాను. ఈ నవల చదివి భుజాలు తడుముకున్నవారెందరో. నాతో అన్నవాళ్లు కూడా ఉన్నారు. ఇట్లా మా గురించి బట్టబయలు చేయడం బాగుందా అని. నేను చెప్పాను. ఒక కథ రాసినప్పుడు ఒక వ్యక్తిని తీసుకోవలసి వస్తుంది. కథలో ఉన్న వ్యక్తి ఒక వ్యక్తి కాదు. నలుగురయిదుగురు వ్యక్తుల సమాహారం. నలుగురయిదుగురి గుణగణాలు, స్వభావాలు ఒక వ్యక్తిలో చూపిస్తాం. ఆ వ్యక్తి మీరే అనుకోవద్దు అని. ఆమె ఆఫీసులో సెక్రటరీలు, డైరెక్టర్లు ఫైళ్లు పట్టుకొని నిలబడేవాళ్లు. వాళ్లలో నేనూ ఉన్నాననుకోండి. ఆమె నా గుండెల్లో కూర్చొని నా కథరాయి, నా కథ రాయి అని బలవంతం చేసినట్లనిపించేది. ఆమె మాత్రం నాకు నిద్ర పట్టకుండా చేసింది. అదొక్కటి మాత్రమే నేను డైరెక్టుగా పూర్తిగా రాసిన నవల. 1967, 68లో. విశాలాంధ్రలో వచ్చింది. అది విశాలాంధ్ర వస్తున్న కాలంలో ఒంగోలు, గుంటూరు, తెలంగాణాలో ఒక జిల్లా కమ్యూనిస్టులంతా ఒక మీటింగు పెట్టి విమర్శించారు. అసలు మన విశాలాంధ్రలో ఈ నవల ప్రచురించడమేమిటి? ఈ నవల చదివినవాళ్లెవరయినా మనవెంట వస్తారా? అని గొడవ పెట్టారు. అప్పుడు రామచంద్రారెడ్డిగారనేవారొకరు మరొకరు డిఫర్ అయ్యారు. 'లేదండి ఆమె కమ్యూనిస్టు పార్టీని కించపరుస్తూ రాయడం లేదు. ఆమె మార్క్సిస్టు. మార్క్సిస్టు ఐడియాలజీ ఉన్నామె. ముందు చదవండి' అని అన్నారు. ఆ నవల వచ్చింతర్వాత అప్పుడు చాలామంది పిల్లలకు సమత అని పేరు పెట్టుకున్నారు. ఇప్పుడు నలభై ఏళ్లవాళ్లు చాలామంది మీ నవలపేరు మాకు పెట్టారండి అని చెప్పుకుంటూంటారు నన్ను కలిసినప్పుడు.

తర్వాత వైతరణి రాశాను. మన ఇళ్లలో ఉండేసంగతే. తల్లీ దండ్రీ బాగానే ఉంటారు. కొడుకులు పెద్దయింతర్వాత కోడళ్లు వచ్చింతర్వాత మారుతుంది. ఏదో ఒకసారి కట్నం ఇచ్చి పంపేసినందువల్ల, ఆస్తిలో భాగం లేనందువల్ల ఆ కట్నం పోతేనో, ఆ రక్షణ లేకపోతేనో ఆ స్త్రీ ఎలా బాధపడుతుంది, అన్నదమ్ముల ఇంటికి వచ్చి ఎలా కష్టపడుతుంది ఇదంతా ఆలోచించి రాసిన నవల. ఆడపిల్లలకు ఆస్తిలో హక్కు ఉండాలి అని నిర్ధారించి రాశాను. డా॥ రంగాచార్యలాంటివాళ్లు మరీచికకంటే కూడా ఇదే గొప్ప నవల అంటూంటారు.

ఉద్యోగరీత్యా విజయవాడ వెళ్లవలసి వచ్చింది, ట్రాన్సఫరు కావడంవల్ల. అక్కడికి వెళ్లింతర్వాత ఒకరోజు పండితారాధ్యుల నాగేశ్వరరావుగారు మా ఆఫీసుకు వచ్చారు. పాపం చాలా పెద్దాయన నాకోసం రావడమేమిటి. కబురంపితే నేనే వచ్చేదాన్ని కదా అన్నాను. మాకు నవల రాయాలి అన్నారు. సరేనన్నాను. ఉద్యోగ బాధ్యతలవల్ల పది రోజులు, పదిహేను రోజులు కాంపుకు వెళ్లాల్సి వచ్చేది. ఇవ్వాళ విజయవాడలో ఉండే మూడో రోజున ఎక్కడో శ్రీకాకుళంలో ఉండవలసి వచ్చేది. ఈ విధంగా బిజీగా ఉన్నప్పుడు

రాయలేకపోవడం, అయ్యో పెద్దమనిషి అడిగారే రాయకపోతే ఎలా అని బాధపడడం. ఆయన కబురు పెడుతున్నారే. ఏంచేయాలి. సబ్జెక్టు? మా వూళ్లో ఒకామె ఉండేది అనసూయమ్మ అని. అటువంటివాళ్లు చాలామంది ఉన్నారు. నా చిన్నప్పుడు చూసేదాన్ని. వ్యవసాయ కుటుంబాలు, భూస్వామ్య సమాజం పెట్టుబడిదారీ వ్యవస్థలోకి అడుగుపెడుతున్న సంధికాలం. పట్టణాలు, నగరాలమీద మోజు. ఆడవాళ్లు కూడా దగ్గరున్న పట్టణాల జీవితం మీద మోజు పడడం, ఏదో ఒక జబ్బుపేరు చెప్పి వైద్యంకోసమని పట్టణాలకు కాపరం మార్చడం, చెడిపోవడం, ఎన్నో కుటుంబాలు చితికిపోవడం నేను చూశాను. సినిమాలకు పోవడం, డబ్బు ఖర్చు పెట్టడం అలవాటయిపోతుంది. నిజంగా నాకొకావిడ తెలుసు. భర్తని తీసుకువచ్చి ఆస్తి రాయించుకొని చంపడానికి ప్రయత్నించడం తెలుసు. ఆవిడ కొడుకు ఇక్కడే ఉంటాడు. అప్పుడప్పుడు మా యింటికి వస్తుంటాడు కూడా. అలాగ ఆమెని దృష్టిలో పెట్టుకొని రాసినా కూడా-- ఏదయినా ఒక సిద్ధాంతంతో కూడిన రచన శ్రుతప్రతిగా ఉండకూడదు. ఒక రైతు గురించి రాసినప్పుడు ఒకే రైతు మనకు ఇన్స్పిరేషన్ కావచ్చు. నాకిక్కడ ఇన్స్పిరేషన్ అనసూయమ్మ కావచ్చు. కాని అనసూయమ్మ లాంటి వాళ్లు టైప్ కావాలి. రైతు పాత్ర తీసుకున్నప్పుడు రైతు టైప్ కావాలి. అప్పుడే మా వూళ్లో కూడా సాంబయ్య ఉన్నాడు, కనకయ్య ఉన్నాడు అనుకుంటారు పాఠకులు. ఏమ్మా మా కథ రాశావు అనేవాళ్లున్నారు. చాలామంది వాళ్ల వాళ్ల రూపాలు అందులో చూసుకోవడం జరిగింది. ఒక్కసారి యాభై వంద పేజీలు రాసేదాన్ని ఫోన్ చేసి చెప్పి పంపించేదాన్ని. ఇట్లాగే నాలుగైదు సార్లు రాసి పూర్తిచేసేదాన్ని. మట్టిమనిషి ఇలాగే రాశాను.

మరీచిక కూడా ఇలాగే. కథ మీకందరికీ తెలుసు. యువతరం కథ. నిషేధించారు. ఆ విషయాలన్నీ మీకు తెలుసు. ఇక రాబందులు-రామచిలకలు నవల కథ. దీన్ని గురించి కొంత చెప్పాలి. నేను ఎలాగ ఇన్‌స్పైర్ అయి కథలు, నవలలు రాశానో చెప్తున్నాను. నేను పంచాయితీ రాజ్ సెటప్ చూస్తూండేదాన్ని. నేనొక ఆఫీసర్ని. చాలామంది నాకింద పనిచేసేవాళ్లు. పంచాయితీ ప్రెసిడెంట్లు వీళ్లను ముఖ్యసేవికల్ని సేవికా సేవికా అని పిల్చేవాళ్లు. నేను తర్వాత డిపార్ట్‌మెంటులో పోరాడి ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ అని పేరు మార్పించాను. ఉమన్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ అని డిజిగ్నేషన్ మార్పించాను. అప్పుడు అక్కడి మహిళా సంఘాలు, వాటి గురించి రాశాను. మహిళా సంఘాలని ఉన్నప్పటికీ కూడా వాటివెనక మగవాళ్లే ఉంటారు. ఆడవాళ్లని ముందు పెట్టుకొని మగవాళ్లు రాజ్యం చేస్తున్నారని చెప్పడానికి ఈ నవలలో ప్రయత్నించాను. ఆ ముఖ్యసేవికలంతా ఎలా బాధపడుతున్నారో, ఆ వీడీవోలెలా బాధపడుతున్నారు అని చెప్పి రాసిన దానిమీద చాలా చర్చ నడిచింది. అది సీరియల్‌గా వస్తున్నప్పుడు ఒకసారి నేను సంగారెడ్డి వెళ్లాను. అక్కడ రామిరెడ్డి అనే ఆయన కలిశాడు. అమ్మా మీరు మా యింటికి డిన్నరుకు రావాలి

అని పిలిచాడు. ఎవరీయన అని అడిగితే అక్కడి బీడీఓ ఆయన పంచాయతీ ప్రెసిడెంటు అని చెప్పారు. వెళ్లాను. వెళ్లింతర్వాత ఏంటండీ మీ రాజకీయాలేమిటి? సంగతులేమిటి? మీరేనా రాజ్యం చేస్తుంది అని అడిగాను. అమ్మా! రిజైన్ చేసేశానన్నాడు. అదేమిటి మీరు రిజైన్ ఎందుకు చేశారు అన్నాను. అమ్మా మీరే నాతో రిజైన్ చేయించారన్నాడు. అదేమిటన్నాను. 'మమ్మల్ని రాబందుల్ని చేసి రాస్తున్నారు కదమ్మా మీరు? అందుకని'. అప్పటికాయనకు రాజకీయాలు తెలియవు, ఏమైనా చేసి ఎవరి నెత్తినైనా చెయ్యో కాలో పెట్టి పైకి పోవడం తెలియదు. పంచాయతీ ప్రెసిడెంటంటే ఇలా రాబందుల్లాగా పచ్చిమాంసం పీక్కుతింటున్నామా? అట్లా ప్రవర్తిస్తున్నామా? చాలా అనుభవంతో రాస్తున్నారు. అని చాలా బాధపడిపోయి రాజీనామా ఇచ్చేశాడు. తర్వాత ఏం చేస్తున్నారంటే ఏదో లాయరుగా ప్రాక్టీసు చేస్తున్నారట. ఎవర్నో ఆయన ఏం చేస్తున్నారని అడిగితే అదేంటమ్మా మీ నవల చదివి ఆయన రాజకీయాలు వదిలి పక్కదోవ పట్టిపోయాడుకదా ఇంకా లాయరుగానే ప్రాక్టీసు చేస్తున్నాడని చెప్పారు.

అలాగే జనార్ధనరెడ్డిగారని వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్. వరంగల్లులో నాకు డిన్నర్ ఇచ్చాడు. ఆ పంచాయతీ ప్రెసిడెంట్లందరినీ పిలిచి మంచి డిన్నర్ ఇచ్చాడు. డిన్నర్‌లో మాట్లాడుతూ అందర్నీ 'రాబందులు–రామచిలకలు' నవల చదవమన్నాడు. మనల్ని గురించి ప్రజలేమనుకుంటున్నారో తెలుసుకోవడానికి ఇది పనికి వస్తుందన్నాడు. నాకు కృతజ్ఞతలు చెప్పాడు.

మార్క్సిస్టు దృక్పథం ఉన్నప్పుడు రచయితకు సామాజిక వాస్తవం అర్థమవుతుంది. అప్పుడే రచయిత రచన సంపూర్ణమవుతుంది. ప్రజల జీవితాన్ని నిర్ణయించేది రాజకీయాలే అయినప్పుడు ఆ జీవితాన్ని చిత్రించే రచయితకు రాజకీయాలు లేకుండా ఎట్లా ఉంటాయి.

నా రచనలు ఈ మార్క్సిస్టు దృక్పథం నుంచే ఉద్భవించాయి. జీవితం నాకు వేసిన ప్రశ్నల నుంచే పుట్టాయి. నాలో రేకెత్తిన ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోవడంలోనే రచయిత్రిగా అభివృద్ధి చెందాను. నా కథలూ, నవలలూ అన్నిటినీ ఈ దృష్టికోణం నుంచే చూడవచ్చు. జనరంజకంగా రాయాలన్న ప్రయత్నం చేయనప్పటికీ, నా రచనల్లోని వాస్తవికత కూడా ప్రజామోదాన్ని పొంది నాకు ఒక విశిష్ట రచయిత్రిగా తెలుగు నవలా రచయితల్లో స్థానాన్ని సంపాదించి పెట్టింది.

జీవితంలో నాలో తలెత్తిన ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోగలిగానో లేదో నాకు తెలియదు. కాని నిజాయితీగా ప్రయత్నం చేశానని మాత్రం చెప్పగలను.



శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి

'పరిణతవాణి' మొదటి సంపుటికి ఇక్కడే ఆవిష్కరణ సభ జరిగినప్పుడు ఆ పుస్తకంలోని ముగ్గురి ప్రసంగవ్యాసాల్ని సమీక్షించే భాగ్యం నాకు కలిగింది. ఈనాడు నాకు స్వయంగా అటువంటి ప్రసంగం చేసే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నాను. నా జీవిత విశేషాల్నీ, సాహిత్య జీవితానుభవాల్నీ, మీతో పంచుకోబోతున్నందుకు ఆనందంగా ఉంది.

నా పుట్టుకే నా తల్లిదండ్రులకి కొంత అసంతృప్తి కలిగించింది. మగపిల్లవాడు పుడితే సూర్యనారాయణమూర్తి పేరు పెట్టుకుంటామని మొక్కుకుని, సూర్యనమస్కారాలు చేసేవారుట. తీరా చేసి నేను పుట్టాను. ఆడపిల్లని కదా అని సూర్యుడి భార్యపేరు పెట్టారు. అయితే, నా జుట్టు కత్తిరించి, లాగూ చొక్కా వేసి మగపిల్లవాడిలాగే పెంచారు కొన్నాళ్లు. నన్ను ఒళ్లో కూర్చోబెట్టుకుని, ప్రహ్లాదచరిత్ర, గజేంద్రమోక్షం, రుక్మిణీ కల్యాణం కథలు చెప్పి, భాగవతంలోని పద్యాలు నా చేత కంఠతా పట్టించేవారు మా నాన్నగారు. కానీ నేను మా అన్నయ్యంత చురుకైనదాన్నీ, తెలివైనదాన్నీ కాదని త్వరలోనే గ్రహించి, నన్ను ఒడిలోంచి దింపేశారు. తప్పు చెబితే దండించేవారు. ఆయన దగ్గర చనువుపోయి భయం పట్టుకుంది నాకు. మా నాన్నగారు రాజమండ్రిలో 'లాయరు'- మద్దాలి వేంకటచలంగారు.

చుట్టుపక్కల పిల్లలు స్కూలుకి వెడుతూంటే చూసిన నేనూ వెడతానని గోలపెడితే, గుమాస్తాగారిచేత నన్ను మా పక్కవీధిలో ఉన్న స్కూలుకి పంపించారు. అది క్రిస్టియన్ మిషన్ స్కూల్. అక్కడ చదువు చెప్పడంకన్న మతబోధ ఎక్కువగా ఉంటోందని గమనించి, మానిపించేసి, ఇంట్లోనే ట్యూషన్ పెట్టించారు. ఎనిమిదో ఏట డైరెక్ట్‌గా 5వ క్లాసులో గర్ల్స్ స్కూల్లో చేర్పించారు. ఆ రోజుల్లో ఎంట్రెన్స్ పరీక్షలుండేవి కావు. మా ఇంటికి

రెండు మూడు ఫర్లాంగుల దూరంలో ఉండేది ఆ స్కూలు. నడిచే వెళ్లేదాన్ని. దామెర్ల రామారావుగారి సోదరో, సతీమణో సరిగ్గా గుర్తులేదు– ఆ స్కూల్లో డ్రాయింగ్ నేర్పించేవారు. నా పాఠ్యపుస్తకాల్లో ఉన్న రేఖాచిత్రాలకి రంగు పెన్సిళ్లతో రంగులు వెయ్యడం మా నాన్నగారు చూసి, ఆ పుస్తకాలను అలా 'పాడు' చేసినందుకు బాగా దండించారు. నాకు పెయింటింగ్‌లో అభిరుచి ఉందేమోనన్న ఆలోచన ఆయనకు రాలేదు. దామెర్ల రామారావుగారి ఇల్లు మా పక్క వీధిలోనే ఉండేది. పంపించిఉంటే ఎంత బావుండేది అనిపిస్తుంది ఇప్పటికీ నాకు.

అయిదో క్లాసు తరవాత ఆడపిల్లల స్కూలు మానిపించేసి, మా ఇంటికి దగ్గరలోనే ఉన్న టౌన్ మిడిల్ స్కూల్లో ఫస్ట్ ఫామ్‌లో చేర్పించారు. థర్డ్ ఫామ్ వరకూ అక్కడే చదువుకున్నాను. అప్పటికి ఇంకా లాగులూ చొక్కాలే వేసుకునేదాన్ని. చిన్న పిలకజడ మాత్రం ఉండేది. మా హెడ్ మాస్టరు మా నాన్నగారి స్నేహితుడే. నన్ను చూసి ఓ రోజున వెక్కిరించారు 'ఇంకా ఎన్నాళ్లు తొడుగుతావే మట్టలాగులు?!' అంటూ. ఇంటికొచ్చి ఏడుస్తూ చెప్పాను. అప్పుడు మొదటిసారి పరికిణీలు కుట్టించారు. వాటిమీద మళ్లీ నా పాత తెల్ల చొక్కాలే. తరవాత పమిట వేసుకుంటున్నా చొక్కాలు తప్పలేదు. అవి ఓ పట్టాన చిరిగేవి కావు. 'ఇవి వేసుకోను' అని చెప్పే హక్కులేదు ఇంట్లో.

మా ఇల్లు ఉన్న సందుపేరు వీరేశలింగంగారి వీధి. ఆయన ఇల్లు ఆ సందులోనే ఉండేది పూర్వం. తరవాత అడవికొలను వారు అద్దెకుండేవారు. వాళ్ల మనవరాలు నా క్లాస్‌మేట్.

ఫోర్త్‌ఫామ్ నుంచి స్కూలుఫైనల్ వరకూ వీరేశలింగం థియోస్టిక్ హైస్కూల్లో చదివాను. అక్కడే సాహిత్యం అంటే నాకు అభిరుచి ఏర్పడింది. ఇంగ్లీసు లిటరేచర్‌లో ఎక్కువ మార్కులొచ్చేవి. తెలుగులో ఎంత ప్రయత్నించినా ఎక్కువ మార్కులు వచ్చేవి కావు. ఆర్.కె.నారాయణ్ రాసిన 'స్వామి అండ్ హిజ్ ఫ్రెండ్స్' అనే నవల మాకు 'నాన్ డిటేల్డ్'గా ఉండేది. ఆ పుస్తకం మా నాన్నగారికి కూడా చాలా నచ్చింది. తెలుగులో ఉపాధ్యాయులుగా పిలకా గణపతిశాస్త్రిగారూ, కృత్తివాసతీర్థులుగారూ, తరవాత ఇంకొకాయన ఎవరో ఉండేవారు. పిలకా గణపతి శాస్త్రిగారు జోక్స్‌వేస్తూ మగపిల్లల్ని నవ్విస్తూండేవారు. కృత్తివాసతీర్థులుగారు గంభీరంగా పాఠం చెప్పేవారు. వీరుకాక, భమిడిపాటి కామేశ్వరరావుగారు మేథమేటిక్స్ బోధించేవారు. ఆ సబ్జక్టు కాక, ట్రాన్స్‌లేషన్ క్లాసులు కూడా తీసుకునేవారు. ఆయన నేర్పిన మొదటిపాఠం– తెలుగు నుడికారాన్ని దృష్టిలో పెట్టుకుని అనువాదం చెయ్యాలన్నది. ఇంగ్లీషులో thanks అని వచ్చిన ప్రతిసారీ 'కృతజ్ఞతలు' అని రాస్తే కుదరదు. సందర్భాన్నిబట్టి 'సరే' అనో, 'మంచిది' అనో, మరోరకంగానో సరియైన పదాన్ని వాడాలి అని చెప్పారు. రెండవది– 'మహాచెట్టు' లాంటి

దుష్టసమాసాలు వాడకూడదని. ఏది సంస్కృత శబ్దమో, ఏది తెలుగు మాటో నిఘంటువుచూసి తెలుసుకోవాలి అనీ, నిఘంటువు వాడటం అలవాటు చేసుకోవాలనీ చెప్పేవారు. ఇంగ్లీషు మాటలకి dictionary వాడటం అలవాటైంది కాని, నిఘంటువు ఎలా ఉంటుందో నా పెళ్లయిన తరవాత మా వారి దగ్గరే చూశాను. స్కూల్లో వక్తృత్వం పోటీలో మొదటి బహుమతిగా 'శబ్దరత్నాకరం' వచ్చిందని సగర్వంగా చూపించారు నాకు. భమిడిపాటి కామేశ్వరరావుగారు మా పెళ్లికి వచ్చారు. మా వారిని ఇంకా 'ఇంప్రెస్' చేద్దామని, "వీరేశలింగం హైస్కూల్లో పిలకా గణపతిశాస్త్రిగారు కూడా మాకు గురువు" అన్నాను. "ఛీ, అలా అని తెలిస్తే నిన్ను పెళ్లి చేసుకునేవాణ్ణి కాదు" అన్నారు నన్ను ఏడిపించడానికి!

స్కూల్లో భమిడిపాటి కామేశ్వరరావుగారి నాటకాల్ని చాలా ఇష్టపడేదాన్ని. క్లాసులో కూడా గంభీరంగా మొహం పెట్టుకుని తన మాటలతో కడుపు చెక్కలయేట్లు నవ్వించేవారు. కానీ ఆ రోజుల్లో ఆడపిల్లలకి క్లాసులో గట్టిగా నవ్వాలంటే భయం. ఆయన మా నాన్న గారిని అప్పుడప్పుడు కలుసుకునేవారు. మా నాన్నగారు వీరేశలింగం హైస్కూలుకి 'ఆనరరీ సెక్రటరీ'గా ఉండేవారు కొన్నాళ్లు.

తరవాత నేను గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజిలో ఇంటర్మీడియెట్‌లో చేరాను. నేను కాలేజిలో చేరిన సంవత్సరమే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాలేజిలో అప్పుడు తెలుగుశాఖలో జి.ఎన్.ఎన్.ఆచార్యగారూ, పి.ఎస్.ఆర్.అప్పారావుగారూ, జి.వెంటకస్వామిగారూ ఉండేవారు. ఆ రోజుల్లో తెలుగు లెక్చరర్స్ pants వేసుకుంటే మాకు ఆశ్చర్యంగా ఉండేది.

నా స్పెషల్ సబ్జక్ట్సు మొదట్లో హిస్టరీ, లాజిక్, తరవాత, ఇకనామిక్స్, హిస్టరీ, పొలిటిక్స్ అయినప్పటికీ, లిటరేచర్ అంటేనే నాకు ఇష్టంగా ఉండేది– ఇంగ్లీషు అయినా, తెలుగు అయినా. నాటకాలంటే నాకు మరీ ఇష్టంగా ఉండేది. పి.ఎస్.ఆర్.అప్పారావుగారు మొదట్లో 'నదీసుందరి' సంగీతరూపకానికి దర్శకత్వం వహించారు. అదే మొదటిసారి నేను 'అబ్బూరి' పేరు వినడం. తరవాత అప్పారావుగారు 'అనార్కలి' నాటకాన్ని ప్రదర్శించారు. అందులో నేను ఒక చిన్న పాత్ర ధరించాను. ఇంగ్లీషులో 'Barretts of Wimpole Street' అనే నాటకం– ఎలిజబెత్ బేరెట్ బ్రౌనింగ్ గురించి రాసిన నాటకం– నాకు చాలా నచ్చింది. అది మాకు ఒక పాఠ్యగ్రంథం.

బి.ఎ. పరీక్షలకి ముందే ఒక సంబంధం నిశ్చయించారు నాకు. కానీ అది అనుకోకుండా కేన్సిల్ అయిపోయింది. అప్పుడు నన్ను మా అన్నయ్య హైదరాబాదు తీసుకొచ్చి ఎం.ఎ.లో చేర్పించాడు. అతికష్టంమీద నిజాం కాలేజిలో పొలిటికల్ సైన్స్‌లో

సీటు దొరికింది. మా అన్నయ్య స్నేహితుడు, సీనియర్, ప్రొ॥ నండూరి సుబ్బారావుగారు, ఉస్మానియా యూనివర్సిటీలో డీన్ ఆఫ్ సైన్సెస్‌గా ఉండేవారనుకుంటాను. ఆయన ద్వారా నాకు సీటు లభించింది.

బూర్గుల నరసింగరావు నా క్లాస్‌మేట్. నాతో స్నేహపూర్వకంగా మాట్లాడేవాడు. విద్యార్థుల తెలుగు అసోసియేషన్‌కి నన్ను జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. వెంకట్రామారెడ్డి అని ఒక విద్యార్థి– భోన్‌గిర్ అనుకుంటాను వాళ్లది. అతని ప్రోద్బలంతోనే ఆ బాధ్యతని చేపట్టాను.

రాజమండ్రిలో మా ఇంట్లో రేడియో ఉండేది కాదు. హైదరాబాదు వచ్చాక మా అన్నయ్య ఇంట్లో రేడియో వినడం అలవాటైంది. ప్రసంగాలూ, నాటకాలూ వినడం చాలా ఇష్టపడేదాన్ని. నాకూ నాటకాల్లో వెయ్యాలనిపించి, ఆడిషన్‌కి అప్లై చేశాను. ఆ రోజుల్లో ఇంత జనాభా లేదు. ఇంత పోటీ లేదు. వెంటనే నన్ను ఆడిషన్‌కి పిలిచారు. నన్ను అంగీకరించారు. నాటకాలకీ, మహిళా కార్యక్రమంలో చిన్న చిన్న ప్రసంగాలకీ నాకు ప్రోగ్రాములివ్వడం మొదలుపెట్టారు. అప్పుడే భాస్కరభట్ల కృష్ణారావుగారితో పరిచయం అయింది. నేనెవరో, నా నేపథ్యం ఏమిటో తెలియకపోయినా ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారు. నేను ప్రసంగవ్యాసం రాసినప్పుడు అందులో గ్రాంథిక ఛాయలు ఎక్కడా లేకుండా వ్యావహారికశైలిలో ఎలా రాయాలో కొన్ని సూచనలిచ్చారు. ఇంటర్‌మీడియెట్‌లో నేను చదివిన 'బేరెట్స్ ఆఫ్ వింపోల్ స్ట్రీట్' నాటకాన్ని 'పెంపకం' పేరుతో తెలుగులోకి అనుసరణ చేశాను. అది రేడియోలో ప్రసారం అయింది. ప్రసారం చేయడానికి అంగీకరించారని తెలియజేయగానే మా నాన్నగారు ఆ నాటకం స్క్రిప్టు కాపీని పంపించమని రాశారు. భయపడుతూనే పంపించాను. ఆ నాటకంలో తండ్రి ఒక నియంతలా ప్రవర్తిస్తాడు. పిల్లల్ని ఎప్పుడూ భయభక్తులతో ఉండేట్లు పెంచుతాడు. వాళ్లపై ప్రేమ చూపిస్తే ఎక్కడ చెడిపోతారో అన్నట్లుగా ఎప్పుడూ అధికారయుతంగా మాట్లాడుతుంటాడు. పిల్లలకి ఆయనంటే భయం తప్ప ప్రేమ ఉండదు. చివరికి పెద్దకూతురు తండ్రితో చెప్పకుండా తను ప్రేమించినవాణ్ణి పెళ్లి చేసుకోవడానికి ఇంట్లోంచి వెళ్లిపోతుంది. ఆ వ్యవహారంలో చెల్లెలు సహాయపడుతుంది తండ్రిమీద కోపంకొద్దీ.

మా నాన్నగారు ఆ నాటకం చదివి నాకు పెద్ద ఉత్తరం రాశారు. తనకు పిల్లలపై ప్రేమ తప్ప మరోభావం లేదనీ, తన ప్రవర్తనని ఎప్పుడూ అపార్థం చేసుకోవద్దనీ కోరారు. ఆయన మొదటిసారి మనసువిప్పి మాట్లాడినట్లనిపించింది. అప్పటినుంచీ ఉత్తరాల్లో నేను కూడా ఎన్నో విషయాలు స్వేచ్ఛగా రాసేదాన్ని. కానీ మనిషి ఎదురుపడితే మాత్రం భయంతో బిగుసుకుపోవడం మానలేదు. మా నాన్నగారు నాకు ముప్ఫయి ఏళ్లపాటు

ఇంగ్లీషులో రాసిన ఉత్తరాల్లో ఎన్నో రకాల విషయాలు ముచ్చటించారు. మా నాన్నగారు పోయిన తరవాత ఆయన ఉత్తరాల్లోంచి కొన్నిటిని ఎంపికచేసి అనువదించి, వాటిలోంచి కొన్ని భాగాల్ని తీసుకుని, వాటిపైనా, ఆయన అభిప్రాయాలపైనా, ఆయన ప్రవర్తనపైనా వ్యాఖ్యానిస్తూ, షష్టిపూర్తి తరవాత ఆయన గడిపిన జీవితం గురించి 'ఓ తండ్రి కథ'లా 'మృత్యుంజయ' అనే పుస్తకం రాశాను. అదొక విలక్షణ ప్రయోగం అయింది. చాలామందిని ఆకట్టుకుంది.

1950లలో మా వదిన రుక్మిణీగోపాల్ అన్న పేరుతో అప్పుడప్పుడు కథలు రాస్తూఉండేది. పోతుకూచి సాంబశివరావుగారూ, భాస్కరభట్లకృష్ణారావుగారూ, నాయని కృష్ణకుమారిగారూ మొదలైనవాళ్లు రాసే రోజుల్లోనే తనూ రాస్తూండేది. రేడియోలో కూడా తన కథలూ, ప్రసంగాలూ వచ్చేవి. తన అనుభవాల ఆధారంగానూ, నేను చెప్పిన నా అనుభవాల ఆధారంగానూ కొన్ని కథలు రాసింది. అప్పుడు నాకూ ఉత్సాహం పుట్టింది– నేనూ ఎందుకు రాయకూడదని.

అప్పటివరకూ నాకు పత్రికలూ, నవలలూ చదివే అలవాటు పెద్దగా లేదు. రాజమండ్రిలో ఉండగా క్లాసుపుస్తకాలూ, వార్తాపత్రికలూ తప్ప ఫిక్షన్ చదవలేదు. మా వదిన పుట్టింటినుంచి వస్తూ దారిలో రైల్లో కొనుక్కున్న చిన్ననవలలూ అవీ తెచ్చుకుని చదువుతూ ఉండేది. ఒకసారి 'బర్త్ కంట్రోలు' అనే పుస్తకం చదువుతుంటే తీసుకుని చదవబోయాను. అసలు శీర్షికే అర్థంకాలేదు. 'భర్త కంట్రోల్' అయి ఉంటుంది, అచ్చుతప్పు పడింది అనుకున్నాను. సరిగ్గా ఆ సమయంలో మా నాన్నగారు ఆ పుస్తకాన్ని నా చేతిలో చూసి ఛడా మడా తిట్టారు. అప్పటినుంచీ ఏ నవలలూ చదవలేదు. మా వదినకి మాత్రం మా లైబ్రరీ నుంచి తెచ్చిపెడుతూ ఉండేదాన్ని. చదివి తను నాకు కథ చెప్పేది.

'భారతి' పాత సంచికలు బైండ్ చేసినవి కొన్ని సంపుటాలు మా నాన్నగారి దగ్గర ఉన్నాయని నేను బి.ఎ. చదువుతున్నప్పుడు గాని తెలిసిరాలేదు. ఓసారి ఆయన అలమార్లలోని 'లా' పుస్తకాలన్నిటినీ దుమ్ముదులపమనీ, మళ్లీ ఎక్కడి పుస్తకాలు అక్కడే అదే వరసలో పెట్టమనీ ఆదేశించి కోర్టుకి వెళ్లారు. ఒక అలమార్లో కింద వరసలో 'భారతి' సంపుటాలు కనపడ్డాయి. అందులో వచ్చిన కథలకన్నా పెయింటింగ్స్ నన్ను ఆకర్షించాయి. 30లు–40లు నాటి సంపుటాలు అవి. మా నాన్నగారు ఇంట్లో లేనప్పుడూ, నాకు వీలున్నప్పుడూ ఆ సంపుటాలు తెరిచి చూస్తూండేదాన్ని. కథలూ నాటికలూ చదవడానికి ప్రయత్నించేదాన్ని. నా క్లాసుపుస్తకాల్లో 'మృచ్ఛకటికం' అంటే చాలా ఇష్టపడేదాన్ని కాలేజిరోజుల్లో.

హైదరాబాదులో మా వదిన వారపత్రికలు కొనేది. వాటి ప్రభావంతో, నిజాంకాలేజి

మేగజీన్‌కోసం ఒక చిన్నకథ రాశాను. 'అనుభూతి' అనే కథ. మా నాన్నగారి నియంతృత్వ ధోరణి గురించి హాస్యస్ఫోరకంగా రాసినకథ అది. అయినా, ముగింపులో కథానాయిక తన భర్తను సంతోషపెట్టడంలోనే తన సంతోషం ఇమిడిఉందని గ్రహిస్తుంది. ఉత్తమ పురుషలో రాశాను ఆ కథని. దాన్ని మా నాన్నగారు చదివి, నన్ను పిలిచారు. భయపడుతూ దగ్గరికి వెళ్లాను. "ఫైన్ సెంటిమెంట్స్ ఎక్స్‌ప్రెస్ చేశావు. ఇట్ షోస్ మెచ్యూరిటీ!" అన్నారు! అయితే, కరివేపాకు కొనడానికి 'కానీ-డబ్బు' దగ్గరనుంచి ఆయన్ని అడగాలి అని మా అమ్మ బాధపడటం, మేము వేసుకునే బట్టల విషయంలో కూడా మాకు స్వేచ్ఛ లేకపోవడం మొదలైన అనుభవాలతో ఆ రోజుల్లోనే 'స్త్రీ స్వేచ్ఛాభావన'కి బీజం నా మనసులో నాటుకుంది.

ఇన్ని తెలిసినప్పటికీ, పెళ్లి చేసుకుని మా నాన్నగారి ఆధిపత్యం నుంచి బయటపడితే నాకు స్వేచ్ఛ లభిస్తుందని ఊహించుకునేదాన్ని!

భాస్కరభట్ల కృష్ణారావుగారు, 'భర్తని ఎన్నుకోవడం ఎలా?' అనే విషయం మీద మాట్లాడమని కాంట్రాక్టు పంపించారు. పెద్దలే సంబంధాలు నిశ్చయించే మన వ్యవస్థలో స్వయంగా భర్తని ఎన్నుకోవడం అన్న ప్రశ్నే రాదు. అయినా, ఉన్న పరిస్థితుల్లో ఆడపిల్లలు ఎలా ఆలోచించాలి అనే అంశంమీద రాశాను. కట్నం పుచ్చుకునేవాడిని చేసుకోకూడదని ఆడపిల్లలు కృతనిశ్చయంతో ఉండాలనీ, ప్రేమ వివాహం అంటూ గుడ్డిగా ప్రవర్తించడం మంచిదికాదనీ, ముందువెనకలు ఆలోచించాలనీ రాశాను.

భాస్కరభట్ల కృష్ణారావుగారు నా ప్రసంగం అయిపోయాక, నా పెళ్లిప్రసక్తి తీసుకొచ్చారు. "ఏదైనా మంచి సంబంధం తీసుకొస్తే చేసుకుంటావా?" అని అడిగారు. కట్నం తీసుకోనివాడైతే చేసుకుంటాను అన్నాను.

ఆ తరవాత ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారూ, కృష్ణారావుగారూ కలిసి మా అన్నయ్య ఇంటికి వచ్చి, వరద రాజేశ్వరరావుగారి సంబంధాన్ని సూచించారు.

మా అన్నయ్య మద్దాలి గోపాలకృష్ణ, మా బావ కాళ్లకూరి మాణిక్యాలరాజు, కొత్తపల్లి వీరభద్రరావు, బాలాంత్రపు రజనీకాంతరావు, వి.వి.రామనాథం, ఎ.ఎస్.రామన్, అబ్బూరి వరదరాజేశ్వరరావు మొదలైనవారందరూ ఆంధ్రా యూనివర్సిటీలో సమకాలికులు-విద్యార్థులుగా. వాళ్లకీ నాకూ మధ్య పది- పదమూడేళ్ల అంతరం ఉంది. నేనింకా అప్పటికి స్కూల్లో చదువుతున్నాను.

వధూవరులమధ్య పదేళ్లతేడా ఉన్నా అభ్యంతరం ఉండేది కాదు ఆ రోజుల్లో మామూలుగా తీసుకునేవారు. మా అన్నయ్య చెప్పాడు- వరద రాజేశ్వరరావు ఎక్కువగా

సాహిత్య కార్యక్రమాల్లోనూ, పాలిటిక్స్‌లోనూ మునిగి ఉండేవాడు; ఎప్పుడూ ఆకాశంకేసి చూస్తూండేవాడు అని.

రాయప్రోలు రాజశేఖర్, ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారూ, వరద రాజేశ్వరరావుగారూ, భాస్కరభట్ల మా ఇంటికొచ్చారు పెళ్లిచూపులికి. నేను లోపలనుంచి హాల్లోకి వచ్చినప్పుడు సరిగ్గా అందరినీ పరిచయం చెయ్యలేదు. ఎదురుగా కుర్చీలో కూర్చుని మధ్యమధ్య చిరునవ్వులు చిందిస్తున్న అతనే పెళ్లికొడుకు అనుకున్నాను. కానీ అతను రాజశేఖర్ అని తరవాత మాటల సందర్భంలో తెలిసింది. రాజేశ్వరరావుగారు ఓ మూలనున్న కుర్చీలో కూర్చుని వాళ్లనాటి ఆంధ్రా యూనివర్సిటీ కబుర్లు చెబుతూ అందరినీ నవ్విస్తున్నారు. నాకేసి ఒక్కసారి కూడా చూడలేదు. వెళ్లేటప్పుడు నమస్కారం పెట్టినా చూసీచూడనట్లు వెళ్లిపోయారు. ఈ సంబంధం ఇష్టం లేదేమో అనుకున్నాను.

నాలుగు రోజులు పోయాక, భాస్కరభట్ల ఇంటికి నన్ను పంపించమనీ, నాతో మాట్లాడాలనుకుంటున్నారనీ కబురు చేశారు మా అన్నయ్యకి. నన్ను తీసికెళ్లి భాస్కరభట్ల ఇంట్లో దిగబెట్టి వెళ్లిపోయాడు మా అన్నయ్య.

అక్కడ మరో ఇద్దరు స్నేహితులున్నారు. పరిచయాలు అయాక, మమ్మల్నిద్దర్నీ హాల్లో వదిలేసి వాళ్లంతా వరండాలోకి వెళ్లిపోయారు. మేమిద్దరం ఎదురెదురుగా కుర్చీల్లో కూర్చున్నాం. కొంచెంసేపు నేలకేసీ, కొంచంసేపు సీలింగ్‌కేసీ, కొంచెంసేపు చుట్టూ ఉన్న గోడలకేసీ చూస్తూ కూర్చున్నాం. ఆయన పిలిపించారు కదా, ఆయనే పలకరిస్తారు అని నేను మౌనంగా ఊరుకున్నాను. ఆయన అంతకంటె మౌనంగా కూర్చున్నారు. చివరికి ఆ నిశ్శబ్దాన్ని భరించలేక దాదాపు పదిహేను నిముషాల తరవాత ఆ స్నేహితులు లోపలికి వచ్చేశారు. "ఇంత సైలెంట్‌గా ఏం జరుగుతోందిక్కడ?" అంటూ. అందరూ నవ్వుకున్నారు. అందరూ కలిసి నన్ను కారులో తీసికెళ్లి మా అన్నయ్య ఇంటిదగ్గర దిగబెట్టేశారు. కారు దిగాక నేను పెట్టిన నమస్కారానికి మొహమాటంగా చెయ్యి ఊపారు ఆయన. ఆ తరవాత పెళ్లికి ఎన్ని అవాంతరాలొచ్చాయో, చివరికి వరదల్లో చచ్చిచెడి పెళ్లి రాజమండ్రిలో ఎలా జరిగిందో అదంతా వేరే కథ.

మా పెళ్లయిన మరుసటి సంవత్సరంలోనే శ్రీశ్రీ, ఆరుద్ర హైదరాబాదుకి వచ్చారు ఏదో రేడియో ప్రోగ్రాంకోసం. మేము హిమాయత్‌నగర్‌లో 'అఫ్సర్ మంజిల్' అనే ఇంట్లో ఉండేవాళ్లం. అక్కడే కూర్చుని ముగ్గురూ కలిసి "మేమే" అనే విలక్షణ కావ్యాన్ని రచించారు. వాళ్లు ముగ్గురూ కలిసి పోటీలమీద పద్యాలు చెప్పుకుంటూ రాస్తూంటే చూసే అదృష్టం నాకు కలిగింది.

అదే సంవత్సరంలో 'కవిత' అనే కవితాపత్రికని ప్రారంభించారు. ఏల్చూరి, అజంతా, రాజశేఖర్ దాదాపు రోజూ సాయంకాలం వచ్చేవారు. అప్పుడప్పుడు విశాఖపట్నం నుంచి అబ్బూరి, మద్రాసు నుంచి శ్రీశ్రీ, ఆరుద్ర వచ్చేవారు. ఇంట్లో సాయంకాలం నుంచి అర్ధరాత్రి వరకూ చర్చలు జరుగుతూండేవి. సీసాలు ఖాళీ అవుతూ ఉండేవి. వాళ్లకి కావాల్సినవి సమకూరుస్తూ ఉండేదాన్ని. ఆ సంగతి తెలిసి, మా వాళ్లకి చిత్రంగా అనిపించేది. ఆయన్ని నేను నిరోధించకపోగా, ప్రోత్సహిస్తున్నానని అనుకునేవారు. నా ఉద్దేశం వేరు. నేను విసుక్కున్నా, అభ్యంతరం చెప్పినా, వాళ్లు చేసేది మానరు. బయటికి వెళ్లి ఎక్కడో కూర్చుంటారు. అర్ధరాత్రివరకూ ఇంట్లో నేను ఒక్కర్తినీ ఒంటరిగా ఉండాలి. వాళ్లు ఇక్కడే ఉంటే, వాళ్ల చర్చలవీ వింటూంటే నాకూ కాలక్షేపం అవుతుంది, కొత్త విషయాలు తెలుసుకున్నట్లవుతుందని వాళ్లందరినీ హృదయపూర్వకంగా ఆహ్వానించేదాన్ని. మా వారు 'కవిత' పత్రిక మీద సంపాదకురాలిగా నా పేరు వెయ్యడానికి నిశ్చయించారు. నిజానికి ఆ రోజుల్లో నాకు ఆ విషయమై ఏ విధమైన సంకోచమూ కలగలేదు. ఏదో, నన్ను ప్రోత్సహిస్తున్నారు అని సంబరపడ్డాను కాని, అదెంత బాధ్యతాయుతమైన వ్యవహారమో గ్రహించలేదు. ఇప్పటికీ ఆ భారాన్ని మోస్తున్నట్లుగానే అనిపిస్తుంది నాకు. అలాగే, తరవాత ప్రచురించిన 'Modern Telugu Poetry' అనే ఆంగ్లానువాదాల సంకలనం కూడా నా పేరుతో వెలువడింది.

'కవిత' పత్రికమీద వచ్చిన సమీక్షల గురించి కొంత చెప్పాలి. 'కవిత' సంచికలలో శ్రీశ్రీ, ఆరుద్ర, బైరాగి, పఠాభి, తిలక్, అజంతా వంటి వచన కవితా వైతాళికుల కవితలు– అందరూ ఇప్పటికీ చెప్పుకునే ప్రసిద్ధ కవితలు కొన్ని ఉన్నాయి. వాటిపట్ల నిరసన, తిరస్కారం ప్రదర్శిస్తూ ఆంధ్ర పత్రికలోనూ, 'భారతి'లోనూ సమీక్షలు వచ్చాయి. వాటికింద, రాసినవారి పేరు లేకపోయినా, ఆ సమీక్షలు చేసినది పిలకా గణపతిశాస్త్రి గారని విన్నాను. వాటికి సమాధానంగా శ్రీశ్రీ మరో సమీక్ష రాశారు 'తెలుగు స్వతంత్ర'లో. ఈ తరం వచనకవులు అందరూ చదవవలసిన సమీక్షలు అవి. వాటిని నేను 'వరదస్మృతి' గ్రంథంలో చేర్చాను తరవాత.

సంపాదకురాలిగా నా పేరుతో వచ్చిన ప్రచురణలే కాకుండా, నా అంతట నేను రాసినవి కూడా లేకపోలేదు. ఇంట్లో ఉన్న ఆంగ్ల సాహిత్యాన్నీ, ఇతర భాషలనుంచి ఇంగ్లీషులోకి వచ్చిన అనువాదాల్నీ చదువుతూండేదాన్ని ఏదైనా బాగా నచ్చితే తెలుగులోకి అనువదించడానికో, అనుసరణ చేయడానికో ప్రయత్నించేదాన్ని. చెహోవ్‌ది 'ప్రపోజల్' అనే నాటకాన్ని 'ప్రధానం' అనే పేరు పెట్టి అనుసరణ చేశాను. ఆ నాటకాన్ని మంత్రి శ్రీనివాసరావు ప్రభృతులు రంగస్థలం మీద ప్రదర్శించారు. అలాగే స్టెఫాన్‌జ్వైక్ అనే

ఆస్ట్రియన్ రచయితవి జర్మన్ నుంచి ఆంగ్లంలోకి అనువాదమయిన కథలు కొన్నిటిని తెలుగులోకి నేను అనుసరణచేస్తే, 'అపరిచితలేఖ, ఇతరకథలు' పేరుతో 1956లో ప్రచురించడం జరిగింది. ఆ రచయిత పేరుని మనవాళ్లు 'స్టీఫాన్‌జ్వీగ్' అంటారు. కానీ, అసలు 'స్టెఫాన్ త్స్వైక్' అని ఉచ్చరించాలని ఈ మధ్యనే CIEFL లో జర్మన్ అధ్యాపకుల ద్వారా తెలుసుకున్నాను. ఆ పుస్తకాన్ని ఈ మధ్యనే పునర్ముద్రించాను.

అంతకుముందు పిల్లలకోసం వివిధ దేశాల జానపద గాథల్ని ఇంగ్లీషునుంచి తెలుగులోకి అనుసరణ చేశాను. అవి "అనగా అనగా" అనే పేరుతో పుస్తకరూపంలో వచ్చాయి. ఇన్ని చేస్తున్నా, ఇంకా ఊరికే కూర్చున్నట్లు అనిపించి, నన్ను జర్నలిజం కోర్స్‌లో చేర్పించారు మా వారు. రెండు నెలల తరవాత మానేశాను. నాకు నప్పలేదు అనిపించింది. దానికి కావాల్సిన చొరవా, ధైర్యం నాకు లేవు.

తరవాత ఆంధ్ర యువతీ మండలిలో సభ్యురాలినయాను. వరదరాజేశ్వరరావుగారు అందించిన సదుపాయాలతో ఆంధ్రయువతీమండలి తరఫున 'వనిత' అనే మాసపత్రికని ఎడిట్ చేసి ఏడాదిపాటు నడిపాను. నాయని కృష్ణకుమారి, తురగా జానకీరాణి, ఉన్నవ విజయలక్ష్మి, ఎస్.రాజ్యలక్ష్మి, రుక్మిణీగోపాల్ మొదలైన వారందరిచేతా కథలూ, వ్యాసాలూ రాయించేదాన్ని. యెల్లాప్రగడ సీతాకుమారిగారి రచనని చాలా ఆలస్యంగా ఇచ్చారు వార్షిక సంచికకోసం. ఆలస్యం అయిపోయి ఆవిడ రచనని చేర్చడం కుదరలేదు. ఆవిడకి కోపంవచ్చి నన్ను తీవ్రంగా విమర్శించారు. దాంతో నాకు దుఃఖంవచ్చి, ఆ బాధ్యతని వదిలిపెట్టేశాను.

పెళ్లయి నాలుగేళ్లయినా పిల్లలు పుట్టే సూచనలు కనిపించలేదు. ఉద్యోగం చెయ్యమన్నారు. లెక్చరర్‌గా చేసే ధైర్యంలేదు. విద్యార్థులు అవహేళన చేస్తారని భయపడేదాన్ని. అందుకని లైబ్రరీసైన్స్ చదవమన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌కి మా మామగారు అబ్బూరి రామకృష్ణరావుగారే హెడ్. వాల్తేరు వెళ్లి 1957-58లో ఆ కోర్స్ చేశాను. పరీక్షలైపోగానే ఢిల్లీకి తరలివెళ్లిపోయాం ఉద్యోగాల అన్వేషణకోసం. అప్పటికే వరదరాజేశ్వరరావుగారు 'బిర్లాస్'లో చేసిన ఉద్యోగం మానేశారు.

1958 జూన్‌లో ఢిల్లీ వెళ్లాం. హైదరాబాదుకి చెందిన హరిశ్చంద్ర హెడాగారు ఎం.పి.గా ఉండేవారు. హెడా దంపతులతో పాటు వారి ఇంట్లో కొన్ని నెలలపాటు ఉన్నాం. ఆ సమయంలోనే వరదరాజేశ్వరరావుగారు "మోడర్న్ ఇండియన్ పోయెట్రీ" అనే సంకలనాన్ని- ప్రముఖ భారతీయ భాషల్లో వచ్చిన కొన్ని కవితల ఆంగ్లానువాదాల్ని సేకరించి ఒక సంకలనాన్ని ప్రచురించారు. దాన్ని నెహ్రూకి అంకితం చేశారు. పుస్తకం

కాపీని ఆయనకి బహూకరించడానికి నెహ్రూ జన్మదినం రోజున ఆయన గృహానికి వెళ్లాం, హెడా దంపతులతో కలిసి. ఆ పని అయిన తరవాత 'మోడర్న్ తెలుగు పోయెట్రీ' కాపీని కూడా నన్ను నెహ్రూకి ఇమ్మన్నారు మా వారు. 1956లో ప్రచురించిన సంకలనం అది. నేను మొహమాటపడి, పక్కనున్న ఇందిరాగాంధీ చేతికిచ్చాను. ఆవిడ ఆ పుస్తకాన్ని తండ్రి చేతికిస్తూ, "షి ఈజ్ ది ఎడిటర్ ఆఫ్ దిస్ వాల్యూమ్" అన్నారు నన్ను చూపించి. నెహ్రూ నాకేసి చూసి, "ఇస్ లడ్కీనే కియా!" అన్నారు. నేను మరీ చిన్నపిల్లని కాదు. పాతికేళ్లున్నాయి. నా అసలు రహస్యాన్ని- అంటే, ఆ సంకలనాన్ని రూపొందించినది మా వారేనన్న సత్యాన్ని నెహ్రూ కనిపెట్టేశారనిపించి, సిగ్గుపడి తలవంచుకున్నాను. నేను చెయ్యనిపనికి పేరు రావడం, ఆ పేరుని వెయ్యడం దుర్భరం అనిపిస్తుంది ఇప్పటికీ.

మేము వెళ్లిన సమయానికే ఒక పాములవాడు రావడం, నెహ్రూ మెడలో కోరలు తీసిన పాముని వేస్తానంటే నెహ్రూ ధైర్యంగా వేయించుకోవడం, అది చూసి ఇందిరాగాంధీ మండిపడి పాములవాణ్ణి చివాట్లువేస్తే, నెహ్రూ ఆవిణ్ణి సముదాయించడం- అదంతా చూశాక ఇందిరాగాంధీ ఝాన్సీ లక్ష్మీబాయిలా అనిపించింది నాకు.

న్యూ ఇయర్ డేకి, ఝాన్సీ లక్ష్మీబాయి బొమ్మచేసి కార్డుమీద అతికించి ఇందిరాగాంధీకి గ్రీటింగ్స్ పంపించాను. అది చాలా బావుందని ప్రశంసిస్తూ కార్డు రాసి పంపించారు ఆవిడ.

మాకు ఉద్యోగాలు లభించాక, మరో ఇంటికి మారాం. తరవాత 15 పూసారోడ్ ఇంట్లో దాదాపు రెండు దశాబ్దాలపాటు ఉన్నాం. 10 డౌనింగ్ స్ట్రీట్ అంత ప్రసిద్ధికెక్కింది ఆ ఇల్లు. ఆ ఇంటికి ఆగ్నేయ (ఎస్.హెచ్.వాత్స్యాయన్), కపిలా వాత్స్యాయన్, అమృతప్రీతమ్, కేశవ్ మల్లిక్, రిచర్డ్ బార్థలోమియో, డా॥ ప్రభాకర్ మాచ్వే, సురేష్ అవస్థి, పి.లాల్ మొదలైన ప్రముఖ రచయితలెందరో వచ్చారు. ఒకసారి పి.లాల్ అత్యంత శ్రావ్యంగా పద్యపఠనం చేశాడు ఇంగ్లీషులో. నిజ్జిమ్ ఎజికిల్ వచ్చి కొన్ని రోజులపాటు ఉన్నాడు మా ఇంట్లో. వాళ్లందరికీ నేను రచయిత్రినని తెలియదు. అప్పటికి నాకు కథారచయిత్రిగా ప్రత్యేకమైన గుర్తింపు రాలేదు. 1963లో మా ఇంటి పైవాటాలో వాకాటిపాండురంగారావుగారు ఉన్నారు కొన్నాళ్లు కుటుంబంతో సహా. నేను కథలు రాస్తానని తెలియదు ఆయనకి. 1955లో 'తెలుగు స్వతంత్ర'లో నా కథ పడిన తరవాత, సూర్యదేవర రాజ్యలక్ష్మిగారు ప్రచురించిన 'తెలుగుదేశం' అనే పత్రికలోనూ, నేను సంపాదకత్వం వహించిన 'వనిత' పత్రికలోనూ తప్పించి, మళ్లీ పదేళ్లపాటు ఏ ప్రముఖ పత్రికలోనూ నా కథ రాలేదు. నా ఉద్యోగం గొడవలో మునిగిపోయాను. మధ్య మధ్య బొమ్మలు చేయడం- అంతే.

'జ్యోతి' మాసపత్రిక చూసిన తరవాత, ఆ స్థాయిలో కథ రాయాలనిపించింది. 'ప్రయాణం' అనే పెద్ద కథ రాసి పంపించాను. నాలుగు సంచికలలో ధారావాహికంగా ప్రచురించారు. ఆ కథ మంచి గుర్తింపుని పొందింది. తరవాత మళ్లీ 'జ్యోతి' ప్రత్యేక సంచికలో వచ్చిన 'సుఖాంతం' అనే కథ. దాన్ని చాలామంది ఇప్పటికీ 'నిద్రకథ'గా గుర్తుపెట్టుకుంటారు. బాల్యంలో చదువులవల్లా, పెళ్లయాక భర్త, పిల్లలూ, ఇంటిపనుల బాధ్యతలవల్లా, ఎదుగుతున్న పిల్లల గురించి దిగులువల్లా, అస్వస్థతా, వృద్ధాప్యం మూలంగా నిద్ర సరిగాపట్టకపోవడం, నిద్రచాలకపోవడం జీవితమంతా నిద్రకోసం మొహం వాచినట్లు ఉండటంతో ఓ రాత్రి హాయిగా తృప్తిగా నిద్రపోదామనే కోరికతో ఉన్న నిద్రమాత్రలన్నీ వేసుకుంటుంది. తనని నిద్రలేపొద్దనీ, కంగారు పడొద్దనీ భర్తకి చిన్న చీటీ రాసిపెడుతుంది. అంతే. ఉత్తమ పురుషలో రాశాను ఆ కథని. వాకాటి పాండురంగారావుగారూ, పురాణం సుబ్రహ్మణ్యశర్మగారూ నేషనల్ బుక్ ట్రస్ట్ తరఫున ఎడిట్ చేసిన 'కథాభారతి' సంకలనంలో చేర్చారు ఆ కథని.

తరవాత అడపా తడపా 'జ్యోతి', 'ఆంధ్రప్రభ' వంటి పత్రికలలో నా కథలు వస్తూండేవి. వచ్చినప్పుడు కొందరు పాఠకుల నుంచి ప్రశంసిస్తూ లేఖలు వచ్చేవి. అవే పెద్దతృప్తినిచ్చేవి. ఢిల్లీలోనే ఉన్న ద్వివేదుల విశాలాక్షిగారూ, ఆమె భర్త ప్రొ॥ డి.ఎస్.రావుగారూ నా కథల్ని ఎప్పుడూ మెచ్చుకుంటూ ఉండేవారు.

'కన్యాశుల్కం', 'మృచ్ఛకటిక' నాటక ప్రదర్శనలకోసం ఢిల్లీ వచ్చిన అబ్బూరి, ఎ.ఆర్.కృష్ణ ప్రభృతులతో కలిసి వాసిరెడ్డి సీతాదేవిగారు కూడా వచ్చారు. అందరూ మా ఇంటికొచ్చినప్పుడు మేమిద్దరం రచయిత్రులుగా ఒకరికొకరం పరిచయం కాలేదు. ఢిల్లీలో ఉండి నేను ఎక్కువగా ఆవిడ రచనలు చదవలేకపోవడంవల్లా, అప్పుడప్పుడు మాత్రమే రాసే నా రచనలు ఆవిడ దృష్టికి రాకపోవడంవల్లా మాకు ఒకరిగురించి ఒకరికి అప్పట్లో తెలియదు. మమ్మల్ని రచయిత్రులుగా ఎవరూ పరిచయం చెయ్యలేదు కూడా. ఇప్పుడు తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. 1976-77లో నేను జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ లైబ్రరీ తరపునుంచి, ఇండో-ఫ్రెంచి కల్చరల్ ఎగ్రిమెంట్ కింద, డాక్యుమెంటేషన్ స్టడీ కోసం ఫ్రాన్స్ వెళ్లాను. నాతోపాటు ఒక విద్యార్థిని కూడా వచ్చింది. ఆ అమ్మాయి ఫ్రెంచ్‌లో ఆనర్స్ చేస్తోంది అప్పుడు. నేను వెళ్లేముందు సర్టిఫికెట్ కోర్స్ చేశాను మా యూనివర్సిటీలోనే. అక్కడికి వెళ్లాక బోర్డో అనే ఊళ్లో అందరికీ మళ్లీ ఆరు వారాలపాటు ఫ్రెంచ్ నేర్పించారు. అనేక దేశాల నుంచి, అనేక విషయాలపై అధ్యయనం చేయడానికి వచ్చిన వాళ్లు అక్కడ కలుస్తారు. ఇప్పుడు సినిమారంగంలో ప్రసిద్ధుడైన తోటతరణి అప్పుడు గ్రాఫిక్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందడానికి వచ్చాడు. నేను తెలుగుదాన్నని తెలిసి అతనికి

ప్రాణం లేచొచ్చింది. అక్కడ- అంటే ఫ్రాన్స్‌లో మొత్తం ఉన్న 9 నెలల్లో ఎక్కువభాగం పారిస్లోనూ, మూడు నెలలు- మధ్యమధ్య ఇతర ప్రాంతాలకీ వెళ్లాం అధ్యయనంకోసం. సెలవల్లో ఇటలీ, రోమ్, లండన్ చూసివచ్చాం. అక్కడ- ముఖ్యంగా ఫ్రాన్స్‌లో నేను చూసిన విశేషాల్నీ, బారిస్టర్ పార్వతీశంలాగ నేను పొందిన అనుభవాల్నీ వివరిస్తూ ఒక పెద్దవ్యాసం రాసి అక్కడనుంచే ఆంధ్రజ్యోతి దినపత్రికకి పంపించాను. నండూరి రామమోహనరావుగారు దాన్ని రెండు ఆదివారం సంచికలలో ప్రచురించారు.

ఆ వ్యాసాన్ని, తరవాత రాసిన వ్యాసాలతో పాటు చేర్చి 1995లో 'వ్యాసచిత్రాలు' పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది. అక్కడి అనుభవాల ఆధారంగా 'స్థానమహిమ' అనే కథ రెండు మూడేళ్లక్రితం రాశాను.

ఫ్రాన్స్ నుంచి తిరిగివచ్చాక, యూనివర్సిటీకి మకాం మార్చాం. అంతవరకూ పూసారోడ్ ఇంట్లోనే ఉండేవాళ్లం. కేంపస్‌కి వచ్చాక చుట్టూ వాతావరణం, ఇల్లూ బావున్నాయని చెప్పి, మా అత్తగారినీ, మామగారినీ మా వద్ద అట్టిపెట్టుకోవడానికి తీసుకొచ్చాం హైదరాబాదునుంచి. కానీ దురదృష్టవశాత్తూ వచ్చిన అయిదు నెలలకే అబ్బూరి తుంటి ఎముక విరిగింది. ఆ వయస్సులో ఇంక అతుక్కోదన్నారు. అలాగే మంచంమీద ఏడున్నర నెలలు గడిపారు. 1979 ఏప్రిల్ 30న పోయారు. మంచంమీద పడుకుని జైల్లో ఉన్నట్లుగా బాధపడేవారు. అదే కథావస్తువుగా తీసుకుని కొన్నాళ్ల తరవాత 'జైలు' అనే కథ రాశాను.

మా అత్తగారు హైదరాబాదు వెళ్లిపోయారు ఢిల్లీలో ఉండలేక. ఆవిడ ఎక్కడుండాలన్న సమస్య ఎదురైంది. వరద రాజేశ్వరరావుగారు ఉద్యోగవిరమణ చేసి కొంత కాలమైంది. నా ఒక్కరికోసం ఢిల్లీలో ఉండాలి. అదీకాక, ఆ రోజుల్లో లైబ్రరీలో రాజకీయాలు ఎక్కువైపోయాయి. అందుకని నాకూ ఉద్యోగం మానేసి హైదరాబాదు వెళిపోవాలని గట్టిగా అనిపించింది. వాలంటరీ రిటైర్‌మెంట్‌కోసం అప్లై చేశాను.

అప్పటికి డా॥ నాయుడమ్మ వైస్‌ఛాన్సలర్‌గా ఉన్నారు. ఆయన నన్ను పిలిపించి మాట్లాడారు. అంతమంచి సర్వీస్ రికార్డ్ ఉండగా, ఇంకా పదకొండేళ్ల సర్వీస్ ఉండగా ఎందుకు ఉద్యోగం మానెయ్యాలనుకుంటున్నారని అడిగారు. "హైదరాబాదులో మా అత్తగారూ, తల్లిదండ్రులూ ఉన్నారు. అందరూ వృద్ధులు. వారిని చూసుకోవలసిన అవసరం ఉంది. వాళ్లని ఇక్కడికి తీసుకురావడం కుదరదు. వాళ్లు రారు" అన్నాను. ఆయన వెంటనే, "నాకూ వృద్ధులైన తల్లిదండ్రులున్నారు. అంతమాత్రాన ఉద్యోగం మానుకుని వెడతానా?!" అన్నారు. నేను వాదించకుండా తలవంచుకున్నాను. "సరే, ఉద్యోగం మానేస్తే తరవాత జీవితం ఎలా గడుస్తుంది?" అన్నారు. "మేమిద్దరం రచయితలమే. కాస్తో కూస్తో

సంపాదించకపోలేము. లేకున్నా, ఉన్నదానితో సరిపెట్టుకుంటాం" అన్నాను. ఆయన చిరునవ్వు నవ్వి, "ఏమైనా మళ్లీ ఆలోచించుకుంటే మంచిది" అని చెప్పి పంపించారు. నిజానికి అంతగా నాకు నచ్చజెప్పవలసిన అవసరం ఆయనకేముంది? ఆయన మానవత్వం, మంచితనమే అందుకు కారణం. అటువంటి మంచి మనిషికి ఘోరమైన దుర్మరణం ప్రాప్తించింది. ఒక విమాన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. ఇటువంటి వ్యక్తులతో పరిచయం ఎంత కొద్దిపాటిదైనా చిరకాలం గుర్తుండిపోతుంది.

1982లో నేను లాంగ్‌లీవ్‌లో ఉండగానే హైదరాబాదుకి వచ్చేసి బాగ్‌లింగంపల్లిలో స్థిరపడ్డాం. అక్టోబరులో వెళ్లి ఉద్యోగ విరమణ చేసివచ్చాను. ఆ యూనివర్సిటీలో వాలంటరీ రిటైర్‌మెంట్ రూలు ఇంకా అమలులోకి రాకపోవడంవల్ల రిజైన్‌చేసి వచ్చాను. 1984లో 'ఉదయం' దినపత్రిక ప్రారంభించేటప్పుడు, ఎ.బి.కె.ప్రసాద్‌గారు మా వారినీ, నన్నూ రాయమని ప్రోత్సహించారు. ప్రారంభ సంచికలోనే 'నలుగురికోసం' అనే కథ పడింది. దాన్ని కొంతకాలం క్రితం జె.ఎల్.రెడ్డిగారు హిందీలోకి అనువదించారు. ఒక హిందీ పత్రికలో పడింది.

ఎ.బి.కె.ప్రసాద్‌గారు 'ఆంధ్రజ్యోతి'కి మారినప్పుడు 'స్త్రీశక్తి' పేజికి రాయమని ప్రోత్సహించారు. అప్పుడప్పుడు చిన్న చిన్న వ్యాసాలు రాస్తూ వచ్చాను. ఒక కవిత కూడా రాశాను. అది తరవాత 'అస్మిత' ఆధ్వర్యంలో ప్రచురింపబడిన 'నీలిమేఘాలు' అనే కవితా సంకలనంలో చోటు చేసుకుంది. ఆ పుస్తకాన్ని సాహిత్య అకాడమీ ప్రచురించే 'ఇండియన్ లిటరేచర్' పత్రికలో సమీక్షిస్తూ శ్రీనివాస్ రాయప్రోల్ నా కవితని ఇంగ్లీషులోకి అనువదించి, ప్రస్తుతిస్తూ రెండుముక్కలు రాశాడు. 1954లో నేను సంపాదకత్వం వహించిన 'కవిత' మొదటి సంచికలో నా కవిత ఒకటి ఉంది. దాన్ని ఆ రోజుల్లో రాయప్రోలు రాజశేఖర్ ఇంగ్లీషులోకి అనువదించాడు అతనికి నచ్చి. నేను రాసినవే మొత్తం నాలుగు కవితాఖండికలు- వాటిలో రెండు ఇద్దరు కవులకు నచ్చాయంటే నాకు ఆశ్చర్యానందాలు కలుగుతాయి. నిజానికి కవయిత్రినని చెప్పుకునే అర్హతా, ధైర్యం నాకు లేవు.

1989-90లో 'ఉదయం నవతరం వారపత్రిక'కి పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు ఎడిటర్‌గా ఉన్నప్పుడు అందులో నన్నొక మహిళా శీర్షికని నిర్వహించమన్నారు. 'ఉదయిని' అనే శీర్షికని ఏడాదిపాటు నిర్వహించాను. ఆ శీర్షిక కింద రకరకాల ప్రయోగాలు చేశాను ఎంతోమందికి అవకాశాన్నిస్తూ. వాటితోపాటు కొంతస్థలాన్ని నాలుగైదు వారాలపాటు 'స్త్రీల సమస్యలూ-జిడ్డుకృష్ణమూర్తి సమాధానాలూ' అని రాశాను. ఈ వ్యాసాలు నచ్చి, వాటినే మరింత విస్తృతంచేసి 'స్త్రీల జీవితం-జిడ్డుకృష్ణమూర్తి' అనే పుస్తకం నాచేత తయారుచేయించారు జిడ్డు కృష్ణమూర్తి సెంటర్‌వాళ్లు.

1990లో మొట్టమొదటిసారిగా నా కథల సంపుటాన్ని ఫణికుమార్‌గారు తనకు తెలిసిన ఉద్యమ పబ్లికేషన్స్ ద్వారా అచ్చు వేయించారు. 1993లో, మా నాన్నగారి లేఖల ఆధారంగా హైదరాబాదులోని జె.కె. సెంటర్‌వారు నేను రాసిన పుస్తకాన్నీ, అనువాదం చేసిన పుస్తకాన్నీ ప్రచురించారు. అందుకు కారకురాలు వాకాటి పాండురంగారావుగారి అమ్మాయి అపరాజిత.

నాకు బొమ్మలు చేయడం సరదా. అపరాజిత చిన్న పిల్లగా ఉన్నప్పుడు ఢిల్లీలో ఆ అమ్మాయికి బొమ్మలు చేసి ఇచ్చాను. అలాగే ఎందరికో ఇచ్చినట్లు బూదరాజు రాధాకృష్ణగారి మనవరాలికి కూడా చేసి ఇచ్చాను. 'ఈనాడు' పత్రికవాళ్లు 'వసుంధర' అనే స్త్రీల పేజీని ప్రారంభించినప్పుడు, అందులో నా చేత బొమ్మలు చేయడం గురించి రాయించమని బూదరాజుగారే వర్మగారికి సూచించారు. 'వసుంధర'లో కొన్ని నెలలపాటు వారం వారం వచ్చిన వ్యాసాల్ని 'బొమ్మలు చేయడం' అనే పుస్తకంగా ప్రచురించాను.

1996లో డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు ఆయన జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఈ వేదిక మీద నుంచే ప్రసంగించాను. సభకి వచ్చినవారిలో ఎంతోమంది వేదికమీదికి వెళ్లి ఆయన్ని సత్కరించారు. ఆ హడావిడిలో నేను చొరబడి వెళ్లలేక, నేను గోపాలరెడ్డిగారికి బహూకరించడానికి తీసుకొచ్చిన 'అబ్బూరి శతజయంతి సంపుటి'నీ, 'అబ్బూరి చాటువులు' పుస్తకాన్నీ ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారి చేతికిచ్చి గోపాలరెడ్డిగారికి అందజేయమని కోరాను.

గోపాలరెడ్డిగారు నెల్లూరు వెళ్లిన తరవాత ఎంతో ఆదరంగా నాకు ఉత్తరం రాశారు. "ఇదివరకు మిమ్మల్ని ఎక్కడ కలుసుకున్నానో గుర్తుకి రావడం లేదు. మద్రాసులోనా, కలకత్తాలోనా?' అని రాశారు. "ఢిల్లీ అబ్బూరి రామకృష్ణరావుగారు అస్వస్థులై మంచంమీద ఉండగా ఆయన్ని చూడటానికి శ్రీమతి వి.ఎస్.రమాదేవి, డా॥ కొత్తపల్లి వీరభద్రరావుగార్లతో కలిసి జె.ఎన్.యు.కేంపస్‌లో మా ఇంటికి వచ్చార"ని గుర్తు చేశాను. అంతేకాక, 1956లో డా॥ గోపాలరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను రాసిన 'అపరిచితలేఖ' పుస్తకాన్నీ, 'వనిత' పత్రికనీ మా వారి ప్రోత్సాహంతో ఆయనకి పంపించాను. గోపాలరెడ్డిగారి దగ్గరనుంచి వారం తిరక్కుండా జవాబు వచ్చింది. రైల్లో ప్రయాణం చేస్తూ నా అనుసరణ కథల పుస్తకం చదివారుట. నా శైలి చాలా సరళంగా, ధారాళంగా ఉందని ప్రశంసిస్తూ, నాకు శుభాకాంక్షలు తెలుపుతూ రాశారు. ఆ ఉత్తరం ఇప్పటికీ నా దగ్గర భద్రంగా ఉందని రాశాను. అందుకు ఆయన ఆశ్చర్యపోతూ, 'ఏమిటి? 1956 నాటి ఉత్తరాన్ని ఇంకా దాచి ఉంచారా? నేను త్వరలో మళ్లీ హైదరాబాదు వస్తున్నాను. అప్పుడు ఆ ఉత్తరాన్ని తీసుకొచ్చి నాకు చూపించగలరా?" అని రాస్తూ, నన్నూ, శ్రీమతి

సి.వేదవతిగారినీ, ఇంకా ఆయనకి తెలిసిన మిత్రుల్నీ 'మాగంటి గెస్ట్ హౌస్'కి భోజనానికి ఆహ్వానిస్తున్నట్లు రాశారు. నేను వేదవతిగారితోనూ, ఆమె భర్తగారితోనూ కలిసి వెళ్లాను. ఆ ఉత్తరాన్ని ఆయనకు చూపించి, నేను ప్రచురించిన మరికొన్ని పుస్తకాల్ని బహూకరించాను. ఆయన లోపలినుంచి శాలువా, పళ్లూ తెప్పించి, నాకు అక్కడ స్వహస్తాలతో సత్కారం చేశారు. అంతేకాక, అబ్బూరి ట్రస్ట్‌కి అయిదువందల రూపాయలు డొనేషన్ ఇచ్చారు. ఆయన పుస్తకాల సెట్‌ని కూడా బహూకరించారు. ఇదంతా నేను ఎన్నడూ ఊహించని విషయం.

ఆ తరవాత ఒకసారి వేదవతిగారింట్లో కలుసుకున్నప్పుడు శారదా అశోకవర్ధన్, వేదవతి మొదలైనవారు ఆయన గురించి రాసిన వచన కవితలు చదివారు. నేను కూడా అప్పటికప్పుడు నాలుగు పంక్తులు రాసి చదివాను. అందులో ఆఖరిపంక్తి- "ఇంకా తొంభై నిండని పసివాడు" అని రాశాను. అది ఆయనకి చాలా నచ్చింది. నేను ఇంకా తొంభై నిండని పసివాణ్ణా! అని పదేపదే అంటూ పసివాడిలాగే సంబరపడ్డారు.

మొన్నీమధ్య రేడియోలో ఉదయం 'భావన' కార్యక్రమంలో నేను రవీంద్రుని సాహిత్యం గురించి ప్రసంగించవలసి వచ్చినప్పుడు డా॥ గోపాలరెడ్డిగారిచ్చిన కొన్ని పుస్తకాలు నాకు చాలా ఉపయోగపడ్డాయి.

ఈ మధ్య ఎంతోమంది నుంచి ఒక ప్రశ్నని ఎదుర్కొంటున్నాను. మాజీ ప్రధానమంత్రి శ్రీ పి.వి.నరసింహారావుగారి నవలకి రాసుకున్న ముందుమాటలో ఇతరులతో పాటు నాకు కూడా కృతజ్ఞతలు చెప్పడం ఎలా జరిగిందని. నిజానికి అందులో నా ప్రమేయం అంతగా ఏమీ లేదు. ఇరవై రెండేళ్ల క్రితం, ఆ నవలని రాయడం మొదలుపెట్టిన కొత్తలో కొన్ని అధ్యాయాలు చూపించి నా అభిప్రాయాన్ని అడిగారు. మెచ్చుకుని ప్రోత్సహించాను. అంతమాత్రాన నాకు కృతజ్ఞతలు తెలపడం ఆయన గొప్పతనాన్ని సూచిస్తుంది. అంతే.

మేము ఢిల్లీలో ఉంటున్నప్పుడు పి.వి.గారు కేంద్రంలో ఏ పదవిలోనూ లేనప్పుడు మా ఇంటికి తరచుగా రాజేశ్వరరావుగారితో రాజకీయాలు చర్చించడానికి వస్తూండేవారు. మా డ్రాయింగ్‌రూమ్‌లో అలమారులో ఉన్న పుస్తకాల్ని చూస్తూండేవారు మధ్య మధ్య. నేషనల్ బుక్ ట్రస్ట్‌వారు 1972లో ప్రచురించిన 'కథాభారతి' అనే తెలుగు సంకలనానికి వచ్చిన హిందీ అనువాదాన్ని చూశారు. హిందీలో నా కథ 'సుఖాంతం' చదివి, అనువాదం ఇంతకన్న బాగా చెయ్యొచ్చు అన్నారు. కొన్నాళ్ల తరవాత, నా కథలు ఇంకా ఏవైనా ఉంటే చూపించమన్నారు. అప్పటికి నా కథా సంపుటం ఏదీ రాలేదు. విడివిడిగా ఉన్న

కథలవే జిరాక్స్ కాపీలు ఇచ్చాను. "ఇటువంటి కథలు రాసినా మీకు పేరెందుకు రాలేదు?" అన్నారు ఆశ్చర్యంగా. నేను అంత ఎక్కువగా ఏమీ రాయలేదు కదా అన్నాను. ఆ తరవాత, ఆయన ఇంగ్లీషులో రాసిన కొన్ని రాజకీయ కథలను- టైప్డ్ కాపీలను ఇచ్చి, చదివాక ఎలా ఉన్నాయో చెప్పమన్నారు. నేను ఊహించినదానికన్న బావున్నాయని సంభ్రమంగా చెప్పాను. ఆ తరవాత, ఆయన ప్రారంభించిన నవలలోని కొన్ని అధ్యాయాల్ని నాకు చూపించి నా అభిప్రాయాన్ని చెప్పమన్నారు. ఆయన్ని ప్రోత్సహించాను. తరవాత ఆ నవలలోని పాత్రలపేర్లూ అవీ మార్చిన సంగతి పుస్తకం చూశాక తెలిసింది నాకు.

అలాగే ఎలెక్షన్ కమిషనర్స్‌లో ఒకరైన జి.వి.జి.కృష్ణమూర్తిగారు 1960లలో తాత్కాలికంగా నిరుద్యోగ దశలో ఉన్నప్పుడు, నేను సప్రూ హౌస్‌లో ఉన్న ఇండియన్ స్కూల్ ఆఫ్ ఇంటర్ నేషనల్ స్టడీస్ లైబ్రరీలో ఉద్యోగం చేస్తూండేదాన్ని. మా లైబ్రరీలో 'డిప్లొమసీ' మీద ఏవైనా పుస్తకాలున్నాయా?" అని అడిగారు జి.వి.జి.ఒక రోజున. "అయ్యో! లేకపోవడం ఏమిటి! ఎన్నో పుస్తకాలున్నాయి" అని చెప్పాను. మంచి పుస్తకాలు కొన్నిటిని లిస్ట్ చేసి ఆయనకిచ్చాను. ఆ పుస్తకాల్ని తీసుకుని చదివి, తరవాత మరికొన్ని తీసుకున్నారు. ఆ తరవాత 'Dynamics of diplomacy' అనే ఉద్గ్రంథాన్ని రచించారు. ఆ పుస్తకానికి ముందుమాటలో నాకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. నేను చేసినది అతి స్వల్పమైన సహాయం. అయినా, సందర్భం వచ్చినప్పుడల్లా వ్యక్తుల దగ్గరా, వేదికపైనా చెబుతూ ఉంటారు ఆయనకి నేనెంత తోడ్పడినదీ. దాన్ని గుర్తుపెట్టుకోవడం ఆయన పెద్దమనస్సుకి నిదర్శనం.

ఆంధ్రప్రదేశ్ 'గవర్న్‌మెంట్ నామినీ'గా కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యత్వానికి నా పేరు సూచింపబడటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎవరు సూచించి ఉంటారు అని ఆరా తీయగా, మరో ఇద్దరి పేర్లతో పాటు నా పేరుని ఆచార్య నాయని కృష్ణకుమారిగారు సూచించారని తెలిసింది. ఒక స్త్రీని తీసుకోవాలనుకోవడంవల్ల, నా పేరుని అకాడమీవారు ఆమోదించారని విన్నాను.

వరద రాజేశ్వరరావుగారి ద్వారానూ, నాకు స్వయంగానూ ఎన్నో రంగాలలో ఎంతోమందితో, ఎందరో మహానుభావులతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాల్ని గానీ, వాటికి సంబంధించిన అనుభవాల్ని గానీ నా కోసమూ నా రచనలకోసమూ ఉపయోగించుకున్నది చాలా అరుదు. మా వారిని మాత్రం ఒక పాత్రని చేసి 'శ్రీమతి-ఉద్యోగిని' అనే కథలోనూ, కొన్ని ఇతర కథల్లోనూ సరదాగా చిత్రించాను. "మీ కథలవల్ల వరద రాజేశ్వరరావుగారి గురించి చాలా విశేషాలు తెలిశాయి!" అన్నారు ఒకసారి కాళీపట్నం రామారావుగారు మా వారి ఎదుటే నవ్వుతూ.

మరొకరెవరైనా నా స్థానంలో ఉంటే కొన్ని వందల కథలూ, ఎన్నో నవలలూ, నాటకాలూ రాసి ఉండేవారేమో. నేను ఎక్కువగా రాయలేకపోయాను.

మొన్నీమధ్య హాస్యావధాని శంకరనారాయణగారు ఏదో పుస్తకంకోసం మా ఇంటికొచ్చినప్పుడు, వీధిగుమ్మంపైన 'అబ్బూరి' అన్న బోర్డుని చూసి, "అబ్బూరివారి వల్ల ఏదో కొంత అబ్బుతుందనుకుంటాను!" అన్నారు. వెంటనే ఏమనాలో తోచక, చిరునవ్వు నవ్వాను. తరవాత మనసులో అనుకున్నాను- నాకు మాత్రం, మేధావి లక్షణాలూ, పాండిత్యం అబ్బకపోయినా, తక్కువగా రాయడం మాత్రం బాగా అబ్బింది! అని.

ప్రతి చిన్న విషయానికీ స్పందించే మనస్సు ఉన్నా, ప్రతిస్పందనకీ సృజనాత్మక సాహితీ రూపాన్నిచ్చే శక్తిని ప్రదర్శించలేకపోయాను. రాయని ఉత్తరాల్లాగా, పూర్తిగా జ్ఞప్తికిరాని కలల్లాగా వ్యక్తావ్యక్తంగా నా మనస్సు పొరల్లోనే మాటుమణిగి ఉండిపోయాయి. అయినా నాకేమీ చింతలేదు. ఇంకా ఏదో సాధించాలన్న తపన లేదు నాకు. ఇప్పటికే నా మీద పడుతున్న కాంతిని నేను భరించలేకపోతున్నాను. ఛాయామాత్రంగా ఉండి, నాకు తోచినదీ, నేను చెయ్యగలిగినదీ చెయ్యడమే హాయిగా ఉంటుంది నాకు.

నాకీ అపూర్వమైన అవకాశాన్నిచ్చిన ఆచార్య సి. నారాయణరెడ్డి గారికి కృతజ్ఞతాభివందనాలు.



ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

కాశ్మీరదేశ చరిత్రను 'రాజతరంగిణి' అను పేరుతో అత్యద్భుత మహాకావ్య రూపంలో అందించిన, క్రీ.శ. పన్నెండవ శతాబ్దానికి చెందిన, కల్హణ మహాకవి తాను రచించిన "ఈ రాజతరంగిణి ఏడు తరంగాలతో (సర్గలతో), గోదావరీనది ఏడు మహాతరంగాలతో (ప్రవాహాలతో) విష్ణునివాసమైన సముద్రాన్ని చేరినట్లు శ్రీ కాంతరాజవంశంలో ప్రవేశించి ఈ జగత్తులో ప్రకాశిస్తూన్నది" అని అంటాడు.

"గోదావరీసరిదివోత్తుములైస్తరఙ్గైః
వక్త్రైః స్ఫుటం సపది సప్తభిరాపతన్తీ
శ్రీకాన్తరాజవిపులాభిజనస్యమధ్యే
జేజేయతే జగతి రాజతరఙ్గిణీయమ్"

మహారాష్ట్ర దేశంలో, నాసికకు ఇరవై మైళ్ల దూరంలో, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన త్ర్యంబకేశ్వరుడు వెలసిన పుణ్యక్షేత్రం, త్ర్యంబకానికి ప్రక్కనే ఉన్న బ్రహ్మగిరి అనే పర్వతం నుండి ఆవిర్భవించిన గోదావరీ నది మహారాష్ట్ర-ఆంధ్రప్రదేశ్‌లలో తొమ్మిది వందల మైళ్ల దూరం ప్రవహించి, చివరకు ధవళేశ్వరం ప్రాంతంలో ఏడు ప్రవాహాలుగా చీలి, తూర్పు సముద్రంలో ప్రవేశించింది. ఆ ఏడు ప్రవాహాలకు ఏడుగురు ఋషుల (సప్తర్షుల) పేర్లతో ఏడు నదులుగా ప్రసిద్ధి ఏర్పడింది. ఐదవ శతాబ్దానికి చెందిన కాశికాకారుడు "సప్తగోదావరమ్" అని (పా.సూ. 2.1.20) వాటినే నిర్దేశించాడు. వీటిలో కొన్ని మళ్లీ ఒకదానిలో ఒకటి కలిసిపోవడమో, కొంతదూరం ప్రవహించి అంతర్హితం అయిపోవడమో జరిగి ఇప్పుడు మూడు-నాలుగు ప్రవాహాలు మాత్రమే వివిక్తంగా

కనబడుతున్నాయి. వాటిలోని మూడునదులు (పాయలు) ఒక విశాల భూభాగాన్ని మూడు ప్రక్కలా చుట్టి నాల్గవ ప్రక్కనున్న తూర్పు సముద్రంలో కలవడంతో రెండు సుందరమైన ద్వీపాలు ఏర్పడ్డాయి. ఇవి ఒక కోణంలో ఉండడంచేత కాబోలు ఈ భూభాగానికి కోనసీమ అను ప్రసిద్ధి వచ్చింది.

ప్రస్తుతం అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట తాలూకాలుగా ఉన్నది ఒక ద్వీపం. రాజోలు తాలూకా ఒక ద్వీపం. గోదావరీనది అనుగ్రహంచేత ఈ కోనసీమ సస్యశ్యామలమై, వరిపొలాలతోను, కొబ్బరి, అరటి, పోక, మామిడి, పనస మొదలైన అనేక ఫలవృక్షాల తోటలతోను అంగుళం కూడా వ్యర్థంకాని భూభాగంతో అతి సుందరంగా ఉండి స్వర్గసీమను స్మరింపచేస్తూ ఉంటుంది.

తురుష్కుల దాడులనుండి వైదికమతాన్ని రక్షించడంకోసం కొందరు ప్రభువులు, కొందరు రెడ్డిరాజులు, కొన్ని శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబాలను కోనసీమకు తీసికొని వచ్చి, తగిన వసతులు కల్పించి వేదశాస్త్ర సంరక్షణ చేసినట్లు ప్రసిద్ధి. శాసనాల ఆధారం కూడా ఉంది. తమిళదేశం నుండి కూడ కొన్ని శ్రోత్రియ కుటుంబాలు ఇక్కడికి వలసవచ్చి అమలాపురం దగ్గర ఉన్న పేరూరు మొదలైన గ్రామాలలో కొన్ని వందల సంవత్సరాల క్రితమే స్థిరపడ్డాయి. వారికి 'ద్రావిళ్లు' అని ఈనాటికి కూడా పేరు. ఆ ద్రావిళ్లు ఇతరులను 'ఆంధ్రులు' అంటారు. కొన్ని ద్రావిడ కుటుంబాలు ఇక్కడినుంచే విశాఖపట్నం ప్రాంతానికి తరలివెళ్లాయని చెపుతారు. కోనసీమలోని బ్రాహ్మణులు చాలవరకు కేవలం వేదశాస్త్రాధ్యయనం చేస్తూ వైదికకర్మల విషయంలో మాత్రమే శ్రద్ధ చూపేవారు. ద్రావిడులలో కూడ వేద శాస్త్రాధ్యయనానికీ వైదికకర్మలకూ ప్రాధాన్యం ఉన్నా, వారిలో కొన్ని కుటుంబాలవారు దేవీ ఉపాసకులుగా కూడ ఉండేవారు. ఆ ఉపాసనకు సంబంధించిన వామాచార- దక్షిణాచారాలు రెండూ ప్రచారంలో ఉండేవి; ఇప్పటికీ ఉన్నాయి.

అమలాపురానికి సరిహద్దు గ్రామం ఇందుపల్లి. డెబ్భై- ఎనభై సంవత్సరాలక్రితం ఈ గ్రామంలో దాదాపు నూరు బ్రాహ్మణ కుటుంబాలుండేవి. వీరిలో కొందరు వేదాధ్యయనపరులు, కొందరు శాస్త్రపండితులు, కొందరు సంస్కృత కావ్యమాత్ర పరిజ్ఞానం కలవారు; చాలామంది ఇవేమీ లేకుండా ఇతర పామరులవలె జీవనయాత్ర గడిపేవారు ఉండేవారు. ఈ గ్రామమే కాదు, ఏ గ్రామం చూచినా, పూర్వకాలంలో కూడ బ్రాహ్మణులని చెప్పుకొనేవారు సకల విద్యాపారంగతులని గాని, మహా శ్రోత్రియులని కాని చెప్పడానికి వీలులేదు. అన్ని రకాలవాళ్లూ ఉండేవారు. విద్యావంతులు మాత్రం అందరిచేతా ఆదరింపబడేవారు.

ఈ గ్రామంలో ఉన్న అనేక శ్రోత్రియ కుటుంబాలలో పుల్లెలవారి కుటుంబం ఒకటి. ఈ కుటుంబంవారికి "జమీందారీ పుల్లెల" అను ప్రసిద్ధి ఉంది. దీనికొక కారణం ఉంది. కొన్ని తరాల క్రితం ఈ వంశానికి చెందిన ఒక బాలునికి పొరుగూరున ఉన్న ఒక ఆఢ్య కుటుంబికుడు తన కుమార్తెను ఇచ్చి వివాహం చేశాడు. ఆ బాలుడు ఆర్థికంగా సామాన్య కుటుంబానికి చెందినవాడైనా అతడు భవిష్యత్తులో అన్నివిధాలా గొప్ప అభివృద్ధిలోనికి వస్తాడని అతని లక్షణాలను బట్టి నిశ్చయించుకొని ఆయన వానికి బాల్యంలోనే తన కుమార్తెను ఇవ్వడం జరిగింది. ఇది "వివాహశ్చ వివాదశ్చ సమయోరేవ శోభతే" అను లోకోక్తికి విరుద్ధం. ఆ కుటుంబానికి చెందిన ఇతరులందరూ కొంచెం చిన్నచూపు చూడడంచేత "ఏమైనా గొప్ప పండితుడనై వీళ్ల అందరినీ మించినవాడను కావాలి" అను పట్టుదలతో ఆ బాలుడు కాశీకి వెళ్లి కొన్ని సంవత్సరాలు ఉండి మంచి పాండిత్యం సంపాదించి స్వదేశానికి తిరిగివచ్చాడు. స్వగ్రామం చేరేలోగా ఆనాటి పెద్దాపురం రాజావారి ఆస్థానంలో ప్రవేశం సంపాదించాడు. అతని కోరికపై ఆ మహారాజు ఆ యువపండితునకు 98 పుట్ల (దాదాపు 900 యకరాల) భూమీ, 'మహారాజశ్రీ' పల్లకీ మొదలైన లాంఛనాలతో జమీందారీ హోదా కల్పించాడు. ఈ విధంగా అతడు తన స్వగ్రామం నుంచి అత్తవారి గ్రామానికి తన భూమిలోనే నడచివెళ్లడానికి అనువైన భూమిని సంపాదించాడు. అది మొదలు ఆ వంశం కొన్ని తరాలపాటు 'జమీందారీ' పండితవంశంగా వెలుగొందింది. ఈనాటికి కూడ ఇందుపల్లిలో 'పుల్లెలవారివీధి' అను పేరుతో ఒక వీధి ఉంది.

ఆ వంశంలో జనించిన వీరభద్రావధానులుగారు గొప్ప వేదపండితులు. ఘనపాఠి. విద్యార్థులకు తమ ఇంట్లోనే నివాసభోజనాది సౌకర్యాలు ఏర్పరచి ఆయన పద్దెనిమిది విద్యార్థి బృందాలను (Batches) ఘనాంతస్వాధ్యాయులనుగా చేశారని ఇప్పటికి కూడా ఆ ప్రాంతానికి చెందిన వయోవృద్ధులు చెపుతుంటారు. ఆయన మా నాన్నగారి పితామహుడు. ఆయన కుమారుడు, మా పితామహుడూ అయిన సూరన్నగారు వేదాధ్యయనం మాత్రమే చేశారు. వారి ఇద్దరి కుమారులలో జ్యేష్ఠులు నరసింహశాస్త్రి; చిన్నవారు మా నాన్నగారు సత్యనారాయణశాస్త్రిగారు. నరసింహశాస్త్రిగారు కూడ వేదాధ్యయనం చేశారు. మా నాన్నగారు వేదాధ్యయనం చేయలేదు. ఆయన వ్యాకరణ-వేదాంత శాస్త్రాలలోను, జ్యోతిఃశాస్త్రంలోను పాండిత్యం సంపాదించారు.

పుల్లెల వంశానికి చెందినవారు చాలవరకు వైదిక నిత్యకర్మానుష్ఠానపరులు. వీరిలో ఎవరూ యజ్ఞయాగాదులు చేసినట్లు లేదు. దేవ్యుపాస, దానికి సంబంధించిన శ్రీ చక్రార్చనాదికమూ కూడా ఈ కుటుంబాలలోని వారెవరూ ఆచరించినట్లు వినలేదు. వీరి సంధ్యావందన- బ్రహ్మయజ్ఞాది నిత్యకర్మానుష్ఠాన నిష్ఠ ఎంత తీవ్రమైనదనగా- ఒక

పర్యాయం మా నాన్నగారు బాల్యంలో టైఫాయిడ్ జ్వరం వచ్చి మూడు నాలుగు వారాలపాటు అస్వస్థులయ్యారట. అప్పుడు వారి తండ్రి (మా తాతగారు) తమ సంధ్యావందనాదికం నిర్వర్తించుకొని, తమ కుమారుని పేర కూడ సంకల్పించి అన్ని రోజులూ సంధ్యావందనాదులు చేశారట. వీరికి నిత్యకర్మాదుల విషయంలోనూ, వైదిక సంస్కారాదుల విషయంలో మాత్రమే శ్రద్ధ అధికంగా ఉండేది. వ్యవసాయం చేసికొంటూ ధార్మికమైన జీవనం గడిపేవారు. ఇందుపల్లికి నాలుగైదు మైళ్ల దూరంలో ఉన్న భట్నపల్లి గ్రామానికి చెందిన బులుసు అప్పన్నగారి రెండవకుమార్తె శ్రీమతి సత్యవతితో మా నాన్నగారికి బాల్యంలోనే వివాహం జరిగింది.

మా నాన్నగారు రామభక్తులు. నిరంతరము శ్రీరామమంత్రజపం చేసేవారు. అవకాశం లభించినప్పుడల్లా రామాయణ పారాయణం, రామాయణ ప్రవచనమూ చేస్తూండేవారు. అప్పుడప్పుడు సప్తదివస సుందరకాండ పారాయణం చేస్తూండేవారు. సప్తదివస దీక్ష వహించి రోజుకు ఒక ఆవృత్తి చొప్పున ఏడు రోజులలో ఏడుసార్లు సుందరకాండ పారాయణ ఆవృత్తులు చేయడం హనుమత్ప్రీతికరం. తప్పక కార్యసిద్ధి కలుగుతూండేది.(ఈ అలవాటు నాకూ పూర్వం ఉండేది) ఒక ప్రభవనామ సంవత్సరం ఆశ్వయుజమాసంలో మా నాన్నగారు సంపూర్ణ రామాయణ ప్రవచనం చేసి నరక చతుర్దశిరోజున శ్రీరామపట్టాభిషేకం పూర్తి చేశారట. ఆ రోజున (23/24.10.1927 తేదీన) తెల్లవారుజామున జనించడంచేత నాకు ఆయన 'శ్రీరామచంద్రుడు' అనిడునజంతమైన నామధేయం నిర్ణయించారు. అంతకుముందు ముగ్గురు మగశిశువులు శైశవంలోనే మరణించగా జన్మించిన ఈ చతుర్థశిశువు రామానుగ్రహంచేతనే దక్కినట్లు ఆయన అంటూండేవారట.

ఇందుపల్లికి తొమ్మిది మైళ్ల దూరంలో అయినవల్లి అనుగ్రామం ఉంది. అది మా నాన్నగారి పెదతల్లిగారి ఊరు. ఆమె ఆరుగురు కుమారులలో రెండవవారైన అద్దాల లక్ష్మీనరసింహశాస్త్రిగారు, తమ అన్నదమ్ముల పిల్లలందరూ రాజమండ్రీ, కాకినాడ వంటి నగరాలలో ఆంగ్లవిద్యాలయాలలో చదువుకొంటున్నా తమ పుత్రునికి (ఆయనకు ఒకే పుత్రుడు) వేదశాస్త్రాలు చెప్పించాలి అను పట్టుదలతో ఒక వేదపండితుణ్ణి రప్పించి తమ గ్రామంలో ఉంచుకొని ఆయనచేత ఐదారు సంవత్సరాలు వేదం చెప్పించారు. తరవాత ఆ గ్రామానికి వచ్చి తమ కుమారునికి సంస్కృత సాహిత్య గ్రంథాలు (కావ్యనాటకాదులు) వ్యాకరణము చెప్పవలసిందిగా తమ పినతల్లి కుమారుడైన మా నాన్నగారిని కోరారు. వారి కోరిక ప్రకారం మా నాన్నగారు, ఐదారు సంవత్సరాల తరవాత తిరిగి స్వగ్రామానికి వెళ్లవచ్చుననే ఉద్దేశ్యంతో, ఇందుపల్లినుండి అయినవల్లి వెళ్లారు. అప్పటికి నా వయస్సు

మూడు–మూడున్నర సంవత్సరాలు. నాపైన ఇద్దరు సోదరు(రీ)లు ఉండేవారు. అయితే మా కుటుంబం అయినవల్లిలోనే స్థిరపడిపోయింది. అందుచేత నాకు ఇందుపల్లి అంటే ఏమీ తెలియదు. నాకు సంబంధించినంతవరకు అయినవల్లియే స్వగ్రామం. మా నాన్నగారు తిరిగి ఇందుపల్లి వెళ్లకపోవడానికి ఒక కారణం ఉంది.

అమలాపురం నుంచి కోటిపల్లి రేవుకు వెళ్లేదారిలో ముక్తీశ్వరం అనే గ్రామం ఉంది. ఇది స్వతంత్రప్రతిపత్తిగల గ్రామం కాదు. మునసబు కరణాలు లేరు. రోడ్డుకు ఇరుప్రక్కలా ఉన్న జనావాసానికి మాత్రమే ముక్తీశ్వరం అని పేరు. రోడ్డుకు ఒక ప్రక్కన పశ్చిమాన ఉన్నది అయినవల్లి, మరొకప్రక్క తూర్పున ఉన్నది తొత్తరమూడి. ముక్తీశ్వరంలో రెండు ముక్తీశ్వర దేవాలయాలు, రోడ్డుకు ఇరువైపులా ఎదురెదురుగా ఉంటాయి. వాటిలో అయినవల్లివైపున ఉన్నది అతి ప్రాచీనమైనది. పదకొండవ శతాబ్దికి చెందినది అని అంటారు. శ్రీరామప్రతిష్ఠ అని అక్కడివారు అంటూంటారు. క్షణకాలం ఉంటేనే ముక్తి ఇచ్చే 'క్షణ ముక్తీశ్వర క్షేత్రం" అని ప్రసిద్ధి. ఈశ్వరుడు ముక్తీశ్వరుడు, అమ్మవారు ముక్తికాంతాదేవి. ఆ ప్రాంగణంలోనే విష్ణ్వాలయం కూడ ఉంది. అది కూడ ప్రాచీనమైనదే. అయినవల్లి–ముక్తీశ్వర గ్రామాలకు చెందినవారు ఉభయులూ పరస్పర సహకారంతో అనాదిగా పూజా–సేవాదులు నిర్వహిస్తుండేవారు. అయితే ఏదో ఒక సందర్భంలో ఆ రెండు గ్రామాల వాళ్లకీ పట్టుదలలు రావడంతో తొత్తరమూడివారు వారి గ్రామసీమలో మరొక ముక్తీశ్వరాలయం ప్రాచీనాలయానికి ఎదురుగా నిర్మించుకొన్నారు. ఆ గ్రామానికి చెందిన కప్పగంతుల రామశాస్త్రిగారనే స్వతఃభూస్వామియైన విద్వాంసుడు ఈ కార్యానికి నడుము బిగించి కాకినాడలో పురాణ ప్రవచనాలు చేసి అక్కడ ఉన్న ఉదారహృదయులైన వైశ్యుల సహాయంతో లక్ష రూపాయలు సంపాదించి ఈ దేవాలయం నిర్మించి దాని నిర్వహణకు కొంత భూమి కూడ సమకూర్చారు. ఈయన గొప్ప రాజరాజేశ్వరీ ఉపాసకులు. ఆ దేవాలయంలోనే "రాజరాజేశ్వరీ సంస్కృత పాఠశాల" నెలకొల్పారు. దానిలో ఉన్న ఉపాధ్యాయులు వృద్ధులవడంచేత రామశాస్త్రిగారు ఆ పాఠశాలలో మా నాన్నగారిని ఉపాధ్యాయులుగా ఉండమని కోరారు.

ఆ రోజులలో జయంతి రామయ్య పంతులుగారు ఉన్నతాధికారి మండలిలోను, సాహిత్యరంగంలోను ప్రసిద్ధులైన వ్యక్తి. ఆనాడు భారతీయులు అందుకొనడానికి శక్యమైన అత్యున్నతస్థానమైన డిప్యూటీ కలెక్టర్ పదవి, మద్రాసులో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పదవి మొదలైనవి నిర్వహించారు. పిఠాపురం రాజావారికి చాల సన్నిహితులు. వీరి ప్రేరణచేతనే రాజావారు సూర్యరాయాంధ్ర నిఘంటువు, ఎందరో పండితులను నియమించి, వ్రాయించారు. ఆ నిఘంటువు రామయ్యపంతులుగారి పర్యవేక్షణలోనే వెలువడింది. గిడుగు

రామమూర్తి పంతులుగారు వ్యావహారిక భాషోద్యమం సాగిస్తే రామయ్యపంతులుగారు దానిని ఎదుర్కొని గ్రాంథిక భాషోద్యమం నడిపించారు. అమరుకం, ఉత్తర రామచరితం మొదలైన సంస్కృత కావ్యాలను తెలుగులోనికి అనువదించారు. వారు ఉద్యోగం నుంచి విరమించిన తరవాత స్వగ్రామమైన ముక్తీశ్వరంలో స్థిరపడ్డారు. వారికానాడు దాదాపు 150 యకరాల సుక్షేత్ర ఖండిక ఉండేది. గొప్పహోదా గల ధనికుడు. రామయ్య పంతులుగారికీ రామశాస్త్రిగారికీ ఉన్న సంనిహిత సంబంధాన్ని బట్టి మా నాన్నగారికి కూడ రామయ్యపంతులుగారితో బాగా పరిచయం ఏర్పడింది. ఈ కారణాలచేత మా నాన్నగారు తిరిగి స్వగ్రామానికి వెళ్లే ఆలోచన మానికొని అక్కడ ఉన్న భూములు, ఇల్లు విక్రయించి అయినవల్లిలో ఏర్పరచుకొన్నారు.

మా నాన్నగారు చాల గంభీర స్వభావం గలవారు. "నేను ఇలా చేశాను, అలా చేశాను" అని తనను గూర్చి అహంభావపూర్ణ సంభాషణగాని తన కష్టసుఖాలను గూర్చి ఇతరులతో ముచ్చటించడంగాని వారు చేస్తూండగా నేనెన్నడూ చూడలేదు. అయితే- ఇందుపల్లిలోని భూమి అమ్మివేసి ఇంటికి వచ్చిన రోజున మాత్రం ఆయన ఎవరితోనో- "కొన్ని తరాలుగా వస్తూన్న ఆ చివరి భూఖండాన్ని నా చేతులతో అమ్మివేశాను" అని అంటూండగా విన్నాను.

ఆ రోజులలో ఆడపిల్లలను బడికి పంపే అలవాటు ఉండేదికాదు. కాని ఆడపిల్లలకు కూడ చదువు ఉండాలని మా నాన్నగారి అభిప్రాయం. అందుచేత నా నలుగురి అక్కచెల్లెండ్రకీ ఆయనే స్వయంగా ఇంటివద్ద చదువుచెప్పారు. వాళ్లలో ఇద్దరు నాకంటె పెద్దవాళ్లు, ఇద్దరు చిన్నవాళ్లు. ఆ ప్రాంతంలో స్కూళ్లలో పాఠ్యగ్రంథాలుగా ఉన్న ఒకటినుండి నాలుగవ తరగతివరకు తెలుగు వాచక పుస్తకాలు, సాధారణ గణితం, నరసింహశతకం, సుమతీశతకం, భాగవతంలో రుక్మిణీకల్యాణం, ఆధ్యాత్మ రామాయణకీర్తనలు, నారాయణతీర్థులు కృష్ణలీలా తరంగిణిలోని కొన్ని కీర్తనలు మొదలైనవి వాళ్లకు చెప్పారు. ఈ జ్ఞానంతో వాళ్లకు తెలుగులోని కథలు, రామాయణ భాగవతాలు చదువుకొనే శక్తి లభించింది. మా చిన్నచెల్లెలికి కొంచెం సంస్కృతం కూడా చెప్పారు. (నాకంటె పధ్నాలుగు సంవత్సరాలు చిన్నవాడైన మా తమ్మునికి మాత్రం నా ప్రేరణపై ఇంగ్లీషు చదువు చెప్పించారు).

నన్ను కూడ బడికి పంపలేదు. తామే నాలుగైదు తెలుగు వాచకాలు, ఎక్కాలు, లెక్కలు ఒకటీ ఒకటిన్నర సంవత్సరాలపాటు బోధించి సంస్కృతం ప్రారంభించారు. ముందుగా శబ్దమంజరిలోని శబ్దాలు, సమాసాలు, అమరమూ చెపుతూ, పాఠ్యక్రమంలో ఒక క్రొత్త పద్ధతి అవలంబించారు. ఆ రోజులలో ముందుగా శబ్ద సమాసాదులతో పాటు

రఘువంశం ప్రారంభించి దానిలో (తరచు చతుర్థ సర్గనుండి) మూడు నాలుగు సర్గలూ, కుమార సంభవంలోని నాలుగైదు సర్గలు, మేఘసందేశంలోని రెండు సర్గలలో ఒక సర్గ, భారవి-మాఘ-నైషధాల నుండి మూడు, నాలుగు లేదా ఐదారు సర్గలూ చెప్పి, పంచకావ్యాలు పూర్తి అయ్యేయని అనిపించి (నైషధంతో ఆరు) పిమ్మట, చెప్పే గురువుగారి అభిరుచి ప్రకారం సిద్ధాంతకౌముదిగాని తర్కప్రకరణాలు కాని ప్రారంభించి చెప్పేవారు. చివరి నాలుగు కావ్యాలు మాత్రం మల్లినాథ వ్యాఖ్యానంతో చెప్పేవారు. ఇది ఆనాడు ఆ ప్రాంతంలో ఉన్న సంస్కృత విద్యాభ్యాస పద్ధతి. ఎక్కువగా శబ్దమంజరి ప్రచారంలో ఉండడంచేత శబ్ద-సమాసాలజ్ఞానం బాగానే ఉన్నా, ధాతువుల జ్ఞానం మాత్రం ఆ విద్యార్థులకు సరిగా ఉండేదికాదు. శబ్దమంజరిలో చివర పరస్మైపద-ఆత్మనేపద-ఉభయ పద ధాతువులకు ఉదాహరణలుగా ఒక్కొక్క ధాతువు మాత్రమే ఇవ్వడం అందుకు కారణం. పొరుగూళ్లనుండి వచ్చి కొందరు మా నాన్నగారివద్ద చదువుకొనేవారు. కొందరు వారాలు చేసికొంటూ మా ఊళ్లోనే నివసించేవారు, కొందరు రోజూ వస్తూండేవారు. వాళ్ల పాఠాలు కూడ పైపద్ధతిలోనే నడిచేవి. అందుకు కారణం వాళ్లందరూ తమ గ్రామాలలోనో, మరొకచోటనో, ఆ పద్ధతిలో చదవడం ప్రారంభించి రావడంచేత ఆ పద్ధతికే అలవాటుపడి ఉండడం.

నా సంస్కృతాభ్యాసం మాత్రం మరొకవిధంగా నడిచింది. తెలుగు లిపితో పాటు దేవనాగరి లిపి కూడ ముందుగానే నేర్పారు. కుంభకోణం నుండి, క్రమబద్ధరీతిలో వ్రాసిన నాలుగు సంస్కృత వాచకాలు (పాఠ్యపుస్తకాలు) వెలువడ్డాయి. వాటి రచయిత కృష్ణమాచార్యులుగారని జ్ఞాపకం. (మన కాశీ కృష్ణమాచార్యులుగారు కాదు. ఆయన అక్కడివారు). అవన్నీ తెప్పించి చెప్పారు. తరవాత శకుంతలోపాఖ్యానం మొదలైన చిన్న చిన్న కథలున్న వచనగ్రంథం చెప్పారు. దాని తరువాత దశ కుమారచరిత్ర పూర్తిగా చెప్పి అప్పుడు కావ్యాలు ప్రారంభించారు. ఈలోగా పైన చెప్పిన పుస్తకాలతో పాటు (శబ్దమంజరిలోని మూడు ధాతువులు చాలవనే అభిప్రాయంతో) శబ్దరత్నావళి అను పుస్తకంలో ఉన్న ధాతువులన్నీ కంఠస్థం చేయించారు. ఇది కూడ మైసూరుకు చెందిన కృష్ణమాచారి అనే ఒక పండితులు రచించినది. అక్కడనే తెలుగులిపిలో ముద్రితమైనది. దీనిలో పది వికరణలకు సంబంధించిన అన్ని ధాతువులూ ఉన్నాయి. (ఇది పునర్ముద్రణకు తగిన మంచి గ్రంథం అని చెప్పగా బెజవాడ గోపాలరెడ్డిగారు, దేవులపల్లి రామానుజరావు గారు దీనిని ఉడాలి సుబ్బరామశాస్త్రిగారి (నెల్లూరు), తెలుగు వ్యాఖ్యతో (కాలాంతరంలో) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ద్వారా ప్రచురింపచేశారు)

ఇవన్నీ అయిన తరువాత నాకు కావ్యాలు ప్రారంభించారు. రఘువంశంలో మొత్తం

19 సర్గలు; కిరాతార్జునీయంలో 18; శిశుపాలవధంలో 20; నైషధంలో 22 సర్గలు. రఘువంశం ఎనిమిదవ సర్గ తప్ప మిగిలిన 18 సర్గలు పాఠం చెప్పారు. కుమార సంభవం 4,8 సర్గలు తప్ప మొత్తం ఆరు సర్గలు, మేఘసందేశం పూర్తిగా రెండు సర్గలు, కిరాతార్జునీయ- శివుపాలవధలు పూర్తిగా అన్ని సర్గలు పాఠం చెప్పారు. రఘు వంశం ఎనిమిదవ సర్గలో మరణించిన భార్యకోసం అజమహారాజు విలాపము, కుమార సంభవం నాల్గవసర్గలో మరణించిన మన్మథుని కోసం రతి విలాపము వర్ణించబడ్డాయి. దాంపత్య సంబంధం ఏనాటికీ విడదీయరాని సంబంధం; భర్తకు భార్యను మించిన ధనం, భార్యకు భర్తను మించిన ధనం లేదు అని దృఢంగా నమ్మిన, అట్టి నమ్మికతో నడచిన, సమాజంలో భర్తకు భార్యావిరహం ఎంత దుర్భరమో భార్యకు భర్తృవిరహం ఎంత దుర్భరమో చెప్పడానికై ఈ మహాకవి ఈ రెండు సర్గలు రచించి ఉంటాడు. వీటిలోని కరుణరస నిర్వహణ అత్యద్భుతంగా ఉంటుంది. ఏమైనా- "ఇవి అమంగళకరమైన వర్ణనలు, కాలాంతరంలో వాళ్లే చదువుకుంటారులే" అనే అభిప్రాయంతో విద్యార్థులకు ఈ సర్గలు పాఠం చెప్పేవారు కాదు. కుమారసంభవంలోని అష్టమసర్గలో జగజ్జననీ జనకులైన పార్వతీ పరమేశ్వరుల ప్రణయగాథ వర్ణించబడింది. ఇలాంటి జననీ-జనక శృంగార వర్ణనలు అనుచితములని ఆలంకారికుల అభిప్రాయం. అమంగళకాశ్లీలం అనీ, లజ్జాజనకాశ్లీలం, జుగుప్సాజనకా శ్లీలం అనీ మూడు విధాల అశ్లీలదోషం కావ్యాలలో పరిహరణీయమని అంటారు. పై రెండూ అమంగళాశ్లీలాలైతే ఇది లజ్జాజనకాశ్లీలం. అందుచేత ఈ సర్గ కూడ పాఠం చెప్పేవారు కారు. ఇతర నాయికా నాయకుల శృంగారం వర్ణనలైతే అంతపట్టింపు లేదు. అందుచేతనే ఇంకా సుతి మించిన వర్ణనలున్నా కూడ కిరాతార్జునీయ- శిశుపాలవధలలోని ఘట్టాలను నిషేధించరు. నైషధం మాకు అప్పుడు పూర్తి గ్రంథం లభించకపోవడంచేత ఆరు సర్గలు మాత్రమే పాఠం చెప్పించుకొనగలిగాను. తరువాత పూర్తిగ్రంథం సంపాదించాను కాని నేనింతవరకు దానిని పూర్తిగా చదవడం కుదరలేదు. కుమారసంభవంలో 17 సర్గలు లభిస్తున్నాయి కాని కాళిదాసు ఎనిమిది సర్గలు మాత్రమే వ్రాశాడు, మిగిలినవి మరొకరెవరో వ్రాశారు అని పండితుల అభిప్రాయం. ఆధునిక విమర్శకుల అభిప్రాయం కూడ అదే. మల్లినాథసూరి మొదటి ఎనిమిది సర్గలకు మాత్రమే వ్యాఖ్యానం వ్రాశాడు.

మొదటి రెండు కావ్యాలు కాక చివరి నాలుగు కావ్యాలు మల్లినాథ వ్యాఖ్యానంతో పాఠం చెప్పారు. మల్లినాథ సూరి వ్యాఖ్యానాలు భాషా పాండిత్యం సంపాదించడానికి ఎంతగానో ఉపకరిస్తాయి. ఈ వ్యాఖ్యానాలకు ఈ వ్యాఖ్యానాలే సాటి. చాలమంది ఇతర వ్యాఖ్యాతలవలె ఈయన అనావశ్యకమైన విషయాలేవీ చెప్పడు. మూలంలో లేని అభిప్రాయాలను దానిపై ఆరోపించి శాఖాచంక్రమణం చెయ్యడు. వ్యాకరణ విశేషాలను సప్రమాణంగా విశదీకరిస్తాడు. ఎన్నో నిఘంటువాక్యాలు ఉదహరిస్తాడు. అలంకారాల

విశ్లేషణలో ఈయన సిద్ధహస్తుడు. అందుచేతనే ఈ వ్యాఖ్యానాలకు అఖిలభారత ప్రసిద్ధి లభించింది. ఈ మధ్య క్రొత్తగా పెట్టే విశ్వవిద్యాలయాలలో రెండింటికి తెలుగునాట తప్ప పైకి ఎవరికీ తెలియని వ్యక్తులపేర్లు పెట్టినప్పుడు ఒక విశ్వవిద్యాలయానికైనా ఈయన పేరు ఎందుకు పెట్టలేదా అని నాకు అనిపించింది. అలాంటిది జరగాలంటే ఆయన గొప్పతనాన్ని గ్రహించకలిగిన ఏ సర్వజ్ఞ సింగభూపాలుడో మళ్లీ రావాలేమో! ఇతరులవద్ద కావ్యాలు చదివేవారికి రోజుకు అతికష్టంమీద రెండో మూడో శ్లోకాలు పూర్తి అయేవి. అందుచేతనే వాళ్లు ఒక్కొక్క కావ్యంలో మూడు నాలుగు సర్గలు చదివి ముందుకు సాగవలసి వచ్చేది. వావిళ్లవారు అన్ని సర్గలూ ముద్రించేవారు కాదు, ఆ కావ్యాలలో ఉన్న మొత్తం సర్గలసంఖ్య కూడ చాలమందికి తెలియదు. మా నాన్నగారు నాకు నూతన పద్ధతిలో సంస్కృత భాషాధ్యాపనం ప్రారంభించడంచేత కావ్యాలదగ్గరికి వచ్చేసరికి చాలవరకు వ్యాఖ్యానాపేక్ష కూడ లేకుండ శ్లోకం చదవగానే అర్థ సమన్వయం చేసికొనే శక్తి లభించింది. అదుచేత రోజుకు పది శ్లోకాలు కూడ పూర్తి అయేవి. ఈ కావ్యాలు పూర్తి అయిన పిమ్మట మురారి రచించిన అనర్ఘరాఘవం కూడ చదివించారు.

మా నాన్నగారు ప్రతీరోజూ స్వాధ్యాయ దివసాలలో (చతుర్దశి, పూర్ణిమ, అమావాస్య, పాడ్యమి, అష్టమితిథులు అనధ్యాయ దివసాలు) భోజనానంతరం ఒకటి ఒకటిన్నర గంటలకు బయలుదేరి ముక్తీశ్వర పాఠశాలలో పాఠాలు చెప్పడానికి అక్కడికి వెడుతూ నన్ను కూడ తీసికొని వెళ్లేవారు. అప్పటికి కప్పగంతుల రామశాస్త్రిగారు చాల వృద్ధులైనారు. ఉపవాసాదులచేత పూర్తిగా కృశించి నడుము పూర్తిగా వంగిపోయి ఉండేవారు. అయినా నిత్యమూ రాజరాజేశ్వరీదేవి పూజ నిరంతరాయంగా జరుపుతూండేవారు. మేం వెళ్లే సమయానికి (దాదాపు మధ్యాహ్నం రెండు గంటలకు) భోజనం చేస్తూనో, భోజనంచేసి గోడకు ఆని కూర్చుండి విశ్రాంతి తీసుకొంటూనో ఉండేవారు. ఒక చిన్న కంచుపళ్లెంలో అమ్మవారికి నైవేద్యం పెట్టిన ద్రాక్షపండ్లు, పటికబెల్లం ముక్కలు మొదలైనవి అమ్మవారి మందిరం ప్రక్కనే నాకోసం ఉంచేవారు. నేను వెళ్లి, నూతి దగ్గర పాదప్రక్షాళనం చేసికొని వాటిని తీసికొనేవాణ్ణి. బహుశా ఇది శ్రీరామశాస్త్రిగారు నాకు సంక్రమింపచేసిన దేవ్యనుగ్రహ విశేషం అని నాకు కాలాంతరంలో అర్థం అయింది.

సాయంకాలం ఒకటిన్నర- రెండు గంటలు కావ్యపాఠాదులు విద్యార్థులకు చెప్పిన తరవాత మా నాన్నగారు శాస్త్రిగారివద్ద కూర్చొని వారితో ఏదో వేదాంత గ్రంథాదికం విమర్శ చేస్తూండేవారు. ఒక్కొక్క రోజున రామయ్య పంతులుగారి ఇంటికి వెళ్లి అక్కడ గంట-గంటన్నర ఏదో గ్రంథ పరిశీలనం చేస్తూండేవారు. రామయ్య పంతులుగారికి తిక్కన భారతం అంటే చాల ఇష్టమట. ఆ తెలుగు భారతమూ, సంస్కృతమూ ఎదుట

ఉంచుకొని వారిద్దరూ పరిశీలిస్తూండేవారు. నాకు పదమూడు సంవత్సరాల వయస్సు నిండేవరకు దాదాపు నాలుగైదు సంవత్సరాలు దైనందిన విద్యాభ్యాస కార్యక్రమం ఈవిధంగానే నడిచింది.

ఒకటి రెండు కావ్యాలు పూర్తి అయిన తరవాత నా పదకొండవ సంవత్సరంలో సిద్ధాంత కౌముది ప్రారంభించారు. రెండు–రెండున్నర సంవత్సరాలలో అది కూడ పూర్తి అయింది. ఇంక వ్యాఖ్యానాదులు చదవవలసి ఉంది. స్వగ్రామంలోనే ఉంటే సమవయస్కులతో కాలక్షేపం జరిగిపోతున్నది; చదువుమీద శ్రద్ధ కుదరదు అని గ్రహించి మా నాన్నగారు నన్ను ఒక సంస్కృత పాఠశాలకు పంపారు.

నరేంద్రపురం చదువు

మా గ్రామానికి దాదాపు పది మైళ్ల దూరంలో నరేంద్రపురం అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో చల్లా సుబ్రహ్మణ్యం గారనే ఒక ధనికుడు స్థాపించిన పాఠశాల ఉండేది. ఆయనకు సంతానం లేకపోవడంచేత ఇందుపల్లి గ్రామ వాస్తవ్యుడైన పుల్లెల బ్రహ్మంగారనే పరమ భాగవతోత్తముని కుమారుణ్ణి ఆయన దత్తపుత్రుడుగా స్వీకరించారు. పుల్లెల బ్రహ్మంగారు కూడ సంపన్న గృహస్థులే. ఆయన కోనసీమలోనే కాక పశ్చిమగోదావరి–కృష్ణా జిల్లాలలో కూడ ఎన్నో భాగవత సప్తాహాలు చేయించారట. భాగవతం అంతా ఆయనకు కంఠస్థం. ఆయన కుమారులలో ఒకరు కృష్ణమూర్తి. ఆయనే నరేంద్రపురం చల్లావారింటికి దత్తతగా వెళ్లారు. అక్కడ ఆయన పేరు కూడా సుబ్రహ్మణ్యంగారే. చల్లావారిది సుమారు మూడువందల యకరాల ఆస్తి. ఆయన పాఠశాల చాల చక్కగా నడిపించారు. ఆ గ్రామంలో దాదాపు 60–70 బ్రాహ్మణ కుటుంబాలుండేవి. అందరూ సంపన్నులే. అందరూ శ్రోత్రియులే; ఆ రోజులలో సోమయాగం చేసిన ఇద్దరు సోమయాజులు కూడ ఆ గ్రామంలో ఉండేవారు. చల్లాదత్తుడుగారు పుల్లెల వంశానికి చెందినవారవడంచేత, జ్ఞాతిత్వమే కాకుండా ఇతర బాంధవ్యం కూడ ఉండడంచేత నా విషయంలో ఎక్కువ అభిమానం చూపించేవారు.

నేను ఆ పాఠశాలలో విద్యార్థిగా 1941 ఆగస్టులో పధ్నాలుగవ సంవత్సరం నడుస్తూన్న వయస్సులో చేరాను. అప్పటికి దానిలో సంస్కృతోపాధ్యాయులు ఇద్దరూ, వేదోపాధ్యాయులు ఒకరూ ఉండేవారు. సంస్కృతోపాధ్యాయులలో ఒకరు చిన్న పాఠాలు చెప్పేవారు. మా గురువుగారు కొంపెల్ల సుబ్బరాయశాస్త్రిగారు. వారు కిరాతార్జునీయం మొదలైన ప్రౌఢకావ్యాలు, వ్యాకరణ శాస్త్రగ్రంథాలూ చెప్పేవారు.

విజయనగరం మహారాజావారి సంస్కృత కళాశాలకు సంబంధించిన

మహామహోపాధ్యాయ తాతాసుబ్బరాయ(రాయుడు) శాస్త్రులుగారు సుప్రసిద్ధ వ్యాకరణ పండితులు. వారి శిష్యులు భాష్యాంతవైయాకరణులు శ్రీ జయంతి భగీరథ శాస్త్రిగారు. వీరు అమలాపురానికి మూడుమైళ్ల దూరంలో ఉన్న భట్నవిల్లి గ్రామంలో ఉండేవారు. వీరి తమ్ముడు సూర్యనారాయణశాస్త్రిగారు. వారి వద్దనే వ్యాకరణశాస్త్రం పూర్తిగా చదువుకొన్నారు. వీరు ద్రాక్షారం పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉండేవారు. వీరి శిష్యులు మా గురువుగారైన శ్రీ కొంపెల్లి సుబ్బరాయశాస్త్రిగారు. ఈ విధంగా వీరు ఆంధ్రదేశంలో శాఖోపశాఖలుగా విస్తృతమైన శ్రీ రాయుడుశాస్త్రిగారి వ్యాకరణ విద్యావంశానికి చెందినవారు. వీరు గొప్ప తపఃసంపన్నులు. సర్వదా అవకాశం లభించినప్పుడల్లా శ్రీ మద్భాగవత చింతన చేస్తుండేవారు.

నేనా పాఠశాలలో ఒక సంవత్సరం పదిమాసాలు చదువుకొన్నాను. ప్రవేశించిన ఐదారు రోజులలోనే మా గురువుగారి పరిపూర్ణాశీస్సులు పొందగలడం నా పూర్వపుణ్యపరీపాకమే అని చెప్పాలి. ఒకనాడు సాయంకాలం నన్ను పిలిచి– “మీ నాన్న మీకు కావ్యాలన్నీ పూర్తిచేసి సిద్ధాంతకౌముది కూడ చెప్పినామని అన్నారు. ఏది! ఈ శ్లోకానికి అర్థం చెప్పు” అని ఒక శ్లోకం చూపించారు. నేను అది ఒకటిరెండుసార్లు మనస్సులో చదువుకొని మూడు నిమిషాలలో అర్థం చెప్పాను. ఆయన నవ్వి– “దీనికి కూడ చెప్పు” అని మరొక శ్లోకం ఇచ్చారు. దానికి కూడ వెంటనే అర్థం చెప్పాను. అప్పుడు వారు అమితానందభరితులై “ఏమిటి! నువ్వు సాహిత్యచక్రవర్తివివలె ఉన్నావే!” అన్నారు. అది మొదలు వారు నేను వారివద్ద చదువుకొన్న ఆ స్వల్ప కాలంలోనే కాక వారు స్వర్గస్థులయేవరకు నాపై అమితవాత్సల్యానుగ్రహాలు చూపించారు.

మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీవారు అప్పుడే, తత్ప్రథమంగా ‘రత్నేశ్వరప్రసాదనం’ అనే ప్రాచీన సంస్కృత నాటకం ఒకటి ప్రచురించారు. దానిని గవర్నమెంట్ ఎంట్రన్స్ పరీక్షకు పాఠ్యపుస్తకంగా నిర్ణయించడంచేత మా గురువుగారు అంతకు ఒకటి రెండు సంవత్సరాలకు పూర్వం అది పాఠం చెప్పవలసి వచ్చినదట. దానిలోని రెండు శ్లోకాలకు సమన్వయం కుదరక అక్కడికి దాదాపు 25 మైళ్ల దూరంలో గోదావరి అవతల ద్రాక్షారంలో ఉన్న తమ గురువుగారిని కలవడానికి వెళ్లినప్పుడు వారిరువురూ వాటి అర్థం గ్రహించారట. వారు నన్ను పరీక్షించడానికి ఇచ్చిన ఆ రెండు శ్లోకాలూ అవే. అందుచేతనే వారికి అంత ఆనందం కలిగింది; మా నాన్నగారి విషయంలో గౌరవభావం పెరిగింది.

మద్రాసు విశ్వవిద్యాలయంవారు ‘శిరోమణి’ అని సంస్కృతంలో అత్యున్నత పరీక్ష నిర్వహించేవారు. అది నాలుగు సంవత్సరాల కోర్స్. దానికి సంబంధించిన కళాశాలలు,

తెలుగునాట నెల్లూరు– తిరుపతులలోను, మద్రాసులోను, ఆ ప్రాంతానికి చెందిన మరికొన్ని నగరాలలోను ఉండేవి. ఆ కక్ష్యలో ప్రవేశం పొందడానికి 'ఎంట్రన్స్' అనే పరీక్ష పాస్ కావాలి. అది ప్రభుత్వం నిర్వహించేది. శిరోమణిలో సాహిత్యం (అలంకారశాస్త్రం), వ్యాకరణం, వేదాంతం, మీమాంస, న్యాయం మొదలైనవి ప్రధాన విషయాలుగా ఉండేవి. సాహిత్యం ఎంట్రన్స్ పరీక్ష తప్పక పాసవుతూ, దానితోపాటు, ఏ శాస్త్రం శిరోమణి చదవాలనుకొంటే ఆ ఎంట్రన్స్ కూడా పాస్ కావాలి. సంస్కృతంలో 'శిరోమణి'వలె తెలుగు మొదలైన భాషలకు 'విద్వాన్' అను పరీక్ష ఉండేది. దానికి సంబంధించిన ఎంట్రన్స్ వేరుగా ఉండేది. మా గురువుగారు "వ్యాకరణ శిరోమణి" తమ దగ్గర చేరిన విద్యార్థులచేత ఎంట్రన్స్ పరీక్షలు వ్రాయించి "శిరోమణి" "విద్వాన్" కళాశాలలకు పంపేవారు. వారు చదువుకొన్నది వ్యాకరణమైనా వారికి వేదాంతం మీద ఆదరభావం ఎక్కువ ఉండేది. అంతకు రెండు సంవత్సరాలకు పూర్వం, ఆ గ్రామానికే చెందిన రాణి నరసింహం అనే విద్యార్థిని (ఇతడే కాలాంతరంలో రాణి నరసింహశాస్త్రి అను పేరుతో గొప్ప పండితుడుగా ఆంధ్రదేశంలో ప్రసిద్ధి పొందాడు) వేదాంతం ఎంట్రన్సు పాస్ చేయించి వేదాంత శిరోమణి కోర్సుకు మైలాపూరులో ఉన్న మద్రాసు సంస్కృత కళాశాలకు పంపించి ఉన్నారు. నన్ను కూడ అక్కడికి పంపాలని సంకల్పించారు. నేను, ఆ రోజులలో వారు కొందరికి చెపుతూన్న సిద్ధాంత కౌముది పాఠాలు, ఆ గ్రంథం గట్టిపడడంకోసం మరొకసారి వింటూ, వ్యాఖ్యాగ్రంథాలైన తత్త్వబోధిని, పరిభాషేందుశేఖరం, లఘుశబ్దేందు శేఖరం మొదలైనవి చదువుతూ ఎంట్రన్స్‌కు సంబంధించిన కావ్యాలు (అవి ఇదివరకే చదివినవి), తర్కసంగ్రహం, అర్థసంగ్రహం, ప్రతాపరుద్రీయం మొదలైనవి కూడా వారివద్దే చదివి 1943లో ఎంట్రన్స్ పరీక్ష వ్రాశాను.

ఆ రోజులలో ప్రతీ గ్రామంలోనూ కొద్దిగానో గొప్పగానో సంస్కృత భాషా పరిచయం (పాండిత్యం కాదు) ఉన్న ఒకరిద్దరు ఉండేవారు. నిజమైన పాండిత్యం, సంస్కృతంలో కాని తెలుగులో కాని ఉన్నవాళ్లు నాలుగైదు గ్రామాలకు ఒకరుండేవారేమో. భాషా పరిచయం మాత్రం ఉన్నవాళ్లకు ఎవరైనా సంస్కృతం చదివే బాలుడు కనబడేటప్పటికి ఫలానాశబ్దం చెప్పమనో, ఏదైన శ్లోకం చదివి అర్థం చెప్పమనో, అడగడంలో ఆనందం ఉండేది. ఇలాంటి తలనొప్పులు నాకు కూడ చాల పర్యాయాలు కలుగుతూ ఉండేవి. ఒకనాడు ఒక ముప్పై యైదు నలభై సంవత్సరాల వ్యక్తి మా పాఠశాలకు వచ్చి సాటోపంగా విద్యార్థులను ఇవీ అవీ అడగడం ప్రారంభించాడు. ఆయన 'ఉభయభాషా ప్రవీణ' ప్యాసయి ఏదో స్కూలులో తెలుగు పండితుడుగా ఉన్నాడట. ఏమి చదువుతున్నావని నన్ను అడుగగా ప్రతాపరుద్రీయం చదువుతున్నానని చెప్పాను. "అలాగా! అయితే– రసం యన్నిష్ఠం?" అని నన్ను ప్రశ్నించాడు. "అది తన్నిష్ఠం" అని నేను వెంటనే సమాధానం చెప్పాను.

"అదేమిటి! పెద్దా చిన్నా తరహా తెలియకుండా అలా పెడసరంగా సమాధానం చెపుతున్నావు?" అని ఆయన కోపంతో అన్నాడు. "యత్తదోర్నిత్యసంబన్ధః" అని శాస్త్రం కదా? అని నేను సమాధానం చెప్పాను. ఆయన ఇంకేమీ మాట్లాడకుండా, ఇంక ఎవర్నీ ప్రశ్నించకుండా వెళ్లిపోయాడు. రసం ఎవనియందు ఉంటుంది అని ప్రశ్నించడానికి "కింనిష్ఠః" అనడానికి బదులు ఆయన "యన్నిష్ఠం' అని అడిగాడు. యచ్ఛబ్దం ప్రశ్నార్థం కాదు, సంబంధార్థకం. ఆయన మా గురువుగారికి పూర్వపరిచితులు. ఆయనతో నా ధార్ష్ట్యన్ని గూర్చి చెప్పగా ఆయన ఒక చిరునవ్వు నవ్వి ఊరుకున్నారట. ఇలా ఉండేవి ఆనాటి సంస్కృత పాఠశాలా విద్యార్థుల ఇక్కట్లు!

నేను నరేంద్రపురంలో చదువుకుంటూన్న రోజులలోనే వివాహం జరిగింది. అప్పటికి నాకో పధ్నాలుగున్నర సంవత్సరాల వయస్సు; వధువుకు ఎనిమిదిన్నర సంవత్సరాలు. మా మామగారైన మంగిపూడి వెంకటశాస్త్రిగారు కాశీపండితులు. ఆయన తమ పధ్నాల్గవ సంవత్సరంలోనే దేశం విడిచి కాశీ వెళ్లిపోయారట. అక్కడ మహామహోపాధ్యాయ గంగాధరశాస్త్రిగారి వద్ద పూర్తిగా వ్యాకరణ శాస్త్రాధ్యయనం చేసి ముప్ఫై రెండు సంవత్సరాల వయస్సులో తిరిగి స్వదేశానికి వచ్చారు. (గంగాధరశాస్త్రిగారు కాశీలో స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందినవారు. అక్కడ కాశీ సంస్కృత కళాశాలలో వ్యాకరణాచార్యులుగా ఉండేవారు. అది (నేటికి) సుమారు నూటయాభై సంవత్సరాలకు పూర్వం బ్రిటిష్ ప్రభుత్వంవారు స్థాపించి నడిపించిన కళాశాల. మహాభాష్యాది సంపాదకుడైన R.T.H.Griffith, G.Thilaut మొదలైన పాశ్చాత్య దేశీయ సంస్కృత విద్వాంసులు అధ్యక్షాది పదవులను అలంకరించిన కళాశాల అది. ఇపుడది వారణసేయ సంస్కృత విశ్వవిద్యాలయంగా విరాజిల్లుచున్నది). వెంకటశాస్త్రిగారివద్ద మా నాన్నగారు చిన్నతనంలో, వారి గ్రామం ఇరుసుమండలో, వ్యాకరణాధ్యయనం చేశారు. నా వివాహ సమయానికి శ్రీ వెంకటశాస్త్రిగారికి 70-72 సంవత్సరాల వయస్సు. మా నాన్నగారు తమ కుమార్తెను (మా చెల్లెలిని)వారి రెండవ కుమారునకిచ్చి వివాహం జరిపించవలెననే అభిలాషతో ఒకనాడు వారి ఇంటికి వెళ్లి ఆ విషయం ప్రస్తావించగా వారు వెంటనే- "నేను పెద్దవాడనైపోతాను; సంబంధాలకోసం తిరగలేను; నువ్వు యువకుడవు. నీవు తిరగగలవు. అందుచేత మా అమ్మాయినే నీ కుమారునకు చేసికో" అని అన్నారట. ఆ మాటే నిశ్చయతాంబూలం; జాతకాలు చూడడం లేదు; కట్నం కానికల మాటలేవీ లేవు.

అయితే వెంటనే పెళ్లి చేయడానికి అవసరమైన ధనం లేకపోవడంచేత కొన్ని మాసాల తరువాత చేద్దామని అనుకొన్నారట. ఇంతలో వారికి అప్రయత్నంగా కొంత ధనం సమకూరింది. వారిదగ్గర చిన్నతనంలో వ్యాకరణం చదువుకొన్న గాజులపల్లి

హనుమచ్ఛాస్త్రిగారు అప్పుడు నెల్లూరు సంస్కృత కళాశాలలో పనిచేసేవారు. ఆయనకేదో అభ్యుదయం కలగడంతో తమ గురువుగారికి ఏమైన గురుదక్షిణ 'ఈనాటికైనా' ఇవ్వాలని సంకల్పించి, వారి ఊరువెళ్లి కొంత ధనము, ఒక కాశ్మీర్ శాలువా వారికి సమర్పించారు. ఇది శుభశకునమని ఎంతగానో ఉప్పొంగిపోయిన వెంకటశాస్త్రిగారు వెంటనే మా నాన్నగారికి కబురు పంపడము, వివాహ ముహూర్త నిర్ణయమూ జరిగిపోయాయి. అనుకొన్నవిధంగా ఐదు రోజులు యథావిధిగా అగ్నిహోత్రాదులతో వివాహం జరిగింది.

మద్రాసు హైకోర్టులో జడ్జిగా పనిచేసిన వి.కృష్ణస్వామి అయ్యర్ అనే ఒక మహాదాత మైలాపూర్‌లో ఒక సంస్కృత కళాశాల, మైలాపూర్‌లోనే మరొకచోట ఆయుర్వేద కళాశాలా స్థాపించారు. సంస్కృత కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా వసతి-భోజనాలు ఏర్పరిచారు. 1906 స్థాపింపబడిన ఈ కళాశాల 2006లో శతవార్షికోత్సవం జరుపుకొన్నది. ఈ కళాశాలలో తయారైన వందలకొలది విద్వాంసులు దేశం అంతటా వ్యాపించి ఉన్నారు.

1943 జూన్ మాసంలో ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. నాకు సాహిత్య-మీమాంసా- వేదాంత శిరోమణి కక్ష్యలలో ప్రవేశానికి అర్హతను కలిగించే మూడు ఎంట్రన్స్ పరీక్షలలో ఉత్తీర్ణత లభించింది. అంతకు ఒకటి రెండు మాసాలకు పూర్వమే మా గురువుగారు మద్రాసు సంస్కృత కళాశాలలో ప్రవేశానికి నాచేత అభ్యర్థనా పత్రం పంపింపచేశారు. "వేదాంత శిరోమణి కక్ష్యలో ప్రవేశం ఇస్తాం, ఇంట్రన్స్ పరీక్ష ఫలితాలు తెలియగానే వచ్చి చేరవచ్చును" అని ప్రిన్సిపాల్‌గారి నుండి లేఖ వచ్చి ఉన్నది. పరీక్షా ఫలితాలు తెలిసినవెంటనే వేసవి శలవులకు నరేంద్రపురం వచ్చిన. రాణినరసింహంతో కలిసి, మా గురువుగారు, నాన్నగారు, మామగారు మొదలైన తపఃసంపన్నులైన పెద్దల ఆశీర్వాదం కవచంవలె రక్షిస్తూండగా మద్రాసు కళాశాలకు వెళ్లాను. అప్పుడు ద్వితీయ ప్రపంచ మహాయుద్ధం జరుగుతూండడంచేత మద్రాసు వంటి మహానగరాలలో ఎప్పుడు ఏమి జరుగుతుందో అని అందరూ భయపడుతూన్న రోజులవి.

అప్పుడు టి.ఆర్.రామచంద్రదీక్షితర్ ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. కళాశాలకు చేరగానే మా మిత్రుడు చెప్పగా అక్కడ ఉన్న సంప్రదాయం ప్రకారం, ప్రిన్సిపాలుగారికి సాష్టాంగ నమస్కారం చేసి గోత్ర ప్రవర కథనపూర్వకంగా అభివాదనం చేశాను. "కౌండిన్యసగోత్రః శ్రీరామచంద్రశర్మా అహంభో అభివాదయే" అని నేను అంటూండగానే ఆయన- "ఓ! అస్మత్సగోత్రస్త్వమ్" (ఓ! మా గోత్రం వాడవే అన్నమాట!) అని ఆనందపూర్వకంగా అన్నారు. ఆయన అనేక శాస్త్రాలలో మహాపండితులు. మొదటి సంవత్సరం మాకు బ్రహ్మసూత్ర శాంకర భాష్యం పాఠం చెప్పారు. ఎంత కఠినమైన శాస్త్రవిషయమైనా, పుస్తకాపేక్ష లేకుండా అతి సులభమైన రీతిలో అరటిపండు ఒలిచి నోటికి అందించినట్లు

వారు బోధించారు. వారు కొన్ని తరాల క్రితం తెలుగుదేశంనుంచి తమిళనాడుకు వలసవెళ్లిన కుటుంబానికి చెందినవారట. కొంచెం తెలుగు మాట్లాడేవారు. కాశీలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో వేదాంతాచార్యులుగా నియుక్తులై వారు నా మొదటి సంవత్సరం చివర వారాణసికి వెళ్లిపోయారు.

మద్రాసు వెళ్లేవరకు నేను రైలు కూడ చూడలేదు. మారుమూల కోనసీమలో ఉండడంచేత లోకజ్ఞానం బాగా తక్కువగా ఉండేది. అప్పటికి పదిహేనవ సంవత్సరం నడుస్తున్నది. అయినా కూడ తెలుగువాడనే ఏమాత్రం భేదభావం లేకుండా మా ఆచార్యులు తోటి విద్యార్థులూ కూడ నా పట్ల ఎంతో వాత్సల్య స్నేహభావాలతో ఉండేవారు. నేను సిద్ధాంత కౌముదీ, ఇతర వ్యాకరణ వ్యాఖ్యా గ్రంథాలు చదివి ఉండడం కూడ మా ఆచార్యుల విశేషానుగ్రహానికి పాత్రుడనవడానికి కారణం అయింది. అన్ని శిరోమణి కక్ష్యలవాళ్లకీ సాధారణమైన (common) పాఠ్యగ్రంథాలుగా కొన్ని వ్యాకరణ- న్యాయ- మీమాంసా- భాషా శాస్త్రాది గ్రంథాలుండేవి. వాటిలో సిద్ధాంత కౌముది ఒకటి. క్రొత్తగా అప్పుడే చదవడం ప్రారంభించినవాళ్లకు ఈ గ్రంథం అర్థం కావడం చాలా కష్టంగా ఉంటుంది. బాలసుబ్రహ్మణ్య శాస్త్రిగారనే మీమాంసాచార్యులు కౌముది పాఠం చెప్పేవారు. వారు వ్యాకరణంలో కూడ దిట్ట. మొదటి మూడు మాసాల చివర జరిగిన త్రైమాసిక పరీక్షలో చాలమంది కౌముది పరీక్షలో అనుత్తీర్ణులు కాగా నాకు నూటికి 98 మార్కులు ఇచ్చారు. వారి అనుగ్రహానికి బీజావాపం అయింది.

నేను 'శిరోమణి' మూడవ సంవత్సరంలో ఉండగా వి.వెంకటాచలం అనే విద్యార్థి సాహిత్య శిరోమణి కోర్సులో చేరాడు. అతడు తిరుణల్వేలి జిల్లాలో ఏదో మిషనరీ కాలేజిలో చదివి బి.ఏ. ప్యాసయినాడు. గణితశాస్త్రంలో కాలేజిలో అత్యుత్తమస్థానం, రెండవభాష సంస్కృతంలో విశ్వవిద్యాలయంలో అత్యుత్తమస్థానం సంపాదించాడు. ఆతనికి ఆ కళాశాలలో సంస్కృతం చెప్పిన ఆచార్యులు ఆతనికి సంస్కృతం విషయంలో అసాధారణమైన ఆదరం కలిగేటట్లు చేశారట. ఏది ఏమైనా సంస్కృతం బాగా చదవాలి అను పట్టుదల ఆతనిలో కలిగింది. జిల్లా ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూన్న ఆతని తండ్రిగారు రిటైర్ కానున్నారు. పెద్ద కుమారుడైన ఇతడు ఉద్యోగంలో ప్రవేశించి కుటుంబానికి సహాయంగా ఉండాలని ఆయన అభిప్రాయపడినా ఏదోవిధంగా ఆయనను ఒప్పించి మా కళాశాలలో చేరాడు. మా ఇద్దరికీ ప్రగాఢమైన మైత్రి ఏర్పడింది. "భావస్థిరాణి జననాన్తరసౌహృదాని" అని కదా కళాదాసోక్తి! ఏదైన శాస్త్రంలో మంచి ప్రవేశం ఉంటే అలంకారశాస్త్ర గ్రంథాలన్నీ కొంచెం మార్గదర్శనం ఉంటే స్వయంగా అన్వయించుకొనవచ్చు. అందుచేత సాహిత్య శిరోమణికోసం నాల్గు సంవత్సరాలు

వెచ్చించడం అనవసరం" అని నేను చెప్పడంచేత, స్వతః అతనికి కూడా శాస్త్రాధ్యయనాభిలాష ఉండడంచేత, అతడు యూనివర్సిటీ నుండి విశేషానుమతి సంపాదించి, ఒక ఏడాదిలో వేదాంతం ఎంట్రన్స్ ప్యాసై, వేదాంత శిరోమణి కక్ష్యలోనికి మారాడు. నేను ఆతని వద్దనే ఇంగ్లీషు అక్షరాలు నేర్చి ఒకటి రెండు ఇంగ్లీష్ రీడర్సు చదివాను. ఆతడు నా దగ్గర సిద్ధాంతకౌముది చింతనం (పునఃపఠనమననాదికం) చేసేవాడు.

కాలేజిలో విద్యార్థులు ప్రధానంగా పాల్గొని నడిపించే "శారదా వాగ్వర్ధనీ సభ" అనే లిటరరీ అసోసియేషన్ ఒకటి ఉండేది. నేనూ, వెంకటాచలమూ దానికి కార్యదర్శులంగా ఉంటూ ఆచార్యుల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుపుతూండేవాళ్లం.

ఆ రోజులలో మద్రాసులో చాలమంది సంస్కృతాభిమానులైన గొప్ప లాయర్లు హైకోర్టు జడ్జీలు ఉండేవారు. కొన్ని కార్యక్రమాలకు వారిని ఆహ్వానించగా వారు అంత చిన్న సంస్థ అను భావనయే లేకుండా సంతోషపూర్వకంగా వచ్చేవారు. అలాంటివారిని చూడడం వల్ల నాకు ఆ కాలంలోనే ఏ క్షేత్రంలోనైనా ఉన్నత స్థితిలో ఉన్నవారిని చూచినప్పుడు అత్యంత ఆదరభావం కలుగుతుండేది. నాకంటె ప్రతీ ఒక్కరూ ఏదో విషయంలో గొప్పవారే అనిపించేది. ఆ భావం ఈనాటికి కూడ నాలో స్థిరంగా ఉండిపోయింది. అందుచేతనే-

"శ్రియాకేచిద్ధియా కేచి ద్విద్యయాచానవద్యయా,
వాక్చాతుర్యా పరే, లోకే మత్తః సర్వేఽధికాజనాః"

అని ఏనాడో వ్రాసుకొని మననం చేసుకొంటూంటాను.

నా మిత్రుడు వెంకటాచలం వేదాంతశిరోమణి పూర్తి అయిన తరవాత ఎమ్.ఏ. కూడ ప్యాసై కొంతకాలం మద్రాసులోను, తరువాత మధ్యప్రదేశ్ ప్రభుత్వం సర్వీసులోను పనిచేసి ఉజ్జయినిలోని విక్రమ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశాడు. తరువాత ఆరు సంవత్సరాలపాటు వారణసేయ సంస్కృత విశ్వవిద్యాలయానికి కులాధిపతి (ఛాన్సలర్) గాను పనిచేశాడు. ఆ కాలంలో అఖిలభారత స్థాయిలో అగ్రశ్రేణి, సంస్కృత విద్వాంసుడుగా పేరు గడించాడు. ఆతని ద్వారా ఎంతోమంది మహావిద్వాంసులతోను, సంస్కృత సంస్థలతోను నాకు కూడ పరిచయం కలిగింది. ఇలాంటి మహోపకారం నాకు చేసినందుకు వి.వెంకటాచలాన్నీ, ప్రొఫెసర్ కె.సచ్చిదానందమూర్తిగారినీ నేను సర్వదా స్మరిస్తూంటాను.

నేను రచించిన "Sansrkit Idioms and Phrases" అను పుస్తకానికి నా మిత్రుడు "ఈ దిశలో ఇది ఎవ్వరూ చేయని తొలి ప్రయత్నం" అని కొనియాడుతూ వ్రాసిన ఉపోద్ఘాతం (2002) అతడు నాకిచ్చిన చివరి ఉపాయనం.

కాలేజీలో చేరిన క్రొత్తలో ఒకనాడు కొందరు సీనియర్ విద్యార్థులు మాట్లాడుకొంటూ "మన కాలేజీకి గడిచిన నాలుగైదు సంవత్సరాల కాలంలో యూనివర్సిటీ గోల్డుమెడల్ రాలేదు" అని అనుకొంటూండగా విన్నాను. నాకు అది లభించేటట్లు చేయుమని ప్రార్థిస్తూ మా ఊరి సిద్ధివినాయకస్వామిని స్మరించాను. ఇంకా అప్పటికి నాలుగు సంవత్సరాల తరువాతి మాట అది. అయితే భగవంతుడు నా ప్రార్థన ఆలకించి 1947లో నాకు యూనివర్సిటీ గోల్డుమెడల్ (ప్రథమశ్రేణి ప్రథమస్థానం లభించినవాళ్లకి ఇచ్చేది) ప్రసాదించాడు. నాకు ఆనాడే కాదు ఈనాటికి కూడా భగవదనుగ్రహం మీదా, కర్మసిద్ధాంతంమీదా అచంచలమైన విశ్వాసం ఉంది. ఆ మొదటి సంవత్సరంలోనే నేనే అయినవల్లి సిద్ధివినాయకస్వామిని స్తుతిస్తూ ఒక అష్టకం (సంస్కృతంలో) వ్రాశాను. ముక్తీశ్వరుణ్ణి స్తుతిస్తూ ఒక అష్టకమూ, వర్ణమాలాస్తోత్రమూ రచించాను. ఇవి నా జీవితంలో తొలి రచనలు.

1947 ఏప్రిల్‌లో చదువు పూర్తి చేసికొని స్వగ్రామం చేరాను. ఆ రోజులలో హిందీ రాష్ట్ర భాష కాబోతున్నదనే విశ్వాసంతో చాలమంది, పాఠశాలాదులలో చదివే చిన్నవాళ్లే కాకుండా వ్యవసాయం మొదలైనవి చేసికొంటూండే పెద్దవాళ్లు కూడ దక్షిణ భారత హిందీ ప్రచార సభ, (మద్రాసు) నిర్వహించే హిందీ పరీక్షలు వ్రాస్తూండేవారు. నేను మద్రాసులో ఉన్న రోజులలోనే ఆ సభవారి మూడవ పరీక్ష 'రాష్ట్రభాష' ప్యాసయ్యాను. 1947లో స్వాతంత్ర్యం వచ్చింది. దానితో హిందీమీద చాలమందికి మక్కువ పెరిగింది. ప్రవేశిక పరీక్షకు సిద్ధం అవుతూ నేను ఇంటివద్దనే ఉన్న పద్నాలుగు నెలల కాలంలో మా ఊరిలోని వారికి కొందరికి హిందీలో ట్యూషన్స్ కూడ చెప్పాను. ప్రవేశిక ప్యాసయి రాష్ట్ర భాషా విశారదకు కూడ కూర్చున్నాను. ఫలితాలు రావలసి ఉంది.

1947 డిశెంబర్‌లో మద్రాసు యూనివర్సిటీ విజయపత్ర ప్రదానోత్సవానికి వెళ్లి "పిట్టిమునిస్వామి చెట్టి గోల్డ్‌మెడల్" దాదాపు ఇరవై సంవత్సరాలపాటు వైస్ ఛాన్సలర్‌గా ఉన్న లక్ష్మణస్వామి మొదలియార్ చేతులమీదుగా అందుకొన్నాను. మా కాలేజీకి సంబంధించిన గోల్డుమెడల్ కూడ వార్షికోత్సవ సమయంలో బహూకరించారు.

అయినవల్లి నుంచి దాదాపు 25 మైళ్ల దూరంలో, రాజోలు తాలూకాకు చెందిన మలికిపురం అను గ్రామం ఉంది. 1948 జూన్‌లో అక్కడ ఒక హైస్కూలు స్థాపించారు. మా యింటికి ఎదురుగా ఉండే నిట్టల వెంకటరావు అనే నా బాల్యమిత్రుడు ఆ స్కూలు కమిటీకి కార్యదర్శిగా ఉన్న తనకు పరిచితుడైన యర్రాప్రగడ బాపిరాజుగారి దగ్గరికి నన్ను తీసికొనివెళ్లి నేను గోల్డుమెడలిస్టుననీ, ఏదైనా ఉద్యోగం ఇవ్వవలసిందనీ సిఫార్స్ చేశాడు. క్రొత్తగా స్థాపిస్తూన్న పాఠశాలలో ఏదో సంస్కృత పరీక్ష ప్యాసైనవానికి ఉద్యోగం

ఇవ్వడానికి ఏమాత్రమూ అవకాశం లేకపోయినా ఆయన నా గోల్డ్‌మెడల్ చూచి, (నేను హిందీ ప్రవేశిక పాసై ఉండడంచేత) హిందీ పండిట్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఒకటి రెండు మాసాల తరవాత రాష్ట్ర భాషా విశారద పరీక్ష ఫలితాలు కూడ వచ్చాయి. దానితో ఉద్యోగార్హత గట్టిపడింది. అయితే– బాపిరాజుగారు సంస్కృత భాషమీద అభిమానం ఉన్నవారు. బి.ఏ.లో ఆయన ఆ భాష చదువుకొన్నారట. అందుచేత సంస్కృతం కూడ పాఠశాలలో ప్రవేశపెట్టి నన్ను సంస్కృత పండితునిగా నియమించారు. ఆ విధంగా సంస్కృతమూ హిందీ రెండు బోధించేవాణ్ణి.

ఆ మలికిపురం ప్రాంతంలో ధనాఢ్యులైన క్షత్రియులూ, కాపులూ ఉండేవారు. వారందరూ రాజకీయంగా కూడ గొప్ప పలుకుబడి కలవారు. పాఠశాలా ప్రారంభోత్సవం చాల ఘనంగా జరిపించారు. ఆ రోజులలో కోనసీమకు కిరీటం లేని రాజైన కళావెంకట్రావుగారూ, ఇంకా ఇద్దరు రాష్ట్రమంత్రులూ, కాంపోజిట్ మద్రాసు స్టేట్‌కు డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్‌గా ఉన్న డి.ఎస్.రెడ్డిగారూ ఇంకా ఎందరో ప్రముఖులూ వచ్చారు. మంత్రులందరికీ, డైరక్టర్ గారికీ స్వాగతం చెపుతూ సంస్కృతంలో పద్యాలు వ్రాయమని హెడ్‌మాస్టర్ చెప్పగా నేను వ్రాసి సభలో చదివాను. సభా కార్యక్రమం అంతా పూర్తి అయిన తరవాత డిపార్ట్‌మెంట్‌కి సర్వోన్నతాధికారి కావడంచేత డి.ఎస్.రెడ్డిగారు ఉపాధ్యాయులందరూ ఉన్నచోటికి వచ్చివారిని కలిశారు. బహుశా నా వంటివాళ్లు ఒకరిద్దరు తప్ప ఉపాధ్యాయులందరూ ఇతర పాఠశాలలలో పనిచేసి అనుభవం సంపాదించుకొన్న వారే. వారినందరినీ కావాలని మేనేజ్‌మెంట్‌వారు కోరి తెచ్చుకొన్నారు. హెడ్‌మాస్టర్‌తో సహా ఐదుగురు ఉపాధ్యాయులు రాజమండ్రీ మునిసిపల్ స్కూలు, వీరేశలింగం స్కూలు మొదలైనచోట్ల నుండి వచ్చారు. తల్లావఝుల కృత్తివాసతీర్థులు అనే జాగ్రఫీ టీచర్ కూడ రాజమండ్రి నుండి వచ్చారు. ఈయన తల్లావఝుల శివశంకర స్వామిగారి పుత్రులని కాలాంతరంలో స్వామివారితో పరిచయం అయిన తరవాత తెలిసింది. ఆయన అప్పుడప్పుడు లాంగ్‌కోట్లు ధరించేవాడు. తెలుగులో మంచి రచయిత. నేను ఆయన లాంగ్‌కోటు ఎరవు తీసికొని కొన్ని మాసాల క్రితమే లభించిన గోల్డ్‌మెడల్స్ రెండూ తగుల్చుకొని ఆ ఉత్సవంలో పాల్గొన్నాను. డి.ఎస్.రెడ్డిగారు నన్ను చూచి ఏదో ఇంగ్లీషులో అన్నారు; నా ప్రక్కనున్నవారు ఏదో సమాధానం చెప్పారు; మళ్లీ ఆయన ఏదో అన్నారు. నాకు అప్పటికి ఆంగ్ల భాషా పరిజ్ఞానం లేదు. అక్షరాలు నేర్చుకొని ఒకటిరెండు రీడర్స్ చెప్పించుకొని ఉన్నాను. అలాంటివారు మాట్లాడే ఇంగ్లీషు అర్థమయే ప్రసక్తే లేదు. ఈ మెడల్స్ ఏమిటి అని ఆయన అడిగారట. వాటి ఆగమనాన్ని గూర్చి ప్రక్కవారు చెప్పగా– "నువ్వు స్కూలులో ఉండడం ఏమిటి? ఆర్ట్స్ కాలేజీలో ఉండాలి" అని ఆయన అన్నారట.

ఈ విషయం మా సహోపాధ్యాయులు అంతర్నియమితహాస పూర్వకంగా తరువాత చెప్పారు. ఈ విషయం మా నాన్నగారితో చెప్పగా- "అంతటి పెద్దవారి నోటినుండి అప్రయత్నంగా వచ్చినమాట ఏనాటికైనా సఫలం అవుతుంది" అన్నారు. "అత్యున్నత స్థానంలో ఉన్న ఏ వ్యక్తియైనా ఏదో ఒక మహత్తరమైన పుణ్యంచేసి ఉండాలి. ఆతనిలో కొంత దేవాంశ ఉంటుంది" అను భారతీయ సంప్రదాయ స్థిరమైన విశ్వాసం ఉన్నవారు ఆయన. ఆశ్చర్యమేమనగా- రెడ్డిగారు 1948 ఆగస్టులో ఈ మాట అన్నారు. 1951 జూన్‌లో క్రొత్తగా అమలాపురంలో స్థాపించిన ఎస్.కె.బి.ఆర్.కాలేజిలో సంస్కృతోపాధ్యాయుడుగా నాకు ఉద్యోగం లభించింది. ఆ రెడ్డిగారే ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్స్‌లర్‌గా ఉంటూ 1960లో నన్ను ఆ విశ్వవిద్యాలయంలో సంస్కృతోపాధ్యాయుణ్ణిగా నియమించారు. 1963లో నేను రచించిన గీతాంజలి (రవీంద్రుని ఆంగ్ల మూలానికి సంస్కృతానువాదం) పుస్తకం వారికివ్వడానికి వెళ్లినప్పుడు వారు చాల సౌహార్దంతో ఇది బి.ఏ. స్టాండర్డ్‌లో ఉంటుందా? యమ్.ఏ. స్టాండర్డ్‌లో ఉంటుందా- ఇత్యాదివిధంగా ప్రశ్నించి, నేను పూర్వం జరిగిన విషయం అంతా చెప్పగా విని చాల సంతోషించారు.

హిందీ ఉపాధ్యాయుడుగా స్థిరత్వం లభించాలంటే 'విశారద' మాత్రం సరిపోదు; దానిపై పరీక్ష 'రాష్ట్ర భాషా ప్రవీణ' కూడ పాస్ కావాలి అను మాటలు వినబడడంతో పనిలో పని అది కూడ పూర్తి చేద్దాం అనే అభిప్రాయంతో ఆ ప్రయత్నం ప్రారంభించాను. నా సంస్కృత పండిత స్థానానికి ప్రమాదం ఏదీ లేకపోయినా- "ఇటుపైన హిందీకి ఎంతో ప్రాధాన్యం రాబోతున్నది. ఇంగ్లీషు చదువుకొన్నవాళ్లు ఎలాంటి పదవులు సంపాదించేవారో వాటిని మించిన పదవులు లభిస్తాయి" అనే మాటలు ఆ రోజులలో అధికంగా ప్రచారంలో ఉండేవి. ఆంగ్ల భాషాగంధంలేని నావంటివాళ్లకు ఆ మాటలు చాల ఆకర్షణీయంగా కూడ ఉండేవి. హిందీ భాషాధ్యాయనోత్సవానికి ఇది కూడ ఒక ప్రధాన కారణం.

రాష్ట్ర భాషా ప్రవీణ పరీక్షకు మూడు భాగాలు. ఒక్కొక్క భాగానికి నాలుగైదు పేపర్లూ ఉండేవన్నట్లు జ్ఞాపకం. ఒక భాగంలో ఒకటి రెండూ పేపర్లు తెలుగు కూడ ఉండేది. పరీక్షా కేంద్రం ఆ ప్రాంతానికంతకీ అమలాపురం హైస్కూలులో మాత్రమే ఉండేది. మలికిపురం నుంచి అమలాపురం చాలాదూరం. అందుచేత నేను అమలాపురానికి ఏడుమైళ్ల దూరంలో ఉన్న మా ఊరు, అయినవల్లి నుండి రోజూ అమలాపురం వెళ్లి పరీక్షలు వ్రాశేవాణ్ణి. కొన్ని పేపర్లు పూర్తి అయాయి. తరువాతి పేపరుకోసం ఒకనాడు వెళ్లగా "అది నిన్ననే పూర్తి అయిపోయింది. నువ్వు టైంటేబిల్ తప్పు చూచుకొని ఉంటావు" అని కేంద్ర నిర్వాహకులన్నారు.

ఈ సంవత్సరం అంతా వృధా అయిపోయింది కదా అని విచారిస్తూ మరునాడు మలికిపురం వెళ్లి మిత్రులకు ఈ విషయం చెప్పాను. ఒక్కొక్కరి రియాక్షన్ ఒక్కొక్క విధంగా ఉంది. ఇంతకీ నీ ఉద్యోగం దీనిమీద ఆధారపడిలేదుకదా? తరవాత పూర్తిచేసికోవచ్చును అని కొందరన్నారు. అయితే నా జీవితంలో ఇది ఒక ప్రధానమైన మలుపు (turning point) అయింది.

మలికిపురం స్కూలులో ఉన్నప్పుడు నాకు ఇద్దరు సమాన వయస్కులతో ఘనిష్ఠమైన స్నేహసంబంధం ఏర్పడింది. దానివల్ల నేను ఎంతో లాభం పొందాను. వారిలో ఒకరు సిహెచ్.నరసింహారావు. వీళ్లు కాపులు. ఈయన ఇంటర్‌మీడియెట్ పాసయి దానితో చదువు ఆపివేసి కో ఆపరేటివ్ డిపార్ట్‌మెంటులో పనిచేశాడు. ఆ వాతావరణం ఈయనకు నచ్చలేదు. రిజైన్ చేసి సెకండరీ గ్రేడ్ టీచర్స్ ట్రెనింగ్ పూర్తిచేసికొని మాతోనే ఆ స్కూలులో ఉపాధ్యాయుడుగా చేరాడు. ఉత్తమ స్వభావం, విశాల దృక్పథం కలవాడు. అవకాశం లభించినప్పుడల్లా ప్రపంచ చరిత్రకు సంబంధించిన పుస్తకాలు, మహాపురుషుల జీవితచరిత్రలు చదువుతూ ఉండేవాడు. రెండవ మిత్రుడు యన్.యస్.కృష్ణమూర్తి. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ప్రభుత్వం విద్యారంగంలో ఎన్నో ప్రయోగాలు ప్రారంభించింది; ఇంకా ఏవేవో చేస్తూనే ఉంది. ప్రారంభ సంవత్సరంలో వృత్తివిద్య అనేది ఒకటి స్కూళ్లల్లో ప్రారంభించారు. అప్పుడు ఆ స్కూలులో కూడ బట్టలనేత, వడ్రంగిపని ప్రారంభించారు. ఆ శాఖకు ఈయనను పర్యవేక్షకుణ్ణిగా నియమించారు. ఈయన క్రొత్తగా పోలీటెక్నిక్ కాలేజిలో మెకానికల్ ఇంజనీరింగు పాసయాడు. మంచి చురుకైనవాడు. మేము ముగ్గురము సమవయస్కులము, సమానాశయవంతులము, అంతగా సంసారబాధ్యతలేని వారమూ అవడంచేత మా మధ్య మంచి స్నేహం ఏర్పడింది. మిగిలిన ఉపాధ్యాయులందరూ దాదాపు 40–45 సంవత్సరాల వయస్సు ఉన్నవారే.

శలవు రోజులలో కూడ మేం ముగ్గురము ఏ పంట కాలవగట్టుమీదనో కూర్చుండి కబుర్లతో కాలక్షేపం చేస్తూండేవాళ్లం. నరసింహారావుకి హిందీభాష విషయంలో మంచి అభిప్రాయం ఉండేది కాదు. ఈ పరీక్షలు ప్యాసవడంవల్ల ప్రయోజనం ఏమీ ఉండదని అంటూండేవాడు. ఒకనాడు నేనూ ఆయనా పంట కాలవ గట్టుమీద కూర్చొని మాటలాడుకొంటున్నప్పుడు నేను హిందీ పరీక్షకు రాబోయే ఛాన్స్‌కు కట్టాలనుకొంటున్నాను అన్నాను. అప్పుడాయన– "ఎందుకు ఈ వృధా శ్రమ? శుభ్రంగా మెట్రిక్యులేషన్ పరీక్షకు కట్టి తరవాత పరీక్షలు కూడ జాగర్తగా ప్యాసయితే నీ సబ్జెక్ట్‌లోనే నువ్వు పైకి రావచ్చు" అన్నాడు. నాకు ఆ ఆలోచన ఏనాడూ కలగలేదు. ఇంగ్లీషు నాకు సర్వదా అసాధ్యం అనే నా నమ్మకం. స్కూల్ ఫైనల్ పరీక్షకు ఉండే అన్ని సబ్జక్ట్స్ మెట్రిక్యులేషన్‌కు ఉంటాయి.

గణితంతో నాకేమాత్రమూ పరిచయం లేదు. చిన్నతనంలో మా నాన్నగారు చెప్పిన సాధారణమైన కూడికలూ గుణకారాలు తప్ప మరేమీ తెలియదు. ఎక్కాలు మరచిపోయాను. అందుచేత నాకు సాధ్యం కాదేమో అన్నాను. నువ్వు తప్పక ప్యాసవుతావు; రాబోయే మార్చికి పరీక్షకు కట్టు అని ఆయన గట్టిగా ధీమా ఇచ్చాడు. సరే అని నిర్ణయించుకొన్నాను. ఈ నిర్ణయం 1949 ఫిబ్రవరి ప్రాంతంలో జరిగింది. మరునాడు ఎక్కాలపుస్తకం మొదలైనవి సంపాదించడం ప్రారంభించాను. ఒక సహాధ్యాపకుని దగ్గరికి వెళ్లి పదవక్లాసు లెక్కలు మొదలుపెట్టాను. నరసింహారావు ఇంగ్లీషు చెప్పడం మొదలుపెట్టాడు. ఎస్.ఎస్.ఎల్.సి.కి ఉన్న పుస్తకమే దీనికీని. అది తెప్పించుకొన్నాను. మా ఇద్దరు మిత్రులూ తప్ప ఇతర ఉపాధ్యాయులందరూ ప్రత్యక్షంగానూ పరోక్షంగాను నవ్వుకొన్నారు. అంతలో వేసవి శలవులు రావడంతో మా ఊరువెళ్లి అక్కడ ఉన్న ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ దగ్గర ట్యూషన్ కుదుర్చుకొని ఆ రెండు నెలలూ ఐదవక్లాసు నుండి మూడవ ఫారం వరకూ ఉన్న లెక్కలు నేర్చుకొని మలికిపురం చేరాను. రెండవ భాష సంస్కృతం హిస్టరీ, సివిక్స్ మొదలైనవి స్వయంగానే చదువుకొన్నాను. నాల్గవఫారం నుంచి ఆరవ ఫారం వరకూ లెక్కలు మా మిత్రుడు కృష్ణమూర్తి బోధించాడు. మేం ఇద్దరమూ ఒకే ఇంట్లో అద్దెకు ఉండడంచేత వ్యాసంగం అవిచ్ఛిన్నంగా నడిచింది. ఆ రోజులలో ఆయన చెప్పిన ఒక విషయం నాకు అప్పుడే కాక, అనేక సందర్భాలలో ఉపకరించింది. "లెక్కలలో ఇచ్చిన పెద్ద సంఖ్యలు చూచి భయపడిపోకూడదు. ఆ అంకెలు చిన్న సంఖ్యల లోనికి ఊహించుకొని లెక్కమనస్సులోనే చేసికొంటే పద్ధతి వెంటనే తెలుస్తుంది. అప్పుడు లెక్కచేయడం సులభం అవుతుంది" అని ఆయన చెప్పాడు. ఈ సూత్రం గుర్తుంచుకొని దాదాపు 500 పేజీల ఆ పుస్తకంలో ఉన్న అన్ని విధాలైన లెక్కలూ అనాయాసంగా చేయకలిగాను. ఈ విధంగా చదివి 1950 మార్చి పరీక్షకు కూర్చున్నాను. పరీక్ష కాకినాడ పి.ఆర్.కాలేజి సెంటర్‌లో వ్రాసి వేసవి శలవులకు మా ఊరిలో ఉన్నాను.

శలవుల తరవాత మలికిపురం వెళ్లినప్పుడు మా మిత్రుడు నరసింహారావు పరీక్షా ఫలితం తనకు తెలిసిన పద్ధతిని గూర్చి డ్రమేటిక్‌గా వర్ణించిచెప్పాడు. వేసవి శలవులలో ఒకనాడు కొందరు మా సహోపాధ్యాయులు ఒక హోటల్ దగ్గర ఉండగా పేపర్‌లో పరీక్షా ఫలితాలు కనబడ్డాయట. నా నంబర్ వాళ్లకు తెలియదు. ఇంతలో నరసింహారావు అక్కడికి వెళ్లాడట. ఆయనను చూడగానే "మీ మిత్రుడి నంబర్ ఏమిటి; రిజల్ట్స్ వచ్చాయి" అని వాళ్లడిగారట. (ఆయన ఆరడుగుల మనిషి). ఒక కాలు నేలమీద ఆనికొని సైకిల్ మీదనే కూర్చుండి నంబర్ చెప్పాడట. వాళ్లు చూచి "లేదు, ఫేలయ్యాడు" అని చిరునవ్వులతో సమాధానం చెప్పారట. నరసింహారావు అలాగే ఉండి- "సెకండ్ క్లాసులో చూడండి" అన్నాడట. ఆ కాలమ్‌లో నంబరుంది. వెంటనే ఆయన నాకు టెలిగ్రాం ఇచ్చాడు. నేనూ

మా ఊరిలో చూచుకొన్నాను. నా మిత్రులిద్దరూ నాకంటె ఎక్కువ సంతోషించారు.

ఓరియంటల్ డిగ్రీ పొందినవాళ్లకి ఎమ్.ఏ. డిగ్రీ సంపాదించడానికై కాలాంతరంలో ఒక సౌకర్యం లభించింది. ప్రత్యేకంగా నిర్ణీతమైన ఒక ఇంగ్లీష్ టెక్ట్స్ చదివి ఒకే పేపర్ పరీక్ష వ్రాస్తే (ఓరియంటల్ డిగ్రీతో) బి.ఏ.గా పరిగణించి వాళ్లకు కావలసిన భాషలో ఎమ్.ఏ. వ్రాయడానికి అనుమతి ఇవ్వడం ప్రారంభం అయింది. కాని ఆ కాలంలో ఆ సౌకర్యం లేదు. పూర్తిగా యథావిధిగా ఇంటర్‌మీడియట్, తరవాత బి.ఏ. ప్యాసైతేనే ఎమ్.ఏ.కి కూర్చోడానికి అనుమతి. ఆ రోజులలో ఒక్క బెనారస్ హిందూ యూనివర్సిటీవారే ఉపాధ్యాయులుగా ఉన్నవాళ్లని మాత్రం ఎమ్.ఏ.కు ప్రైవేటుగా కూర్చొనడానికి అనుమతించేవారు. అందుచేత 1952 మార్చికి ఇంటర్ మీడియేట్‌కు కూర్చోవాలని పుస్తకాదులు సేకరించి ప్రయత్నం ప్రారంభించినాను.

1951లో అమలాపురంలో ఒక కాలేజి స్థాపించారు. (రెండేళ్లలో దానిని డిగ్రీ కాలేజి చేసి బి.ఏ., బి.కామ్., బి.ఎస్‌సి.లు ప్రారంభించారు). ఆ సంవత్సరమే దానిలో 'సంస్కృతం పండిట్'గా తీసికొన్నారు. ఓరియంటల్ డిగ్రీ మాత్రమే ఉన్నవాళ్లని 'పండిట్' అనీ ఎమ్.ఏ. ప్యాసయి ఉంటే లెక్చరర్ అనీ అనేవారు. చేసే పని ఒకటే. స్కేల్స్‌లో మాత్రం భేదండుండేది. ఈ పద్ధతి ఆంధ్రా– వెంకటేశ్వర– మద్రాసు విశ్వవిద్యాలయాదులలో చాలకాలం నుంచి ఉంది. ఉస్మానియాలో లేదు.

మెట్రిక్యులేషన్ ప్యాసైన తరవాత మూడు సంవత్సరాల వ్యవధానం ఉండాలంటూ విశ్వవిద్యాలయంవారు నాకు 1952లో ఇంటర్‌మీడియట్‌కు కూర్చొనడానికి అనుమతి నిరాకరించారు. అందుచేత ఆ సంవత్సరం తెలుగు విద్వాన్ ప్రీవియస్ పరీక్షకు కూర్చున్నాను. "నీ దగ్గర చదువుకొన్నవాళ్లతో కలిసి పరీక్ష వ్రాస్తే బాగుండదు; ఏ కాకినాడ సెంటర్‌కైనా వెళ్లి రాయి" అని కొందరు సలహా చెప్పినా– దానిలో అవమానకరం ఏదీ లేదని నిర్ణయించుకొని నా విద్యార్థులతో పాటే 1953లతో ఇంటర్మీడియట్, 1955లో బి.ఏ. వ్రాశాను. 1954లో విద్వాన్ ఫైనలు వ్రాశాను. అలంకారశాస్త్రం ప్రధాన విషయంగా తీసికొని బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఏ. సంస్కృతం 1956లో ప్రీవియస్ 1957లో ఫైనల్ వ్రాశాను. ఎమ్.ఏ. పాసవడంచేత లెక్చరర్ డెజిగ్నేషన్ లభించింది.

బి.ఏ. పాసయిన తరవాత ఒకనాడు లైబ్రరీ నుంచి మెకాలే వ్రాసిన ఒక చిన్న పుస్తకం తీసికొంటున్నాను. అంతలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్‌గా ఉన్న మా బంధువు అక్కడికి వచ్చి, నా చేతిలో ఆ పుస్తకం చూచి "ఇది నీకెక్కడ అర్థం అవుతుందిరా?"

అన్నాడు. "అదే చూద్దామని తీసికొనివెడుతున్నాను; చూస్తాను" అని చెప్పి నేను వెళ్లిపోయాను. నాలుగైదు రోజులు దీక్షగా ఆ చిన్న పుస్తకం చదివితే దానిలో నా కర్థంకాని వాక్యం కాని, భావం కాని కనబడలేదు. అతడలా అన్నందుకు సంస్కృతం ఎమ్.ఏ. పూర్తిచేసికొన్న తరవాత ఇంగ్లీష్ ఎమ్.ఏ. కూడ ప్యాసు కావాలని ఆనాడే నిశ్చయించు కొన్నాను. ఆతని మాట నాకు మేలే చేసింది. 1961లో ఇంగ్లీషు ఎమ్.ఏ. ప్యాసయ్యాను; హిందీ ప్రారంభించాం కదా అనే ఉద్దేశ్యంతో ఆ ఎమ్.ఏ. కూడా 1963లో ప్యాసయ్యాను. ఈ విధంగా 1943 నుంచి 1963 వరకూ ప్రతీ సంవత్సరమూ ఏవో పరీక్షలతో చాల శ్రమ అనిపించేది. కాని సంస్కృత సాహిత్య- శాస్త్రాదులతో పాటు తెలుగు- హిందీ- ఆంగ్ల సాహిత్య గ్రంథాలు కూడా చదువుతుంటె వాటిలోని సామ్య వైషమ్యాలను గుర్తిస్తూ వాటి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూన్నప్పుడు కలిగిన ఆనందం లోకోత్తరంగానే ఉండేది. ఇతర విషయాలన్నీ క్షుద్రంగా (trivial) గా కనబడేవి. ఏదో ఒక సాహిత్యాన్నో, ఒక సాహిత్య ప్రక్రియనో పట్టుకొని ఇతర సాహిత్యాదుల విషయంలో అనాదరం చూపేవారిని చూస్తే "అయ్యో! పాపం" అనిపిస్తుంది. పాణిని- పతంజలి- కాళిదాస- బుద్ధ- శంకరాచార్యాదులతోను, నన్నయ- తిక్కన- పోతన- విశ్వనాథ- జాషువా- శ్రీశ్రీ- జంధ్యాలాదులతోను, ప్లేటో- అరిస్టాటిల్- మిల్టన్- షేక్స్పియర్- జాన్సన్- మార్క్స్- బెర్నార్డ్‌షాదులతోను, గాంధీ- టాగూర్- నెహ్రూ- రాధాకృష్ణాదులతోను వారి గ్రంథాల ద్వారా సంబంధం ఏర్పరచుకొన్నవాడు ఒకప్రక్క ఆనందిస్తున్నా, తాత్కాలికంగానైనా "అయ్యో! నాకు తెలిసినది అత్యల్పమే కదా!" అని వాపోతూంటాడు. అలాంటి స్థితి నేను చాలసార్లు అనుభవించాను, అనుభవిస్తున్నాను కూడ.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యోగం

1960 జూన్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృతం లెక్చరర్ పోస్టు ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ఆ స్థానంలో లభించదనే పూర్తి నమ్మకంతోనే మిత్రుల ప్రోత్సాహంచేతా, ఈ వంకపై హైదరాబాదు చూడవచ్చుననే ఉద్దేశ్యంచేతా ఇంటర్వ్యూకి వచ్చాను. అంతక్రితం సంవత్సరం తిరుపతి ఎస్.వి. యూనివర్సిటీకి, తప్పక లభిస్తుందనే పూర్తి విశ్వాసంతో, ఇలాంటి స్థానానికే ఇంటర్వ్యూకి వెళ్లడం, అది లభించకపోవడం జరిగింది. అందుచేతనే ఈ నమ్మకం. డి.యస్.రెడ్డిగారు అప్పుడు వైస్ చాన్సలర్. ఆనాడు మలికిపురంలో చూచిన Director of Public Instruction ఈయనే అను సంగతి కూడ నాకప్పుడు తెలియదు. అప్పుడు ప్రొఫెసర్‌గా ఉన్న ఆర్యేంద్ర శర్మగారు "నిన్నెక్కడో చూచినట్లుందే" అన్నారు. ఆయన తిరుపతి ఇంటర్వ్యూ కమిటీ మెంబరుగా ఏడాదిక్రితం చూచి ఉన్నారు. ఆయనను నేను గుర్తించడంచేత ఆ విషయమే చెప్పాను. ఇంటర్వ్యూ

అయిన తరవాత నిశ్చింతగా చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియమూ చూచి మరునాడు బయలుదేరి అమలాపురం వెళ్లిపోయాను. ఈ ఇంటర్వ్యూ విషయమే పూర్తిగా మరచిపోయాను. దాదాపు ఒక నెల తరవాత ఉస్మానియా యూనివర్సిటీ నుండి వరంగల్లు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో అప్పాయింటు చేస్తూ ఆర్డరు వచ్చింది. అప్పటికి విశాలాంధ్ర ఏర్పడినా ఇతర ప్రాంతాలవారికి యూనివర్సిటీలు, ప్రభుత్వంలోను ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రత్యేకించి గవర్నర్ అనుమతి అవసరం ఉండేది. నా వంటి పది పదిహేనుగురి పేర్లతో అలాంటి అనుమతి పత్రం కూడ ఆర్డర్‌కు జతచేసి పంపబడింది. ఈ నియమాలన్నీ పాటించడంలో ఆలస్యం అవడంచేత ఆర్డర్ ఆలస్యంగా వచ్చిందని అనుకొన్నాం.

ప్రత్యక్షంగా యూనివర్సిటీ పాలనలో ఉన్న కాలేజీలు సుదూర నగరాలలో ఉండడం అనే పద్ధతి నాకేకాదు; అక్కడివాళ్లెవరికీ తెలియదు. ఇంటర్వ్యూలు హైదరాబాదులో యూనివర్సిటీలో జరిగినా బైట నున్న కాలేజీలో అప్పాయింట్ చేయడం ఏమిటా అని శంక. అప్పటికి నేను పనిచేస్తూన్నది కూడ డిగ్రీ కాలేజియే అయినప్పుడు దానిని విడచి ఎక్కడో తెలియని దేశానికి మరొక డిగ్రీ కాలేజికి వెళ్లడం అనవసరం అనిపించింది. హైదరాబాదులో ఆనాడు నాకు కాని నా మిత్రులకు గాని తెలిసినవారు, ఈ విషయంలో సందేహం తీర్చగలవారు లేరు. ఒక్క దివాకర్ల వెంటావధానిగారితో ముఖపరిచయం ఉంది. అంతకు ఒక సంవత్సరం క్రితం వారు ఏదో సాహిత్యసభకు అమలాపురం వచ్చారు. ఆ ఒక్కరోజు పరిచయంలోనే వారు తాము ఎడిట్ చేస్తూన్న ఏదో విజ్ఞాన సర్వస్వం సంపుటానికి 'స్మృతివాఙ్మయం' అను విషయంమీద నిబంధం వ్రాయవలసిందిగా నాకొక పని అప్పగించారు. రెండు, మూడు మాసాలలో ఆ వ్యాసం వారికి పంపివేశాను. ఇంతమాత్రం పరిచయంతో లేఖ వ్రాస్తే మాత్రం జవాబు ఇస్తారా అని సందేహం. అయినా వ్రాసిచూద్దాం; ఆయన నుండి సమాధానం రాకపోయినా, వచ్చిన సమాధానం అనుకూలంగా లేకపోయినా వెళ్లడం మానివేద్దాం, సర్వీసులో ఏదైన ఉత్కర్ష ఉన్నది అని సమాధానం వస్తే వెడదాం అని నిశ్చయించుకొని ఆయనకు లేఖ వ్రాశాను. వారం రోజులలో వారు సమాధానంగా- వరంగల్ కాలేజ యూనివర్సిటీ కాలేజియే అనీ, క్రొత్తగా నియమితులైనవాళ్లను కొందరిని మొదట నాలుగైదు సంవత్సరాలు అక్కడ ఉంచి తరవాత హైదరాబాదు తీసికొనివస్తారనీ, తప్పక చేరవచ్చుననీ వ్రాశారు. ఆయన చెప్పిన ధైర్యాన్ని పురస్కరించుకొని నేను వచ్చి వరంగలులో జేరాను అందుచేత, నా యూనివర్సిటీ ప్రవేశానికి దివాకర్ల వెంకటావధానిగారు ఒకవిధంగా కారణభూతులని సర్వదా అనుకొంటూ ఉంటాను.

అమలాపురం విడచివచ్చేటప్పుడు రెండు నిర్ణయాలు తీసికొన్నాను. అక్కడ

ఉపాధ్యాయవర్గంలో ప్రిన్సిపాలుకు అనుకూలమైన వర్గం, ప్రతికూలమైన వర్గం అని రెండు వర్గాలుండేవి. క్రొత్తగా చేరే కాలేజీలో కూడ అలాంటివి ఉంటే ఏ వర్గంతోను సంబంధం పెట్టుకొనగూడదనేది ఒక నిర్ణయం. ఇలాంటి వర్గాలు ప్రతీసంస్థలోనూ అన్నిచోట్లా కనబడుతూనే ఉంటాయి. ఈ విభేదాలన్నీ అనావశ్యకమైన, ఒకరిపై ఒకరు ఊహించి పెంచుకొన్న అనుమానాల మూలాన మాత్రమే బయలుదేరుతాయి అనేది జాగర్తగా ఆలోచిస్తే అందరికీ తెలిసిన విషయమే. నేను మద్రాసునుండి తిరిగి వచ్చిన తరవాత ఒక ఏడాది ఖాళీగా ఉన్న రోజుల్లో మా నాన్నగారివద్ద కొంచెం జ్యోతిషం (ఫలభాగ- ముహూర్తభాగాలు) నేర్చుకొన్నాను. అమలాపురంలో ఉన్న కాలంలో దీనికోసం చాలమంది నా దగ్గరకు వస్తూ ఉండడంతో కాలం ఎక్కువగా వ్యర్థం అయేది. ఆ విద్యను ఎవరికీ ప్రదర్శించకూడదనేది రెండవ నిర్ణయం. వరంగలులో కూడ కొన్ని వర్గాలుండేవి. వాటికి దూరంగానే ఉన్నాను. క్రమక్రమంగా నేర్చుకొన్న జ్యోతిశ్శాస్త్రం అంతా మరచిపోయాను. దీనితో నిత్యసంబంధం లేకపోతే అది తనంతట తానే మరుగున పడిపోతుంది. పుస్తకాలన్నీ కావాలన్న వాళ్లకి ఇచ్చివేశాను. వృథా కాలయాపనం తగ్గింది.

వరంగలులో ఐదు సంవత్సరాలూ అతిసుఖంగా స్నేహమయ వాతావరణంలో గడచిపోయాయి. అక్కడి కాలేజిలో ఏడెనమండుగురు వయోవృద్ధులైన ఉపాధ్యాయులున్నా చాలమంది అప్పుడే పోస్టు గ్రాడ్యుయేట్సు అయి క్రొత్తగా అక్కడికి వచ్చిన నవయువకులు మంచి ఉత్సాహంతో పనిచేసేవారు. అయితే అంతవరకు హైదరాబాదులో ఉండి వచ్చినవారవడంచేత తిరిగి అక్కడికి ఎప్పుడు వెడతామా అని తహతహలాడుతూం దేవారు. "Suffering from Warangalitis" అని పరస్పరం పరిహసించుకొనేవారు. నేను అక్కడికి వెళ్లడమే పల్లె వాతావరణం నుండి వెళ్లడంచేత నాకు వరంగలు నివాసం ఆనందకరంగానే ఉండేది. ఒక పర్యాయం డి.ఎస్.రెడ్డిగారు అక్కడికి వచ్చినప్పుడు ఆ యువకులందరూ కోరగా వారు హైదరాబాదుకు వెళ్లిన వెంటనే రెండు మూడు వారాలలో- హైదరాబాదు కాలేజీలలో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులందరూ కనీసం రెండు సంవత్సరాలపాటు వరంగలు కాలేజిలో పని చెయ్యాలని నియమం పెట్టాడు. ఆ విధంగా చాలమంది హైదరాబాదుకు ట్రాన్స్ఫర్ అయ్యారు. మరికొన్ని సంవత్సరాలలో కాకతీయ విశ్వవిద్యాలయం స్థాపించడంతో నవయువకులకు ఇతరులకూ కూడ వరంగలైటిస్ బాధ తొలగిపోయింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపించినప్పుడు మొట్టమొదట ప్రారంభించిన డిపార్ట్మెంట్లలో సంస్కృతం డిపార్ట్మెంటు ఒకటి. దీనివలెనే అతిప్రాచీనమైనది "డిపార్ట్మెంట్ ఆఫ్ ఎథిక్స్" అనేది. కాలాంతరంలో దానిని "రెలిజియన్ అండ్ కల్చర్

డిపార్ట్‌మెంట్"గా మార్చారు. ఆ పేరుతో అది చాల కాలం నడిచింది. దానిలో ఇస్లాంకు ప్రాధాన్యం ఉండేది. అది చదివేవాళ్లు కూడ వాళ్లే. తద్భిన్నులు ఎప్పుడైనా కొన్ని సంవత్సరాలకు ఒకరిద్దరు ఉండేవారు. అలా చదివిన ఒక వ్యక్తి ఆ డిపార్ట్‌మెంటులో ఉపాధ్యాయుడుగా ఉండేవాడు. డి.యస్.రెడ్డిగారి కాలంలో ఆ డిపార్ట్‌మెంటును రెండుగా చేసి "ఇండాలజీ" అను పేరుతో ఒక డిపార్ట్‌మెంట్ సంస్కృత డిపార్ట్‌మెంటుతోను, "ఇస్లామిక్ స్టడీస్" అను పేరుతో రెండవదానిని అరబిక్ డిపార్ట్‌మెంటుతోను, తాత్కాలికంగా, వాటి అధ్యక్షుల పర్యవేక్షణలో నడిచేటట్లు చేర్చారు. అందుచేత ప్రారంభ సంవత్సరాలలో ఆ డిపార్ట్‌మెంట్ విద్యార్థులకు మేం కూడ పాఠాలు చెప్పడం జరిగింది. రెండు సంవత్సరాల తరవాత ఇండాలజీ డిపార్ట్‌మెంటును స్వతంత్ర డిపార్ట్‌మెంట్‌గా చేశారు. అప్పుడు నన్ను దానికి హెడ్ చేశారు. రెండు మూడు సంవత్సరాల తరవాత ఆ డిపార్ట్‌మెంటును "డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఏన్షియంట్ ఇండియన్ హిస్టరీ అండ్ ఆర్కియాలజీ"గా మార్చినప్పుడు నేను సంస్కృత విభాగానికి తిరిగి వెళ్లిపోయాను.

హైదరాబాదుకు వచ్చిన తరవాత విభాగాధ్యక్షులైన ఆర్యేంద్రశర్మగారి పర్యవేక్షణలో పిహెచ్.డి.కి సిద్ధాంతవ్యాసం సుమారు వేయి పేజీలలో పూర్తి చేసి 1966లో సమర్పించాను. ఫలితం రావడానికి ఆలస్యం అయింది. రెండు సంవత్సరాలు పట్టింది. ఆ రోజులలో మౌఖిక పరీక్షకు బైటవారైన ఇద్దరు పరీక్షకులు, ఆంతర పరీక్షకుడు– ముగ్గురూ కలిస్తేనే కాని జరిగేది కాదు. లేఖల ద్వారా తేదీ నిర్ణయించడం ఆలస్యం అయేది. ఈ మధ్య బైటవారిని పిలవకుండా ఇక్కడ ఉన్నవారితోటే పని పూర్తిచేస్తున్నారు. దీనివల్ల యూనివర్సిటీకి కొంచె ధనం ఆదా అయినా వేరు వేరు విశ్వవిద్యాలయాలకు చెందిన ఆచార్యులతో అప్పుడప్పుడైనా సంబంధం లభించే అవకాశం దుర్లభమౌతుంది. ఆ ధనలాభంకంటె ఏ యూనివర్సిటీలో ఎవరు ఏ పనిచేస్తున్నారో తెలియకపోవడంచేత కలిగే విద్యావిషయకమైన నష్టం అధికమని అస్మాదృశుల అభిప్రాయం.

వివిధ విద్యాక్షేత్రాలలో, విశేషించి అలంకారశాస్త్రంలో, సుప్రసిద్ధులైన డా॥ వి.రాఘవన్ (మద్రాసు విశ్వవిద్యాలయం) డా॥ వెంకటేశ్వరన్ (అన్నామలై విశ్వవిద్యాలయం) బైట పరీక్షకులు. వెంకటేశ్వరన్‌గారు "థీసిస్ అన్ని విధాలా చాల బాగున్నది; ఇంగ్లీషు కూడ బాగున్నది" అని వ్రాశారు. రాఘవన్‌గారు మాత్రం కొన్ని లోపాలు చూపించారు. ఆయనకు ఔత్తరాహులు హిందీలో వ్రాసిన అలంకారశాస్త్ర గ్రంథ వ్యాఖ్యానాల విషయంలో సదభిప్రాయం ఉన్నట్లు లేదు. ఇది ఆ వ్యాఖ్యలు చదివి ఏర్పరచుకొన్న అభిప్రాయంగా కాక ఆయనకు హిందీ మీద ఉన్న ఉదాసీనత వల్ల ఏర్పడినదిగా కనబడుతుంది. నేను మూలగ్రంథాలు, సంస్కృత వ్యాఖ్యానాలు, ఆంగ్ల వ్యాఖ్యానాలు, హిందీ వ్యాఖ్యానాలు–

అన్నీ పరిశీలించి థీసిస్ రూపొందించాను. అయినా కూడ ఆయన "ఇతడు హిందీ వ్యాఖ్యానాలమీద ఎక్కువ ఆధారపడ్డాడు" అని వ్రాశారు.

పండితరాయలు "వాక్యం రసాత్మకం కావ్యమ్" అను విశ్వనాథుని కావ్య లక్షణం ఖండించి– "కావ్యంలో రసం ఉంటే మంచిదే; కాని రసం లేనంతమాత్రంచేత కావ్యంకాదు అనడానికి వీలులేదు; అలంకారాదులవల్ల కూడ మాటకు అందం వస్తుంది. అది కూడ కావ్యమే" అని ప్రతిపాదించాడు. దాదాపు 72 అలంకారాలను గూర్చి విస్తృతంగా చర్చించాడు. ఈ తథ్యాన్ని మనస్సులో పెట్టుకొని నేను నా థీసిస్‌లో– "పండితరాయలు తన గ్రంథానికి రసగంగాధరం అని పేరు పెట్టినా, తనకు ముందున్న అలంకార సర్వస్వకారాదులను అనుసరిస్తూ అలంకారాలకి కూడ ప్రాధాన్యం ఇచ్చాడు" అని ప్రతిపాదించాను. ఇది రాఘవన్ గారికి నచ్చలేదు. "నేనీ థీసిస్‌లోని కొన్ని భాగాలు రెండు మూడుసార్లు కూడ చదివేను. రసగంగాధరకారుడు అలంకారాలకు ప్రాధాన్యం ఇచ్చాడని చెప్పడం రామాయణం అంతా విని రామునికి సీత ఏమౌతుంది అని ప్రశ్నించినట్లుంది" అని వ్రాశారు. "ఏమైనా ఇతనికి డిగ్రీ ఇవ్వవచ్చును" అని మాత్రం అన్నారు. ఇదంతా చూచిన ఆర్యేంద్ర శర్మగారు మౌఖికపరీక్ష రేపనగా నన్ను పిలిచి "రాఘవన్ ప్రశ్నించే విధానం కొంచెం దురుసుగా ఉంటుంది. నువ్వు ఎదిరించి సమాధానం చెప్పినట్లు కాక సౌమ్యంగానే అడిగినవాటికి సమాధానం చెప్పు" అని ఉపదేశించారు. మౌఖికపరీక్ష, ఆ రోజులలో ఆర్ట్స్ కాలేజికి ప్రిన్సిపాలుగా కూడ ఉన్న ఆర్యేంద్ర శర్మగారి ఛాంబర్‌లో దాదాపు రెండు గంటలసేపు జరిగింది. ప్రశ్నలన్నీ రాఘవన్‌గారే వేశారు. అయితే నా సమాధానాలకి వారి ముఖంలో ప్రసన్నత కనబడింది. మొత్తంమీద పిహెచ్.డి. డిగ్రీ ఆర్యేంద్రశర్మగారి అనుగ్రహంచేత లభించింది. గండంనుంచి గట్టెక్కినట్లయింది. ఇండాలజీ డిపార్ట్‌మెంటుతో సంబంధం ఏర్పడడానికి ముందే రీడర్ పదవి కూడ వారి ఆశీస్సులవల్లనే లభించింది. ఆ రోజులలో ప్రొఫెసర్ పదవి అస్మాదృశులకు అందని పండుగానే ఉండేది.

1976లో తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి, ఎస్.వి. ఓరియంటల్ రిసెర్చి ఇనిస్టిట్యూట్‌లో ప్రొఫెసర్ కమ్ డైరక్టరు పదవికి ఇంటర్వ్యూకి రావలసిందిగా లేఖ వచ్చింది. అంతకు ఒకటిరెండు మాసాలకు పూర్వం నేను ఆ పదవిని గూర్చిన ప్రకటన పత్రికలలో చూచాను కాని దానికొరకై అప్లికేషన్ పెట్టలేదు. ఆ లేఖ చూడగానే ఆశ్చర్యం కలిగింది. అప్పుడు ఆ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ కె.సచ్చిదానందమూర్తిగారు వైస్ ఛాన్సెలర్‌గా ఉండేవారు. "అప్లికేషన్ పెట్టకపోయినా ఎవరైనా అర్హత కలవాళ్ల పేర్లు ఆ విద్యావిభాగంలో ప్రముఖులుగా ఉన్నవారిద్వారా తెలుసుకొని వాళ్లను కూడ

ఇంటర్వ్యూకు పిలవవచ్చును" అను ఒక క్లాజు వారు ప్రకటనలో పొందుపరచినారట. రాఘవన్‌గారికి వ్రాయగా వారు నా పేరు సూచించారట. మరొకరు బీహారుస్టేట్‌కి చెందిన ఒక పండితుని పేరు సూచించారట. "అయాచితంగా ఆహ్వానం వచ్చింది కదా, ఇంటర్వ్యూకి వెళ్లు" అని మిత్రులు ప్రేరేపింపగా ఇంటర్వ్యూకు వెళ్లాను. బీహార్ ఆయన కూడా వచ్చారు. అభ్యర్థులలో స్థానికులు, ఇతరులూ కూడ ఉన్నారు.

ప్రొ॥ సచ్చిదానందమూర్తిగారిని గూర్చి విన్నాను కాని ఏమాత్రం పరిచయం లేదు. ఆయన ఎస్.వి.విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్ అయినప్పుడు వారి బంధువొకరు ఆంధ్ర సారస్వత పరిషత్తు హాలులో అభినందన సభ ఏర్పాటు చేశారు. మా యూనివర్సిటీ జియాలజీ విభాగంలో పని చేస్తున్న డా॥ ఎం.వెంకటేశ్వరరావు, (మేం కాంపస్‌లో ఇరుగు పొరుగున ఉండేవాళ్లం) సభ ఏర్పాటు చేసిన సజ్జనునికి బంధువు. ఆయన తాను ఆ సభకు వెడుతూ మీరు కూడ వస్తారా అని నన్ను అడిగారు. సచ్చిదానందమూర్తిగారు ఫిలాసఫీలో మంచి పండితుడు అని విని ఉండడంచేత ఆయనను చూడవచ్చును కదా అని నేను కూడ వెళ్లాను. సభలో ఎక్కడనో దూరంగా కూర్చొని ఇంటికి వచ్చేశాం. సచ్చిదానందమూర్తిగారిని అదే తొలిసారి దూరం నుంచి చూడడం.

ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు నన్ను చూడగానే ఆయన "ఆర్ యు ఫ్రమ్ బీహార్" అని అడిగారు. "నో, అయామ్ ఫ్రమ్ ఆంధ్రప్రదేశ్" అని సమాధానం చెప్పాను. ఇంటర్వ్యూ అయింది. ఫలితాన్ని గూర్చి ఆశ పెట్టుకొనకపోవడంచేత భగవద్దర్శనమే లాభం అనుకొని హైదరాబాదుకు వెళ్లిపోయాను. ఎవరో తమిళ ప్రాంతీయునకు ఆ స్థానం లభించినట్లు తెలిసింది. దానిని గూర్చి పూర్తిగా మరచిపోయాను. ఇలా ఉండగా నెలా నెలా పదిహేను రోజుల తరవాత నన్ను అక్కడ ప్రొఫెసర్‌గా నియమిస్తున్నట్లు లేఖ వచ్చింది. ఆ మొదటి వ్యక్తి చేరకపోవడంచేత నాకిచ్చారా అని సందేహం కలిగింది. తరవాత తెలిసింది. ఆయన వెంటనే చేరాడు. అయితే వైస్‌ఛాన్సలర్‌గారు ఒక స్థానం ఏర్పరచి దానిలో నన్ను అప్పాయింట్ చేశారట. వెళ్లాలా మానాలా అను విచికిత్స మళ్లీ ప్రారంభం అయింది. పిల్లల చదువు, నా రెండవ కుమార్తెకు అనారోగ్యానికి వైద్యం జరుగుతూండడం ఈ విచికిత్సకు హేతువు. ఏమైనా– మూడు కారణాలను పురస్కరించుకొని వెళ్లాలని నిశ్చయించుకొన్నాను. ఒకటి– నా పేరు రాఘవన్‌గారు రికమెండ్ చేయడం. రెండు– నా కోసం సచ్చిదానందమూర్తిగారు ఒక స్థానం ఏర్పాటు చేయడం. మూడు– అందరూ స్వప్నాలు చూచే ప్రొఫెసర్‌షిప్ అప్రయత్నంగా లభించడం. రెండు సంవత్సరాల లీవ్ తీసికొని అక్కడికి వెళ్లాను. కుటుంబం తీసికొని వెళ్లడానికి ఒక ఇల్లు కూడా అద్దెకు తీసికొన్నాను. ఇంతలో దౌహిత్రుడు కలగడంతో కుటుంబం మార్చడంలో ఆలస్యం అయింది.

నాలుగైదు మాసాలయ్యేసరికి– "ఏదో ప్రొఫెసర్ అనిపించుకొన్నాం కదా? ఇది చాలు. అక్కడనే లభిస్తే లభిస్తుంది. లేదా రీడర్‌గానే రిటైర్ అయితే మాత్రం ఏమి నష్టం? తిరిగి ఉస్మానియాకు వెళ్లిపోదాం" అని నిశ్చయించుకొన్నాను. ఒకనాటి సాయంకాలం, నాకంటె ముందు జేరిన శంకరనారాయణన్‌తో కలిసి వి.సి.లాడ్జికి వెళ్లి ఆయనను కలిసి నా అభిప్రాయం చెప్పాను. "మళ్లీ రీడర్‌గా వెళ్లడం ఏమిటి? ఇక్కడ అంతా బాగానే నడుస్తూన్నది కదా. నాలుగు ఇంక్రిమెంట్లు కూడ ఇస్తాను. వెళ్లవద్దు" అని ఆయన గట్టిగా చెప్పారు. ఆ సమయంలో ఏమీ బదులు చెప్పలేక ఇంటికి వెళ్లిపోయాను. ఆయన మాటలు విన్న నా ప్రక్కనే ఉన్న శంకరనారాయణన్‌కు కొంచెం దిగులు పుట్టింది. "అయితే– నాలుగు ఇంక్రిమెంట్లు కూడ ఇచ్చి నిన్నే డైరక్టరుగా కూడ చేస్తారు!" అన్నాడు దారిలో. "ఏమీ భయపడకు; నేను వెళ్లిపోవాలని నిశ్చయం చేసికొన్నాను" అని ఆయనకు ధైర్యం చెప్పాను. రెండు మూడు రోజుల తరవాత మళ్లీ వి.సి.ని కలిసి నాకున్న కొన్ని అసౌకర్యాలు చెప్పి నెల తరవాత రిలీవ్ చేయవలసిందిగా కోరాను. చివరికి ఆ ఉద్యోగం విడిచి, లీవ్ కాన్సెల్ చేసికొని, సంస్కృతవిభాగంలో "పునర్మూషకోభవ" అన్న రీతిలో రీడర్‌గా చేరాను. తరవాత ఇక్కడనే ప్రొఫెసర్‌గా ప్రమోషన్ లభించింది.

ఎస్.వి.యూనివర్సిటీలో ఉన్న కొందరు ఈ విషయం తెలిసి ఇంత తెలివితక్కువతనం ఉంటుందా అని నవ్వుకొన్నారట. సచ్చిదానందమూర్తిగారికి నా విషయంలో వైముఖ్యం కలుగుతుందేమో అని మనస్సులో నాకు సందేహం కలిగింది. అదేమీ లేకుండా వారికి నా విషయంలో సౌహార్దం రెట్టింపు పెరిగింది. నాకు వారిచ్చిన టెస్టిమోనియల్ "What is a loss to this university will be gain to Osmania" అను వాక్యంతో ముగించారు. వారు అప్పుడేకాదు, యు.జి.సి. వైస్ ఛైర్‌మన్ అయిన తరవాత కూడ, హైదరాబాదు వచ్చినప్పుడు నాలుగైదుసార్లు మా యింటికి వచ్చారు. తాము రాగానే ఫోను చేసి తామున్న అతిథిగృహాలకు రప్పించుకొనేవారు. నేను అడగకుండా నాకు ఎన్నో ఉపకారాలు చేశారు. తద్వారా ఎన్నో విశ్వవిదాలయాలతో నాకు సంబంధం ఏర్పడింది. పాశ్చాత్య దేశాలకి వెళ్లే అవకాశం కూడ ఒకటి కల్పించారు. నాకు మొదటినుంచీ విదేశగమనంమీద ఏమాత్రమూ ఆసక్తి లేకపోవడంచేత అలాంటి అవకాశాలు నేనే ఉపయోగించుకొనలేదు.

ప్రొ॥ సచ్చిదానందమూర్తిగారు యు.జి.సి.వైస్‌ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం పక్షాన 1989లో ఇంటర్‌నేషనల్ సెమినార్ ఆన్ శంకరాచార్య నిర్వహించారు. విజ్ఞానభవన్‌లో జరిగిన వెలిడిక్టరీ ఫన్‌క్షన్‌లో ఆయన అధ్యక్షత వహించారు. భారతదేశ ప్రతినిధుల పక్షాన నేను, విదేశీయ ప్రతినిధుల పక్షాన అమెరికా దేశీయుడైన ప్రొ॥ విల్‌హెల్మ్ హల్బ్‌ఫాస్ (Professor Wilhelm Halbfass) ముఖ్యఅతిథిగా డా॥ కరణ్‌సింగ్

వేదికమీద ఉన్నాం. అమెరికన్ ప్రొఫెసర్ ముందుగా మాటలాడుతూ "నేను మ్లేచ్ఛుడనే అయినా, శంకరాద్వైతం శ్రద్ధతో అధ్యయనం చేస్తున్నాను" అన్నాడు. నేను తరవాత మాటలాడుతూ– "భారతీయులకు విద్యావిషయంలో జాతిభేదం కాని, దేశభేదంకాని లేదు. అందుచేతనే ఐదవ శతాబ్దికి చెందిన ఖగోళశాస్త్ర విద్వాంసుడు వరాహమిహిరుడు బృహత్సంహితలో–

"మ్లేచ్ఛాస్తే యవనాః తేషు శాస్త్రం సమ్యక్ ప్రతిష్ఠితమ్
ఋషివత్ పూజనీయాస్తే... ..."

"గ్రీకువారు మ్లేచ్ఛులే, అయితేనేమి? ఈ ఖగోళశాస్త్రం వారిలో పరినిష్ఠితమై ఉంది. వాళ్లను కూడ ఋషులను పూజించినట్లు పూజించాలి" అన్నాడు. అందుచేత మీరు మాకు పూజ్యులే" అన్నాను. సచ్చిదానందమూర్తిగారు, కరణ్‌సింగ్ మొదలైనవారు సంతోషించారు. సమయానికి ఆ శ్లోకం స్ఫురించినందుకు నేనూ సంతోషించాను.

సంస్కృత అకాడమీ

ప్రొ॥ డి.రామిరెడ్డిగారు V.C. గా ఉన్నప్పుడు నన్ను ఆయన సంస్కృత అకాడమీకి డైరెక్టర్‌గా చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం లైబ్రరీలో ఉన్న కొన్ని అముద్రిత సంస్కృత గ్రంథాలను, అలభ్యమైన ప్రాచీన గ్రంథాలనూ ముద్రించడానికై డా॥ సూరి భగవంతంగారు వి.సి.గాను ఆర్యేంద్రశర్మగారు విభాగాధ్యక్షులుగాను ఉన్న రోజులలో స్థాపించిన సంస్థ ఇది. దీనిద్వారా, పండితుల సహాయంతో కొన్ని వ్యాకరణ శాస్త్రగ్రంథాలను ప్రచురించే అవకాశం నాకు కూడ లభించింది. పదకొండు సంవత్సరాలు దాని డైరక్టరుగా ఉన్నాను.

సురభారతీ సమితి

మద్రాసులో నేను చదువుకొంటూన్న కాలంలో అక్కడ సంస్కృత అకాడమీ అనే సంస్థ సంస్కృత ప్రచారంకోసం పనిచేస్తూండేది. డా॥ వి.రాఘవన్, శంకరన్ మొదలైన ప్రముఖులు దానిని నడుపుతూండేవారు. కొన్ని పుస్తకాలు ఆంగ్లానువాదాలతో ప్రచురించడం, కాళిదాసడే, వ్యాసడే. వాల్మీకిడే, భవభూతిడే ఇత్యాద్యుత్సవాలు ఏర్పరచి పండితులచేత ఆంగ్ల– సంస్కృత– తమిళభాషలలో ఉపన్యాసాలిప్పిస్తూండడం, ఉచితంగా సంస్కృత తరగతులు నడపడం, విద్యార్థులలో వ్యాసరచన, సంస్కృత భాషణము మొదలైన స్పర్ధలు నడిపిస్తూ ఉండడము ఇలాంటి కార్యక్రమాలు జరుపుతూండేవారు. విద్యార్థులుగా ఇలాంటి పోటీలలో పాల్గొంటూ ఉత్సవాలకు వెళ్లి అవకాశం విడవకుండా ఉపన్యాసాలు వింటూండేవాళ్లం.

ఆ కాలంలో రైట్ ఆనరబుల్ వి.ఎస్. శ్రీనివాసశాస్త్రిగారు అనే గొప్ప విద్యావేత్త ఉండేవారు. ఆయనకున్న ఆంగ్ల భాషా పాండిత్యం ఎంతటిదనగా ఏదైన ఉచ్చారణ-పదప్రయోగాది విషయాలలో సందేహం వచ్చినప్పుడు ఆంగ్లేయులైన ఆంగ్ల భాషా పండితులు కూడ ఆయనను సంప్రదించేవారు.

1944వ సంవత్సరంలో సంస్కృత అకాడమీవారు శ్రీశాస్త్రిగారి ద్వారా ప్రతీ బుధవారం సాయంకాలం రామాయణంమీద ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. సంస్కృత కళాశాల గ్రౌండ్సులో 30 ఉపన్యాసాలు జరిగాయి. శాస్త్రిగారు అరుగుమీద ఒక కుర్చీలో కూర్చునేవారు. ఆ నగరంలోని ప్రముఖ న్యాయవాదులు, హైకోర్టు న్యాయమూర్తులు, తదితర విద్యావేత్తలు నేలమీద ఇసుకలో కూర్చొని తన్మయత్వంతో ఆ ఉపన్యాసాలు విని ఆనందిస్తూండేవారు. నేను తప్పకుండా ఒక మూల కూర్చొని వినేవాణ్ణి కానీ ఒక్క ఆంగ్లపదం కూడ అర్థం అయేది కాదు. మధ్యమధ్య ఆయన ఉదాహరించే శ్లోకాలు కర్ణామృతంగా ఉండేవి. అయితే కాలాంతరంలో ముద్రితములైన ఆ లెక్చర్స్ అనేక పర్యాయాలు చదివే అదృష్టం కలిగింది. ఆ రోజులలో నాకు వైశిష్ట్యం ఏమీ తెలియకపోయినా అది తలుచుకొన్నప్పుడల్లా ఆనాటి విద్వద్వరేణ్యుల, ఉన్నతాధికారుల నిరాడంబరజీవన విధానం, విద్యాసంస్కృతులపై వారికున్న శ్రద్ధా తలచుకొంటె ఆశ్చర్యం కలుగుతూంటుంది.

ఈ సంస్థద్వారా నడిపే కార్యక్రమాల ప్రభావం నాపై చాల ప్రసరించింది. మన దేశం వెళ్లి పెద్దయిన తరవాత ఇలాంటి సంస్థ నడపాలి అని అనుకుంటూండేవాణ్ణి.

మలికిపురం హైస్కూలులో ఉపాధ్యాయుడనుగా ఉన్నప్పుడు ఏదైన ఒక విద్యా విషయక సంస్థ స్థాపించాలని నేనూ, నా మిత్రులు నరసింహారావు, శ్రీకృష్ణమూర్తి సంకల్పించుకొన్నాము. ముదునూరివారు అను భూస్వాములైన క్షత్రియుల కుటుంబాలు కొన్ని ఉన్న ఒక చిన్నపేటలో వారి సహాయంతో ఎంతో ఆడంబరంగా "గార్డెన్ యూనివర్సిటీ" అను పేర ఒక సంస్థ స్థాపించాం. దీనికి ప్రధాన బోధకుడు నరసింహారావు. దానికి ఆనాడే ప్రారంభం, ఆనాడే పరిసమాప్తీ కూడ జరిగింది.

నేను అమలాపురం కాలేజీలో సంస్కృతోపాధ్యాయుడుగా చేరినపిమ్మట సంస్కృత అకాడమీ ఆలోచన పునర్బుద్ధం అయింది. గుమ్మిడిదల సుబ్బారావుగారు అను ఒకరుండేవారు. మద్రాసులో ఆంధ్రమహిళాసభ స్థాపకురాలైన గుమ్మడిదల దుర్గాబాయి వీరి కుటుంబానికి చెందినవారేనట. (ఆ సభనే కాలాంతరంలో హైదరాబాదు తరలించారు). ఆయన గొప్ప దేశ నాయకుడుగా ప్రసిద్ధుడైన దుగ్గిరాల గోపాలకృష్ణగారికి చాల సన్నిహితులు. ఆయనతో కలిసి జాతీయోద్యమం నడిపించినవారు. గోపాలకృష్ణయ్య తమ

సిద్ధాంతాలను వ్యక్తీకరించడానికై 'గోష్ఠి' అనే పత్రిక నడిపేవారట. అతి బలిష్ఠమైన శరీరం గల ఆయన కారాగారంలో ఆంగ్ల ప్రభుత్వంవారు పెట్టిన హింసలకు ఆరోగ్యం చెడి అకాలమృత్యువు వాతపడ్డారట. చాలకాలం విజయవాడలో ఉన్న సుబ్బారావుగారు 1952-53 ప్రాంతంలో అమలాపురం వచ్చి అక్కడ స్థిరపడి అక్కడ 'గోష్ఠి' అను ఒక సంస్థ స్థాపించి, 'గోష్ఠి' పత్రిక కూడ ప్రారంభించారు. ఆయన అమలాపురం కాలేజి స్థాపకులలో ప్రధానులైన పేరూరు జమీందారుగారి దివాన్ రామచంద్రరావుగారికి అన్నగారు. జమీందారుగారితో బాంధవ్యం కూడా ఉంది. ఆ గోష్ఠికి నన్ను కార్యదర్శిని చేశారు. ప్రతిమాసం కనీసం ఒకసారి సమావేశం జరిపి దేశానికి, భారతీయ సంస్కృతికీ సంబంధించిన విషయాలపై మాటలాడుతుండేవారు. అమలాపురంలోని కొందరు ప్రముఖ న్యాయవాదులు, కొందరు విద్యావంతులు ఆ సమావేశాలకు వస్తూండేవారు. అవి ఒక్కొక్కమాసం ఒక్కొక్కరి ఇళ్ళల్లో జరిగేవి. సభ్యులసంఖ్య పదిమందికి మించి ఉండేది కాదు. అయినా చర్చించిన విషయాలు మాత్రం భారతదేశ సంబంధమైనవి. పార్టీలు, ప్రభుత్వ విధానాలూ మొదలైనవాటిని గూర్చినవి, ఉండేవి. అవి ఇతరులకందరికీ కొట్టినపిండివంటివే కాని నాకు క్రొత్తవిగా ఉండేవి. కొంతకాలం అయిన తరవాత సంస్కృత అకాడమీ, దాని లక్ష్యాలు మొదలైనవి తెలిపి, దానిని స్థాపించాలి అని నేను చెప్పగా అందరూ అంగీకరించారు. దానిని గూర్చిన ఆలోచన జరుగుతూండగా నాకు ఉస్మానియాలో ఉద్యోగం లభించి వరంగలు వచ్చేశాను. వరంగలులో ఉన్న ఐదు సంవత్సరాలూ దానిని గూర్చి ఆలోచించే అవకాశమే లేదు.

1969-70 ప్రాంతంలో ఎ.వి.సుబ్రహ్మణ్యన్ అను ఒక ఉన్నత రైల్వే అధికారి (Dy.F.A.C.A.O.) సికిందరాబాదు వచ్చి ఒకటి- ఒకటిన్నర సంవత్సరాలున్నాడు. ఆయన సంస్కృత ప్రేమ కలవాడు. ప్రతీ బుధవారం తన ఆఫీసులోనే ఇంటర్‌మీడియట్ స్థాయి సంస్కృతజ్ఞానం ఉన్న కొందరు ఉద్యోగస్థులకు (నలుగురైదుగురికి) మేఘసందేశం వంటి కావ్యాలు చెపుతూండేవాడు. ప్రతీనెలా ఒక రోజున ఒకే చోట సమావేశమై ఏదైన ఒక విషయం మీద (కావ్యం మొదలైనవాటిమీద) సంస్కృత భాషా ప్రవేశం ఉన్నవాళ్లు కొందరు పది నిమిషాలకు మించకుండా సంస్కృతంలో మాటలాడాలి అని 21.4.1970 తేదీన ఒక కార్యక్రమం ప్రారంభించాడు. మిగిలినవాళ్లు శ్రోతలు- సంస్కృతాభిమానులు. ఈ సంస్థకు 'సురభారతీసమితి' అని నామకరణం చేశారు. తాత్కాలిక కమిటీకి కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు అధ్యక్షుడు. రెండవ సమావేశం నుంచి నన్ను కూడా ఆహ్వానించడంతో నేను కూడ తప్పక పాల్గొనేవాణ్ణి. ప్రారంభంనుంచీ దేవులపల్లి రామానుజరావుగారు దీనికి చేయూత ఇచ్చారు. నెలనెలా సమావేశాలు ఆంధ్ర సారస్వత పరిషత్తులో జరుగుతూండేవి. "జస్టిస్ అల్లాడి కుప్పుస్వామిగారి వంటివారు దీనికి అధ్యక్షులుగా ఉంటే ఇది అభివృద్ధి

చెందుతుంది; అందుకు ప్రయత్నించండి" అని ఒకరోజు రామానుజరావుగారు సుబ్రహ్మణ్యంగారికి సలహా ఇచ్చారు. మేమిద్దరూ వెళ్లి కుప్పుస్వామిగారిని కోరగా వారు అందుకు అంగీకరించారు. సుబ్రహ్మణ్యన్, నేనూ కార్యదర్శులుగా, రామానుజరావుగారు లక్ష్మణశాస్త్రిగారు మొదలైన ఇద్దరు ముగ్గురు ఉపాధ్యక్షులుగా, ఎం.రామప్పగారు కోశాధికారిగా, ఇంకా మరికొందరు జడ్జిలు, ప్రముఖ న్యాయవాదులు మొదలైనవారు సభ్యులుగా 10.4.1971 తేదీన సంస్థను రిజిస్టర్ చేయించారు. సారస్వత పరిషత్తు దానికి స్థానం (Official address).

కుప్పుస్వామిగారు, రామానుజరావుగారు వంటి ప్రముఖుల సంబంధం లభించడంతో సమితి గౌరవం బాగా పెరిగింది. అప్పుడు నేను మద్రాసులోని సంస్కృతం అకాడమీ చేస్తూన్న కార్యక్రమాల వంటివి చేపట్టాలని చెప్పగా పెద్దలందరూ ఆమోదించారు. కేవలం ఇంటర్ మీడియట్ స్థాయి సంస్కృత విజ్ఞానం ఉన్నవాళ్లకు కాదు, చిన్నపిల్లల దగ్గరనుంచీ సంస్కృతం నేర్పాలి అని నిర్ణయించి కొన్ని ఉచిత సంస్కృత తరగతులు (వారానికి ఒకరోజు) ఏడెనిమిది కేంద్రాలలో ప్రారంభించబడ్డాయి. 1971 సంవత్సరాంతంలో సుబ్రమ్మణ్యన్‌గారు కలకత్తా వెళ్లిపోవడంతో వారి స్థానంలో అప్పటి రైల్వేలో డిప్యూటీ చీఫ్ ఇంజనీరుగా ఉన్న బి.పి.శాస్త్రిగారిని సహకార్యదర్శిని చేశారు. రామానుజరావుగారి ప్రయత్నం ఫలితంగా ఆనాటి వైస్‌ఛాన్సలర్ నూకల నరోత్తమరెడ్డిగారు లాంగ్‌లీజ్‌పై ఇచ్చిన 1700 చతురపు గజాల స్థలంలో దాదాపు రూ.55,000=00 చందాలద్వారా సేకరించి ఒక చిన్నభవనం నిర్మించడం జరిగంది. ప్రతీ సంవత్సరం మూడు మాసాలకొక 'కాళిదాస దివసోత్సవం' వంటి ఉత్సవం జరిగేది. తెలుగు అనువాదాలు పండితులచేత వ్రాయించి దాదాపు 30 సంస్కృత గ్రంథాలు (చిన్నవి) ప్రకటింపబడ్డాయి. ఈ విధంగా నేను 1970 నుండి 1992 వరకు (యూనివర్సిటీ కాంపస్ విడిచేవరకు) దానికి కార్యదర్శిగా ఉన్నాను. నేను తిరుపతిలో ఉన్న ఐదారు మాసాలలో కె.ఆర్.సుబ్రహ్మణ్యం కార్యదర్శిగా ఉన్నారు. శ్రీ కుప్పుస్వామిగారు, శ్రీరామానుజరావుగారు, ఇంకా ముగ్గురు నలుగురు హైకోర్టు జడ్జీలు, ప్రముఖ న్యాయవాదులు- వీరందరి సహాయంతో ఈ కార్యక్రమాలన్నీ నిరాఘాటంగా జరిగాయి. దీనిని ఇతర రాష్ట్రాలలో ఉన్నట్లు రిసర్చి ఇన్‌స్టిట్యూట్‌గా చేయాలనే కోరిక ఉండేది కాని అది సఫలం కాలేదు.

గ్రంథరచన

నేను 1948లో హిందీ విశారద ప్యాసయ్యాను. అది అతిక్లిష్టమైన పరీక్షగా ఉండేది. ప్రథమశ్రేణి ఎవ్వరికీ లభించేది కాదు. మొత్తం రాష్ట్రానికి పది పదిహేను ద్వితీయశ్రేణులు మాత్రమే లభించేవి. నేను ద్వితీయశ్రేణిలో ప్యాసవడంచేత ఆ చుట్టుప్రక్కవాళ్లందరూ

నేను హిందీలో మహాపండితుడిననుకొనేవారు. ఒకనాడు హైస్కూలులో జాగ్రఫీ టీచర్‌గా ఉన్న కృత్తివాసతీర్థులు నన్ను పిలచి- "రాజమండ్రిలోని ఒక పుస్తక ప్రచురణకర్త నన్నొక హిందీ-తెలుగు నిఘంటువు రాయమన్నాడు. నాకు తీరికలేదు. నువ్వు రాయి. రూ. 116=00 ఇస్తాడు" అని అంటూ "సంక్షిప్త హిందీ శబ్దసాగర్" అనే హిందీ నిఘంటువు నా చేతిలో పెట్టాడు. నేను సంతోషపూర్వకంగా అంగీకరించి నాలుగైదు మాసాలలో పూర్తిచేసి, ఆయనతో కలిసి రాజమండ్రీ వెళ్లి ఆ వ్రాతప్రతి ప్రచురణకర్తకిచ్చాను. అతడు రూ. 116/- వెంటనేవిచ్చాడు. తాను ప్రచురించిన ఏవో కొన్ని పుస్తకాల వెనుక రాబోవు పుస్తకాల పేర్లలో, నా పేరుతో, ఈ నిఘంటువును గూర్చి కూడ ప్రింటు చేశాడు. అది చూచి ప్రింటైన పుస్తకమే చూచినట్లు సంతోషించాను. ఇంతలో కృత్తివాసతీర్థులు మలికిపురం స్కూలు వదిలి రాజమండ్రి వెళ్లిపోయాడు. నేను అమలాపురం వెళ్లిపోయాను. కొంతకాలానికి ఆ పుస్తకం ప్రింటు అయింది. కాని రచయిత పేరు మరొకరిపేరు ఉంది. నేను ఉత్తరం వ్రాయగా సమాధానం లేదు. కృత్తివాసతీర్థులుగారికి వ్రాయగా- "నీ పుస్తకం వాళ్లకు నచ్చలేదట. మరొకరిచేత వ్రాయించుకొన్నారు" అని జవాబు వ్రాశాడు. అది నా పుస్తకం అని నిరూపించడానికి నా వద్ద ఏ ఆధారాలూ లేవు. ఆ 116/- రూపాయలే లాభం; ఇటుపైన జాగర్తగా ఉండాలి అని అనుకొని సరిపెట్టుకొన్నాను. అసహాయస్థితి. ఇది నా ప్రథమ రచనకు సంబంధించిన అనుభవం.

నేను మెట్రిక్యులేషన్‌కు చదివే రోజులలో, జె.వి. రమణయ్య వ్రాసిన 'ఇంగ్లీషు తెలుగు గ్రామర్' (తెలుగులో వ్రాసిన ఇంగ్లీషు భాషా వ్యాకరణం) చాల ప్రచారంలో ఉండేది. అది నా వంటి వాళ్లకు కల్పవృక్షంవలె పనిచేసింది. ఆ సంవత్సరంలో నేను దానిని 20-25 సార్లు ఆమూలాగ్రం చదివి ఉంటాను. ఆ పద్ధతిలో హిందీ తెలుగు వ్యాకరణం వ్రాయాలని అభిలాష కలిగింది.

భవిష్యద్రాజభాష కదా మరి! వ్రాసి 1953లో ప్రింటు చేయించాను. అది నా ప్రథమ ముద్రిత పుస్తకం. 1955లో 'నాగానందం' తెలుగులోనికి (గద్యానికి గద్యం పద్యానికి పద్యం) అనువదించాను. కాని దాని ముద్రణం మాత్రం 1995లో జరిగింది. 1960-61 సంవత్సరాలలో భారత ప్రభుత్వంవారు రవీంద్ర శతజయంత్యుత్సవాలు ఘనంగా జరిపారు. ఆయన రచించిన గీతాంజలి వైశిష్ట్యం ఏమిటో తెలుసుకోవాలని అది సంపాదించి చదివాను. అన్ని భావాలు ఉపనిషత్తులలో ఉన్నవే అన్నట్లు తోచింది. కొన్ని రూపకాలంకారాలతో, ఉపచార వక్రతతో ఆవిష్కరింపబడినవి. ఆంగ్లభాషలో ఉన్న ఈ గీతాంజలి సంస్కృతంలోనికి అనువదిస్తే బాగుంటుందని తోచి 103 గీతాలను 264 మందాక్రాంతా వృత్త శ్లోకాలలోనికి అనువదించాను. "దీనిని మీకు కృతి ఇవ్వాలని

కోరిక ఉన్నది; స్వీకరించవలసనదిగా ప్రార్థిస్తున్నాను'' అను లేఖతో ఆనాడు ప్రధానమంత్రిగా అఖిలభారత సామ్రాజ్యం ఏలుతూన్న జవహర్‌లాల్‌నెహ్రూ గారికి ఆ వ్రాతప్రతి పంపాను. వెంటనే వారం రోజులు తిరగకుండా "కృతజ్ఞతా పూర్వకంగా స్వీకరిస్తాను"' అని ఆయన వద్దనుండి లేఖ వచ్చింది. ఈ నాడైతే పంచాయతీ బోర్డు మెంబరుకూడ అస్మాదృశులకు ప్రత్యుత్తరం వ్రాయడు. ఆ సంతోషంతో వెంటనే దానిని ముద్రించాను.

ఆ రోజులలో సికింద్రాబాదులో అజంతా ప్రెస్ ఉండేది. దాని అధిపతులు ఎ ఎన్.సి.ఎస్.వెంకటాచార్యులుగారు. వారి అన్నగారు కూడ పండితకవులు. సంస్కృతాంధ్ర పుస్తకాలు చక్కగా నిర్దుష్టంగా ముద్రించేవారు. శ్రీ వెంకటాచార్యులుగారికి నా వ్రాత ప్రతి ఇచ్చాను. అంతే– అంత బాధ్యతా వారే వహించి పుస్తకముద్రణం పూర్తిచేసి నాకు ఐదారు కాపీలు వరంగలు పంపారు. పార్సెల్ అందగానే నేను ఇంటిహాలు మధ్యకూర్చొని ఆనందపారవశ్యంతో అది విప్పి మొదటి పుస్తకం తీసి చదివేటప్పటికీ మొదటి శ్లోకానికి బదులు– "మూఢాత్మన్ కిం స్వమపియతసే స్కన్ధమారోఢుమేవం..." అన్న 17వ శ్లోకం కంటబడింది. బైండింగులో పొరబాటువల్ల మొదటి పేజీకి బదులు 5వ పేజీ పుస్తకం ప్రారంభంలో ఉంది. "ఓరి! మూఢుడా! నీ భుజం మీదకే నువ్వు ఎక్కడానికి ప్రయత్నం చేస్తున్నావేమిటి! ఓ! బిచ్చగాడా! నీ గుమ్మంముందే నువ్వు బిచ్చం ఎత్తుకొంటున్నావేమిటి! నీ భారం అంతా ఆయనమీద వేసి హాయిగా ఉండు. మూడు లోకాల భారాన్నీ మోయగల సామర్థ్యం ఉన్నవాడు ఆయన ఒక్కడే" అని ఈ శ్లోకం భావం.

పుస్తకం తెరవగానే "మూఢాత్మన్" అంటూ ఈ శ్లోకం కనబడడం ఏదో అపశకునంలా అనిపించింది. ఐదారు నిమిషాలైన తరవాత– "ఇది అపశకునం కాదు; ఇది ఆ జీవితాంతం స్మృతిపథంలో ఉంచుకొనవలసిన, భగవంతుడు అప్రత్యక్షంగా చేసిన ఉపదేశం" అను నిశ్చితమైన భావం కలిగింది. ఆ భావమే నన్ను నడిపించింది, నడిపిస్తూన్నది.

ఆనాడు ఉత్తరప్రదేశ గవర్నరుగా ఉన్న బూర్గుల రామకృష్ణరావుగారిని కోరగా ఆయన ఇంట్రడక్షన్ వ్రాశారు. కేంద్రమంత్రిగా ఉన్న బెజవాడ గోపాలరెడ్డిగారు అనేక ఆకాశవాణి కేంద్రాలలో దీనిని సమీక్షింపచేశారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'హిందూ', 'ఆంధ్రపత్రిక', 'భారతి' మొదలైన వాటిలో మంచి రెవ్యూలు వచ్చాయి. ఆ రోజుల్లో ఆకాశవాణిలో ఉన్న దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అనేక పర్యాయాలు కొన్ని శ్లోకాలు బ్రాడ్‌కాస్ట్ చేయించారు.

1962లో సుసంహత భారతం అనే ఆరంకాల సంస్కృత నాటకం రచించాను. స్వాతంత్ర్య సంగ్రామం, స్వాతంత్ర్యప్రాప్తి దీనిలోని కథావస్తువు. దీనిని సాగర్

యూనివర్సిటీవారు ప్రచురించి కొన్ని సంవత్సరాలపాటు వారి ఎమ్.ఏ.సంస్కృతానికి పాఠ్యగ్రంథంగా నిర్ణయించారు. ఇది విశాఖదత్తుని ముద్రారాక్షసంవలె ఉన్నదని రెవ్యూలు వచ్చాయి.

వరంగలులో ఉండగానే తెలుగులో రాఘవ శతకం రచించాను. సుమతి శతకానికి పేరడీగా 'కుమతీ శతకం' రచించాను. ఇది ఎవరి రచనో చాలమందికి చాలకాలంపాటు తెలియదు. ఇదొక తాలపత్ర గ్రంథరూపంలో లభించిన ప్రాచీన రచన అన్నట్లు– "పరిశోధన సంపాదన "ఇతిశ్రీ", నివేదన "మతిశ్రీ" అని ప్రకటించాను. శతకంవలె దీని ప్రస్తావన కూడ ఆనాటి ప్రస్తావనలకు పారడీగా నడిచింది. కేవలం చమత్కారంకోసం కాలేజీలోని మిత్రులకు, నగరంలోని వారికీ కూడ పోస్టుద్వారా పంపగా కొన్నాళ్లవరకు దానిని గూర్చిన చర్చ నడిచింది. అది నేను రచించినట్లు నా మిత్రులు భీమసేన్ నిర్మల్‌గారికి, కేతవరపు రామకోటిశాస్త్రిగారికి మాత్రమే తెలుసును. ఎవరో టీచర్ వ్రాసి ఉంటాడు అన్నారు కాళోజి నారాయణరావుగారు. కొన్నాళ్లకు అక్కడ వారికందరికీ తెలిసింది. వరంగలు వచ్చినప్పుడు నారాయణరెడ్డిగారు చూచి "పరవాలేదు, ఆధునికుల ధోరణిలోనే ఉన్నాయి భావాలు" అన్నారు.

1962లో ప్రారంభించిన థీసిస్ దాదాపు నాలుగు సంవత్సరాలపాటు లభ్యమౌతూన్న అరకొర శాస్త్ర గ్రంథాలన్నీ చదివి 1966 నాటికి పూర్తిచేశాను. పుస్తకం పేరులో 'రసం' అని ఉంటేచాలు, దానిని తెప్పించేవాణ్ణి. అలా చేయడంలో ఒకటి రెండు ఆయుర్వేదం పుస్తకాలు కూడ వచ్చాయి! భవిష్యత్సూచన అన్నట్లు నాకు చిన్నతనంలోనే పండితరాయలమీద చాల గౌరవాదరాలు పుట్టాయి. మా యింటిప్రక్కనే 'ముక్కువారు' ఉండేవారు. వారి అసలు ఇంటిపేరు ఉపద్రష్టవారు. అది పండితరాయల ఇంటిపేరు. వారి కుటుంబంలో ఎవరికో పెద్ద ముక్కు ఉండడం చేత 'ముక్కువారు' అను పేరు వచ్చింది. ఆ ముక్కువారి కుటుంబానికి చెందిన నా మిత్రుడు మా నాన్నగారివద్ద సంస్కృత కావ్యాలు చదివేవాడు. వాళ్లు వేగినాట్లు. వాళ్లింట్లో 'పండిత రాయచరిత్ర' అను ఒక పుస్తకం ఉండేది. అదంతా చదివి దానిలోని "యవనీ నవనీతకోమలాంగీ" ఇత్యాది పద్యాలు చిన్నతనంలోనే కంఠస్థం చేశాం. కాశీమజిలీ కథలలో ఒక భాగంలో కూడ పండితరాయల చరిత్ర ఉంది. అవి అన్ని భాగాలూ చదివేవాళ్లం చిన్నతనంలోనే. నిజం చెప్పాలంటె మాకు వచ్చిన తెలుగు అంతా ఆ పుస్తకాలు చదవడంవల్ల వచ్చినదే. ఆ విధంగా బాల్యపరిచితుడైన పండితరాయల రసగంగాధరాదులను గూర్చిన పరిశోధన చాల ఉత్సాహంతో నడిచింది.

తెలుగు డిప్.ఓ.యల్.పరీక్షకు లఘు సిద్ధాంత కౌముదిలోని కొన్ని ప్రకరణాలు

పాఠ్యాంశాలుగా ఉండేవి. ఆ ప్రకరణాలకి తెలుగులో వ్యాఖ్య వ్రాయమని అవధానిగారు అన్నారు. ప్రకరణాలకు మాత్రం వ్రాస్తే గైడ్ వ్రాసినట్లవుతుంది అని అలా వ్రాయడం ఇష్టంలేక మొత్తం గ్రంథానికే అతి విస్తృతమైన వ్యాఖ్యానం వ్రాశాను. వెయ్యి పేజీలయింది ప్రింటులో. అది చూచి శృంగేరీ పీఠాధిపతులు "ఇదేమిటి! లఘుకౌముదిని బృహత్కౌముది చేసివేశావు!" అన్నారు నవ్వుతూ. అది మూడుసార్లు ప్రింటయింది. దీని ప్రింటింగులో రామానుజరావుగారి ప్రోత్సాహం కూడ ఉంది.

కేంద్ర సాహిత్య అకాడమీవారు వక్రోక్తి జీవితానికి తెలుగులో వ్యాఖ్య వ్రాసేపని అప్పచెప్పారు. అప్పుడు సలహా సంఘంలో ఉన్న రామానుజరావుగారే దీనికి కారణ భూతులని తరవాత తెలిసింది.

ఒక సంస్థవారు నన్నూ మరొక విద్వాంసుణ్ణీ కలిసి ఒక గ్రంథం తెలుగులో వ్రాయమన్నారు. ఆ విషయం మిత్రులొకరికి చెప్పినప్పుడు ఆయన– "తెలుగులో ఒక మంచి గ్రంథం రాబోతూన్నందుకు చాల సంతోషం. కాని అంతా మీరే వ్రాయవలసి ఉంటుంది; ఆయనేమీ వ్రాయడు" అన్నారు. "అదెలా కుదురుతుంది?" అని నేననగా– "చూస్తూండండి; అది అంతే" అన్నారాయన. చివరికి అలాగే జరిగింది. పాపం ఆయన ఒక్క అక్షరం కూడ వ్రాయలేదు. చివర వ్రాతప్రతి వారికిచ్చేనాడు– "వారిస్తామన్న పారితోషికం చాలదు; పెంచాలి" అని లేఖ వ్రాసి ఇష్టం లేకపోయినా నా చేత కూడా సంతకం పెట్టించారు. దానిని వారు నిరాకరించారు. ఇది హిందీ నిఘంటువు అనుభవంకంటె కొంచెం మెరుగైన రెండవ అనుభవం.

వక్రోక్తి జీవిత వ్యాఖ్య ముద్రితమైన తరవాత "ఇతర అలంకారశాస్త్ర గ్రంథాలకు యథాశక్తి తెలుగులో వ్యాఖ్యలు వ్రాసి తెలుగువారికి అందివ్వాలి; హిందీవాళ్లు చాలా పనులు చేస్తున్నారు కదా?" అను ఉద్దేశ్యంతో భామహుని కావ్యాలంకారం మొదలైన, కావ్య ప్రకాశ– ధ్వన్యాలోక– లోచనాద్యగ్రంథాలతో సహా పదకొండు అలంకార శాస్త్ర గ్రంథాలకు వ్యాఖ్యలు వ్రాశాను. పతంజలి యోగసూత్రం, బ్రహ్మసూత్రశాంకరభాష్యం, శాంకరగీతాభాష్యం మొదలైన కొన్ని గ్రంథాలకు కౌటిల్యుని అర్థశాస్త్రానికి వ్యాఖ్యలు వ్రాశాను.

ప్రతిపదార్థ తాత్పర్యాలతో, కొన్ని విశేషాంశాలతో వాల్మీకి రామాయణం పది సంపుటాలలో ప్రకటించబడింది. దీనిని ప్రచురించిన వారి సలహాదారులొకరు తమ పేరు కూడా దీని రచయితలలో చేర్చడానికి చేయబోయిన ప్రయత్నాన్ని, వెనుకటి అనుభవం దృఢంగా ఉండడంవల్ల ఆదిలోనే వమ్ము చేయగలిగాను.

1. "సంస్కృత వచోవిచ్ఛిత్తిః ప్రత్యయార్థవైచిత్రీచ" (Sanskrit Idioms, Phrases and Suffixational Subtitles) 2."పాశ్చాత్య తత్త్వశాస్త్రేతి హాసః" (The History of the Western Philosophy in Sanskrit). అనేవి ఇంతవరకు సంస్కృత భాషలో ఎక్కడా వెలువడని నూతన గ్రంథాలు. కౌండిన్య స్మృతి-(ఆంగ్లానువాదంతో) ఒక ఆధునిక స్మృతి. ఈ విధంగా చిన్నవి పెద్దవీ మొత్తం గ్రంథాలసంఖ్య 120 దాకా ఉంది. దాదాపు 50 విమర్శాత్మక వ్యాసాలున్నాయి.

పురస్కారాలు, సన్మానాలు: అప్పుడప్పుడు భగవంతుడు అనుగ్రహించిన బిరుదాలు, సంమానాలు కృతజ్ఞతాపూర్వకంగా స్వీకరించడం జరిగింది.

బిరుదులు

1. వేదాంత విశారద, మద్రాసు సంస్కృత కళాశాల, 1947.
2. మహామహోపాధ్యాయ, శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, సంస్కృత విశ్వవిద్యాలయం, ఢిల్లీ, 1999.
3. శాస్త్రకళానిధి, మద్రాస్ సంస్కృత కళాశాల, 2006.

సన్మానాలు

1. 'గీతాంజలి'కి ఉత్తరప్రదేశ ప్రభుత్వ సన్మానం, 1962.
2. 'సుసంహత భారతానికి' ఉత్తరప్రదేశ ప్రభుత్వ సన్మానం, 1964.
3. అలంకార శాస్త్ర పాండిత్యానికి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ పురస్కారం, 1985.
4. 1983-85 సంవత్సరాలలో వెలువడిన భారతీయ గ్రంథాలలో అత్యుత్తమమైనదిగా 'ది కంట్రిబ్యూషన్ ఆఫ్ పండితరాజ టు సంస్కృత పొయిటిక్స్' అను గ్రంథానికి ఆల్ ఇండియా ఓరియంటల్ కాన్ఫరెన్స్‌వారి నేషనల్ అవార్డ్, 1985.
5. ప్రెసిడెంట్స్ సర్టిఫికేట్ ఆఫ్ ఆనర్, 1987. ప్రతీ సంవత్సరం రూ.50,000/- ల పారితోషికం కేంద్ర ప్రభుత్వంవారు నా జీవితాంతం ఇస్తారు.
6. ఉత్తమ సంస్కృత పండిత సన్మానం తెలుగు విశ్వవిద్యాలయం, 1991.
7. విశ్వభారతీ పురస్కారం,ఉత్తరప్రదేశ సంస్కృత సంస్థానం రూ.1,00,000=00 తామ్రపత్రం, 1994.
8. ట్రాన్స్‌లేషన్ అవార్డ్, కావ్యప్రకాశాంధ్రానువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీ, 1996.

9. గుప్త సాహిత్య అవార్డ్, ఏలూరు, 1998.
10. సిద్ధార్థ కళాపీఠం అవార్డ్, విజయవాడ, 1999.
11. శివానంద సద్గురు ఎమినెంట్ సిటిజన్ అవార్డ్, 2000.
12. తెలుగు ఆత్మగౌరవం అవార్డ్, ఆంధ్రప్రదేశ ప్రభుత్వం, రూ. 50,000/-లు ప్రశంసాపత్రం, 2001.
13. సంస్కృత విమర్శ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్, 2002.
14. వాచస్పతి పురస్కారం, బిర్ల ఫౌండేషన్, ఢిల్లీ, 1,00,000=00 మొ. 2004.
15. మహాకవికాళిదాస సంస్కృత జీవనప్రతి (Lifetime Sanskrit Service) పురస్కార్. కవికుల గురు కాళిదాస సంస్కృత విశ్వవిద్యాలయం, రామ్‌టెక్, 2005. ప్రశంసాపత్రం సువర్ణపతకం, రూ. 50,000/-.
16. కాళిదాస జ్ఞానరత్న అవార్డ్, హైదరాబాద్, 2006.

ఆత్మగౌరవ పురస్కార ప్రదాన సందర్భంలో ప్రశంసా పత్రం వ్రాసినవారు ఎవరో తెలియదు గాని, దానిలోని "దేవభాషకు తెలుగు నేర్పిన మహామహోపాధ్యాయులు" అను వాక్యాంశం చూచి హితైషులైన నా మిత్రులందరూ ఆనందిస్తూంటారు.

భారతీయ సంస్కృతికి సంస్కృత భాషకు యథాశక్తి గ్రంథ రచన ద్వారా సేవ చేయడం నా జీవితలక్ష్యం. పురస్కారాదులు ఆనుషంగికాలు. దూషణ భూషణాదులు వైయక్తిక భావ ప్రచోదితాలు. భారతీయతను కాపాడుకోవలసిన బాధ్యత భారతీయులందరి మీదా ఉంది. ఉపాయభేదమే కాని ఉపాయం ఒక్కటే.

నాకీ సదవకాశాన్ని ఇచ్చిన ఆంధ్ర సారస్వత పరిషదధ్యక్షులు డా॥ సి. నారాయణరెడ్డి గారికీ, ఎంత కాదన్నా వదలక నా చేత ఈ మాటలు మాట్లాడించి వ్రాయించిన పరిషత్కార్యదర్శి డా॥ ఎల్లూరి శివారెడ్డిగారికి కృతజ్ఞతలు తెలుపుచున్నాను.

స్వయంప్రశంసయానూనం యత్ పాపం సంచితం మయా,
వినాశయతు తత్తూర్ణం పరమాత్మా హృదిస్థితః.



డా॥ అద్దేపల్లి రామమోహనరావు

కృష్ణా జిల్లా బందరులో ఒక చివర 'చింతగుంటపాలెం' అనే పేట ఉంది. బందరు కాలవకిందనే ఉంది. నా చిన్నప్పుడు అది ఒక గ్రామంలాగానే ఉండేది. అక్కడ అద్దేపల్లి వారివీధిలో 1936వ సంవత్సరంలో సెప్టెంబరు నెల ఆరవ తారీకున పుట్టాను. మా తాత పురోహితుడు. మా నాన్న ఒక చిరుద్యోగి. ఇద్దరికీ సాహిత్యవారసత్వం ఏమీ లేదు. నా చిన్నప్పుడు నా స్పష్టమైన ఉచ్చారణ గమనించిన మా తాత నన్ను పురోహితుణ్ణి చేస్తాననేవారు. నా మనస్సు ఆ వైపు లేదని ఆ ప్రయత్నం మొదట్లోనే మానేశాడు. మా అమ్మ వంశంలో కూడా సాహిత్యవారసత్వం లేదు. కాని, అమ్మా నాన్న యిద్దరూ బాగా పాడగలిగేవారు. సాహిత్యం చదవడంలో ఇద్దరికీ యిష్టం ఉండేది. నా వయస్సున్న చాలా మందిలాగానే నా చిన్నతనమంతా ప్రాకృతిక నేపథ్యంలోనే గడిచింది. బందరులో హిందూ హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు, అద్దేపల్లి లక్ష్మణస్వామిగారూ, మునిమాణిక్యం నరసింహారావుగారూ మాకు గురువులు. సాహిత్యంమీద యిష్టం కలిగించినవారు. హైస్కూలులో ఉన్నప్పుడు, ఛందస్సుమీద ఆసక్తి కలిగింది. చిన్న చిన్న పద్యాలు రాసేవాణ్ణి. కాలేజికి వచ్చేటప్పటికి, పువ్వాడ శేషగిరిరావుగారూ, భాగవతుల కుటుంబశాస్త్రిగారూ, మొదలైనవారు గురువులు. వారివల్ల సాహిత్యాసక్తి మరికొంత విస్తరించింది. మా అమ్మకుగాని నాన్నకుగాని సాంప్రదాయిక భావాలుండవచ్చు గాని, ఛాందసభావాలు ఏ మాత్రమూ లేవు. అందువల్లనే మొదట్లో నాకు సంప్రదాయంపట్ల అభిలాష ఉన్నా, పరిణామక్రమంలో అతిసులభంగా ఆధునికుణ్ణి కాగలిగాను.

బి.యే. చదువుతున్నప్పుడు ఒక మిత్రుడివలన విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యంమీద అభిమానం కలిగింది. బందరు వచ్చినపుడు విశ్వనాథ ఉపన్యాసాలు

వినడం, నాలుగైదుసార్లు మిత్రులతో విజయవాడ వెళ్ళి ఆయన నోటివెంట కల్పవృక్ష పద్యాలూ, వ్యాఖ్యానాలూ వినడం జరిగేది. విశ్వనాథపద్యంలోని అపూర్వభావ సంపద, శిల్పశక్తి ఆకర్షించేది. మరీముఖ్యంగా, మిగిలిన సంప్రదాయ పండితుల్లా కాకుండా, ప్రాచీనకవుల్ని ఆయన విశ్లేషించే పద్ధతిలో పాండిత్యమూ, ధర్మాలూ కాకుండా కేవలం కవితా శిల్పవివేచన ఉండేది. ఇది నన్ను బాగా ఆకట్టుకున్న విషయం. ఆ రోజుల్లో చాలా పద్యాలు విశ్వనాథ ముద్రతో రాశాను. కొన్ని వ్యాసాలు కూడా రాశాను.

1960–62లలో తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు ఎం.ఏ. చేశాను. అప్పుడు భూపతి లక్ష్మీనారాయణగారు, పింగళి లక్ష్మీకాంతంగారూ, భద్రిరాజు కృష్ణమూర్తిగారూ, జి.యన్.రెడ్డిగారూ మొదలైన ఉద్దండులవద్ద చదివాను. ఆ రోజుల్లో నాకు చాలా బెరుకుదనం ఉండేది. చాలామందిలాగా నేను పెద్దవాళ్ళకి ఎవరికీ దగ్గిర కాలేకపోయాను. అలాగే తర్వాతికాలంలో కూడా శ్రీశ్రీ, ఆరుద్ర మొదలైనవార్ని గూడా పరోక్షంగా అభిమానించడమేగాని, వ్యక్తిగతంగా మిత్రుణ్ణి కాలేకపోయాను. ఒక్క కుందుర్తికి మాత్రమే కొంత దగ్గిరకాగలిగాను, కొన్ని సంఘటనలవల్ల. అందుకనే బహుశః నేనెంత అభిమానించిన కవుల ముద్రలైనా నా మీద పడలేదు. దగ్గరవడంచేత ముద్రపడి తీరాలన్నది నా ఉద్దేశంకాదుగాని, పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నై. ఆ రోజుల్లో ఏం.ఏ. తెలుగు చదవడమంటే, ప్రాచీన సాహిత్యాన్ని క్షుణ్ణంగా చదవడమే. అలంకార శాస్త్రాల్ని అవగాహన చేసుకోవడమే. వ్యవస్థీకృతమైన ఆధునిక విమర్శ విధానం విస్తరించలేదు. అందువల్ల ప్రాచీన సాహిత్య అధ్యయనం, అభిమానం ఎమ్.ఏ. చదువుతున్నప్పుడు ఎక్కువ పరిధిలోనే ఉంది.

ఎం.ఏ. 'యూనివర్సిటీ ఫస్టు'గా వచ్చిన తర్వాత, బందరు హిందూ కాలేజిలోనే ట్యూటరుగా చేరాను. ఆర్థిక పరిస్థితులు అంగీకరించి ఉంటే, పరిశోధన చేసి ఉండేవాణ్ణి యూనివర్సిటీలో అధ్యాపకుడుగానే ఉండిఉండేవాణ్ణి. కాని, ఉద్యోగం అవసరం కావడంవల్ల బందరు వచ్చేశాను. బందరులో నాలుగేళ్ళు ట్యూటరుగా, రెండేళ్ళు లెక్చరర్‌గా చేసిన తర్వాత, నందిగామకు లెక్చరర్‌గా వెళ్ళాను. బందరులో ఆ ఆరేళ్లూ నా సాహిత్య జీవితంలో అత్యంత ప్రాధాన్యంగల రోజులు.

నాకు అప్పుడు విశ్వనాథపై తీవ్రమైన అభిమానమేగాక, భావకవిత్వంమీద పట్టరాని యిష్టం ఏర్పడింది. బహుశః ఆ రోజుల్లో యౌవనదశలో ఏ కవియైనా భావకవిత్వాన్ని దాటిపోవడం అసాధ్యం. రవీంద్రనాథ్ ఠాకూరుపైన అమితమైన ఆకర్షణ కలిగింది. ఆయన గీతాంజలి కవిత్వం, చిత్ర–కవితా నాటకం నాకు ఎంతో యిష్టమైనవి. అందుకే ఆ రోజుల్లో ఆ రెండూ అనువాదం చేసుకున్నాను. అలాగే 'స్ట్రేబర్డ్స్' కూడా. అయితే

అవేవీ ముద్రించలేదు. గీతాంజలి అనువాదాన్ని ఆ రోజుల్లో నాగేశ్వరరావనే ఆత్మీయమిత్రుడికి వినిపించాను, బందరు మెయిన్‌రోడ్‌లో ఉన్న మోడరన్ హోటల్లో ఒక మూల. అదే మా సాహితీ మిత్రుల సమావేశస్థలం. ఆయన అన్నీ ఓపిగ్గా విని, ఒక్కటే మాట అన్నాడు 'ఒక్క ఏడాదితర్వాత మళ్ళీ మీరు చదువుకోండి' అని. రాసినప్పుడు చాలా బాగుంది అని నేను అనుకున్నా, ఏడాదితర్వాత చదువుకునేటప్పటికి నా అనువాదం ఏమీ బాగాలేదని అనిపించింది. కవితా నాటకాల్లో ఠాకూర్‌ది ఒక గొప్ప వినూతన మార్గం. 'చిత్ర' నాటకం నాకు ఎంతో ప్రీతిపాత్రం. అలాటి నాటకం రాయాలన్న కోరికతోనే అప్పట్లో 'చైతన్య గౌతమం' అనే వచన కవితా నాటకాన్ని రాశాను. దాన్ని ఇటీవల 'సంఘం శరణం గచ్ఛామి' అనే పేరుతో ముద్రించాను. 'స్ట్రేబర్డ్స్' మొదలైన రచనలు అద్భుతమైన సృజనశక్తి గలవి. మూడు పాదాలుగా రాయలేదుగాని భావుకత, అనుభూతి విషయాల్లో అవన్నీ గొప్ప హైకూ లక్షణం గలవే. ఆ ప్రభావంతో ఆ రోజుల్లో చాలా లఘుకవితలు రాశాను.

కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు, విశ్వనాథ మొదలైనవారి భావ కవిత్వం చదివినతర్వాత, ఎన్నో ప్రణయ కవితలు, అనుభూతి కవితలూ రాశాను. అవన్నీ ఎక్కువగా గీతపద్యాలే. ఆ రోజుల్లోనే నన్ను బాగా ఆకట్టుకున్నపుస్తకం ఉమర్ ఖయ్యాం రుబాయత్‌కి ఫిడ్జిరాల్డ్ ఆంగ్లానువాదం. తెలుగులోకి ఎంతో మంది అనువాదం చేశారు. నాకూ చెయ్యాలనిపించింది. 'మధుజ్వాల' పేర పద్యాల్లోకి అనువదించాను. దానికి దాశరథి ముందుమాట రాశారు. ఈ పద్యాల్ని నేను యథాతథానువాదం కాకుండా, భావకవిత్వ రేఖల్ని అద్దుతూ చేశాను. ఉదాహరణకి ఒక పద్యం:

'బ్రతుకునకంటె సత్యమగు వస్తువులోకమునందులేదు, ఈ
బ్రతుకొక నాటికిన్ మనల వంచనచేసి నశించిపోవు, ని
శ్చితముగ; ఒక్కసారి వికసించిన పుష్పము కన్నుమూయు శా
శ్వతముగ; కాన జీవసుఖ సారము పొందుము ప్రాణముండగన్'

అప్పట్లో నా మధుజ్వాల పద్యాలు చాలామందిని ఆకర్షించినై. నా విద్యార్థి టి.యల్.కాంతారావైతే ఆ పద్యాలన్నీ అప్పచెప్పేవాడు. భావకవిత్వంలో జీవగతి విషాదం ఒక ప్రధానమైన అంశం. అది 'మధుజ్వాల'లో పొసగించాను. అప్పట్లో నా పద్యాల్ని అభిమానించి, నా పరిచయాన్ని కూడా చూసినవారు కొందరు 'అద్దేపల్లి పద్యరచన వదిలేసి, వచనకవితలు రాసి పాడైపోయాడు' అంటుంటారు.

బందరులో ఆ రోజుల్లో సాహిత్య వాతావరణంలోనూ, ఇతరత్రా ఛాందస వాతావరణం

బాగా ఉండేది (దాదాపు అన్ని ఊళ్ళూ అంతే). దీన్ని వ్యతిరేకించి, కులమతాది రహితమైన నేపథ్యాన్ని నిర్మించడంలో నా పాత్ర చాలా ఉంది. బందరులో ఆనాడు నాతోపాటు సాహిత్య ప్రయాణంచేసిన జి.సత్యనారాయణగారు ఒక వ్యాసంలో అన్నారు.

'ముప్ఫై ఏళ్ళ క్రితం బందరుకు అభ్యుదయ సాహిత్యాన్ని అందించిన అపరభగీరథుడు మాస్టారు. ఆ ప్రయత్నంలో ఆయన ఎన్నో అవాంతరాలను అధిగమించారు'.

ఆధునిక మార్గానికి మళ్ళినప్పటినుండి ఈ అవాంతరాలు అన్నీ యిన్నీ కావు. దీన్ని దృష్టిలో పెట్టుకునే అనంతర కాలంలో నేను రాసిన కొన్ని పంక్తులు బహుళ ప్రచారం పొందినై.

'నాకు జీవితం కవిత్వం వేరువేరు కాదు
జీవితం నన్ను ఉక్కుగోళ్ళతో రక్కితే
కారే నెత్తురే నా అక్షరాల్లో ప్రవహిస్తుంది
బతుకు నన్ను పోరాటానికి రెచ్చగొడితే
రగిలే రవ్వలే నా అక్షరాల్లో మండిపడతై'
ఆనాటి నుండి ఈనాటిదాకా నా కవితా నేపథ్యం ఇదే.

ఆధునికత్వానికీ, వామపక్ష భావాలకీ మళ్ళడంలో ప్రధాన నేపథ్యం నా జీవితమే. వివరాలెందుకుగాని, ఆనాటి మధ్యతరగతి మాములైనట్లే చెప్పరానంత పేదరికం, సమస్యలు, వీటినెదుర్కోడానికి అసహాయంగానైనా సరే చాలామందిని ఎదుర్కోవలసి రావడం, అన్యాయాల్ని చూస్తూ సహించలేకపోవడం మొదలైన కారణాలెన్నో ఉన్నై. సాధారణంగా కవిలోని భౌతిక అసమర్థత కూడా బలమైన కవిత్వంగా రూపుదిద్దుకుంటుంది. ఆవేశంతో పాటు, కవితాభివ్యక్తిలో బలం ఉంటే అది అనేకమందిని ప్రభావితం చేసే బలమైన కవిత్వమౌతుంది. అందువల్ల 63 నుండి నేను రాసిన కవితలన్నీ ఆవేశపూరితంగానే వచ్చినై. అన్ని దేశాల అన్ని ప్రాంతాల గొప్ప కవుల్ని, కవిత్వంకోసం ప్రేమించడంవల్ల అభివ్యక్తిలోని గాఢత నాకు ప్రీతిపాత్రమైంది. పద్యాన్నించి వచన కవిత్వానికి రావడానికి కారణం కూడా ఇదే. భావానికి సూటియైన వ్యక్తీకరణగాని, మాట్లాడుకునే భాషగాని, అడుగడుగునా శిల్పసహితం చెయ్యగల అవకాశంగాని వచన కవితలోనే ఉంటుంది. ఆనాడు పత్రికల్లో వచ్చిన సామాజికావేశపూరితమైన కవితలన్నిటినీ మిత్రులు 'అంతర్జ్వాల' అనే సంకలనంగా తెచ్చారు. నేను కవిత్వంలో ఆవేశాన్ని ఎప్పుడూ ఆవేశంగా ప్రవహించనివ్వలేదు. శిల్పసహితంగా చెప్పడానికే ప్రయత్నించాను. అంతర్జ్వాలలోని ఒక కవితలో ఇలా అన్నాను.

'ఇది అంతర్జ్వాల
మనిషనే అగ్గిపుల్లని
ఏ రోడ్డుమీద గీసినా భగ్గునమండే
సమాజ బాధామయవాతావరణం
గుండెలో రాజుకుంటున్న మహాజ్వాల.
చిన్న కార్ల టైర్ల అడుగున గుండెకాయలూ
ఎయిర్‌కండిషన్ మేడల పునాదుల్లో స్వేదప్రవాహాలూ
బంగారు గమ్మాలమీద కుంకుమబొట్లలో
నెత్తురుజీరలూ
విందుభోజనాల విస్తళ్ళకింద
ఆకలిచావులూ
తాగితాగి తూలేవాళ్ళ
అరికాళ్ళ కింద సన్నని అరుపులూ...!'

ఈ కవిత్వాన్ని చూసి, సంప్రదాయాన్నుండి మారలేనివాళ్ళు కొందరు చాలా బాధపడ్డారు. ఒకాయన 'అంతర్జ్వాల' అంటే 'కడుపుమంట కవిత్వం' అన్నాడు. వేరే అర్థంలో ఈ మాట యథార్థమేగదా. నాతోపాటు పీడితుల పక్షాన రాసిన 'అంతర్జ్వాల', 55ల తర్వాత బలహీనపడిన సామాజిక ప్రగతిశీల కవిత్వంలోని ఒక ఎడాన్ని పూరించిన కొద్దివాటిలో ఒకటిగా విమర్శకులు పేర్కొన్నారు. 'మార్క్సిజమ్' అనే అవగాహనని అభిలషించే వామపక్షవాదులందరూ ఆ కవిత్వంలోని సామాజికావేశాన్నీ, కవితాత్మకతనీ ప్రశంసించారు.

ప్రాచీన భావకవిత్వ ప్రాధాన్యాన్నుండి, నా ప్రాధాన్యాన్ని వామపక్ష భావాలకు మరలించడంలో కొంత టి.ఎల్.కాంతారావు పాత్ర ఉంది. ఆ రోజుల్లో టి.ఎల్.కాంతారావు కాలేజీలో నా విద్యార్థి. ఐతే నాకు స్నేహితుడుగానే ఉండేవారు. అప్పటికే కొంచెం పెద్ద వయసులో కాలేజిలో చేరినవాడు. అతనికి మార్క్సిజమ్ మీద వల్లమాలిన అభిమానం, ఆవేశం. అతనిదగ్గర ఎన్నో పుస్తకాలుండేవి. అతనికి శ్రీశ్రీ అంటే వల్లమాలిన అభిమానం. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితల్ని అన్ని సందర్భాల్లో ఆవేశంగా చెప్పూపోయే అతన్ని అందరూ "శ్రీశ్రీ వీరభక్తహనుమాన్" అనేవాళ్ళు. మార్క్సిజమ్‌నీ, శ్రీశ్రీనీ, తెలంగాణా ఉద్యమకవిత్వాన్నీ తెగచదివాను. నా మార్గం పూర్తిగా మారింది.

విశ్లేషణాత్మకమైన విమర్శ గూర్చి నాలో మొదటి రోజుల్లో ఆసక్తి కలిగించింది విశ్వనాథయే. ఆయన పండితమార్గానికి విరుద్ధంగా తన ఆంగ్ల పరిజ్ఞాన నేపథ్యాన్ని

గూడా మేళవించుకుని, చేసిన కవి పరిశీలనలు నా మనస్సులో ముద్రవేసినై. అలాగే ఆ రోజుల్లో టి.యస్. ఎలియట్ కూడా విమర్శకుడుగా నాకు బాగా ఇష్టమైనవాడు. శ్రీశ్రీ మహాప్రస్థానంపై సమీక్షా వ్యాసాలు రాద్దామనుకున్నప్పుడు నాపై విశ్వనాథ ప్రభావం ఎలా ఉందంటే, ఆయన శాకుంతల, నన్నయ, అల్లసానిపెద్దనల మీద రాసిన శిల్పవిశ్లేషణలాగా శ్రీశ్రీపైన ఎందుకు రాయకూడదు- అనిపించింది. శ్రీశ్రీ గొప్ప శబ్దశిల్పవేత్త; వినూతన మార్గాన్ని ప్రారంభించిన శైలీనిర్మాత, పీడితుల పక్షాన రాసినకవి అన్నది నాకు ఆత్మీయమైన అంశమే. అంతకుముందు ఒకే ఒక్క కవిమీద అనేక ముఖాల విశ్లేషణతో రాసిన గ్రంథాలు రాలేదు. అందువల్ల అనేక కోణాల్లో విశ్లేషిస్తూ శ్రీశ్రీ మహాప్రస్థానంపై వరసగా వ్యాసాలు రాశాను. అవన్నీ 64,65ల్లో 'ఆంధ్రప్రభ' కళాసాహిత్యవేదిక ఆదివారం సంచికలో వరసగా వచ్చినై. వస్తువు, శిల్పం- వీటిని గూర్చిన నిర్దిష్టమైన సామగ్రి నా ముందులేదు. విమర్శ కూడా అప్పటికి వ్యవస్థీకృతం కాలేదు. అందువల్ల నా వ్యాసాల్లో కొన్ని ప్రాచీన దృక్పథాన్ని స్పృశించే విశ్లేషణలు కూడా ఉంటై. ఇది ఆనాడు ఎవర్నీ బాధించలేదు. పెద్దలందరూ శ్రీశ్రీపైన వచ్చిన మొదటి విశ్లేషణ గ్రంథంగా ప్రశంసించారు. శ్రీశ్రీయే మహానందపడ్డాడు. ఇంగ్లీషు విమర్శ బాగా చదువుకున్నవాళ్ళైతే 'New Criticism' పోకడలు ఇందులో నిండుగా ఉన్నై అన్నారు. తదనంతరకాలంలో సమయసిద్ధాంతాల నేపథ్యంలో కొందరు కొన్ని విమర్శలు చేసినా, కాలం గడిచినకొద్దీ 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' గొప్ప ప్రశంసలు పొందింది. శ్రీశ్రీపై మొదటి పుస్తకం రాసినందుకు, త్రిపురనేని మధుసూదనరావు ఎంతో మెచ్చుకునేవారు. ఒకే ఒక్క కవితని విశ్లేషించడం గూడా బహుశః మొదటిసారిగా ఈ పుస్తకంలోనే జరిగింది. 'కవితా ఓ కవితా' మొదలైన వాటిని వస్తుశిల్ప దృక్పథాల్లో విశ్లేషించిన వ్యాసాలు "శ్రీశ్రీ కవితా ప్రస్థానం'లో ఉన్నై.

ఇంత రాస్తున్నా, వేదికమీద మాట్లాడ్డమంటే నాకు విపరీతమైన భయం. మొదటిసారిగా ఈ భయాన్ని పోగొట్టినవారు శ్రీ కొల్లూరి కోటేశ్వరరావుగారు, 'తెలుగు విద్యార్థి' సంపాదకులు. ఒకసారి బి.ఇడి. కాలేజిలో వార్షికోత్సవం జరుగుతుంటే నన్ను మాట్లాడమన్నారు. నేను పైనించి కిందవరకు వణికిపోయి, మాట్లాడలేనన్నాను. 'నువ్వు వ్యాసాలు రాసిన శ్రీశ్రీ మీదే మాట్లాడవయ్యా, ఏం భయం ఉండదు' అన్నారు. ఆయన మీద ఉన్న గౌరవంవల్లనే సరే అన్నాను. వేదికమీద ఉపన్యాసం మొదలుపెట్టినతర్వాత, నా ఒళ్ళు నాకు తెలియనంత ఆవేశం వచ్చింది. బాగా మాట్లాడానని అదరూ అన్నారు. ఆనాటినించి యింక తీరికలేని వక్తనయ్యాను. బందరు గ్రంథాలయంలో అభ్యుదయ కవిత్వంమీద, మహాకవి జాషువా మీద, ఎన్నో ఇతర విషయాలమీద, ఆనాడు గ్రంథాలయ

కార్యదర్శిగా ఉన్న వేములపల్లి చంద్రశేఖరరావుగారు నా ప్రసంగాలు ఏర్పాటు చేశారు. అలా ఆనాడు నా వక్తృత్వం రూపుదిద్దుకుంది.

1968 నించి 71 దాకా నందిగామ, అప్పటి ఎన్.టి.ఆర్.కళాశాలలో లెక్చరరుగా పనిచేశాను. అక్కడ విద్యార్థుల్లో వామపక్షవాదులందరికీ దగ్గరిస్నేహితుణ్ణైనాను. వామపక్ష భావాలపట్ల బాగా ఆకర్షితుణ్ణవడంలో నందిగామలో లెక్చరరుగా పనిచేసిన రోజులు ముఖ్యమైనవి. ఆ రోజుల్లో ఆ కాలేజిలో జీతాలు సరిగా ఇవ్వకపోవడంవల్ల, కొల్లూరి కోటేశ్వరరావుగారే నన్ను 1971లో కాకినాడ యం.యస్.యన్.డిగ్రీ కాలేజీలో చేర్చారు.

1971లోనో 72లోనో నాకు బాగా గుర్తు లేదు. యువభారతివారు 'కుందుర్తి'పై ప్రసంగించవలసిందిగా హైదరాబాదు ఆహ్వానించారు. అంతకుముందు ఆయనతో కొద్దిపాటి ఉత్తర ప్రత్యుత్తరాలున్నై. 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' ఆ రోజుల్లో బాగా ప్రశంసించినవారిలో ఆయన ఒకరు. వస్తువును మాత్రమే అత్యధికంగా విశ్లేషించేవారు ఎక్కువగానే ఉన్నారుగాని, అభ్యుదయ కవుల్లోని అభివ్యక్తి విశేషాలు చెప్పేవారు అవసరమని ఆయన భావించి, తనపై మాట్లాడగలవాణ్ణి నేనే అని నన్నెన్నుకొన్నట్లు చెప్పారు. 'యువభారతి' వారి సభలో, అమరేంద్ర, సి.నారాయణరెడ్డిగారి 'విశ్వంభర' మీదా, నేను కుందుర్తి కవిత్వంమీదా మాట్లాడాం. ప్రసంగమైనతర్వాత, నిర్వాహకులు జి.వి.సుబ్రహ్మణ్యంగారు, నా విశ్లేషణను ప్రశంసించారు. ఆ విధంగా అప్పటి పెద్ద తరంలో కుందుర్తికి మాత్రమే నేను కొంత సన్నిహితుణ్ణి కాగలిగాను. పెద్దవాళ్ళు వెన్ను చరిచి, దగ్గరకు తీసుకోవడం, చిన్నవాళ్ళకి ఎప్పుడూ గొప్ప ఉత్తేజాన్నిస్తుంది. ఆనాడు నేను చేసిన ప్రసంగపాఠమూ, మరో పోటీకోసం నేను రాసిన పుస్తకమూ, యువభారతివారు నాచేత రాయించిన 'కుందుర్తి కవితా వైభమూ'– మూడు విశ్లేషణ గ్రంథాలు కుందుర్తిగారిపై ప్రచురించబడినై.

1970ల నుండి, విప్లవ రచయితల సంఘం, సాహిత్యంలో ప్రధానశక్తి అయింది. సామాజిక పరిస్థితులపట్ల ఆవేదన, ఆగ్రహం గలవారందర్నీ విప్లవమూ, విప్లవసాహిత్యమూ ఆకర్షించినై. సాహిత్యంమీదనైతే విప్లవ ప్రభావం అత్యంత విస్తృతం. ఆ సమయంలోనే సామ్యవాదం గురించిన సర్వాంశాలూ చర్చకు వచ్చినై. అన్ని భావధారల ప్రగాఢ పరిశీలనలు జరిగినై. 'నిబద్ధత' అనేది ఒక ముఖ్యాంశంగా ముందుకు వచ్చింది. సామాజికావేశం కలిగినవారు అసంఖ్యాకంగా విప్లవ కవిత్వంపట్ల ఆకర్షితులయ్యారు. వారిలో నేనూ ఒకణ్ణి. సంఘంలో సభ్యుణ్ణి కాకపోయినా, ఆ భావాలతో చాలా కవితలు రాశాను. ఆ సమయంలో వెలువరించిందే 'రక్తసంధ్య'. ఇందులోని 'గదిలో మేధావులు' అనే కవిత విస్తృత ప్రచారం పొందింది.

ఆ రోజుల్లోనే పాటలు రాయడమూ ప్రారంభించాను. ఎమర్జెన్సీ సమయంలో నేను రాసిన 'భజన' అనే పాటకు ఎంతో స్పందన వచ్చింది. ఇది 'సృజన' పత్రికలో వచ్చింది. అప్పట్లో ఇందిరాగాంధీ తలపెట్టిన సంస్కరణల గురించి వ్యంగ్యంగా రాసినపాట. ఆ పాటలోంచి ఒక్క చరణం.

'ఏమి చెయ్యాలేమి చెయ్యాల
జనులార మీరు
ఇందిరమ్మకు భజనచెయ్యాలి
బ్యాంకులెన్నో చేసె జాతీయం-మన ఇందిరమ్మ
పేదవాళ్ళకు పెంచెనాదాయం-మన ఇందిరమ్మ
కమ్యూనిజమును చేసేదేశీయం-మన ఇందిరమ్మ
గొప్పవాళ్ళకె గొప్ప అప్పులు
ఇచ్చి ఇంకా గొప్ప చేసీ
మిగిలిపోయిన బీదతనమును
బీదవారికె పంచివేసెను... ఏమి'

1970 నుండి 75 వరకు నా సాహితీ ప్రయాణంలో ఒక తీవ్రదశ అనుకుంటే, ఆ సామాజిక దురన్యాయ ప్రతిఘటన దశ ఈనాటివరకూ కొనసాగుతూనే ఉంది. మౌలికంగా నాది ఉద్యమ ప్రేరణగల తత్వం. అయితే ఏ ఒక్క రాజకీయ సిద్ధాంతం దగ్గిరా ఇది విశ్రమించదు. సామాజిక ప్రగతిశీలతకి అవసరమైన అన్ని ఉద్యమాల్నీ స్వీకరిస్తుంది. వాటిలోని మంచి-చెడుల్ని వివేచన చేస్తుంది. అందుకే అన్ని ఉద్యమాలకు సంబంధించిన విశ్లేషణ వ్యాసాలు అసంఖ్యాకంగా రాశాను, రాస్తున్నాను.

1975 దాటిన తర్వాత 'మినీకవిత' యువతరంలో బహుళ ప్రచారం పొందింది. 'మినీకవిత' ఎక్కువగా యువతరమే రాసింది. అందుకే అప్పట్లో 'మినీకవిత, వచన కవితాయౌవనరూపం' అన్నాను. మినీకవిత, అప్రయత్నంగా ఆ రోజుల్లో దావాగ్నిలా అల్లుకుంది. ఎందుకంటే యువతరపు సామాజిక రాజకీయ చైతన్యమంతా ఆవేశపూరితంగా మినీకవితలో ప్రతిధ్వనించింది. ఇది నన్ను ఆకర్షించిన అంశం. రెండోది సహజంగానే వస్తువుకి అనుగుణమైన శిల్పాన్ని కోరలేదు. మినీకవితలో ప్రత్యేకమైన శిల్పరీతులు అభివ్యక్తం కావడం గమనించాను. అందువల్ల స్నేహితులతో కలిసి ఎన్నో ఊళ్ళు తిరిగి 'మినీకవిత'పై ప్రసంగాలు చేశాను. 'మినీకవిత' ఒక సాహిత్య ఉద్యమమైతే, ఆ ఉద్యమాన్ని విస్తృతం చెయ్యడానికి కృషి చేశాను. మినీ కవితలోని వస్తులక్షణాల్నీ, అభివ్యక్తిరీతుల్నీ విశ్లేషిస్తూ 'మినీకవిత' అనే వ్యాససంపుటిని ప్రచురించాను.

1980లు వచ్చేసరికి సామాజిక సాహిత్య దృక్పథాల్లో చాలా మౌలికమైన భేదాలు వచ్చినై. సమాజగమనంలోని మార్పులే సాహిత్యంలో వస్తువునూ, శిల్పాన్నీ నిర్దేశిస్తై. వస్తువులో వర్తమానాంశాలు ఎక్కువ ఉంటై, స్థిరమైన అంశాలు తక్కువ ఉంటై. శిల్పంలో స్థిరమైన అంశాలు ఎక్కువ ఉంటై, వర్తమాన అంశాలు తక్కువ ఉంటై. 80ల నుండి అస్తిత్వవాదాలు విస్తృతంగా వచ్చినై. కవిత్వంలో శిల్పంపైన ఇష్టం పెరిగింది. విప్లవ కవిత్వం వస్తు ప్రధానం కాబట్టి శిల్పం కవి ప్రతిభనుబట్టి మాత్రమే ఉంటుంది. వస్తువుతోబాటు శిల్పమూ ప్రధానమనుకున్నప్పుడు శిల్పాన్ని గూర్చి ప్రత్యేకమైన అవగాహన, శ్రద్ధ ఉంటై. 80ల నుండి వికసించిన స్త్రీ వాద, దళితవాదాల మీద ఎన్నో వ్యాసాలు రాశాను. 'దృష్టిపథం' అనే వ్యాససంపుటిలో వాటిలో ప్రధానమైనవి కొన్ని ఉన్నై.

సామాజిక గమనంతో పాటు ముఖ్యమైన మరో మార్పు, కవిత్వంలో వాస్తవికతకీ, సౌందర్య దృక్పథానికీ ఉన్న సమీకరణలు. ఒక దశలో సౌందర్యాంశకు గౌరవం లేదు. మరోదశలో సౌందర్యంతో మిళితమైన సామాజిక వస్తువు అంగీకరింపబడుతుంది. దీనికి దేశకాల పరిమితులు కూడా ఉంటై. ముఖ్యంగా 80ల నుండి కవిత్వంలో సౌందర్యంతో, భావుకతతో మిళితమైన వస్తువుకి జనాదరణ బాగా వచ్చింది. నా కవిత్వంలో ఆ పరిణామం బాగా ఉంది. ఆవేశమే సర్వస్వమూ కాకుండా, మూలసూత్రాలు స్థిరంగా ఉంటూనే, భావుకతనీ, భావచిత్రాల్నీ, ప్రతీకల్నీ, ధ్వనుల్నీ మిళితంచేసే శైలి అధికమైంది. 'గోదావరి నా ప్రతిబింబం' ఇలాటి కవిత్వంతో నిండిఉంది. 'గోదావరి నా ప్రతిబింబం' అనే శీర్షికతో ఉన్న కవితే యిందుకు ఒక ఉదాహరణ. గోదావరి సౌందర్యాన్ని ఎన్నో భావచిత్రాలతో వర్ణిస్తూ వచ్చి, చివరి పంక్తుల్లో

'రాజమండ్రి దగ్గర
గోదావరిలోకి తొంగిచూస్తే
నా ముఖం నాకు కనిపించదు
వీరేశలింగంగారి ముఖం కనిపిస్తుంది!

అనే సామాజిక స్ఫూర్తి మిళితమైంది. ఈ కవితమీద వ్యాసం రాసిన మాకినీడి సూర్యభాస్కర్ ఒకచోట ఇలా అన్నాడు.

'వస్తుచిత్రం భావచిత్రంలో భాగమై జమిలిగా కలిసిపోవటం అద్దేపల్లిలో చూస్తాం. ఆయన ఇమేజరీని కేవలం ఇమేజరీకోసమే వాడరు. తీసుకున్న వస్తువుకి సరిగ్గా సరిపోయే ప్రతీకలతోనే భావాన్ని చిత్రీకరిస్తారు'.

ఇదే ధోరణిలో 'మెరుపుపువ్వు' అనే దీర్ఘకవిత కూడా రాశాను.

1995లో నేను విశ్రాంత అధ్యాపకుణ్ణి అయ్యాను. 1971, 72 ప్రాంతాల్లోనే కుందుర్తిపై పరిశోధన చెయ్యడానికి బి.రామరాజుగారు అంగీకరించారు. కాని మా కాలేజిలో ఉన్న కొన్ని అంతశ్శైత్యాల వల్ల, ప్రిన్సిపాలుగారి అనుమతి నాకు లభించలేదు. అలా అలా సమయం గడిచిపోయింది. 95లో రిటైరయ్యాను. సామ్యవాద కవిత్వాన్ని గూర్చిన విమర్శపైనా ఒక ప్రశ్న చాలాకాలంగా ఉంది. మార్క్సిస్టు పెద్దలందరూ, మార్క్సు, లెనిన్, మావో- ఇంకా అందరూ శిల్పంలేని కవిత్వం వ్యర్థమని చెప్పారు. మరి సామ్యవాద కవిత్వ విమర్శకులు కేవలం వస్తువు గురించి మాత్రమే చెప్తారెందుకు? గొప్ప కవి కేవల వస్తువువల్ల ప్రసిద్ధుడు కాడు గదా! అందుకే ఈ అంశంపై రిటైరైన తర్వాత పరిశోధన చెయ్యడానికి పూనుకున్నాను. రిటైరవకముందే రిజిస్టర్ చేసుకున్నాను. ఆ సిద్ధాంత గ్రంథంపేరు 'అభ్యుదయ విప్లవకవిత్వాలు-సిద్ధాంతాలు-శిల్పరీతులూ'! ముందు నేనేదో పేరు పెట్టాను. ఆ పదాల్ని అందంగా మార్చి, సరిచేసి ఈ పేరు సూచించినవారు సి.నారాయణరెడ్డిగారే. నా సిద్ధాంత వ్యాసంలో శ్రీశ్రీ దగ్గరనుండి 70ల లోని విప్లవ కవులవరకూ, అందరి అభివ్యక్తిరీతుల్నీ వివరించాను. ఇది విమర్శలో ఒక ఎడాన్ని భర్తీ చేసిందని విమర్శకులు పేర్కొన్నారు.

1990 నుండి ఈ దేశంపైన సామ్రాజ్యవాద ప్రభావం సర్వరంగాల్లోకి రావడం ప్రారంభమైంది. గాట్‌పైన సంతకం చెయ్యగానే ఈ దేశపు సార్వభౌమత్వమంతా కట్టుపడింది. అన్ని రంగాల్లో సాంస్కృతిక విలువల పతనం ప్రారంభమౌతుందనీ, డబ్బు వ్యాపారం సర్వరంగాల్నీ పాలిస్తైయనీ, దేశం పరోక్ష బానిసత్వంలోకి నెట్టివేయబడుతుందనీ, ముందుగా అర్థం చేసుకున్నవాళ్ళు వామపక్షభావాలు గలవారే. పెట్టుబడిదారీ విధాన దుష్ఫలితాల గురించి మార్క్స్ ఈ విషయాలన్నీ వందేళ్ళక్రితం చెప్పిఉన్నాడు. 1990ల నుండే నా కవిత్వంలోకీ, వ్యాసాల్లోకీ, కవితల్లోకీ సామ్రాజ్యవాద వ్యతిరేక భావన పూర్తిగా ప్రవేశించింది. గాట్‌పై సంతకం జరిగినప్పుడే ఇలా రాశాను.

'గాట్‌పై సంతకం జరిగిపోయింది
భారతదేశం అట్లాంటిక్ సముద్రంమీదికి ఒరిగిపోయింది
తనకు తాను ఒక తోలుబొమ్మగా మారిపోతోంది
దాని ఎముకల వంపులకి
రిమోట్ కంట్రోల్ 'అమెరిక'గా ఉంటుంది...
'ఒక్క సంతకం విలువ
ఒక దేశసంస్కృతి అయినప్పుడు

వేళ్ళమీద పగబట్టినవాడే
తన విలువ తాను తెలిసినవాడు'

అప్పటినుండి సామ్రాజ్యవాద దుష్ప్రభావంలోని అన్ని అంశాలూ నా రచనలకి ప్రేరణగా నిలుస్తున్నై. అయినా ధైర్యంగానే, పొగచూరిన ఆకాశం–కవితా సంపుటాలు ఈ భావాలకి ప్రతిబింబాలు.

సామాజిక ప్రగతిశీల వస్తువు నా రచనలకి ప్రాణం. అభివ్యక్తి సౌందర్యం అంతర్గతమైన శ్వాస. గత కాల ప్రగతిశీలాంశాల్ని వర్తమానాంశాలతో కలుపుకుంటూ, నిరంతర పరిణామంతో భవిష్యత్తుకి సాగిపోవడమే నా మౌలికతత్వం.



డా॥ ఎ.బి.కె.ప్రసాద్

సంస్కారంతో కూడిన బుద్ధి వ్యక్తిని-మనిషిని ఉదాత్తుడిగా తీర్చిదిద్దుతుందే కాని వయస్సు కాదని ఒక ప్రాచీన సూక్తి (మతిః పరిణమతీమానుషముదాత్తయతి న వయః)! ఈ సూక్తి నాకెంతవరకు వర్తిస్తుందో తెలియదుగాని నేను నేడీ స్థితికి ఎదిగిరావడానికి కారకులు నా తల్లీ, నా మేనమామ, నా పూర్వీకుల సాహితీ సంప్రదాయాలూ, నా భార్య అని చెప్పితీరాలి. అయితే ఈ మధ్యలో తండ్రి పాత్ర ఏమైనట్టు అని మీకు అనుమానం రావొచ్చు. పుత్రులు లేనివారికి ఊర్ధ్వలోక గతులుండవని ఒక మూఢవిశ్వాసం సమాజంలో పేరుకుపోయిన కాలంలో నేను పుట్టిన తరువాత కూడా ఎదుగుతున్న నన్ను, నా ముద్దు ముచ్చట్లనూ చూడకుండానే, ఏ పాపమూ ఎరుగని మా నాన్న మూడు పదుల వయస్సు నిండకుండానే "ఊర్ధ్వలోకం" చేరాడు! "బిడ్డలు లేనివారికి ఇల్లు శూన్యం" గా ఉంటుందని చెప్పబోయి మనవాళ్లు మతితప్పి ఆడపిల్లల్ని జనాభాలెక్కలనుంచి తప్పించి పితృస్వామిక వ్యవస్థ అల్లిన ఇనుపచక్రానికి, చల్లిన మత్తుకు బందీలైపోయి "పుత్రులు లేనివాళ్లకు ఇల్లు శూన్యం"గా ఉంటుందని సిద్ధాంతీకరించి ఉంటారు!

నేను "వరపుత్రుణ్ణి" అంటారు. అందులో నాకు విశ్వాసం లేదు. ఎందుకంటే నాన్న ప్రమేయం లేకుండా నేను శూన్యం నుంచి ఉద్భవించానని ఎవరైనా అంటే, సాక్షాత్తూ తల్లిదండ్రులే అన్నా నేను నమ్మను. కాని మా అమ్మ చంద్రమ్మ నేను వరపుత్రుడిననే అంటూండేది. కారణం? అమ్మకు పెళ్లయిన 12 ఏళ్లదాకా సంతానం కలగలేదట; కొందరికి ఆలస్యంగా సంతానం కలుగుతుందన్న శాస్త్రవిజ్ఞానం అప్పటికి లేదు. అందుకని గుంటూరు జిల్లా నర్సరావుపేటకు దక్షిణంగా ఎనిమిది మైళ్ల దూరంలో ఉన్న కోటప్పకొండ శివక్షేత్రాన్ని దర్శించిందట, కోటీశ్వర దేవాలయంచుట్టూ ప్రదక్షిణలు చేసిందట, పిల్లల్లేనివాళ్లు ఇక్కడికి

వస్తే సంతానవతులు అవుతారని ఒక నమ్మకం. అన్నేభవానీ కోటీశ్వర ప్రసాద్ అన్న నా పేరులోని "కోటీశ్వరు"డు ఆ కోటప్పకొండలోని 'కోటయ్య'గారే! అలాగే అన్నే వంశంవారు శైవారాధకులు కావడంవల్ల "భవానీ" (పార్వతి) కూడా నా పేరులో చేరింది. ఆలయ సమీపంలో ఉన్న ఓంకార నది సాక్షిగా ఈ మాట నమ్మితే, నాన్నకు అన్యాయం చేయడమేననీ, మరి పెళ్లి ఎందుకు చేసుకున్నావు అని ప్రశ్నించినదానికి అమ్మ నవ్వుకుంటూనే గోముగా నాకు రెండు చెంపకాయలిచ్చింది! తప్పు అని చెప్పిందే గాని నన్ను ఒప్పించలేకపోయింది.

ప్రతి వంశం వెనుకా, ప్రతి వంశాంకురం వెనక కొన్ని సంస్కార ఛ్ఛాయలు ఉంటాయి. మాది "అన్నే" వారి వంశం అంటారు. ఈ వంశం పూర్వీకులది అసలు కృష్ణా జిల్లా కాదు, నెల్లూరు జిల్లా, వెంకటగిరి సంస్థానం. ఇప్పటికి 200 సంవత్సరాలనాడు వెంకటగిరి నుంచి కృష్ణా జిల్లాకు, పశ్చిమ గోదావరి జిల్లాకు వలసవచ్చి ఉప్పులూరు గ్రామంలో కొందరు, ముదునూరులో కొన్ని కుటుంబాలు స్థిరనివాసులయ్యారు. ఇంతకూ చెప్పవచ్చేదేమంటే- చరిత్ర గమనంలో ఇలాంటి ప్రవాసాలూ, వలసలూ, స్థిరనివాసాలూ సర్వసాధారణం. కాకపోతే "అన్నే" వంశానికున్న ఒక ప్రత్యేకతేమంటే- ఈ వంగడాలలో సాహిత్య సంపర్కం, కవన సంస్కారం ఉన్న పండితులు కూడా ఉండడం. ఈ వంశంలో హెచ్చుమంది సగటున 70 ఏళ్లు వయస్సు దాటిన దీర్ఘజీవులూ, కొంతమంది స్వాతంత్ర్య సమరయోధులూ, ఉన్నత విద్యనభ్యసించినవారూ, పండితులూ, కవులూ ఉన్నారు. కాశీ విద్యాపీఠ్‌నుంచి "శాస్త్రి" బిరుదాంకితుడై హైదరాబాద్ కేంద్రంగా నాలుగు వేదాలు ఒక్క చేతిమీదగా అనువదించిన అన్నే కేశావార్య 'శాస్త్రి' ఆర్యసమాజ నాయకుల్లో ఒకరుగా, స్వాతంత్ర్య సమరయోధునిగా 1930లో, 1932లో, 1939లో అనేకసార్లు జైళ్లపాలై, ఆర్యసత్యాగ్రహంలో హైదరాబాదు, నాందేడులలో. జైళ్లకు వెళ్లి బహుగ్రంథకర్తగా విఖ్యాతినొందిన సంస్కృతాంధ్ర, హిందీ పండితుడు.

అలాగే అన్నే అంజయ్య, అన్నే మల్లికార్జునరావు, అన్నే స్వరాజ్యం (భగత్‌సింగ్ సహచరుడు, స్వాతంత్ర్య సమరయోధునిగా అండమాన్స్‌లో 20 ఏళ్లు సెల్యులార్ జైలులో మగ్గి తరువాత అన్నే స్వరాజ్యాన్ని వివాహమాడిన మహోన్నతవ్యక్తి విజయకుమార్ సిన్హా), అన్నే సుబ్రహ్మణ్యం లాంటివారున్నారు. 1925లోనే అస్పృశ్యతా నివారణకోసం ముందు తమ ఇంటిబావిని దళితులకు తెరిచి ఆనాటి మూఢాచారాలను ఎదురొడ్డి నిలిచిన ఆదర్శజీవి సుబ్రహ్మణ్యం. అన్నే వంశం దానధర్మాలకు ప్రసిద్ధి చెందడమే గాక, మా పూర్వీకులెందరో (వీరిలో 'పీచు'గాళ్లు, పీనాసులు కొంతమంది ఉన్నా) సేద్యవృత్తిలోనూ, దేవాలయనిర్మాణంలోనూ, ఆరాధనా సంప్రదాయంలోనూ పేరొందినవారే గాక, స్వయంగా

పండితులుగా, పద్య కవితా క్రీడలో ఆరితేరిన "మత్తేభాలు"గా, "శార్దూలాలు"గా వన్నెకెక్కినవారూ ఉన్నారు, పరగణా పెత్తందార్లూ ఉన్నారు. తమ భూముల్ని పేదలకు ఈనాములుగా యిచ్చిన పెద్దలూ ఉన్నారు. ఈ ప్రజాహిత కార్యకలాపాల్లో పురుషులకేమాత్రం తీసిపోని వరాల పార్వతమ్మలాంటి మానవతా ప్రియులూ ఉన్నారు. 1785 నాటికే మా వంశ మూల పురుషుల్లో ఒకరైన అన్నే వెంకయార్యుడు వంశంలోని ఆది అంకురమైన మృత్యుంజయుడిని గురించి ఒక ప్రసిద్ధశతకం– "మృత్యుంజయ శతకం" రాశాడు. ఈ శతక పద్యభాగాల్ని నా చిన్నతనంలో వేమన, సుమతీ శతకాలతో పాటు మా వూరి బళ్లో చదివించేవారు. నూటయాభై ఎనిమిది సంవత్సరాల తరువాత అంటే 1943లో గాని శిథిలావస్థలో ఉన్న ఈ శతక తాళపత్ర కావ్యాన్ని బయటికి తీయలేకపోయారు. శివభక్తులైన ఈ వంశస్థుల విద్యావిశారదత్వానికి, కలకండలాంటి పలుకులకు "మృత్యుంజయ" శతకం నుంచి ఉదాహరణంగా రెండు పద్యాలు చూద్దాం:

"తలపైక్రొన్నెల నీరు వెన్నెలలు గాత్రంబందు కాకోలమం
దలి పెంజీకటులొక్కటన్ తెలుపునాత్మజ్ఞానమున్ భూజనం
బులకున్ భోగములెల్ల మిథ్యలనియుద్బోధించుగోదైత్యని
ర్దళనారంభవిజృంభమాణ! నతభక్తత్రాణ! మృత్యుంజయా!

"కమలాధీశు మృదంగవాద్యము దివౌకజ్యేష్ఠుతాళంబు నా
దమునన్ మించగ శారదా తరుణిగీతంబుల్ చెలంగంగ న
య్యమరుల్ సిద్ధులు సంయమీంద్రులు గణాధ్యక్షుల్ భజింపన్ ప్రదో
షమునన్ నాట్యముసల్పుమూర్తి మదిసంస్థాపింతు మృత్యుంజయా!

ఒలయంగుమ్మరి భూప్రదేశముల శీతోష్ణానుకూల స్థితుల్
జలకాష్ఠతృణ సస్యవృద్ధి ఫలవిస్తారంబు నారోగ్యమున్
తెలియందోచెను గృష్ణనాజనునదీతీర ప్రదేశంబటం
చెలిమిన్నిల్చిరి యుప్పులూరికడ నన్నేవారి పూర్వుల్ఘనుల్"!

ఆస్తికులతో పాటు నాస్తికులు కూడా పెరిగిన వంశంలో పుట్టిన నాకు పాఠశాల దశలో వేమన, సుమతి, భాస్కర శతకాల నుంచి గురువులు ఉదాహరించే పద్యాలలోని హేతుబోధ, నీతిబోధ నాకు మాతృభాషా మాధ్యమం వల్లనే వంటబట్టింది. దీనికితోడు భక్తురాలైన మా అమ్మ "కమలాక్షునర్చించు కరములు కరములు" భాగవతం పద్యాలు చదువుతూ ఉండేదింట్లో. నా చెవులు వాటినీ తప్పించుకు తిరిగేవి కావు! నాటి గురువులు

విద్యార్థుల్లో ధారణశక్తి పెరగడానికి ఉచ్చారణకోసం, స్పష్టతకోసం, అనుసరించిన పద్ధతులూ నేటికన్నా భిన్నంగా ఉండేవి: ఎస్.ఎస్.ఎల్.సి. నుంచి ఎఫ్.ఎ.వరకూ మాతృభాషలో బోధనతో పాటు ఇంగ్లీషునూ ఒక అంశంగా బోధించేవారు. సైన్సు, లెక్కలూ కూడా మాతృభాషలోనూ, కొంతభాగం ఆంగ్లంలోనూ సాగినా, పాఠ్యాంశాల తాలూకు భావనను తెలుగులో చక్కగా వివరించి చెప్పేవారు. ఆ పునాది మీదనే నేనూ పట్టభద్రానంతర దశవరకూ, పి.జీ. వరకూ విద్య కొనసాగించాను. పాఠశాల విద్యాదశలో భూగోళం, సామాజిక శాస్త్రాలు మాతృభాషలో నా అభిమాన అంశాలు కావడంతో ఆ తరగతుల్లో మొదటి రెండు స్థానాల్లో నా ఉనికిని దర్జాగా నిరూపించుకునేవాణ్ణి. మానవీయ విషయాలను, చరిత్రనూ ఈనాడు పాలక రాజకీయులు పక్కకు పెట్టిస్తున్నారు గాని, భూగోళం, సాంఘికశాస్త్రాలు, చరిత్రాధ్యయనం ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికీ, అర్థవంతంగా అభ్యుదయ పరంపరగా తమ రూపురేఖలు దిద్దుకోవడానికీ మానవీయ సులోచనాలు తొడగడానికి ఉపాధేయాలని మరవరాదని పంతుళ్లు చెప్పేవారు. ఆనాడు మాకు పాఠాలు చెప్పే పంతుళ్లందరూ తరగతి గదిలో ప్రవేశించడంతోనే "రొడ్డకొట్టుడు"గా వెంటనే పాఠంలోకి వెళ్లకుండా అయిదు-పది నిమిషాలసేపు మమ్మల్ని "మూడ్"లోకి లాగడానికి ముందు ఆసక్తికరమైన వార్తలో లేక లోకాభిరామాయణమో చెప్పి, మమ్మల్ని తమ వశం చేసుకునేవారు. ఇలా పాఠశాల దశ, సెకండరీ విద్యాదశ గడచి సైన్స్ పాఠ్యాంశాలు పునాదిగా విశ్వవిద్యాలయ దశకు ఎదిగేసరికి మా కళ్లముందు ప్రపంచం మరింత విశాలమయింది. కృష్ణా జిల్లా పునాదిపాడు, బెజవాడ, మచిలీపట్నంలలో మొదటి రెండు విద్యాదశలు ముగించుకుని మదరాసు విశ్వవిద్యాలయానికి చెందిన లయోలా కాలేజీలో తెలుగు ప్రత్యేకాంశంగా, ఇంగ్లీషు మాధ్యమంలో రాజకీయ, ఆర్థికశాస్త్రాలు, చరిత్ర ప్రధానాంశాలుగా చదువుకున్నాను. లయోలా కళాశాల తెలుగు విద్యార్థి సంఘానికి నా మిత్రుడు, పార్లమెంటులో పూర్వ ప్రజాప్రతినిధి డి.పుల్లయ్య అధ్యక్షుడుగా, నేను కార్యదర్శిగా ఉండేవాళ్లం. వార్షికసభకు మల్లంపల్లి సోమశేఖరశర్మ, తాపీధర్మారావులాంటి ఉద్దండుల్ని ఆహ్వానించి విలువైన అతిథి ప్రసంగాలు ఏర్పాటు చేసుకునేవాళ్లం. మా తెలుగు ఆచార్యుడు చల్లా రాధాకృష్ణశర్మ పాఠం, పద్యం చెబితే మళ్లీ చదవాల్సిన అవసరం లేకుండా అంత మధురంగా బోధించేవారు. చెవులు రిక్కించి మరీ వినేవాళ్లం, మార్కులూ మాకు అలాగే వచ్చేవి. తెలుగును ఎన్నడూ మార్కుల సబ్జక్టుగా నేర్చుకోలేదు.

నేను నాగపూర్‌లో పి.జి.(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) చేస్తూనే మధ్యలో పత్రికలకు వ్యాసాలు రాసేవాణ్ణి. అంతకుముందు ఇంటర్-బి.ఎ. దశ నుంచి వ్యాసాలు రాసే అలవాటు ఉన్నందున (జ్వాల, ఆంధ్రప్రభ, తెలుగు స్వతంత్ర), పత్రికా రచనా వ్యాసంగంవైపు పూర్తిగా దృష్టి మళ్లించడంవల్ల మధ్యలోనే ఎం.ఎ. చాలించాల్సి వచ్చింది. నా యాభై ఏళ్ల

పత్రికారంగ చరిత్రలో గడచి వచ్చిన దశలూ, అనుభవాలూ ఎన్నెన్నో. అవన్నీ ఏకరువు పెట్టడానికి, అనుభవాలు పూర్తిగా పంచుకోడానికి ఇది వేదిక కాదు. పత్రికా రంగంలో ప్రవేశించడానికి రాజకీయ సామాజిక పరిస్థితులు, వాటి పరిశీలన నాకు పూర్వరంగం సమకూర్చిపెట్టాయి. రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనిర్మాతల్లో నా మేనమామ చలసాని వాసుదేవరావు ఒకరు. ఆయన కమ్యూనిస్టు కావడానికి ముందు వివేకానంద భక్తుడూ, కాంగ్రెస్‌వాదీ, జమిందారీ వ్యతిరేక పోరాటంలో రైతునాయకుడు; పరిణామవాద సిద్ధాంతాన్ని కమ్యూనిస్టు కార్యకర్తలకు అరటిపండు వలచిపెట్టినట్టు వివరిస్తూ ఆయన ఓ పుస్తకం కూడా రాశారు. 1936లో (నేను పుట్టిన సంవత్సరానికి) వాసుదేవరావు ప్రధాన కార్యదర్శిగా, కొమ్మారెడ్డి సత్యనారాయణ అధ్యక్షుడుగా ఆంధ్రదేశ చరిత్రలో మొదటిసారిగా రైతాంగ సమస్యలపై ఇచ్ఛాపురం నుంచి మదరాసు వరకూ 1400 మైళ్లు చరిత్రాత్మకమైన రైతుయాత్ర సాగింది. దాని తాలూకూ చరిత్ర తెలుసుకున్నాను. తెలుగు సాహిత్యం, చరిత్ర, విజ్ఞానశాస్త్ర గ్రంథాలు అనేకం ఆయనవద్ద లభించేవి. తొమ్మిది-పదేళ్ల వయస్సులోనే నేను మామయ్యతో కలిసి బెజవాడలోని మొగల్రాజపురంలో ఉండే పార్టీ దినపత్రిక అయిన మొట్టమొదటి "ప్రజాశక్తి" కార్యాలయానికి తరచుగా వెడుతూ ఉండేవాడిని; అనేకమంది నాయకుల్ని చూశాను. అనంతర దశలో పార్టీ అగ్రనాయకులు అనేకమంది అజ్ఞాతవాస కాలంలో మా ఊళ్లోని మా యింట్లో తలదాచుకోడం ఎరుగుదును, వారి రహస్య జీవితానికి భంగం కలగకుండా ఉండేందుకు నన్ను "పెద్దగా మాట్లాడొద్ద"ని వారించడమూ నాకెరుకే. నేను ఎదిగిన తరువాత పార్టీ సాహిత్యంతో పాటు తెలుగు సాహిత్యమూ, సాధారణ సాహిత్యేతర గ్రంథాల పఠనమూ నాకు అలవాటయింది. "విశాలాంధ్ర"తో ప్రారంభమైన నా పాత్రికేయవృత్తి చివరికి కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలికలలో భాగంగా అవతరించిన "జనశక్తి" పత్రిక మొదలు నేను సాధారణ సబ్-ఎడిటర్, చీఫ్-సబ్-ఎడిటర్, న్యూస్ ఎడిటర్ దశలనుంచి పూర్తి సంపాదకుని దశవరకూ ఎదుగుతూ వచ్చాను. ఈ ఎదుగుదలలో భాగంగానే రాష్ట్రంలోని కనీసం అయిదారు ప్రధాన పత్రికలకు (ఈనాడు, ఉదయం, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి) సంపాదకుని స్థాయిలో ప్రధాన సంపాదకుని హోదాలో వాటి వృద్ధికీ, సర్క్యులేషన్లు పెరగడానికీ నా శాయశక్తులా కృషిచేశాను. ప్రజాకవి నారాయణరెడ్డి తరచుగా అంటూంటారు- "ఎన్నో పత్రికలకు ఇతను పురుడు పోశాడ"ని! నిజానికి పత్రికలను పెంచినవాడినే గాని తుంచినవాడిని కాదు. వాటి ఆకృతినీ వాటి అంతర్యాన్నీ ప్రజాయత్తం చేయడానికి, నవనవోన్మేషంగా అభ్యుదయ భావాల పరివ్యాప్తికీ దోహదం చేయడం ద్వారా పాఠకలోకంలో చైతన్యాన్నీ, స్ఫూర్తినీ కలిగించడమేగాక ప్రపంచ/దేశీయ/రాష్ట్రీయ పరిణామాలపట్ల సునిశితమైన స్ఫూర్తినీ కలిగించడానికి నా వంతు ధర్మం నేను నెరవేర్చానన్న తృప్తి నాకుంది. నాకు

అంతగా అభిరుచిలేని క్రీడా విషయాలలో సహితం– పత్రికకోసం విభిన్నరుచులు గల పాఠకుల ప్రయోజనాన్ని గౌరవించుతూ ఆయా ప్రత్యేక క్రీడలకు చెందిన సమాచార స్రవంతికి అవసరమైన సంభారాలన్నీ సమకూర్చుతూ వచ్చాను. క్రీడలనే కాదు, సాంస్కృతిక, కళా, సాహిత్య, సాంకేతిక, విజ్ఞానశాస్త్ర, వాణిజ్య, వ్యాపార రంగాలన్నింటికి సంబంధించిన పాఠకుల ప్రత్యేకాభిరుచులకు తగినట్టుగా పత్రికలను తీర్చిదిద్దడానికి పత్రికలలో కనీస గ్రంథాలయాలు పెట్టించాను. ఉన్న పత్రికలకు కొత్త జవసత్వాలు తొడిగి స్థాయిని పెంచడానికి, కొత్త పత్రికల వ్యవస్థాపక సంపాదకునిగా నేను ఒక కెన్నడీ "కేప్ కాన్వెరాల్" గానో, ఒక "బైకనూర్ కాస్మోడ్రామ్"గానో రోదసీ ప్రయోగ కేంద్రాల మాదిరిగా నేనూ ఒక "లాంచింగ్ పాడ్" అయిపోయాను. కొత్త వార్తా పత్రికల "లాంచింగ్" అనేక చిక్కులతో కూడుకున్నదీ, బాధ్యతతో కూడుకున్నదీ కావడంవల్ల ప్రయోక్త వైఫల్య–సాఫల్యాలకు సర్వదా సిద్ధమై ఉండాలి. వృత్తి నైపుణ్యానికీ తద్వారా తన తనాన్నీ, పత్రికనాణ్యతనూ సమున్నత స్థానంలో నిలపడానికీ ప్రయోగదశ ఒక అవకాశమూ, ఒక సవాలూ. ఇందులో 'అదృష్టం' కన్నా అవగాహనకూ, అవిశ్రాంత కృషికే ప్రాధాన్యం అని నా విశ్వాసం. మధ్యమధ్యలో వార, పక్ష పత్రికలయిన "సుప్రభాతం", "మా భూమి"కి కూడా ఎడిటర్‌గా ఉన్నాను. అవీ వెలుగొందాయి. అయితే ఈ పత్రికలన్నింటిలో మీరెందుకు యిమడలేకపోయారు, ఎందుకు తరచుగా పత్రికలు మారారన్న ప్రశ్న కొందరు పాఠకుల యక్షప్రశ్నల్లో భాగమైపోవడం సహజం. పత్రికల, వాటి యాజమాన్యాల పేర్లు వద్దుగాని ఒక చిన్న ముచ్చట: ఎముక లేకపోయినా పర్వాలేదు గాని వెన్నెముక మాత్రం మనిషికి అవసరం; అలాగే జీవిక అవసరమేగానీ, జీవినీ, జీవాన్నీ తోడేసే అస్వతంత్ర వాతావరణాన్నీ స్వేచ్ఛారాహిత్యాన్నీ సహించలేం. పత్రిక పట్టాలమీదకి ఎక్కి, నిలదొక్కుకుని, నడక సాగిస్తూ పరుగు లంకించుకునేంతవరకూ పాత్రికేయుడు ఆ పత్రికాభ్యున్నతి అనే యజ్ఞంలో ఒక సమిధగా పనిచేయాల్సి వస్తుంది, ఆ తర్వాత ఆ సమిధ ఆహుతవుతుంది. మరో పత్రిక యాజమాన్యానికి వ్యాపార ప్రకటనలే ముఖ్యం, అవి అశ్లీలతను పెంచేవైనా సరే తమకు సంపాదకుడు అడ్డురాకూడదు. ఈ ప్రయోగంలో అతని మాట చెల్లనప్పుడు తన వ్యక్తిత్వాన్ని సంపాదకుడు కాపాడుకోవలసి వస్తుంది. ఈ క్రమంలో ఎడిటర్ పత్రికా పాఠకుల సబబైన అసహనాన్ని, ఆగ్రహాన్నీ కొనితెచ్చుకునేకన్నా పత్రిక నుంచి తప్పుకోవడం మంచిది; ఇంకో పత్రికా యాజమాన్యం తన వ్యాపార ప్రయోజనాల కోసం విలేకరులనూ, పత్రికా సిబ్బందిని వ్యాపార ప్రకటనలను బుక్ చేయడానికి పురమాయించినప్పుడు లేదా వ్యాపార ప్రకటనల కోసం వార్తలను "తార్చడా"నికి వెనుకాడనప్పుడు ఎడిటర్ తన సిబ్బందిచేత నిష్పాక్షికమైన వార్తలను రాయించుకోలేదు; అప్పుడూ అతను తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాల్సి వస్తుంది. మరోపత్రిక

యాజమాన్యం సంపాదకునితో సంబంధం లేకుండానే తన వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా నిష్కారణంగా విలేకరులను మార్చడానికి లేదా తొలగించడానికి ప్రయత్నించినప్పుడు, విచారణ జరిపిన తరువాతనే చర్య తీసుకోవాలన్న కనీస న్యాయసూత్రాన్ని కూడా యాజమాన్యం పాటించనప్పుడు- ఎడిటర్ అన్నవాడు తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవలసి వస్తుంది. ఈ దురవస్థకు దోహదం చేస్తున్న ప్రధాన కారణాలు రెండు: 1) జాతీయ స్థాయిలో రెండు ప్రెస్ కమీషన్లు ప్రతిపాదించినట్టుగా ప్రైవేట్ రంగంలోని పత్రికలను ఆయా ప్రైవేట్ యాజమాన్యాలకు ఇతరత్రా ఉన్న పారిశ్రామిక సంస్థలతో గల సంబంధాన్ని ప్రభుత్వం తెగ్గొట్టకపోవడం, 2) దీని ఫలితంగా, క్రమంగా పత్రికా యజమానులే (అక్షర శూన్యులైనా సరే) సంపాదకులుగా కూడా అవతరించడమూ, పత్రికలకు రూపొందించుకోలేని విధాన ప్రకటనలనూ, లక్ష్యాలనూ సమాజానికీ, ప్రభుత్వాలకూ రూపొందించడానికి యాజమాన్యాలు సాహసించడమూ! వృత్తిధర్మ నిర్వహణలో సుమారు 20 పత్రికలు మారవలసివచ్చిన కోటంరాజు రామారావు అంటూండేవారు: "The rolling stone gathers neither mass nor any boss" అని! అదే నా విషయంలోనూ జరుగుతూ వచ్చింది. అయినా పత్రికా నిర్వహణలో పరువునష్టం దావాలూ, కేసులూ తప్పవు. పరువు కోల్పోయినవాడు కూడా దావా వేయడం, కేవలం పరువును పళ్లబిగువతో కాపాడుకోడానికే గాని, అందులో సత్తా లేదని అనేక కేసుల్లో రుజువయింది. నేను కమ్యూనిస్టు పార్టీ పత్రికల్లో సంపాదకునిగా ఉన్నప్పుడు, ఆంధ్రజ్యోతిలో ఉన్నప్పుడూ ఒకసారి రాజకీయ ఖైదీగానూ, వేరొకసారి దొంగ కుట్రకేసులో మొత్తం సంవత్సరంన్నర కాలం జైళ్లలో ఉన్నాను. సమాజ సభ్యుల, దేశపౌరుల న్యాయబద్ధమైన హక్కులకు మించిన స్వేచ్ఛాహక్కును పత్రికలూ కోరుకోకూడదు. ప్రజాబాహుళ్యం హక్కుల రక్షణలో భాగంగా పత్రికా స్వేచ్ఛను చూడాలిగాని దాన్నొక విశేషాధికారంగా భావించుకోరాదు. సమాజంలో పత్రికలూ, పాత్రికేయులూ భాగమనుకున్నప్పుడు పరిధుల నిర్ణయం అవధులకు లోబడే ఉండాల్సి వస్తుంది. అయితే ఈ ఇబ్బందులూ సబ్బందులూ ఎలా ఉన్నా, సంపాదక స్థానంలో ఉన్నంతకాలం పనిచేస్తున్న పత్రికను ఎప్పటికప్పుడు సంపాదకుడు నవం నవంగా తీర్చిదిద్దుకుంటూ ఉండవలసిందే. పాతతరాలకు చెందిన ప్రసిద్ధ పాత్రికేయులలో ఒకరు జాతీయస్థాయిలో పత్రికా లోకంలో తెలుగు బావుటా ఎగరవేసిన, ప్రాతఃస్మరణీయుల్లో ఒకరైన “లీడర్” సంపాదకుడు సి.వై. చింతామణి, “పండితపుత్రుడు” అన్న అపవాదుకు అపవాదుగా నిలిచిన ఆయన కుమారుడు సి.ఎల్.ఆర్.శాస్త్రి కవుల, రచయితల కుటుంబానికీ పత్రికారంగానికీ మధ్య ఉండే సంబంధం ఎలాంటిదో చెప్పారు: ఈ దృశ్యమాన ప్రపంచంలోని సర్వకళలకూ, సారస్వత సాంస్కృతికాది రంగాలకూ, వాటిలో ఈదులాడే సారస్వతేయులకూ సంస్కృతీపరులకూ పత్రికలు, దినపత్రికలూ తొలి ప్రచార ముఖద్వారాలు, వారూ, వారి

రచనలూ ప్రకాశమానం కావడానికి అవి విశ్వసనీయమైన ప్రవేశద్వారాలు. ఈ వరవడిలోనే నా ఉరవడితో వర్ధిష్ణువులందరికీ ప్రోత్సాహకరంగా ఉండేవిధంగా మూడు నాలుగేళ్లపాటు వరసగా నేను పనిచేసిన పత్రికల్లో క్రమం తప్పకుండా ప్రతీ ఆదివారం సాహిత్య సంపాదకీయాలు నిర్వహిస్తు వచ్చాను. నిష్ఠతో సాగించిన ఈ విన్యాసంవల్ల విధిగా నేనూ అనేక కొత్త పుస్తకాలనూ, విభిన్న ప్రక్రియా విశేషాలతో కూడుకున్న అనేక తాజా గ్రంథాలనూ చదవవలసి వచ్చేది; పాతబూజు ఏదైనా ఉంటే దులుపుకోవలసి వచ్చేది; వాటితోపాటు చేతికందిన పాశ్చాత్య పత్రికా రాజాల కాపీలనూ పరిశీలించేవాణ్ణి; ఈ వెతుకులాటలో ఒక విషయం బయటపడింది. ఏ పాశ్చాత్య పత్రికలకూ ఆకారంలోనూ, ఆంతర్యంలోనూ, విషయపుష్టితో కూడిన సరసమైన, లయబద్ధమైన శీర్షికలు పెట్టడంలోనూ దేశీయ/రాష్ట్రీయ పత్రికలు ఏమాత్రం తీసిపోవనీ, అంతకన్నా మిన్నగానే ఉన్నాయనీ రుజువయింది. ఈ అనుభవసారాన్ని యువ పాత్రికేయులకు, రచయితలకు పంచాలన్నా, వారిని పెంచాలన్నా ఏంచేయాలి? తమ నిరంతర సాహిత్య వ్యవసాయం ద్వారా, ప్రజారంజకంగా ప్రజా సమస్యలపై స్పందిస్తూన్న యువరచయితలు తమదైన శైలిలో కలం యోధులుగా తీస్తున్న పంటలను విదేశాలలోని నవరచయితల రచనా విలువలతో పోల్చి బేరీజు కట్టి నిష్పాక్షికమైన అంచనాకు రావడానికి చేసిన ప్రయత్నమే నా సాహిత్య సంపాదకీయాలు. స్థూలంగా వాటి పేరు 'సాహిత్యకీయాలు!'

పండిత-పాత్రికేయ వర్గంలో కొసమెరుపైన తిరుమల రామచంద్ర, పద్మభూషణ్ డాక్టర్ సి.నా.రె., భాషా శాస్త్రవేత్త చేకూరిలాంటివారు ఈ సాహిత్యకీయాలపై వెలిబుచ్చిన సదభిప్రాయాలకు వారికి ఈ సందర్భంగా కృతజ్ఞత తెల్పడం నా విధి. అభిప్రాయం కోసం సాహిత్యకీయాల సంపుటాలు రెండింటినీ పంపినప్పుడు తిరుమల రామచంద్ర నెల రోజుల తర్వాత వాటిని తిప్పి పంపేస్తూ "రెండుసార్లు చదివినా వీటిని అంచనా కట్టడం నావల్ల కావడం లేదు" అని తెలిపారు. అప్పుడు నేను "మీ వల్లనే గాకపోతే మరెవరివల్ల అవుతుంది? పుస్తకం మూసేసి, వివరాలలోకి వెళ్లకుండా చదివినప్పుడు మీకేమనిపించిందో అదే రాయండి" అన్నప్పుడు తేరుకున్న తిరుమల రామచంద్ర, ఒక రచయితగా నేనూహించని విధంగా రాసి పంపిన ఆప్తవాక్యాలను మీకు నివేదనగా ఇక్కడ ఉదాహరించదలచాను:

"సంపాదకుని పని అసిధారా వ్రతం. ఈ సాహిత్య సంపాదకీయాల్లో రచయిత బిందువులో సింధువును చూపాడు. అద్దంలో కొండను చూపాడు. ఇవి అసిధారా వ్రతంతో చేసిన రచనలు, శ్యామశబల వ్రతంలో నిగ్గుతేరిన అపరంజిరేకులు. ఏ సంపాదకీయం చదివినా నా మట్టుకు నాకు ఏదో నేను కలలోనూ చూడని నందనోద్యానవనంలో

విహరించినట్లు, ఏదో అపూర్వ సౌందర్యాన్ని సాక్షాత్కరించుకున్నట్టు, కైలాసనాథకోన, ఎత్తిపోతల, కుర్తాళం, నయాగరా జలపాతాల్లో జలకాలాడినట్టు, ఏ హెలికాప్టర్‌లోనో ఒంటిగా విహాయసపథంలో తిరుగుతూ లోకంలోని అతిలోక సౌందర్యాన్ని పర్యవేక్షిస్తున్నట్టు, షేక్‌మౌలానా సాహెబ్ నాదస్వరాన్ని వింటున్నట్లు, ఎల్లా వెంకటేశ్వర్రావు నవ మృదంగ నాదాన్నో, అల్లారఖ్ఖా తబలా భాషనో వింటున్నట్టు అనిపిస్తుంది. ఇదొక ప్రపంచం, ఇదొక కొత్త సృష్టి. నేనొక నవ్య ప్రపంచంలో విహరించాను. క్షణక్షణానికీ రూపం మార్చుకుంటూ విచిత్ర రూపాలతో అలరిస్తూ తిరిగే మేఘాల మేఘాలయాన్ని ఈ రచనల్లో చూచాను. రచన, విధి సృష్టికి భిన్నమయింది. అదొక, మరొక మహాలోకం. మీ మనస్సు మహితం, మీ బుద్ధి మహాతీక్షణం. మీ విమర్శ నిష్పక్షపాతయుతం. మీ ఊహలు సత్యధర్మ సంయుతాలు!"

తిరుమల రామచంద్ర పేల్చిన మతాబులో ఎంత కితాబుందో నాకు తెలియదుగాని, ప్రకృతిసిద్ధంగా మాబోటి వాళ్లను ముదిమి ముంచుకొస్తున్న ఘడియలలో కూడా యువ రచయితలకు మా రచనలనుంచి అందించే ప్రోత్సాహంవల్ల వారు పొందే ఆనందాన్ని పంచుకోవడం విశ్వశ్రేయస్సు కోసం సాగే ఓ ప్రజాహిత రసాయన ప్రక్రియగా నేను భావిస్తాను. యువ రచయితల భావధారలో కొన్ని మూలాలు బలహీనంగా ఉంటే ఉండొచ్చుగాక. కాని ప్రసిద్ధ ఆంగ్ల సాహిత్యవేత్తలలో ఒకరైన బిల్‌కిర్క్‌మాన్ (కేంబ్రిడ్జి) అన్నట్టు "Even shallow roots can still feed interest". యువ సంపాదకునిగా పనిచేసిన రోజుల్లో నేనూ చిన్న చిన్న కవితలు గిలికాను, "మధురగతి రగడ"లో కొన్నీ, ఫ్రీవర్స్‌లో కొన్నీ రాశాను, మరికొన్ని చిరు అనువాదాలూ చేశాను. బహుశా మనం ఎర్రనార్యుని అంత గొప్పవాళ్లం కాకపోయినా ప్రతి జీవిలోనూ ఏదో ఒక కూనిరాగమైనా, గూనిరాగమైనా నిరంతరం మెదలుతూనే ఉంటుంది కనుక అనుకోకుండానే అలవోకగా "కీర్తి సంగ సుఖలీలకు నేనును కాంక్ష చేసితిన్" అని ఎవరికి వారు ఒప్పుకోవడం తప్పు కాదంటాను! ఈ వరసలో నేను హోచిమిన్, బెర్టోల్డ్ బ్రెహ్ట్ కవితలను వినిపించాను, అలాంటివే మరికొన్ని చిన్నవీ, పెద్దవీనూ. హోచిమిన్ దృష్టిలో కవితా వ్యాసంగం అనేది జైలు కటకటాల మధ్య సాగించవలసిన కార్యకలాపం! అయినా, మనం రోజూ చూస్తూ ఉన్నా మన దృష్టికి రాని ఒక మానవీయ కోణాన్ని ఆయన ఆవిష్కరించిన తీరు అనుపమానం: ఆయన అంటాడూ– "నిద్రలో అందరిముఖాలు నిజాయితీగా, 'నీటు'గానే ఉంటాయి / కాని, మేల్కొన్నప్పుడు గాని వారి వారి నిజరూపాలు బయటపడవు"! అలాగే బంగ్లాదేశ్ అవతరణ సందర్భంగా విడుదలయిన ఒకనాటి రవీంద్ర కవీంద్రుని "సోనార్ బంగ్లా" కవితకు "ఆంధ్రజ్యోతి"లో నేను చేసిన అనువాదం పలువురి ప్రశంసలు అందుకొంది. పూజ్యులు బాలాంత్రపు రజనీకాంతరావు తానూ ఈ కవితను అనువదించి

ఉన్నా, నా అనువాదాన్ని మెచ్చుకున్నారని విన్నాను. అది వారి సహృదయత. ఇదీ నా అనువాద కవిత "బంగారు బంగ్లా":

"జోహారు జోహారు
బంగారు బంగ్లా!
అందుకొమ్మీ ప్రేమ
మురళిగీతుల రవళి!

నీ నీలగగనాలు నీ శీత పవనాలు
ఊదునా ఎదలోన కోటివేణువులు
ఫాల్గుణ మాసాన మామిళ్లతోపులో
మరపించు నా మేను నేవో సుగంధాలు!

మార్గశిర మాసాన పసిడి పంటల పుడమి
మధురహాసము చిలుకు, మృదుల భాషల పలుకు
పసరములు మేయు నీ క్షేత్రాల పసిరికల
పడవలే విహరించు నీ నదీ తోయముల!

నీ గ్రామ సీమలను నీరెండ నీడలను
స్వేచ్ఛావిహంగాలు మెలగేటి నిండు ముంగిట నేను
శాంతిగా గడిపెదను–భేదమేదియులేదు
గోపకులు, కర్షకులు అందరూ సోదరులు
నీ పాదముల నా మౌళి మోపనిమ్మోజనని
జోహారు జోహారు బంగారు బంగ్లావని!"

అలాగే "నిజాలు–నిష్ఠూరాలూ" మకుటంతో మధురగతి రగడలో కొన్ని కవితలు రాశాను. రాశిలోనూ, వాసిలోనూ అంతంత మాత్రంగానే ఉన్నాయనిపించినా అవి కూడా మచ్చుకు కొన్ని వినిపిస్తా:

"శిల ద్రవించగా మనసు ద్రవించద?
శిలలూ మనసూ ఒకటే అయితే
తలపు మూతపడి తమను జయించును
తెలివి గలిగితే మనసు జయించును!

"లేటు" చేయకనె "ప్లేటు" మార్చుటలు
"క్రాసు" వోటులో "రేసు" లాటలే

...లకు త్రాసులాయెరా
రా...భములకిది రాజ్యమాయెరా!

మరికొన్నాళ్ల తరువాత "చేదు-చిరుచేదు" అనే మకుటంతో రాసినవి అముద్రితాలు. అయినా మనలో మాటగా సరదాగా రెండు కవితలు చదువుతాను:

"ప్రతివాడు తా ప్రతిపక్షమంటరా
పదవి దొరకునా ప్రభు పక్షమంటర!
పాలపొంగుల మనికి క్షణమేనుర
తాలుతప్పల బతుకు చాలించర!"

"దుష్టభంజకుడు శిష్టరంజకుండు
చీమునెత్తురు పారువాడె నరుడు-
శివుని ఎరుకతోనె చీమకుట్టంగ
నీలకంఠుడుకాడె 'నక్సలైటు'?!

ఈ కవితల కేమొచ్చెగాని, గత యాభై వసంతాలుగా కొనసాగుతూ వచ్చిన నా పాత్రికేయ వృత్తిలో రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాహిత్యాది రంగాలలో వచ్చిన పరిణామాలన్నింటినీ అవగాహన చేసుకున్న నాకు, చేపట్టిన అంశాలపై అధ్యయనంలో నాకున్న పూర్వరంగం మరింత విస్తరించుకుంది. ఈ క్రమంలో ఎంతోమంది రచయితలు, కవులు, ప్రసిద్ధులూ నాకు అందించిన ఉత్సాహ ప్రోత్సాహాలూ ఆశీర్వాదాలే పెట్టుబడిగా సాగిన ఈ నా అర్ధశతాబ్ది యాత్ర ఫలితంగానే, పత్రికా నిర్వహణలో అవసరమైన సర్దుబాట్లకు నేను ప్రతికూలం కాకపోయినా మౌలికమైన విధానాల పైన రాజీలేని వైఖరిని కొనసాగించడం వల్లనే వేతన కూలీలా ఉద్యోగ వలసలో వృత్తిని చిత్తశుద్ధినీ మాత్రం వదలుకోలేదు; పెట్టుబడిదారీ సమాజంలో వేతనకూలీకి స్థిమితం ఉండదు. "సీటు"కు స్థిరత్వం లేకపోయినా వృత్తిలోనూ, వ్యావృత్తిలోనూ స్థిమితంగా నిలబడగలిగానని, నిలబడి కలబడగలిగాననీ ఘంటాపథంగా చెప్పగలను. తలవంచుకుంటే, తరాలు గడిచిపోతాయి. కాని ఆ పని వృత్తి ధర్మానికీ, వ్యక్తిత్వానికీ తలవంపులు తెచ్చిపెడుతుంది. నాకున్న ఈ వ్యక్తిత్వ బలంవల్లనే సిబ్బంది సమష్టి శ్రమ ఫలితానికి చిహ్నంగా జాతీయస్థాయిలో ప్రసిద్ధ జి.కె.రెడ్డి స్మారక పురస్కారాన్ని, బంగారు పతకాన్నీ ప్రధానమంత్రి చేతులమీదుగా పొందగలిగాను; అలాగే మీ అందరి ఆశీరాక్షతల ప్రభావం వల్లనే జాతీయ స్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ పెక్కు సాహితీ, సాంస్కృతిక సంస్థల నుంచీ పాత్రికేయ సంఘాలనుంచీ, రాష్ట్రేతర ఆంధ్రుల భాషా, సాహితీ సంస్థల నుంచీ గౌరవ పురస్కారాలు అందుకోగలిగాను. పేరు పేరునా ఉదాహరించడం సాధ్యంకాని ఎందరెందరో ప్రముఖుల నుంచి పలు

సందర్భాలలో ప్రశంసలు, సలహాలూ పొందగలిగాను. వారందరికి వినమ్రతతో నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. రాజీవ్‌గాంధీ ప్రధాన మంత్రిత్వ హోదాలో ఆయన అధికార ప్రతినిధి వర్గం తలపెట్టిన సోవియెట్ పర్యటనలో తెలుగు సంపాదకుని హోదాలో పాల్గొన్నాను; పశ్చిమ జర్మనీ ప్రభుత్వ ఆహ్వానంపైన జర్మనీ యాత్ర చేశాను; కేవలం పాత్రికేయులు భాగస్వాములుగా నడిపే ఒక దినపత్రికను పెట్టాలన్న తపనతో, కేవలం హైదరాబాద్, విజయవాడ కేంద్రాలకే పరిమితమై నడిపేందుకు "వార్త"కు అనుమతిపత్రం పొంది, అందుకై స్థానిక ప్రమోటర్లను సిద్ధం చేసుకుని, విదేశాల్లోని నా చిన్ననాటి ప్రవాసాంధ్ర మిత్రుల సహకారం పొంది కూడా స్థానిక బ్యాంకర్ల సహాయ నిరాకరణ మూలంగా ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాల్సి వచ్చింది. అప్పుడు గాని "పసిడిగలవాని బానిసకొడుకు"లని వేమన చెప్పిన మాటకు అర్థమేమిటో తెలిసిరాలేదు! పెట్టుబడికీ, కట్టుకథకు ఉన్న అనుబంధం మరింతగా నాకు అవగాహనకొచ్చింది! అయినా మరో రూపంలో నన్నయాదులు ఆశించినట్టు "వార్త"లోనే ఈ జగం వర్ధిల్లుతూ ఉంది!

ఈ పరిణామ దశ యిలా ఉండగా ఆరోగ్యంలో వచ్చిన తొట్రుపాటు వల్ల నా 'గుండె' కోతకు గురైనా గుండెనిబ్బరం మాత్రం సడలకుండా కాలం గడుస్తోంది. ఈలోగా రాష్ట్రంలో సాగుతున్న నక్సలైట్ ఉద్యమానికీ, ప్రభుత్వ పోలీసు వ్యవస్థకూ మధ్య హింసాయుత ఘర్షణలు, మానవ సంహార కాండ కొనసాగుతున్న సమయంలో ఉభయపక్షాల కోరికమేరకు శాంతి చర్చల ప్రక్రియ మొదలయినప్పుడు, "మధ్యవర్తుల" జాబితాలో ఉన్న నేను కూడా చర్చలలో పాల్గొనవలసి వచ్చింది. కాని దురదృష్టవశాత్తూ, ఆశావహ వాతావరణంలో ప్రారంభమై, ప్రజలు ఈ శాంతి చర్చల నుంచి మంచి ఫలితాలను ఆశిస్తూన్న సమయంలో అర్థాంతరంగా చర్యలు విఫలమయ్యాయి. ప్రజల ప్రాథమిక ప్రయోజనాల సంరక్షణకు, పేదసాదల సమస్యలకు నిర్దిష్టమైన పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ప్రజాస్వామ్య ప్రియులందరికీ ఈ వైఫల్యం పిడుగుపాటయింది. ఏ భూసమస్య అయితే ఆనాటి చర్చలకు ప్రాతిపదిక అయిందో సరిగ్గా ఆ భూసమస్యపైననే నాటి చర్చల్లో విప్లవకారులు ప్రతిపాదించిన అంశాల కోసం, పరిష్కారాల కోసం ఈ రోజున పాలకులు తహతహతో పాకులాడక తప్పనిసరి పరిస్థితులు ఏర్పడ్డాయని నోటితో పైకి అనకపోయినా ఆచరణలో జరుగుతున్నది అదే. ఈ తప్పిదాన్ని మనసారా గ్రహించి అంగీకరించకపోవడంవల్లనే వందలాది మంది ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందని గ్రహించాలి. ఈ చర్చల వైఫల్యం మధ్యవర్తులందరికీ తీవ్ర మనస్తాపం కల్గించిన దుష్పరిణామంగా నేను భావిస్తున్నాను. సమస్యలను నానబెట్టడం ప్రజాస్వామ్యమూ కాదు.

అలాగే నలభై ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం ఉన్నా, అది అమలు

కాకుండా ఉండడంగానీ, అమలు పరచకపోవడంగానీ చట్టరీత్యా నేరమన్న అవగాహన కూడా ఇంతకాలం పాలకులకు లేకపోవడం కూడా దుస్సహం. చట్టధిక్కారాన్ని నేరంగా పరిగణించే ప్రభుత్వాలూ, న్యాయస్థానాలూ ఈ ధిక్కారానికి బాధ్యులెవరో ప్రజలకు సూటిగా జవాబు చెప్పాల్సి ఉంది. ప్రస్తుతం భాషా సంఘం అధ్యక్షునిగా నేను, సంఘసభ్యులం అందరం పాలనా భాషగానూ, ప్రాథమిక విద్యాదశ అంతా బోధనా మాధ్యమంగానూ తెలుగును పటిష్ఠం చేసేందుకు తీసుకుంటున్న అనేక చర్యలకు ప్రజా సంఘాలనుంచీ భాషా సంఘాలనుంచీ పెద్ద ఎత్తున ఉద్యమ రూపంలో చేదోడువాదోడు కావాల్సిన అవసరం ఉంది.

చివరిమాట

నేనూ, ఒక అభిమానవతిగా బంగారు కొండను సయితం ఒక గడ్డిపోచగా భావించే నా భార్య సుధారాణి కొండాపూర్‌లోని సి.ఆర్.ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో కాలక్షేపం చేస్తున్నప్పటికీ, ఇప్పటికీ నేను పత్రికా రచనా వ్యాసంగాన్ని మానుకోలేదు. వయోపరిమితి శరీరానికే గాని మనస్సుకు వర్తించదు. ఈ విషయంలో నా బాట, కవిమిత్రులు సి.నా.రె. మాటే. మార్పును తీర్పుగా భావించుకుంటూనే తన శైశవం మీద ముదిమి ముసురుకు రావడాన్ని సహించని సి.నా.రె. "పురోగామి" శక్తి ఎందులో నిక్షిప్తమై ఉంటుందో చెప్పారు. ఆ రహస్తంత్రి సందేశం ఏమిటి?

> **"నాకు శైశవం లేదు**
> **నిరంతర యౌవనం తప్ప**
> **నాకు విశ్రమణం లేదు**
> **నిత్య పురోగమనం తప్ప-**
> **ఆసనాలు కన్నెర్రజేసినా సరే**
> **కదలిపోవడంలో వున్న సంతృప్తి**
> **కుదురుగా కూచోవడంలో లేదంటాను"**

అలా ప్రతి అక్షరం మంత్రబీజం అనుకున్నప్పుడు ఆ బీజాక్షరాలు వ్యక్తుల జీవితాలను సువర్ణాక్షరాలుగా మలచక తప్పదు. మా దంపతులిద్దరికీ తపనలేని స్తబ్ధ జీవితం యిష్టంలేదు. మేముంటున్న ఆశ్రమం ఒక ఉద్యాన వనవాటిక, జాజుల, విరజాజుల పేటిక. అక్కడ ఏదో ఒక పని కల్పించుకోవాలని ఆశ్రమవాసులు తహతహలాడుతూ ఉంటారు. ఆహ్లాదకరమైన వాతావరణం, అన్నిటా శుచీ శుభ్రం; కూరగాయలు, పండ్లు, పూలమొక్కలతో "బహు పుష్ప పల్లవ ప్రకర చిత్రితాలై" చూడముచ్చటగా ఉంటుంది. ఈ ఆశ్రమాన్ని చూసిన వారికి అతిథి మర్యాదలకు పేరొందిన తారక్ష్యుడనే మహర్షి నియమనిష్ఠలతో

కూడిన తన ఆశ్రమం ఎలా ఉంటుందో, ఎలా ఉండాలో భారత కథలో చెప్పిన మాటలు గుర్తుకు రాకతప్పదు; అక్కడ కాలహరణం ఉండదు, సకాలంలో ఆహారం అందుతుంది, పరిశుభ్రత ఉంటుంది, అతిథులకు ఆదరణ లోటుండదు. ప్రశాంతివల్ల, నియమనిష్ఠలవల్ల చావుభయం కూడా ఉండదట! జనన మరణాలకు అభేదం చెప్పుకోగలిగితే ఆ భయం కూడా అభయహస్తంగా మారుతుంది! మా ఆశ్రమంలో నెమళ్లూ, హంసలూ ఉండకపోవచ్చు గాని, రోజూ సప్తవర్ణాలతో వెలుగొందే రకరకాల పిట్టలు, కొదమ తుమ్మెదల ఝుంకారాలు, అన్నింటికీ మించి ఉభయ సంధ్యలలోనూ నగర వాసులెవ్వరికీ అందని కోకిలమ్మల కుహుకుహూ రాగాలూ పెద్దలకు మనోల్లాసం కలిగిస్తుండడం ఒక అనుభవం! నేత్రానందానికి, శ్రవణానందానికి మా ఆశ్రమం ఒక కేంద్రబిందువు. ఏది ఏమైనా, తృప్తికి మించిన ఆస్తి లేదు. తృష్ణను త్యజించేవాడు సుఖపడతాడనీ, సర్వధని అవుతాడనీ ధర్మరాజు అనలేదూ?! ఎంతో అర్థవంతమైన వాక్కులో ఏదో అనిర్వచనీయమైన శోభ ఉంటుందంటారు. ("అర్థభారతీ వాణీ భజతే కామాపి శ్రియమ్"). మనిషికి ఇంగిత జ్ఞానమే కాదు, పరేంగిత జ్ఞానం కూడా అవసరం.

సి.నా.రె. "సప్తతి" చేసుకున్నప్పుడు దాన్ని "లిప్త"గా గడిచిపోయినట్టు ప్రకటించు కున్నారు. కాని, నాకూ ఏనాడో సప్తతి లిప్తగానే కాదు, తృప్తిగా, సంతృప్తిగా కూడా గడిచిపోయింది. మా ఆశ్రమం వెన్ను వొంగినవారికి కూడా చైతన్యం దట్టించి వెన్నెముకను నిలబెడుతున్న ఆశ్రమం. వృద్ధాప్యాన్ని ఎలా గడుపుతారని తనను ప్రశ్నించినవారికి కృష్ణశాస్త్రి జవాబు– "దినములట్లు ప్రతిధ్వనులు కాగ" అని! ఆ ధ్వనే మనిషిని సర్వార్థసిద్ధుడుగా, సర్వధనిగా నడుపుతుంది. పరిణామ క్రమంలో గడించే పరిపక్వతే ఈ మనిషి పరిణతి.

ఈ ఆహ్లాదకర సాయం సమయంలో మీతో ఇలా నాలుగు ముక్కలు పంచుకోడానికి అవకాశం కల్పించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వాహకులకు, అధ్యక్షులు డా॥ సింగిరెడ్డి నారాయణరెడ్డిగారికి మరోసారి నా మనఃపూర్వక వందనాలు.